SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

జోషి, పి. సి.

కాంగ్రెసు కార్యవర్గానికి కమ్యూనిస్టుల జవాబు

బెజవాడ, 1946

Record no. 100

Jōṣi, Pi. Si.

Kāṅgresu kāryavargāniki Kamyūnisṭula javābu

Bejavāḍa, 1946

Record no. 100

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

జోషి, పి. సి.

కాంగ్రెసు కార్యవర్గానికి కమ్యూనిస్టుల జవాబు / పి. సి. జోషి. - బెజవాడ : ప్రజాశక్తి కార్యాలయం, 1946.

3 volumes. ;17 cm.

Record no. 100

Jōṣi, Pi. Si.

Kāṅgresu kāryavargāniki Kamyūnisṭula javābu / Pi. Si. Jōṣi. - Bejavāḍa : Prajāśakti Kāryālayaṃ, 1946.

3 volumes. ;17 cm.

Record no. 100

35 mm microfilm

Image placement: IA (IIA) IB IIB   Date filming began:

*

రెండవ భాగం

VI

ఆగస్టు ఫలితాలు

మీకూ మాకూ ఉన్న ఏకభావాలు, అభిప్రాయభేదాలు ఆగస్టు తీర్మానంతో ఆఖరుకాలేదు. ఆనాడు మీరూ మేమూ అన్న మాటలు, రాసిన రాతలతోనే ఆ కథంతా పూసగ్రుచ్చినట్లు చెప్పుకొచ్చాం. ఇదేం మాకంత సంతోషకరమైన పని అని మీ రనుకోవద్దు. మీ అంచనాలు తప్పయాయనీ, మీ ఆశలన్నీ అడియాసలయాయనీ, మా హెచ్చరికలు నిజమయాయనీ, నిర్ధారణ చేయవలసి వచ్చినందుకు మాకెంతో బాధగా ఉంది. ఆనాడు మేము భయపడినదంతా యదార్థం కావాలని మేము కోరలేదు. కాని దేశ దౌర్భాగ్యం కొద్దీ, మన ప్రజల దురదృష్టంకొద్దీ, అదంతా నిజమయింది,

పరస్పర వైరుధ్యంతోకూడుకొన్న ఆ ఆగస్టు తీర్మానం కాంగ్రెసులో దారుణమైన ఫలితాలను కలిగించింది. బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫాసిస్టు వ్యతిరేకసంస్థగా ప్రజ్వలించిన కాంగ్రెసు మహాసంస్థ చివరకు నేటి కమ్యూనిస్టు వ్యతిరేక సంస్థగా పతనమయింది.

ఆపోహలను విడనాడి యదార్థ విషయాలను గుర్తించినట్లయితే, ఆవేశాలను అవలకు నెట్టి, వివిధ పార్టీల విధానాలను పరిశీలించినట్లయితే, నిజాయితీగల ఏవ్యక్తికూడా మేము కాంగ్రెసుకు ద్రోహం చేశామని అనలేదు. ఇది మేము ఘంటాపథంగా చెబుతున్నాం. ఆనాడు మీరు చూపిన మార్గం బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై పోరాటానికి కాదు దారితీసింది, వారి వలలో పడడానికే! జపాను ఫాసిస్టులను ప్రతిఘటించడానికి ప్రోత్సహించలేదు మీరు నిర్ణయించిన పంథా. దేశానికున్న కాస్త రక్షణలను ధ్వంసం చేసే చర్యలకే పురికొల్పింది. ఆ పంథా. విప్రయోజనం కాక తప్పింది కాదు. అందుకు బాధ్యతను ఎవరి నెత్తిని పెడదామా అనే వెతుకులాట

ఏనాడో ప్రారంభమయింది. ఆ పనినే ఇప్పుడు మీరు వచ్చి తీసుకున్నారు.

ఆరోజుల్లో మీరు జైళ్ళలో ఉన్నారు, మేము బయటవున్నాము. పరిస్థితులు క్రమక్రమంగా పరిణామము చెందుతూ ప్రస్తుత విషాదకరస్థితికి ఎలావచ్చాయో క్లుప్తంగా వివరిస్తాము. ఇది మాకొక్కరికే కాదు; కాంగ్రెసుమహాసంస్థకు, యావద్భారతదేశానికీ విషాదకరము. మీదృష్టిలో ఇదొక పాడుసమస్య కావచ్చును. కాంగ్రెసు నిబంధనావళిలో క్రమశిక్షణ సూత్రాలతో తుడిచివేయగల అతిస్వల్ప విషయమే కావచ్చును. మరొకమారు వట్టిభ్రమల్లో పడిపోతున్నారు మీరు; సోదర కాంగ్రెసు వాదులమైన మాపట్ల ఘోరమైన అన్యాయం చేస్తున్నారు.

తనంతటది వచ్చిన వెల్లువా?

ఆగష్టు 9వతేదీ ఉదయం మీరు అరెస్టయారు. అలా జరిగి తీరుతుందని మీరనుకోలేదు. ఆతరువాత జరిగినఘటనలకు మా వ్యతిరేకులు 'ఆగస్టు విప్లవమ'ని నామకరణం చేశారు. 'జాతీయ సంక్షోభమ'ని మేము నిర్వచించాము. అలాంటి పరిస్థితులకు తగినఏర్పాట్లు మరేమీ చేయలేదు. ఎలాంటిప్లానూ ఇవ్వలేదు. ప్రతి కాంగ్రెసువాదీ, ప్రతి కాంగ్రెసుగ్రూపు. తనకు తానే ఆలోచించుకోవలసి వచ్చింది, తన అంతరాత్మకు తోచినట్లు నడచుకోవాలి; కాంగ్రెసు ఆశయాన్ని నెరవేరుస్తుందని తానేది నమ్మితే దానినే ఆచరించవలసి వచ్చింది. కొంతమంది కాంగ్రెసువాదులు రహస్య జీవనం ప్రారంభించారు. అచ్చువేసో, మరే ఇతరపద్ధతుల్లోనో ఏవేవో ఉత్తరువులుప్రకటించసాగారు. వాళ్ళు ప్రకటించినవాటిలో మచ్చుకు కొన్నిటిని ఉదహరిస్తాం:

I కొంతమంది కాంగ్రెసు సోషలిస్టు నాయకులు "భారతజాతీయ కాంగ్రెస్ కేంద్ర అధికారసంఘం" అని పేరుపెట్టుకున్నారు. ఆపేరుతో "ఏ. ఐ. సి: సి. ఆఫీసునుంచి ఉత్తరువు" అంటూ ఏమిటేమిటో ప్రకటించ నారంభించారు. వారి కరపత్రాలు అహింసావిధానంపట్ల శుష్క-

ప్రశంసలతో ప్రారంభమయాయి. జపానుప్రమాదాన్ని లెక్కలోకి తీసుకోలేదు, విధ్వంసక కార్యక్రమం ప్రోత్సహించసాగాయి. చివరకు బాహాటంగా జపాను అనుకూల ప్రచారానికి దిగాయి.

1942 ఆగష్టు 10వ తేదీన వారి మొదటికరపత్రం వెలువడింది. దానిలో ఇలా అన్నారు:

"ఇదే మన అంతిమపోరాటం. అందరూ తమతమ విద్యుక్త ధర్మాన్ని నెరవేరిస్తే ఈపోరాటం రెండునెలల్లోనే ముగియగలదు. భారత మాతను బంధిస్తున్న దాస్యశృంఖలాలను పగులగొట్టడానికి కోట్లకొలది ప్రజలు ముందుకురావాలి.... గాంధీజీ మనకిచ్చిపోయిన 'కర్తవ్యపాలనో లేక చావో' అనే సందేశాన్ని శిరసావహిద్దాము."

పదకొండు అంశాలతో ఒక కార్యక్రమాన్ని తయారు చేశారు. వాటిలో కొన్ని :

1 వ అంశం :— " దేశమంతటా అన్ని గ్రామాల్లోను. పట్టణాల్లోను హర్తాలు జరగాలి. "

2:— " మా ఆశయం పర ప్రభుత్వాన్ని అంతమొదించడం, అహింసా విధానానికి కట్టుబడి, ఈ ఆశయసిద్ధికి తోడ్పడే ప్రతిచర్య ఆచరణీయము, సక్రమము. రాష్ట్రాలలోని ప్రజలు ప్రభుత్వయంత్రాన్ని స్తంభింపచేయడానికి తగిన అహింసాపద్ధతుల నాలోచించి, ఆచరణలోపెట్టాలి...."

12:— " ఇక చివరివిషయం. గాంధీజీకి అత్యంత ప్రియతమమైన నూలు వడికే కార్యక్రమాన్ని మరచిపోవద్దు. కోట్లకొలది ప్రజలు నూలు వడికినట్లయితే మన పోరాటం మరింత ఉత్సాహంతో సాగుతుంది."

" కర్తవ్యపాలనో — లేక చావో "

అదే రోజున "భారతదేశ కార్మికులకు" అంటూ ఒక కరపత్రం ప్రకటించారు. అందులో ఇలా అన్నారు :

" మీరు పనిమానివేయడంతో పాటు ఏలాంటి రవాణాలు సాగకుండా చేయాలి. పరాయి పేనల్ని కదల మెదలలేని స్థితిలో పడేయాలి.

అప్పుడు మీపైని గాని, మీ సోదర దేశీయులపైన గాని దెబ్బతీయడానికి సేనలకు వీలులేకుండా పోతుంది."

II బహిరంగంగా జపాను అనుకూలపోకడలు పోయిన ఫార్వర్డు బ్లాకు కూడా "స్వాతంత్ర్య సమరం" అనే శీర్షికతో కరపత్రాలు వేసింది. తన యజమానులైన జపాను ఫాసిస్టులకు ఏది అవసరమో వాటిని స్పష్టంగా ప్రచారం చేసేది. 1942 ఆగష్టు 10 వ తేదీ కరపత్రంలో అదివరకే కోపోద్రేకులైన ప్రజల్ని బ్రిటిష్‌వారిపైకి మరింత రెచ్చగొట్టడానికి ప్రయత్నించింది. అందులో ఇలావుంది:

"భారత స్వాతంత్ర్యపోరాటం ప్రారంభమయింది.... నిన్నటినుంచి మన స్త్రీ, శిశువుల్ని వీధుల్లో కాల్చి చంపుతున్నారు. పురుషుల్ని వేటాడి పట్టి జైళ్ళలో త్రోస్తున్నారు. ఇంత జరుగుతున్నా మన పత్రికలు పల్లెత్తు మాటాడడం లేదు.........భారత స్వాతంత్ర్య పోరాటాన్నిగురించి వార్తల నన్నిటినీ మీ కీ కరపత్రం ప్రతిరోజూ అందిస్తుంది.

బొంబాయి

"ఈవేళ ఉదయం వివిధ ప్రాంతాల్లో విద్యార్థుల్ని, కార్మికుల్ని, వీరు చాలవరకు స్త్రీలే — రక్తపిపాసులైన బ్రిటిష్ సైనికులు కాల్చి చంపారు. అహింసావలంబకు లైన భారతస్వాతంత్ర్య యోధులను అణచడానికి టన్నులకొలది విషవాయువులను ఉపయోగించారు. యూరప్ రష్యా, యుద్ధరంగాల్లోనే ఇంతవరకు విషవాయుప్రయోగం జరగలేదు. అలాంటిది రక్తపిపాసులైన ఈ బ్రిటిష్ హంతకులు భారతీయులపై దీనిని ప్రయోగిస్తున్నారు.

"మన కర్తవ్యం"

"మాతృదేశ పరువుమర్యాదలను కాపాడడానికి వేలకొలదిగ సంసిద్ధం కండి. రక్తపిపాసులైన బ్రిటిష్‌సేనల రవాణాకు ఎలాంటి అవకాశం లేకుండా చేయండి. బ్లాకౌటు చట్టాలను భగ్నంచేయండి. స్వతంత్ర భారతదేశంలోని స్వతంత్ర పౌరులుగా వ్యవహరించండి; సంపూర్ణ స్వాతంత్ర్య గమ్యస్థానంవైపు పురోగమించండి.

భారతదేశం భారతీయులకే

భారతీయు లెన్నటికీ బానిసలుగా పడిఉండరు

1857 లో బానిసత్వం — 1942 లో స్వాతంత్ర్యం

III కాంగ్రెసు సోషలిస్టు నాయకులు, కొంతమంది గాంధీతత్వవాదులుకలిసి 1942 సెప్టెంబరు 7 వ తేదీన "బొంబాయి కాంగ్రెసు బులెటిన్" అని ఒక కరపత్రం వేశారు. అందులో ఇలాఉంది.

"మిమ్మల్ని పీడిస్తున్న నిరంకుశ
ప్రభుత్వ రక్తనాళాలను నరకండి"

"మిమ్మల్నిపీడిస్తున్న నిరంకుశప్రభుత్వ రక్తనాళాలను నరకండి - మీ ఎదుటే అది కుప్పకూలి పోతుంది" అన్న కాంగ్రెసు సందేశం నలు దిశల వ్యాపించింది.

"ఇండియాలోని బ్రిటిష్‌రైల్వేలను, నావలను, టెలిగ్రాఫ్ టెలిఫోను ఏర్పాటులను అహింసాపద్ధతుల్లో భగ్నం చేయవలసిందని మేము ఆదేశిస్తున్నాం. నాజీ ఆక్రమిత దేశాల్లోని గెరిల్లాల ఉజ్వల ఆదర్శాలను అనుసరిద్దాం; శత్రువుయొక్క ఆయువుపట్టులమీద దెబ్బతీద్దాం. దీని ఫలితంగా ఇప్పటికే ఎక్కువ ఒత్తిడివల్ల పగులు చూపుతూన్న ప్రభుత్వపు రవాణా ఏర్పాట్లన్నీ ధ్వంసమయిపోతాయి. దేశభక్తిగల భారతీయులందరూ తోడ్పడగలది ఈ కార్యక్రమంలోనే. కాంగ్రెసు విప్లవకారులు దెబ్బ తీయవలసింది దీనిమీదనే.

"విజృంభించండి — విజయం సాధించండి
కర్తవ్య పాలనమో — లేక చావో."

గాంధీగారి ఆదేశాలెన్నటికి కావు

ప్రజలు కోపోద్రేకులై ఉన్నారు. నాయకత్వంకోసం ఎదురు చూస్తున్నారు. అలాంటి సందర్భంలో సాధారణంగా జరిగే విధంగానే మీ అరెస్టులను ఖండించడానికి ప్రజలు గుంపులు గుంపులుగా కూడారు. పోలీసులు లాఠీలు, తుపాకులు ప్రయోగించారు. దానితో ప్రజావెల్లువ బయలుదేరింది. దాని నణచడానికి ప్రభుత్వం దారుణ నిర్బంధ విధానాన్ని అమలుజరిపింది. దానితో ప్రజలదేశభక్తి ఆవేశం అణగారింది; కాని ఆరిపోలేదు. మునుపెన్నడూ లేనంతగా బ్రిటిష్ పరిపాలనను ద్వేషించారు. తమ నిస్సహాయతకు తిట్టుకున్నారు. ఆ స్థితిలో జపాను అనుకూల ప్రచారానికి చెవియొగ్గసాగారు.

పైన మే ముదహరించిన ఆదేశా లన్నింటినీ కాంగ్రెసు ఉత్తరువులు గానే దేశంలో చెలామణీ చేశారు. ప్రభుత్వ నిర్బంధానికి బలికాకుండా మిగిలిన కాంగ్రెసు వాదులు ఈ కార్యక్రమాన్ననుసరించే ప్రజలను నడుప సాగారు.

1942 ఆగస్టు 23 వ తేదీన మష్రూవాలాగారు 'హరిజన్ పత్రికలో రాసినదానిని బట్టీ, మీలో ఒకరైన (వర్కింగుకమిటీ సభ్యుడు) డాక్టరు పట్టాభి శీతారామయ్యగారు రాసిన సుప్రసిద్ధ 'ఆంధ్రా సర్క్యులర్'ను బట్టీ కాంగ్రెసు వాదులు ఈ రహస్య కార్యక్రమమంతా సవ్యమైనదే అని నమ్మారు.

'హరిజన్'లో మష్రూవాలా ఇలా రాశారు:

"అహింసా పద్ధతులో, ప్రాణాపాయం కలుగకుండా, రవాణా సౌకర్యాలను భగ్నం చేయవచ్చును ....

"ఇలాంటి పోరాటంలో తీగలనుత్రెంచడం, రైలుపట్టాలను ఊడదీకడం, చిన్నచిన్న వంతెనలను పడగొట్టడం ఆక్షేపణీయములు కావు. కావి, ప్రాణాపాయం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి ....

అక్షరాజ్యాల నేవిధంగా పరిగణించి, ఎలాంటి పద్ధతుల్లో ఎదుర్కొంటామో, బ్రిటిష్ ప్రభుత్వాన్నికూడా ఆవిధంగానే లెక్కగట్టి, అలాంటి పద్ధతుల్లోనే ఎదుర్కోవాలని అహింసా విప్లవకారుల్ని కోరుతున్నాము." ('హరిజన్' - 1942 ఆగస్టు 23)

టాటెన్హామ్ పుస్తకానికి జవాబురాస్తూ (1943 జూలై 14) గాంధీగారు మష్రువాలా ధోరణిని పూర్తిగ ఖండించారు. గాంధీగారు ఇలా రాశారు:

"శ్రీ మష్రువాలాగారు అమూల్యమైన సహచరులు అహింసా వ్రతావలంబనను అత్యున్నత దశకు తీసుకుపోతారు.

"అయినప్పటికీ, ఆయన వ్యాసంలోనుంచి ఉదహరించిన భాగాన్ని నేను సమర్ధించ దలచుకోలేదు.

".... బ్రిటిష్‌ప్రభుత్వాన్ని జపానులాంటి ప్రభుత్వంతోపాటే జమకట్టడంకూడా నే నంగీకరించను."

(ప్రభుత్వంతో గాంధీగారి ఉత్తర ప్రత్యుత్తరాలు - ఇంగ్లీషుప్రతి - 1942 - 44-159 వ పేజీ.)

ఆంధ్రా సర్క్యులర్‌లో "టెలిగ్రాఫ్ టెలిఫోనుతీగలను త్రెంచడం నిషిద్ధమూకాదు. ప్రోత్సహింపబడినదీకాద"ని ఉంది. "రైలుపట్టాలను, ఊడదీకకూడదు. పెర్మనెంటువేకి ఆటంకం కలిగించగూడదు. ప్రాణాపాయం కలుగకుండా ఉండేలా ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాల"ని ఒక ప్రత్యేక హెచ్చరికకూడా ఉంది.

ఈ సర్క్యులర్‌తో కాంగ్రెసు కేలాంటి సంబంధం లేదని గాంధీజీ స్పష్టపరిచారు. విడుదలయినతర్వాత ఉపన్యసిస్తూ పట్టాభిగారు ఆ సర్క్యులర్‌కి బాధ్యుడను తానే అని చాటారు. మరోసారి గాంధీగారు దానితో తన కేలాంటి సంబంధం లేదని ప్రకటించారు. తదనంతరం పట్టాభిగారొక అయోమయప్రకటన చేశారు. ఆ సర్క్యులర్‌కి తానే బాధ్యుడనని

ఇంకా అంటున్నాడో, కాదంటున్నాడో — ఇదమిద్ధం తేల్చకుండా ఉంది ప్రకటన.

దీనిపై చర్చ ఈనా డనవసరం. ఆగస్టు తీర్మానంలో తలపెట్టిన ఉద్యమానికి గాంధీగారిని నాయకులుగా నిర్ణయించారు మీరు. 1942 ఆగస్టు 7 వ తేదీని ఈ ఉద్యమాన్ని గురించి తాను తయారుచేసిన సలహాపత్రాన్ని గాంధీగారు 1945 ఏ. ఐ. సి. సి. సమావేశం జరిగే ముందు ప్రకటించారు. అంతవరకవి వెల్లడేకాలేదు. మష్రువాలా, పట్టాభి గార్లు సూచించిన కార్యక్రమాలకూ గాంధీగారి సలహాలకూ వ్యత్యాసం స్పష్టం.

గాంధీగారి సలహాపత్రం 1942 ఆగస్టు 7 వ తేదీకే తయారయింది. ఆ మరునాడే అది మీ ఎదుట చర్చకు వచ్చింది. ఆ సలహా లేమిటో మీరు బాగా ఎరుగుదురు.

ఈ సలహా పత్రాన్ని ప్రకటిస్తూ గాంధీగారు ఉపోద్ఘాతంలో ఇలా రాశారు :

"ప్రభుత్వంతో నేను జరుపదలచిన రాయబారాలను గురించి నా ఉద్దేశాలను వర్కింగుకమిటీ ఎదుటపెట్టాలని నిర్ణయించారు. ఈ రాయబారాలను అధమపక్షం మూడువారాలయినా సాగించాలని అనుకున్నాం. రాయబారాలు భగ్నమయిన తరువాతనే ఈ సలహాలను వెల్లడి చేయాలని అప్పటి నిర్ణయం.

" ఈ సలహాల నిప్పుడు ప్రకటించడంలో రెండు ఉద్దేశాలున్నాయి. ఆరోజుల్లో నా ఆలోచన లెలాసాగాయో వీటినిబట్టి స్పష్టంకాగలదు. ప్రభుత్వం చేసిన అభియోగంలో నా అహింసా సిద్ధాంతాచరణము గురించిఉన్న ప్రతికూల విమర్శలకు ఈ సలహాపత్రం ఒకజవాబుగ ఉపయోగపడగలదు. రెండవఉద్దేశం ఏమిటంటే-నాకే అవకాశమున్నట్లయితే ఆరోజుల్లో నే నెలాంటి చర్యలు తీసుకునేవాడినో కాంగ్రెసువర్కర్ల కందరికీ ఇందుమూలముగా తెలియగలదు. విధ్వంసక చర్యలు మొదలైన

కార్యక్రమాలకు నా పేరును ఇష్టంవచ్చినట్లు అంటగట్టారని నాకు తెలియవచ్చింది."

('బొంబాయి క్రానికల్'–1945 సెప్టెంబరు 21)

కొన్ని పనులు చేయకూడదని గాంధీగారు నిషేధాలు పెట్టడంలోనే ఈ సలహాల ప్రాధాన్యత ఉంది.

1. దేశవ్యాపిత హర్తాలూ, 24 గంటల ఉపవాసమూ జరగాలని ఆయన కోరారు; కాని ఇలా అన్నారు :

"ప్రభుత్వ కార్యాలయాల్లోను, ప్రభుత్వ ఫ్యాక్టరీల్లోను, రైల్వేలు; పోస్టాఫీసులు మొదలైనవాటిల్లోను పనిచేసేవారు యీ హర్తాల్లో పాల్గొనరాదు. ఎందువల్లనంటే - జపాను, నాజీ లేక ఫాసిస్టు దండయాత్రలనుగాని, బ్రిటిష్ పరిపాలననుగాని మనం సహింపమని రుజువుచేయడమే ఈ హర్తాలుయొక్క ఉద్దేశం."

రక్షణసన్నాహాలకు సంబంధించిన వివిధశాఖల్లో హర్తాలు చేయడమయినా పనికిరాదని గాంధీగారు నిషేధించారు. అలాంటప్పుడు ఆరక్షణ సన్నాహాలను భగ్నంచేయడం, రవాణాసౌకర్యాలను తెగగొట్టడం. రైలు పట్టాలను ఊడబెరకడం మొదలయినవి కాంగ్రెసు కార్యక్రమమెన్నటికీ కాజాలదని అనడం సబబుకాదా? ఆపరిస్థితుల్లో అలాంటి కార్యక్రమాన్ని కొనసాగించడం జాతీయ ఆశయాన్నే దెబ్బకొట్టడమవుతుంది. ఆవిధ్వంసక విధానానికి 'ప్రజా పోరాటంలో తనంతటది రూపొందిన విధానం, అని పేరుపెట్టి. దానిని బలపరచనందుకు మాపైనెలా నేరారోపణచేయగలరు?

"కాంగ్రెసువాదులందరూ ఏదో ఒకరూపంలో పాల్గొన్న ఈ ప్రజా పోరాటానికి వ్యతిరేకంగా 'పీపుల్సువారు' ఇతర కమ్యూనిస్టు పత్రికలు ఎడతెగని ప్రచారం గావించాయ"ని సబ్‌కమిటీ రిపోర్టులో అన్నారు.

కాని గాంధీగారేమన్నారు? తానేగాని బయటవున్నట్లయితే ఎలాంటి విధ్వంసక కార్యక్రమాన్నీ సహించి ఉండేవారుకారని స్పష్టంచేశారు.

మీరే బయటవున్నట్లయితే ఏమిచేసేవారు? గాంధీగారు చెప్పినట్లు నడుచుకొనేవారా? లేక తద్వ్యతిరేకంగా ప్రవర్తించేవారా? మేమీ ప్రశ్నకు చాల ప్రాధాన్యత నిస్తున్నాం. ఎందువల్లనంటే 1945 సెప్టెంబరులో బొంబాయిలో జరిగిన ఏ. ఐ. సి. సి. సమావేశంలో ఉపన్యసిస్తూ "ఆరోజుల్లో బయట ఉన్నట్లయితే ఏమిచేసి ఉండేవాడినో నాకేతెలియద"ని నెహ్రూ పండితుడే అన్నారు.

ఈ ప్రశ్నకు జవాబుచెప్ప నిరాకరిస్తూ మేము కాంగ్రెసువాదులుగా మాఅంతరాత్మ ననుసరించి నడచుకున్నందుకు మమ్మల్ని నిందించడం న్యాయమేనా? ఆవేశాలు పెచ్చుపెరిగి, విచక్షణాదృష్టి మందగించిన ఆరోజుల్లో మేము కాంగ్రెసు విధానాన్ని సరిగా అర్థం చేసుకున్నామని నమ్మాము. మా నమ్మకం ఆధార రహితంకాదు,

మా విధానాన్ని సమర్థించుకోడానికి గాంధీగారి సలహా పత్రాన్ని లాయర్లలాగ ఉపయోగించడంలేదు. కాని మాపై కక్ష సాధించడానికి కాంగ్రెసు పేరును, ఈ దిగువ వాదనల్లాంటి సాధనాలను ఉపయోగించ వద్దని మిమ్మల్ని కోరుకుంటున్నాము.

మీనోట 'టాటన్‌హాం' మాటలు

మాపై ఆరోపణలను రుజువుచేసుకోడానికి సబ్ కమీటీ ఇలా రాసింది:

"అధికార రీత్యా ఏ. ఐ. సి. సి. గాని, గాంధీజీగాని ఎలాంటి ఉద్యమం ప్రారంభించలేదన్నది స్పష్టమే కాని, అపూర్వస్థాయిలో సంభవించిన ఆ ప్రజా వెల్లువ అంతకుపూర్వం జరిగిన ఘటనల ప్రత్యక్ష ఫలితమే అన్న విషయంకూడా సుస్పష్టమే. ఏ ప్రజలకైతే ప్రాతినిధ్యం వహిస్తున్నానని కాంగ్రెస్ చాటుతూవచ్చిందో, ఆ ప్రజావాంఛే ఈవిధంగా వ్యక్తమయిందనడానికి ఎలాంటి సందేహంలేదు."

ఆగస్టు అల్లరుల బాధ్యత మీపై మోపడానికి సామ్రాజ్యవాద బంటు టాటన్‌హాం వుపయోగించిన వాదన లివే. అచ్చంగా వీటినే మీరిప్పుడు మాపై వుపయోగిస్తున్నందుకు మే మెంతో కలత జెందాము.

'అల్లరులకు కాంగ్రెసు బాధ్యత' అనే తన అబద్ధాల అల్లికలో టాటన్‌హాం ఇలా రాశాడు:

"1942 ఆగస్టు 9 అరెస్టుల తరువాత ప్రారంభమయిన అల్లర్లు దేశమంతా వ్యాపించి, తీవ్రమయే సరికి, ఇది కాంగ్రెసు ఉద్యమం కాదు. దానికది బయలుదేరిన ప్రజా వెల్లువే ఇదని కొంతమంది సంజాయిషీ చెప్ప నారంభించారు. జాతీయనాయకులపై ప్రభుత్వం తీసుకొన్న చర్యే దీనిని రెచ్చగొట్టిందని వీరు వాదించారు. ఈ వాదన నిజముకాదని రుజువుచేయగల విషయాలను ఇదివరకే వివరించాను:"

(26 వ పేజీ - ఇంగ్లీషుప్రతి)

ఆగస్టు అల్లరులకు బాధ్యత కాంగ్రెస్‌దే అన్న టాటెన్‌హాంకు 'కాదు' అని జవాబుచెప్పారు. అది కాంగ్రెసు ఉద్యమం ఎంతమాత్రం కాదని మొదటినుంచీ చెబుతూవచ్చినందుకు మమ్మల్ని ఆ నోటితోనే నిందిస్తున్నారు. ఇది సబబేనా?

కాంగ్రెసునాయకత్వాన పోరాటాన్ని ఎలా నడపవలసి ఉంటుందో గాంధీజీ వివరించారు, స్వాతంత్ర్య సమరంలో మిమ్మల్ని నడపవలసిన సేనాధిపతిగా ఆయన్నే నియమించారు మీరంతా, ఆగస్టు తరువాత మేమనుసరించిన పంథాను ఆక్షేపించదలుచుకుంటే ముందుగా వీరి నాయకత్వాన్ని పరిత్యజించవలసి ఉంటుంది. ఆ నాయకత్వానికిబదులు, రహస్యకార్యక్రమాన్ని సాగించిన "భారతజాతీయకాంగ్రెసుకేంద్ర అధికార సంఘ" నాయకత్వాన్ని శిరసావహించవలసి ఉంటుంది.

1942-45 మధ్యకాలంలో జరిగిన ఘటనలు కాంగ్రెసుదేమీబాధ్యత లేదని, మీరువిడుదలై వచ్చిన తరువాత జరిపిన మొట్టమొదటి ఏ.ఐ.సి.సి,

సమావేశంలో అధికారరీత్యా ప్రకటించారు. ఆ కాలంలో మేమనుసరించిన పంథాపై వెనువెంటనే అభియోగము తెచ్చారు.

మమ్మల్నిగురించి మీ ఇష్టంవచ్చిన అభిప్రాయానికి రాగలఅధికారం మీకుంది. మమ్మల్ని సరిగా పరిశీలించి సవ్యమైన అభిప్రాయానికి రావాలనే మేము కోరుతున్నాం. కొన్నిఘటనల పట్ల మావైఖరికి సంజాయషీ చెప్పుకొమ్మని మమ్మల్ని కోరారు. ఇలాకోరేముందు ఆఘటనలను గురించి మీ వైఖరేమిటో వివరించి ఉండవలసింది. మీరలాంటిదేమీ చేయలేదు. "ప్రజాపోరాటంలో తమంతటవి రూపొందిన" విధానాలనూ, ఆగస్టుతీర్మానాన్నీ మీ రిపోర్టులో చాలసార్లు పేర్కొన్నారు. కాని ఆ 'విధానా' లేమిటో ఒక్కసారికూడా విశదీకరించలేదు.

1945 సెప్టెంబరులో బొంబాయిలో జరిగిన ఏ.ఐ.సి.సి. సమావేశంలో కాంగ్రెసు విధానాన్నిగురించి ఒక తీర్మానం చేశారు. మీరు పేర్కొన్న ప్రజాపోరాటాన్నిగురించి దానిలో ఇలాఉంది:

"నాయకులను కోల్పోయి ప్రజలు దిగ్భ్రాంతులయారు; కోపోద్రేకులయారు. తమ ఆగ్రహాన్ని తమకు తోచిన రూపాల్లో ప్రదర్శించారు. హింసాపూర్వకమయిన పద్ధతులనూ అవలంబించారు; అహింసాయుతమైన మార్గాలనూ అనుసరించారు. కాని ప్రజలుచేసిన హింసను ఎన్నోరెట్లు మించిపోయింది ప్రభుత్వహింసాకాండ".

(కాంగ్రెసు విధానంపై అధికార తీర్మానం)

నిష్పక్షపాతి అయిన ఏ ప్రజాస్వామ్యవాదయినా ఈ తీర్మానాన్నీ మాపై మీరుతయారుచేసిన రిపోర్టునూ చదివినట్లయితే, మీ ఆరోపణలు బేసబబయినవనే నిర్ణయానికి వెంటనే వస్తాడు.

మీపరిశీలన సునిశితంగా సాగేందుకు తోడ్పడతాము. ఒక్కొక్కదశలో కాంగ్రెసు పేరిట ఇతరులేమేమన్నారో, మా పార్టీ పేరుతో మేమేమిటన్నామో క్లుప్తముగా మీ ఎదుటపెడతాము. వీటిని జాగ్రత్తగా పరిశీలించండి. కాంగ్రెసుసంస్థకెవరు పేవచేశారో, ఎవరు

ద్రోహం చేశారో నిర్ణయించండి. కాంగ్రెసు సాంప్రదాయాల నెవరు ముందుకు తీసుకుపోయారో తెల్పండి.

ఆగస్టు అనంతరం కమ్యూనిస్టుల పంథా

ఆరోజుల్లో ప్రజలకు మేమేమిటిచెప్పామో క్లుప్తంగా తెలియజేస్తాం. ఆగస్టు అరెస్టులు జరిగిన వెనువెంటనే 1942 ఆగస్టు 16 వతేదీ పీపుల్సువార్, సంపాదకీయంలోనే మాపాలసీనంతా వివరించాం. దేశంలో జరుగుతూన్న ఘటనలనుగురించి మాఅభిప్రాయాన్ని స్పష్టంచేశాం. అంతకుముందే, 9 వ తేదీనే, మీరుఅరెస్టయిన మూడుగంటలకు మాపార్టీప్రధాన కార్యదర్శి అయిన పి. సి. జోషీగారొక ప్రకటనచేశారు. సామ్రాజ్యవాదులు ప్రజల్ని రెచ్చగొడుతున్నారని ఖచ్చితంగాచెప్పారు. నాయకుల్ని వెంటనే విడుదలచేయాలనీ, పరిష్కారానికి సంప్రదింపులు ప్రారంభించాలనీ కోరాడు.

ఆసంపాదకీయంలోని కొన్నిభాగాల నిక్కడ ఉదహరిస్తాం:

ఇందుకు బాధ్యు లెవరు

"భారతదేశంపట్ల స్వాతంత్ర్యకాముకులయిన ప్రజాసామాన్యంపట్ల ఈదారుణ అత్యాచారానికి కారకులెవరు? భారతస్వాతంత్ర్యోద్యమాన్ని నెత్తుటేరులలో ముంచెత్తాలని ఎల్లప్పుడూ గుటకలువేసే అమెరీలూ, కరుడుగట్టిన ఇతరసామ్రాజ్యవాదులూ దీనికిబాధ్యులు. తమఫాసిస్టుఅనుకూల పోకడలతో బ్రిటిష్ ప్రజలకు ఘోరవిపత్తులు చేకూర్చుతూన్న ఈదుష్టగ్రహాలే దీనికి కారకులు. బ్రిటిష్‌ప్రజలను. భారతప్రజలను, తీవ్రప్రమాదాలెదుర్కొనియున్న ఈనాడు వీరు తమ సహజధోరణిని మరింతపైశాచిక రూపంలో ప్రదర్శిస్తున్నారు.

"ఫాసిస్టుల ననుసరించే, ప్రజలనుద్వేషించే ఈ హంతకముఠాయే ప్రజల రక్తంతో తడిసిన తమ వ్రేలెత్తి మన జాతీయ సంస్థనుచూపిస్తూ "అరుగో విధ్వంసకులవి పెదబొబ్బలు పెడుతున్నారు." ('పీపుల్సువార్' సంపుటి 1 సంచిక 6 - 2 వ పేజీ)

ఇంత నిర్భయంగా, ఇంత తీవ్రంగా సామ్రాజ్యవాద ప్రభుత్వాన్ని ఖండించడం ఇదివరకెన్నడూ జరగలేదని మే మనగలం, కాని ఈ విషయాన్నిగురించి మీ సబ్‌కమిటీ రిపోర్టేమిటంటుందో దయచేసి చూడండి.

బ్రిటిష్‌ప్రభుత్వ విధానాన్ని వారప్పుడప్పుడు మెత్తమెత్తగా విమర్శిస్తూ, నాయకుల విడుదలను కోరారన్నమాట నిజమే...."

ఈ అభిప్రాయానికి వచ్చేముందు ఆనాడు మేమన్నమాటలనుగాని, రాసిన రాతలనుగాని పరిశీలించే శ్రద్ధతీసుకున్నారా?

జాతీయ సంస్థల్లో తలమానికమయిన కాంగ్రెసుకి ప్రధాన నాయకులు మీరు. అలాంటి మీరు మే మేమన్నామో. ఏమిచేశామో తెలుసుకోనయినా తెలుసుకోకుండా, మీ అపోహలనే ఆధారంగా తీసికొని మాలాంటి చిన్ని దేశభక్తి పార్టీపై బాధ్యతారహితంగా, చులకనగా నేరారోపణ చేయడానికి పూనుకున్నారు. ఇది మా కెంతో బాధాకరంగా ఉంది.

సామ్రాజ్యవాదవిధాన మేమిటి?

"ప్రభుత్వం ప్రారంభించిన దారుణ నిర్బంధ విధానం దేశానికి నలుమూలలా నిప్పు పెట్టింది. ప్రజల్లో అణగారియున్న ఆగ్రహాన్ని, అసంతృప్తిని కార్చిచ్చులా రగుల్గొలిపి, అరాజకచర్యలకు రెచ్చగొట్టి అప్పుడు లాఠీలు, తుపాకీలు, విషవాయువులతో ప్రజలను అణగగొట్టడానికి చేసిన సన్నాహం ఇదంతా. ఫాసిస్టుదురాక్రమణ ముంచుకొస్తున్న సమయంలో దేశాన్ని నిస్తబ్ధంగాను, నిర్వీర్యంగాను అణచి ఉంచాలనుకున్న సామ్రాజ్యవాద విధానంయొక్క దారుణ పర్యవసానం ఇది. మనకు జాతీయ ప్రభుత్వాన్నివ్వ నిరాకరించారు. జాతీయైక్యతను నిర్మించి, సామ్రాజ్యవాదుల చేతుల్లోనుంచి జాతీయ ప్రభుత్వాన్ని గుంజుకోగల సంఘటితశక్తి-కాంగ్రెసును ధ్వంసం చేయడానికిప్పుడు తెగబడుతున్నారు."

(పీపుల్సువార్ 1942 ఆగష్టు 16)

ఆగస్టు ఘటనల అంతరార్థము

1942 ఆగస్టు 23 వతేదీ 'పీపుల్సువార్' లో 'అంతాఏకమై' అనే శీర్షికతో జోషీగారి వ్యాసం ఒకటి ప్రచురించాం. అందులో ఇలాఉంది:

"మునుపెన్నడూ లేనంతప్రమాదం ఇండియాను నేడెదుర్కొంటూంది. వర్షాకాలం పూర్తికాగానే ఫాసిస్టు దండయాత్ర ప్రారంభం కావచ్చు. బయటినుండి యీ ముప్పు రానున్నరోజుల్లోనే దేశంలో ఒక కొత్తప్రమాదం ఏర్పడింది. యీ విధంగా దేశవిపత్తు నూరింతలయింది. దేశరక్షణ భంగం కానుంది! స్వాతంత్ర్యం మట్టికలియనుంది. మన జాతియొక్క ఉనికికే దెబ్బతగులనుంది.

"ఇప్పుడు సాగుతూన్న పోరాటస్వభావాన్ని గురించి ఏలాంటి సందేహాలు కూడదు. ఒకవైపు నిర్బంధం—ప్రజలపై పోలీసులు సాగిస్తున్న పోరాటం. ఆత్మగౌరవంగల ఏ భారతీయుడూ నిర్బంధాన్ని సమర్థింపజాలడు. మరోవైపు విధ్వంసకకార్యక్రమం—తప్పుదారిలో బడిన దేశభక్తులు దేశరక్షణసన్నాహాలపై సాగిస్తున్న పోరాటం. ఇదేగాని జయప్రదమైనట్లయితే దేశానికి లభించేది స్వాతంత్ర్యం కాదు; ఫాసిస్టు బానిసత్వమే ప్రాప్తిస్తుంది."

ప్రజల కర్తవ్యం

"కాంగ్రెసు దేశభక్తులకందరికీ మేమిలా విజ్ఞప్తి చేస్తున్నాం. విధ్వంసకకార్యక్రమానికి విముఖులుకండు. .... అన్నిపార్టీలను, అన్ని సంస్థలను ఐక్యపరచడానికి తోడ్పడండి—ఇదే మీ దేశభక్తియుత కర్తవ్యం. కాంగ్రెసేతర దేశభక్తులకు మా విజ్ఞప్తి. భారతజాతిని నిద్ర మేల్కొలిపిన జాతీయసంస్థ కాంగ్రెసును ఒక పరాయిప్రభుత్వం నిషేధించింది. భారతదేశసత్సాంప్రదాయాలను నిలబెట్టండి. నాయకులను విడుదల చేయవలసిందనీ, జాతీయప్రభుత్వస్థాపనకు రాయబారాలు ప్రారంభించవలసిందనీ ప్రజలు కోరుతున్నారు. వారిని బలపరచండి." అందరూ యేకమై కర్తవ్యపాలనకు పూనుకోండి.

(2)

ఆ రోజుల్లో యేమేమీచేస్తేమీకు నచ్చేదో మీ అభియోగపత్రంలో గాని, రిపోర్టులోగాని తెలిపారుకాదు. "భారతజాతీయకాంగ్రెసుకేంద్ర అధికారసంఘ" ఆదేశాలను అనుసరించిఉంటే మీ రిష్టపడేవారా?

ఆయా దేశాలకు మా విముఖతను స్పష్టంచేశాం. ఆ మార్గాన్న నుసరించడంవల్ల బ్రిటిష్ పరిపాలనను తొలగించలేము సరిగదా, చేతు లార జపానువారిని తెచ్చిపెట్టుకున్నవార మౌతామనీ, అదిమన జాతీయోద్య మానికి చరమాంక మౌతుందనీ ప్రజలలో నిర్మొహమాటంగా ప్రచారం చేశాం.

దేశమంతటి రక్షణనుగురించి ఆలోచించేటప్పుడు అప్రయత్నంగా మాభావాలు అపాయప్రదేశాల్లోఉన్న కామ్రేడ్స్‌పైకి పోయేవి. మా చిట గాంగ్‌కామ్రేడ్స్—ఆయుధాగారముట్టడిలోని యోధులు జపాను విమాన దాడులను నిర్భయంగా ఎదుర్కో—మని వారు జైలుగోడల వెనుకనుండే తమ సోదరప్రజల్ని ఉద్బోధించారు.

తూర్పుబెంగాల్లోని మా కామ్రేడ్స్-బాల్యంనుండీ బ్రిటిష్ సామ్రా జ్యవాద దోపిడీ గాండ్రను హతమార్చ కంకణంకట్టిన వీరులనాయకత్వం క్రింద పనిచేసి, తమ లేతజీవితాల్లో అధికభాగాన్ని జైలుసెల్లులకు, డిటె న్షన్ క్యాంపులకు ధారపోసిన స్వాతంత్ర్యయోధులు, జపాను కిరాతకులు వస్తే ఆత్మరక్షణ చేసుకోవలసిందని తమ రైతుసోదరుల్ని ఉత్తేజపరిచారు; రైతుబిడ్డలకు గెరిల్లాయుద్ధ పద్ధతులను బోధించారు.

మా సిల్హెట్ కామ్రేడ్స్ - ఆజిల్లా కాంగ్రెసుకమిటీ సభ్యుల్లో మెజా రిటీ మాకామ్రేడ్సే, పట్టణాల్లోనిమధ్యతరగతి ధనికవర్గాల అనుమానాలను లెక్క—చేయక వీరు గ్రామాల్లో చెదరిపోయి, రైతులోకంలో భీతావహము, నిరాశావాదము వ్యాపించకుండా పాటుబడ్డారు.

మా మణీపూర్ కామ్రేడ్స్ - వీరు జపాను ప్రతికూల ప్రచారం కూడా రహస్యంగానే చేయవలసి వచ్చింది.

మాతృదేశానికి ఘోర ప్రమాదం సంభవింపనున్న రోజుల్లోకూడా జైలు గోడలమధ్య కుములవలసివచ్చిన మా ప్రియతమ కామ్రేడ్స్‌ని గురించి విచారించాం. మణిపూర్ ప్రజానాయకుడు ఐరావతసింగ్ 1930 లో జరిగిన ప్రధాన చెరరిస్టు పోరాటంయొక్క నాయకులు ఆనాడు జైళ్ళలో ఉన్నారు. వీలయిన అన్నివిధాల వీరు మాకు సందేశాలు పంపే వారు. మే మే విధానమైతే నిర్ణయించుకున్నామో, సరిగ్గా ఆ విధానాన్నే ఈ స్వాతంత్ర్యయోధుల సందేశాలన్నీ సూచించేవి.

మీ రా జైల్లోనుంచి బయట కేలాంటివార్త పంపలేకపోయేవారు. కాని గాంధీజీ మీ తరఫున వైస్రాయికి జాబురాశారు. దానిని గురించి తరు వాత రాస్తాము.

జనరల్ సమ్మెను ఎందువల్ల తలపెట్టలేదు

భారతదేశం ఏకఖండమని కాంగ్రెసే చెప్పిందికదా? అలాం టప్పుడు, ముంచుకొస్తున్న ప్రమాదం చిటగాంగ్‌నుంచి డిబ్రుగర్ వరకు ఉన్న ప్రదేశానికి దక్షిణ ఇండియాలోని సముద్రతీర ప్రదేశానికీ మాత్రమే చెందినదా? లేక యావద్భారతదేశానికీ చెందినదా?

'ఈ ప్రమాదం యావద్భారత దేశానికీ చెందినదే' అని మాపార్టీ నిస్సంకోచంగా ప్రకటించింది. ప్రతి ప్రాంతమూ అపాయ ప్రదేశమే అన్నట్లు వ్యవహరించడం మీకు నేర్పింది.

అపాయ ప్రదేశాలుగా ప్రకటించబడిన ప్రాంతాల్లో ప్రజాసామాన్యం మా జపాను ప్రతికూలదీక్షను గుర్తించారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల పక్షం చేరిపోయిన వారిగా మమ్మల్ని చూడలేదు.

కాని దురదృష్ట వశాత్తు ఇతర ప్రాంతాల్లో ప్రజలు బ్రిటిష్‌వారి నిర్బంధ చర్యలకు ఆవేశ పరవశులయారు. జపాను ప్రమాదాన్ని మరచి పోయారు. ముందు ఆలోచనలేకుండా బ్రిటిష్‌వారిపై ఎదురుదెబ్బ తీయ డానికి తహ తహ లాడసాగారు.

మేము వారికి బోధించాం: ఆలోచన లేకుండా, గుడ్డి ఆవేశంతో ప్రవర్తించవద్దన్నాం. ప్రజలు ఎదురుదెబ్బతీయడమంటే పట్టి పగసాధించడంకోసమే కాకూడదన్నాం. ఆ దెబ్బ స్వాతంత్ర్యానికి మార్గం తెరిచేదిగా ఉండాలేగాని, జపాను విషకౌగిలిలోకి జేర్చకూడదన్నాం. ఈ ప్రాంతాల ప్రజలకు జపానువారు దూరపుకొండలవంటివారయారు. బ్రిటిష్‌వారు, వారి గులాములు—కళ్ళ ఎదుట కాళకింకరుల్లా చెలరేగుతున్నారు. అందువల్ల ఈ ప్రజలు మమ్మల్ని అపార్థము చేసుకున్నారు. వక్రభాష్యాలు చేశారు. ఆ ప్రజల్లో మాపట్ల సానుభూతిపోయింది. అయినప్పటికీ కార్మికవర్గంలో అత్యధిక భాగం మా వెనుకనే నిలిచింది. ఏళ్ళ తరబడి మేము చేసిన ప్రచారం ఫలితంగా వారు పరిస్థితులను స్పష్టంగా అవగాహన చేసుకోగలిగారు; ఫాసిస్టుదురాక్రమణ, భారత స్వాతంత్ర్యము ఈ రెండూ ఒక్క ఒరలో ఇమడజాలవని గుర్తించారు.

ఆ రోజుల్లో కాంగ్రెసు పేరుచెప్పి కార్యక్రమం సాగించినవారు ఈ కార్మికుల్లో ప్రజ్వలిస్తున్న స్వాతంత్ర్య కాంక్షనుకూడా వినియోగించుకోవాలని ప్రయత్నించకపోలేదు. సంపూర్ణ స్వాతంత్ర్యంకోసం అంటూ కార్మికుల్ని జనరల్ సమ్మెకు రెచ్చకొట్టాలని వీరు శక్తికొలది ప్రయత్నించారు. అలాంటి సమ్మె జపానువారికే అనుకూలపడుతుందని నచ్చచెప్పి వారించాము. తాము యెంతగానో ద్వేషిస్తున్న ఫాసిస్టు శత్రువు యేమంటున్నాడో రేడియోలో తెలుసుకోమన్నాం. ఇండియాలో మూడు ఘటనలు జరగాలని శత్రువుకోరాడు - భారత సైన్యంలో తిరుగుబాటు; రవాణా సౌకర్యాలను భగ్నంచేయడం: కార్మికుల జనరల్ సమ్మె. ఈ మూడూ ప్రారంభంకాగానే 'భారత స్వాతంత్ర్య సమరాని కిదిగో మా సహకారం' అంటూ దేశంలో సుళువుగా జొరబడాలని శత్రువుప్లాను. జపానురేడియో ప్రసారాల్లో స్పష్టమవుతూన్న ఈ విషయాల్ని కార్మికులకు విశదపరిచాం.

మేమేగాని పూనుకున్నట్లయితే మా పార్టీకున్న సంఘటిత శక్తితో 24 గంటల్లో పారిశ్రామిక కేంద్రాల్లో జనరల్‌సమ్మె తెచ్చేవాళ్ళం, ఎస్.ఐ. రైల్వేనంతటినీ, అస్సాం సరిహద్దువరకూవున్న అస్సాం - బెంగాల్

రైల్వేలో అత్యధికభాగాన్ని చిందరవందర చేయగలిగేవాళ్ళం, ఆరోజుల్లో యుద్ధరంగానికి మిత్రమండలి సరఫరాల నందజేస్తున్న ఏకైక నౌకాకేంద్రమయిన బొంబాయికి యితర ప్రదేశాలతో రైల్వే రాకపోకలు లేకుండా చేయగలిగేవాళ్ళం. కార్మికవర్గంలో మా కంత శక్తివున్నా, ఈ పనిచేయకూడదని మేము బుద్ధిపూర్వకంగానే నిశ్చయించుకున్నాం. ఈ నిశ్చయం మాకు బాధకలిగించక పోలేదు.

జనరల్ సమ్మెకు పూనుకోవడమంటే భారతదేశాన్ని చేతులార జపానువారికి కానుక యివ్వడమే అనీ, సోదరప్రజల చిత్రవధలో భాగస్వాములం కావడమేననీ, మేము గుర్తించాం. అదిభారతదేశస్వాతంత్ర్యానికి ఏ మాత్రమూ దారితీయదు. ఫాసిస్టు బానిసత్వాన్నే ప్రాప్తింపజేస్తుందని గ్రహించాం. పెనంలోనుంచి తప్పించుకోబోయి పొయ్యిలో కురికే ఆ పంథాను నిరాకరించాం.

విధ్వంసకకార్యక్రమానికి సి. యస్. పి. నాయకత్వం

న్యాయంకోసం ప్రజలలో పొంగుకొచ్చిన ఉద్వేగాన్ని ఏ మార్గంలో పెట్టడం అన్నదే ఆనాటి ప్రధాన సమస్య. 'భారతజాతీయ కాంగ్రెసు అధికారసంఘమూ', కాంగ్రెసు సోషలిస్టుపార్టీ, ఫార్వర్డుబ్లాకులు పార్టీల హోదాలోనూ, కొంతమంది కాంగ్రెసువాదులు వ్యక్తిగతంగానో లేక స్థానికగ్రూపులుగానో, ఈ ఉద్వేగాన్ని విధ్వంసక కార్యక్రమంలోకి మళ్ళించడానికి కృషిచేశారు. "మెరుపులాంటి ఒకచిన్న పోరాటం" అని సర్దార్ పటేలిచ్చిన నినాదానికి నిర్మాణస్వరూపాన్నివ్వడానికి ప్రయత్నించారు. "కర్తవ్యనిర్వహణో లేక చావో" అని గాంధీగారిచ్చిన సందేశాన్ని కూడా ఇందుకుపయోగించారు.

కాంగ్రెసు సోషలిస్టుపార్టీ నాయకులంతా కూడి ఏర్పడిన 'జాతీయ కాంగ్రెసు కేంద్ర అధికారసంఘం', 1942 ఆగస్టు 10 వ తేదీన 'భారతదేశకార్మికులకు' అని ఒక కరపత్రం వేశారు దానిలో ఇలాఅన్నారు:

"మీరు పనిమానివేయడంతో పాటు. ఎలాంటిరవాణాలూ సాగకుండా చేయాలి. పరాయిసేనల్ని కదల మెదలలేని స్థితిలో పడేయాలి. అప్పుడు మీపైనిగాని, మీ సోదర దేశీయులపైగాని దెబ్బతీయడానికా సేనలకు వీలులేకుండా పోతుంది."

ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు సందేశం పంపుతూ జైప్రకాశ్ నారాయణ్, యుద్ధకృషిని భగ్నంచేయమని కార్మికుల్ని పురికొల్పాడు. ఇలా అన్నాడు:

"కార్మికవర్గ దృక్పధంనుంచి చూస్తే. యుద్ధకృషి ఎంతతీవ్రంగా సాగితే ధరలు అంత పెచ్చుపెరిగిపోతాయి; భారత కార్మికుని స్థితి అంత అధ్వాన్నమవుతుంది." (భారతజాతీయ కాంగ్రెసుయొక్క పక్షపత్రిక. అన్న ముసుగుతో అచ్యుతపట్వర్ధన్ సంపాదకత్వం క్రింద వెలువడిన 'ఆగష్టు 9' అనే రహస్యపత్రిక—1943 ఆగష్టు 9వతేదీ సంచిక.)

అదేపత్రిక యొక్క 24 వ సంచిక (1943) సంపాదకీయంలో ఇలాఉంది:

"మనల్ని అణచిఉంచడానికి ఇక్కడుండేసిబ్బందిని అచంచల దీక్షతో సంఘటితకృషిద్వారానే తుడిచివేయగలం. రవాణాసౌకర్యాలన్నీ తెగగొట్టడం, ప్రభుత్వయంత్రాన్ని స్తంభింపజేయడం, కార్మికుల చేత సమ్మెచేయించడం మొదలయిన కార్యక్రమంలో ఐక్య కృషి ద్వారానే ఈ అచంచలదీక్ష ఏర్పడగలదు

1943 ఆగస్టు 23 వ తేదీ 'ఆగస్టు 9' పత్రికలో 'ఆగస్టుతీర్మానం గురించి రాస్తూ 'రాంమనోహర్ లోహియా, ఇలా అన్నారు:

"గ్రామాలకు, పట్టణాలకు మధ్య వ్యాపారం సాగుతూండాలనీ. పట్టణాలు ప్రశాంతంగా ఉన్నట్లు కనబడాలనీ, పారిశ్రామికోత్పత్తి కుంటుపడకూడదనీ మన శత్రువు ముఖ్యంగా కోరుతున్నాడు. ఈ రంగాల్లో మనం చేయగలదేదో చేద్దాం."

ఈ విధమయిన కృషిచేసిన శక్తుల్లో అన్నిటికన్నా చేతకానిదవి పించుకున్నది ఫార్వర్డుబ్లాకు. తమకు కంచుకోట అని చెప్పుకునే బెంగాల్లో నయినా వారేమీ సాధించలేకపోయారు. వారు చేయగలిగినదంతా తప్పుల తడకల రాతలతో, అసహ్యంగా అచ్చువేసిన కరపత్రాలను తేవడమే. మరొక ఘనకార్యంకూడా చేశారు, మా ప్రజాసమీకరణలనుచూచి సహించలేక మా కామ్రేడ్స్‌లో అయిదుగురిని హత్యచేశారు.

మమ్మల్ని దేశద్రోహులంటూ వారు దుమ్మెత్తి పోశారు. కాని. మేము రెచ్చిపోయి ఎదురుతిట్టలేదు. మొట్టమొదటి ప్రజావెల్లువ రోజుల్లో మేము వారిని గ్రుడ్డిఆవేశానికి పరవశులయిన దేశభక్తులనే అన్నాం. తరువాత వారు విధ్వంసక కార్యక్రమాన్ని ప్రారంభించినప్పుడు తప్పుదారిని త్రొక్కుతున్న దేశభక్తులన్నాం. ఈ దశలన్నీ దాటి స్పష్టం[illegible] జపాను అనుకూల వైఖరిని కనబరిచినప్పుడే వారిని పంచమాంగదళమని ఖండించాం. దీనికంతటికీ సాక్ష్యం మా 'పీపుల్సువార్' పేజీలే.

కాంగ్రెసుపేరు చెప్పుకుంటూ వారు వ్యహరించారు. అలా చేయడానికి వారికి అధికారంలేదని మేము సవాలుచేశాం. మేమేమాత్రం కాంగ్రెసు తరపున మాట్లాడే అధికారంఉన్న వాళ్ళలాగా ప్రవర్తించలేదు.

ప్రజల్లో వారు కలిగిస్తున్న భ్రమలను దేశభక్తిని పురస్కరించుకొని పోగొట్టడానికి ప్రయత్నించాం. వారు ప్రేరేపించుతూన్న కార్యక్రమం స్వాతంత్ర్యసాధనకేవిధంగా నయినా తోడ్పడుతుందేమో ఆలోచించమన్నాం.

దేశానికిప్పుడు కొత్తగా ఏర్పడిన దురాక్రమణ ప్రమాదాన్ని ప్రజల చేత గుర్తింప జేయడానికి, జైలుకువెళ్ళక పూర్వం మీరెంతగా కృషి చేశారో మేము మరచిపోలేదు.

"బ్రిటిష్ ప్రభుత్వం మనల్నేమిచేస్తుంది. మనం వారినేమి చేయాలి అన్నది కాదిప్పుడు ప్రధానవిషయం. దీనికి ప్రాధాన్యత లేకపోలేదు. కాని ఇప్పుడు దేశానికి సంభవించిన విపత్తూ, దానిని

తొలగించడానికి మనమేమి చేయాలన్నదే ప్రధాన విషయం. కాబట్టి, జరిగిందంతా జరిగినప్పటికి, మనదేశంలో బ్రిటిష్‌వారుజరిపే యుద్ధ కృషికి ఎలాంటి ఆటంకం కలిగించము. ఇక్కడికిరాబోయే అమెరికా మిత్రులసన్నాహాలకుకూడా భంగం కలిగించము. పారిశ్రామిక వుత్పత్తి వుమ్మరంగా సాగాలని మేము కోరుతున్నాం, ప్రజలు ఎవరి స్థానాల్లో వారు నిలచిఉండాలనీ, వాటినివిడిచి పారిపోకూడదనీ కోరుతున్నాం." ('బొంబాయిక్రానికల్'-1942 ఏప్రిల్ 13.)

దేశాన్నెదుర్కొన్న ఉపద్రవాన్నిగుర్తించి మీ రావిధంగా సూచించిన విధానాన్నే, ఎన్ని చిక్కులు వచ్చినా వెనుదీయక, కొనసాగించినందుకు మమ్మల్ని నిందించడానికి మీకు నోరెలా వచ్చింది?

మీరు జైలుకువెళ్ళిన వెంటనే ఆ విపత్తు తొలగిపోయిందా దృక్పథంమార్చుకోడానికి? పై పెచ్చది మూరింతలు తీవ్రంకాలేదా?

ఇప్పుడుచెప్పండి - మేము కాంగ్రెసు విధానానికి భిన్నంగా పోయామని మీరెలా ఆరోపించగలరు? ముంచుకొస్తున్న ప్రమాదంనుండి దేశాన్ని రక్షించడమేగదా ఆనాడు కాంగ్రెసు విధానానికి మూలసూత్రం? ఆ దృక్పథంతోనే మేము విధ్వంసక కార్యక్రమాన్ని వ్యతిరేకించాం; ఆ కార్యక్రమంనుండి విముఖులు కండనికాంగ్రెసు సోదరుల్ని ప్రార్థించాం.

ఆ విధ్వంసక కార్యక్రమమేగాని జయప్రదమైనట్లయితే జపాను వారికి పండుగయ్యేది. అలాగాక, విఫలమైనట్లయితే, బ్రిటిష్ హింసాకాండకు ప్రతిక్రియగా ఏమిచేయలేక పోయామేఅని ప్రజలు నిస్పృహావస్థలో పడిపోయేవారు. ఈ రెండు కారణాలచేతామే మా కార్యక్రమాన్ని తీవ్రంగా వ్యతిరేకించాము.

పోరాటంనుంచి దోపిడీలకు పతనం

బాలియాభగల్పూర్, మిడ్నాపూర్. సతారాలను మీలో కొందరు ప్రస్తుతించారు. ప్రజలు చూపిన ధైర్య సాహసాలను, ప్రభుత్వ నిర్బంధాలను వారు నిర్భయంగా ఎదుర్కొన్నతీరును పొగిడారు. నిజమే; మన ప్రజల్లో వీరత్వం ఎంతయినాఉంది. మన దేశచరిత్రను ఎరిగిన వారెవరూ దీనిని కాదనలేరు.

కాని, ఈ ధీరత్వప్రదర్శన ఒక్కటేకాదు జరిగింది. ఇంకా ఇతర విషయాలుకూడా జరిగాయి. నాయకుల అరెస్టుతో ఉప్పొంగిన ప్రజా వెల్లువ క్రమక్రమంగా తగ్గిపోవడం ప్రారంభించేసరికి, జపాను సేనల సహాయాన్ని ఆశచూపి ప్రజల్లో ఆవేశాన్ని తిరిగి రెచ్చగొట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. జపాను అనుకూల ప్రచారాన్ని సాగించారు. కాని ఇది కూడా ఫలించలేదు. కొద్దిరోజుల్లోనే విధ్వంసక కార్యక్రమ నాయకులకు ప్రజలతో సంబంధం తెగిపోయింది. దానితో వారు దోపిడీ తనమే వృత్తిగా పెట్టుకొన్న వారితో సంబంధం కుదుర్చుకున్నారు. ఆ విధంగా సోదర ప్రజలను భయపెట్టి, పీడించి దోచుకుతినే గుంపులుగా పతనమయారు. తమ ఉత్తరువులను పాటించనివారిని గూఢచారులని చెప్పి ఖూనీ చేశారు.

బీహారు కాంగ్రెసు నాయకులు విడుదలైవచ్చిన వెంటనే ఈ రకం వారినంతా బహిరంగంగా ఖండించారన్న సంగతి మీకు తెలిసే ఉంటుంది. ఏమి చేస్తారో అని భయపడి వారి కాశ్రయ మివ్వవద్దని ఈ నాయకులు ప్రజల్ని హెచ్చరించారు.

1944 జులైలో బీహారు కాంగ్రెసు వర్కర్లు పాట్నాలో సమావేశమయారు. అనుగ్రహ నారాయణ సిన్హాగారు అధ్యక్షత వహించారు. ఈ సమావేశాన్ని గురించి 1944 ఆగస్టు ఒకటవతేదీ 'సెర్చిలైటు' పత్రికలో ఒకవార్త పడింది. ఆ వార్త నింతవరకు ఎవరూ కాదనలేదు. దానిలో ఇలాఉంది:

"కాంగ్రెసు మూలసిద్ధాంతాలయిన సత్య, అహింసలకు వ్యతిరేకం కాబట్టి, హింసాపద్ధతు లవలంబించడానికి కాంగ్రెసుగాని, గాంధీజీగాని ఎవ్వరికీ అధికార మివ్వలేదని విశదపరుస్తూ పూర్ణియాజిల్లాలో కాంగ్రెసు వర్కర్లు కరపత్రాలను పంచిపెడుతున్నారు. కాబట్టి హింసాపద్ధతుల నవ

లంబించేవారిని ప్రజలు కాంగ్రెసువాదులుగా గుర్తించకూడదు; వారి కేలాంటి ఆశ్రయమూ ఇవ్వకూడదు. గయా, మాంఘీరులలో ఇలాంటి కట్టుదిట్టాలనే చేస్తున్నాం. ఇతర జిల్లాల్లోకూడ చేస్తాం."

1945 ప్రారంభంలో అనుగ్రహబాబు గాంధీజీని దర్శించారు. అప్పుడే గాంధీజీ వారికిచ్చిన సలహానుగురించి 1945 ఫిబ్రవరి 10 తేదీ సెర్చిలైటు పత్రికలో ఒకవార్త పడింది. దీనినికూడా ఇంతవర కెవ్వరూ కాదనలేదు. అందులో ఇలా ఉంది:

"అహింసాసూత్రాన్ని గురించి గాంధీజీ చాల ఖచ్చితంగా మాట్లాడారని తెలుస్తూంది. అహింసావిధానంలో తనకు అచంచల విశ్వాసం ఉందని వారన్నారట. విధ్వంసక కార్యక్రమాన్ని తా నెన్నడూ ప్రోత్సహించ లేదన్నారట."

"ఏవిధమైనదోపిడీనయినా కాంగ్రెసువాదులు నిర్భయంగా ఖండించాలని గాంధీగారు చెప్పారు. అలా ఖండిస్తూనే, ప్రభుత్వం వేలకొలది నిరపరాధుల్ని హింసించీ, ఖైదుచేసీ, దోపిడీకన్నా దారుణమైన అపరాధం చేసిందనికూడా ఖండించాలన్నారు. ఈ రెండు అపరాధాలను నిర్భయంగా బట్టబయలుచేయటం అహింసావాదుల విధి అన్నారు. మరోప్రశ్నకు జవాబు చెబుతూ గాంధిగారిలా అన్నారు. "దోపిడీ నొక సాధనంగా ఉపయోగించడంవల్ల దోపిడీరాజ్యమే ఏర్పడుతుందని నా అభిప్రాయము. కాబట్టి దోపిడీగాండ్రు వచ్చి చంపుతామని బెదరించినా వాళ్ళ సహాయం మీకు వద్దనీ, మీ సహాయం వారి కుండదనీ నిర్భయంగా చెప్పాలి."

దేశక్షేమానికి భంగకరమైన ఇలాంటి దోపిడీలు మొదలయిన చర్యలకు పూనుకొన్నవారిని ప్రతిఘటించి ప్రజల యెదుట మేము ఆనాడే బట్టబయలు చేశాం. ఈ ప్రజలే ఎన్నో ఏండ్లనుండీ వారినీ, మమ్మల్ని కూడా కాంగ్రెసువాదులుగా ఎరుగుదురు. అయినప్పటికీ మా ప్రచారంలో మేము కాంగ్రెసుపేరును ఉపయోగించలేదు. వారు పవిత్రమైన కాంగ్రెసు పేరును దుర్వినియోగం చేస్తున్నారని స్పష్టపరిచాం. ఇదంతా పరిశీలించి

మీరేచెప్పండి. మేము కాంగ్రెసును బలపరిచామో లేక ద్రోహం చేశామో.

మాంఘీర్, భగల్పూర్ మొదలైన ప్రదేశాల్లో పోరాటాన్ని ప్రశంసిస్తే ప్రశంసించవచ్చును, కాని దానిని నడిపినవారినిమాత్రం ఆ ప్రాంతాల్లో ఖండించకుండా ఉండడం కష్టమని మాకుతెలుసు. విప్లవకారులమని చెప్పుకుంటూ కాంగ్రెసు సోషలిస్టుపార్టీ, ఫార్వర్డుబ్లాకులవారు ఆ ప్రాంతాల్లో చేసిన అఘాయిత్యాలను గురించి వందలకొలది కాంగ్రెసువాదులు ఫిర్యాదులు చేశారు.

ఆయా సమయాల్లో, ఆయా ప్రదేశాల్లోనే మేమీ దుండగీడులను బట్టబయలు చేశాం. కాని ఇంతవరకుకూడా కథను బయటపెట్టలేదు. ఇందుకు కారణం స్పష్టమే.

ఆ ప్రదేశాల్లో జరిగిన విషయాలను పూర్తిగా తెలుసుకోవాలనే కుతూహలం మీకుంటే పూర్తిరిపోర్టులతో కొంతమంది స్థానిక కామ్రేడ్సుని మీవద్దకు పంపుతాం.

ఆ జిల్లాల్లోని మా కామ్రేడ్లంతా కాంగ్రెసు వర్కర్లుగానే ఉంటూ వచ్చారు. వీరిలో అనేకులు ఆగస్టుఘటనల్లో పాల్గొన్నవారే. పిచ్చిభ్రమలన్నీ తొలగిపోగా మాతోచేరారు.

ఆగస్టు పోరాటనాయకులపైకన్నా మాకు మీవిధానంపై ఎక్కువ విశ్వాసముంది, ఇది సహజమే. ఎందువల్లనంటారా? ప్రతిప్రాంతంలోను, దేశమంతటాకూడా ఆనాడు వారిననుసరించిన వారిలో వేలకొలది ఉత్సాహవంతులీనాడు మావైపు మ్రొగ్గారు. ఈనాడు విద్యార్థిరంగంలో ఉన్న మాపార్టీ సభ్యుల్లో మూడోవంతు ఆనాడు, అదే స్వాతంత్ర్యపోరాటమని నమ్మి, దానిలో పాల్గొన్న దేశభక్తులే. వీరినేమేము 'ఆగస్టుదళ సభ్యు'లని పిలుస్తాము.

ఆగస్టురోజుల్లో మా విధానాన్ని అంగీకరించక మాపార్టీనుంచి వెళ్ళిపోయినవారు ఏరాష్ట్రంలోనూ పదిమందికన్నా ఎక్కువ ఉండరు.

ఆరోజుల్లో కమ్యూనిస్టుగా పనిచేయడమంటే అటు పోలీసునిర్బంధానికి, ఇటు సోదరదేశభక్తుల ఆడిపోతలకు గురికావడమన్న మాట. దీనికి తట్టుకొని నిలబడడం కన్నా 'విప్లవకారు'ల మని చెప్పుకొని తిరగడం చాల తేలికయినపని. ఆనాడు మిమ్మల్ని విడిచిపోయినవారిలో కూడా కొందరు తిరిగి మాపార్టీలోకివచ్చారు.

నిర్బంధవ్యతిరేక ఉద్యమం

ప్రజల్లో పొంగుకొచ్చిన బ్రిటిష్ వ్యతిరేక ఉద్రేకాన్ని సక్రమ మార్గాలకు మళ్లించడానికి; మీపై వారికిగల అపారమైన ప్రేమకు, విశ్వాసానికి నిర్మాణాత్మకమైన స్వరూపాన్ని కల్పించడానికి; మేము వెంటనే ఒక కార్యక్రమాన్ని నిర్ణయించాం. ప్రభుత్వ నిర్బంధ విధానాన్ని ఖండించడానికి, మిమ్మల్ని విడుదల చేయించడానికి దేశమంతటా బ్రహ్మాండమైన ఉద్యమాన్ని ప్రారంభించాం.

ఆనాడు మీతో మాకుగల భేదాభిప్రాయాలను నలుగురికీ చాటలేదు. దేశంలోని పరిస్థితులను మా కామ్రేడ్స్ సరిగా అవగాహన చేసుకోడానికి, అప్పటి విషమ పరిస్థితి ఎలా సంభవించిందో తెలుసుకోవడంకోసం మా పార్టీ ఆంతరంగిక సర్క్యులర్లలోమాత్రమే వాటిని విశదీకరించాం.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులను. ప్రజలను పెడత్రోవలు త్రొక్కిస్తున్న ద్రోహులను బట్టబయలు చేయడంలోనే మా శక్తినంతా కేంద్రీకరించాం. మనకు గలభేదాభిప్రాయాలను మూలబెట్టాం. మీరు బయటికి వచ్చిన తరువాతనే వాటిని ప్రజలఎదుట బెట్టి పరిష్కరించాలని నిశ్చయించుకున్నాం. సాధారణంగా మీరు మీ చుట్టూఉన్న పరిస్థితులనుబట్టి వాటి కనుగుణ్యమైన నిర్ణయాలు చేస్తూఉంటారు. అందువల్ల మీరు బయటికి వచ్చినతరువాత దేశంలోఉన్న విషాదకర పరిస్థితులను పరిశీలిస్తారు: మీకూ మాకూ ఉండిన విభేదాలిక అంతరించిపోతాయని ఆశించాం.

"యుద్ధకాలం అంతా మిమ్మల్ని నిర్బంధంలో ఉంచి జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించవలసిన అగత్యం లేకుండా చేసుకొని; ఆ తరువాత

దేశాన్ని భద్రంగా తమచేతిలోనే పెట్టుకొనే మార్గం ఆలోచించండం—" ఇదీ సామ్రాజ్యవాదుల పన్నాగం. మా దేశభక్తిని ఎదురొడ్డి సామ్రాజ్యవాదుల పన్నాగాలను భగ్నంచేయ నిశ్చయించాము. మిమ్మల్ని విడిపించుకోవడమే ఆనాటి మా ప్రధాన కర్తవ్యంగా భావించాము.

మీ విడుదలకోసం అహోరాత్రులు ఆందోళన చేశాం. మీరు బయటికి వచ్చి మీ కార్యక్రమం ఎక్కడయితే భగ్నమయిందో అక్కడనుండి తిరిగి ప్రారంభిస్తారని నమ్మాము.

బ్రిటిష్ దురాగతాన్ని మితవాదుల్లాగా మేము వాచా ఖండించి, ఇళ్ళల్లో హాయిగ కూర్చోలేదు. ఒకవైపు ప్రజలను రెచ్చిపోవద్దని ప్రచారం చేశాం, మరోవైపు, ఘర్షణలు సంభవించినప్పుడు ప్రజలకు పోలీసులకు మధ్య నిలబడ్డాం. ప్రజలను కాపాడుతూ, పోలీసు లాఠీలకు ముందుగా మాతలలనే వప్పగించాం.

మీకు తెలియదేమో—అహమదాబాదులో, ఆగస్టు రోజుల్లో పోలీసు కాల్పులు జరిగినప్పుడు మొట్టమొదట బలిఅయింది మా కామ్రేడ్ ఉమాభాయ్ కాడియా. మాతృదేశ సంరక్షణకు, జపాను ఫాసిస్టుల విధ్వంసనానికి ఈ 20 ఏళ్ళ కమ్యూనిస్టు యోధుడు కంకణం కట్టాడు. గెరిల్లా శిక్షణ పొందాడు. ఆగస్టు 10వ తేదీన ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ ఒక వూరేగింపు జరిగింది. ప్రజలను రెచ్చగొట్టజూచినవారు తమ ప్రయత్నాలు సాగించారు. ప్రజలనుకాల్చి చంపడానికి అదనుకోసం పోలీసు సిబ్బంది కాచుకుని ఉంది. రెచ్చిపోవద్దు—పోలీసు వలలో పడవద్దని ఉమాభాయ్ ప్రజలను వారిస్తూ వచ్చాడు. కాని పోలీసులు దురాగతంకొద్దీ అకారణంగా తుపాకులు పేల్చారు. మొట్టమొదట నేలకొరిగింది మా ఉమాభాయ్. నిజమైన ప్రజలబిడ్డడు—ప్రజలను కాపాడడానికి పాటుపడి, ప్రాణాలర్పించాడు.

నిర్బంధ వ్యతిరేక ఉద్యమం సాగిస్తూ, మీవిడుదలకై ఆందోళన చేస్తూ, ప్రభుత్వ హింసాకాండలో మావంతు పూర్తిగా అనుభవించాం.

సి. యస్. పి. మీవిడుదలకు వ్యతిరేకం

కాంగ్రెసుపేరిట మమ్మల్ని వ్యతిరేకించిన వారారోజుల్లో వింతపోకడలు పోయారు. మీవిడుదలకై మేముసాగించిన ప్రచారాన్ని తీవ్రవాదాల్లో మితవాదం అని అపహాస్యం చేశారు. అంతేకాదు, స్వాతంత్ర్యం కోసమే నాయకులు జైళ్ళకు వెళ్ళారు. తిరిగి వా ని బానిస భారతదేశంలోకి తేవాలనుకోవడం వారికీ, స్వాతంత్రోద్యమానికీ ఘోరమైన ద్రోహం అంటూ పాత కాంగ్రెసు సంప్రదాయాలను పురస్కరించుకొని వాగాడంబరం ప్రదర్శించారు. మీవిడుదలకేకాదు. జాతీయ ప్రభుత్వస్థాపనకు కూడా వారు వ్యతిరేకత చూపారు.

"భారత దేశానికి తీరనినష్టం మరొకటి కలుగుతుంది. మహాత్మా గాంధీ, అధ్యక్షులు అజాద్, పండితనెహ్రూ మొదలైనవారు విడుదలయిన మరుక్షణంలో ప్రపంచంభారతదేశాన్ని మరచిపోతుంది. ప్రపంచబాధ్యతను నిర్వహిస్తున్నవారిపై మన ప్రతిష్టంభన చాలవొత్తిడి కలిగిస్తూంది. వీరు విడుదలైతే ఆవొత్తిడి తగ్గిపోతుంది. అమెరీలు, చర్చిల్లు నిశ్చింతగా నిద్రపోతారు. పిచ్చిగాంధి మళ్ళీజైలుకు తీర్ధయాత్రప్రారంభించేదాక ఏమీఫరవాలేదని హాయిగా ఉంటారు. నెహ్రూపండితుడు బయటికి రాగానే ఏవేవో ప్రకటనలు చేస్తాడు, అమెరికావిలేఖరులు బ్రహ్మానందం పొందుతారు. కాని అందమైన మాటలుకూర్పు మినహాయిస్తే వాటిలో పస ఏమీఉండదు. నెహ్రూ జైలులోఉండడమే రూజువెల్టు, చర్చిలు మొదలైన సామ్రాజ్యవాదులకు గట్టిసమస్యగా ఉంటుంది. ఆయన బయటికివచ్చి చక్కని ప్రకటనలు వెదజల్లుతూ పెద్దరాజ్యాల రాయబారుల్ని ముగులను చేస్తూఉంటే ఈసామ్రాజ్యవాదులకు ఏలాంటి ఒత్తిడీ ఉండదు."

(" స్వాతంత్ర్య యోధులకందరికీ " అని జైప్రకాశ్ నారాయన్ ప్రకటించిన జాబుల్లో రెండవదానిలో 7 వ పేజీ)

" పై సమస్యలకు సంబంధించినవే జాతీయ ప్రభుత్వ సమస్యా: కాంగ్రెసు లీగు ఐక్యతా సమస్యలున్నూ. జాతీయ ప్రభుత్వం తప్పకుండా

కావలసిందే. కాని, ఈ విషయంలో తమాషా ఏమిటంటే — దీనికోసం పోరాడడం, త్యాగం చేయడం కాంగ్రెసువంతు; వట్టిమాటలతో కాలం గడపడం ఇతరులవంతు: జాతీయప్రభుత్వం అంటే ఇండియా చట్టం (1935) క్రింద ఏసంయుక్త మంత్రివర్గాలో, లేక మసిపూసిన మారేడు పండులాంటి వైస్రాయి కార్యనిర్వాహక వర్గమో కాకుండా, సిసలైన జాతీయ ప్రభుత్వం కావాలంటే సంప్రదింపులవల్ల ఎన్నటికీ లభించదు. ఈ నిరర్ధక సంప్రదింపుల పంధాను కాంగ్రెసు ఏనాడో విసర్జించింది. ఇప్పుడు కమ్యూనిష్టులుబయలుదేరి తమ సామ్రాజ్యవాద యజమానులకు పిటిషన్లు పెట్టడం ద్వారా జాతీయ ప్రభుత్వాన్ని సంపాదించ దలచుకుంటే, ఆకాళ్ళు పిసకడమేదోవారినే చేయనీయండి. కాని, ఒకటి నిశ్చయం. ఈకృషిలో వారుతమ సోదర ప్రజల హేళన: తమకు జీతమిచ్చి పోషిస్తున్న సామ్రాజ్యవాదుల ఈసడింపులు తప్ప మరేమీ సంపాదించరు." (పై జాబులోనే 8 వ పేజీ)

ఇదిగో ఢిల్లీకి ప్రయాణమై మిమ్మల్ని విడిపించి, భారతదేశాన్ని విముక్తి చేసేస్తామని జపానువారు బాకాలూదసాగారు. వీళ్ళు రావడమంటే ఏమిటో మేము గ్రహించాము, దానిఅర్థం భారతదేశంపై దురాక్రమణ; మొదటినుంచీ ఫాసిజాన్ని ఖండిస్తూ వచ్చిన మిమ్మల్ని జైలు సెల్లులనుండి బయటికితీసి కాల్చి చంపడం: అభాగ్య భారతదేశంపై ఫాసిస్టు బానిస సంకెళ్ళను బిగించడం.

స్వాతంత్ర్యానికి నిజమైన మార్గం

దేశాన్ని నిజంగా కాపాడి బ్రిటిష్ సామ్రాజ్యవాదులనుండి పరిష్కారాన్ని సాధించగల శక్తిని జాతీయోద్యమానికి కలిగించే మార్గమేదో మేము గ్రహించాము. అక్షరాజ్య వ్యతిరేక పోరాటంలో మనం ఉచిత పాత్రను నిర్వహించడానికి తోడ్పడే మార్గమేదో మేము నిర్ణయించుకున్నాం. అది — మొట్టమొదట మిమ్మల్ని విడిపించుకోవడం; కాంగ్రెసువాదుల్లో స్వయంనిర్ణయ సూత్రంపట్ల సుముఖత్వం కలిగించీ, మీ విడుదలకొరకై జరిగే ఆందోళనకు లీగువారి సహకారాన్ని సాధించీ

దేశంలో ఐక్యతా వాతావరణాన్ని నెలకొల్పి, ఢిల్లీలో జవహర్ — జిన్నా ప్రభుత్వాన్ని ప్రతిష్టించడానికి తగిన అవకాశాలను కలిగించడం. లీగు కేంద్ర నాయకవర్గం బిర్రబిగుసుకు కూర్చుంది —నిజమే. కాని, బీహారు, బెంగాల్ రాష్ట్ర నాయకులు, అనేకమంది జిల్లా నాయకులు ఐక్యతా అవసరాన్ని గుర్తిస్తూ మాట్లాడారు.

మేము బ్రిటిష్ పాలకులకు అమ్ముడుపోయామనే విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికే నాయకుల విడుదలకోసం ఆందోళన అంటూ ఒక నాటక మాడామని విషప్రచారం సాగింది. ఈ దిగువప్రశ్నే దానికి జవాబు: అమెరీముతా విధాన మేమిటికి? —నాయకుల నిర్బంధమా, లేక విడుదలా? నాయకులు విడుదలై దేశానికి తిరిగి నాయకత్వం వహిస్తే మాక్సువెల్. లిన్లిత్గోలకు లాభమా, నష్టమా ?

మీతో మాకు తీవ్రమైన భేదాభిప్రాయాలున్నాయి. అయినా మీ విడుదల కోసం అహోరాత్రులూ అందోళన చేయడానికి మమ్మల్ని ఉత్తేజపరిచిం దేమిటి? బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై పిచ్చినమ్మకం కాదు. హింసాకాండకు గురిఅయినవారిపట్ల సాధారణ దేశభక్తియుత బాధ్యతకూడా కాదు. మీపై మాకుగల భక్తి, ప్రేమలే మమ్మల్ని ఆందోళనకు పురికొల్పాయి. 'పీపుల్సువార్' పుటలూ, మా ఉపన్యాసాలను వినిన వేలాది ప్రజలూ ఇందుకు సాక్ష్యం.

జాతీయ నాయకుల్లో ప్రప్రధానులు మీరే అని మేము గుర్తించాం. దేశాన్నెదుర్కొన్న విషమ సమస్యలను పరిష్కరించడానికి సర్వశక్తులను వినియోగించగల స్వేచ్ఛ మీకు లేనట్లయితే మన జాతీయోద్యమానికి ముక్తి లేదనీ, అది శిధిలమవక తప్పదనీ మేము గుర్తించాం. ఒకవైపు బ్రిటిష్ సామ్రాజ్యవాదులపై వెర్రి ద్వేషం, మరోవైపు నిరాశా నిస్పృహలు ప్రజల్లో అలముకుంటాయని గ్రహించాం. మీరువచ్చి ఈ దుర్గతినుండి దేశాన్ని కాపాడే బాధ్యతను వహిస్తారనే ఆశతోనే ఆనాడు మేము మీపట్ల దేశంపట్ల మావంతు బాధ్యతను నెరవేర్చాము.

VII

తనంతట ప్రారంభమైన ప్రజా వెల్లువ ఎందుకు నీళ్ళుకారిపోయింది

ముందు ఆలోచన లేకుండా తనంతట ప్రారంభమయి ఏ ప్రజా వెల్లువా చరిత్రాత్మకమైన బాధ్యతలను నెరవేర్చలేదు. మానవేతి హాసంలో అలా ఎన్నడూ జరుగలేదు, అయినప్పటికీ మీరు. మీ రాయబార ప్రయత్నాలు సఫలం కాకపోయిన పక్షంలో, ఇలాంటి ప్రజా వెల్లువ మీదనే ఆధారపడా లనుకున్నారు, అమెరీముతా మిమ్మల్ని అహమద్ నగరు కోటలో బంధించి, ఈ వెల్లువను లేవదీసే అవకాశం లేకుండా చేసింది.

ఆగస్టు 9న ప్రారంభమయిన ఆ దేశభక్తియుత ప్రజా వెల్లువ కొద్దిరోజుల్లోనే నీళ్ళుగారిపోసాగింది.

'ఏ ప్రజలకైతే ప్రాతినిధ్యం వహిస్తున్నానని కాంగ్రెసు చాటుతూ వచ్చిందో, ఆ ప్రజా వాంఛయొక్క స్వరూపమే' (సబ్‌కమిటీ రిపోర్టు) అయిన ఈ ప్రజా వెల్లువ ఆగస్టు తీర్మానం ఫలితంగా అనాలోచితంగా సంభవించినది. పరస్పర వైరుధ్యాలతో కూడుకున్న ఆగస్టు తీర్మానమే ఆత్మ వినాశ కరమైన పోరాటానికి దారితీసింది. ఒక సబబైన న్యాయమైన వాంఛను అపసవ్యమైన, అక్రమమైన పద్ధతులతో నెరవేర్చుకో జూచారు. దేశరక్షణకోసం కావలసిన జాతీయ ప్రభుత్వాన్ని ఆ దేశరక్షణ సన్నాహాలను భగ్నం చేయడంద్వారా ఎలా సాధించగలం ?

జాతీయవాంఛ సూచిస్తున్నది ఒక మార్గం. దానికోసం తీసుకోదలచిన చర్యలు దారి చూపిస్తున్నది. మరోవైపు.

ఆగస్టు తీర్మానంలో బ్రిటిష్వ్యతిరేకత జపానువ్యతిరేకత తొణికిసలాడాయి. బ్రిటిష్ నిర్బంధం పెచ్చుపెరిగినకొద్దీ ప్రజల్లో బ్రిటిష్ వ్యతిరేకత ఇనుమడింపసాగింది. ప్రజలు ద్వేషపూరితు లయారు. నిస్సహాయ స్థితిలో మునిగారు. అప్పుడు వారిలో జపాను అనుకూల భావం మొలకెత్తిపెరుగ

సాగింది. పోరాటం విఫలమయిందని ఎప్పుడు స్పష్టమయిందో అప్పటి నుంచీ బ్రిటిష్ దాస్య విముక్తికోసం జపాను దండయాత్రకొరకు ఎదురు చూడసాగారు.

మన జాతీయ వాంఛపట్ల ప్రపంచంలోని అభివృద్ధి కాముకులందరి సానుభూతి, సహకారాలను సంపాదించాలనే మీతీర్మానంయొక్క ఉద్దేశం. కాని ఆ తీర్మానం అనంతరం జరిగిన ఘటనలు ఇతర దేశాల్లోని మన మిత్రుల్ని అయోమయావస్థలో ముంచాయి. ఆ సమయంలో, ఆ దేశాల్లోని మా సోదర కమ్యూనిస్టు లొక్కరే చొరవ తీసుకొని. చర్చిల్- అమెరీలు మీపై సాగించిన విషప్రచారా న్నెదుర్కొన్నారు. తక్షణమే భారతదేశంతో పరిష్కారం కుదుర్చుకోవడం అత్యవసరమని సహృదయులు ప్రచారం సాగించడానికి అవకాశం కలిగించారు, ఆగస్టు ఘటనలు కలిగించిన అయోమయావస్థలో నుంచి భారతదేశాభిమాను లింకా తెప్పరిల్లక ముందే ఈ పనికి పూనుకోవడం ఎంతో కష్టమైన పని. అయి మా సోదర కమ్యూనిస్టు పార్టీలు వెనుదీయలేదు.

ప్రపంచంలోని అభివృద్ధికాముకుల భావాలను మే మెల్లప్పుడూ జాగ్రత్తగా గమనిస్తూ ఉంటాము. భారతదేశంనుంచి సుప్రసిద్ధ విదేశ పత్రికా విలేఖరులు తమతమ పత్రికల కేమేమి పంపుతున్నారో మే మెరుగుదుము. 1941–42 లో భారతదేశంపట్ల వీరు అపార సానుభూతిని ప్రకటించారు. 1942 ఆగస్టు అనంతరం దిగ్భ్రమను ప్రతిబింబించారు, 1943 నుంచి ఏదో దయదలచినట్లు కనుపించారు. వారు ఎన్నోసార్లు పునరుచ్చరించిన మాటలను ఉదాహరిస్తాము.

"మీ నాయకులను మే మర్థంచేసుకోలేక పోతున్నాం. పరిస్థితులను వా రల్లకల్లోలం చేసేశారు." "బ్రిటిష్ సామ్రాజ్యవాదుల తప్పుడు ప్రచారాన్ని మేము నమ్మడంలేదు. కాని మీరు చేస్తున్నదేమిటి ?" వారి భావాలు ఈవిధంగా వెల్లడవుతూ వచ్చాయి. ఈ పత్రికలను యీ విలేఖరులను, "అభ్యుదయకాములనీ, భారతదేశాభిమానుల"నీ అనడాన్ని నెహ్రూ పండితుడు ఏమాత్రం సంకోచింపడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కుత్రలను

వీరు శక్తికొలది తూర్పారబడుతూ వచ్చారు. కాని అదే సమయంలో కాలం గడచినకొద్దీ, మన నాయకులపై వారికిగల విశ్వాసం కూడా తగ్గుతూవచ్చింది.

ఇక ఆగస్టుపోరాటానికి నాయకులమని చెప్పుకున్నవారి భావాలకూ, వారి ధీరత్వానికి పట్టిన గతేమిటి ?

'కర్తవ్యపాలనో, లేక చావో'అన్న నినాదాన్ని వారు మంత్రంగా తీసుకున్నారు; 'మెరుపులాంటి ఒక చిన్న పోరాటం' అనే కార్యక్రమాన్ని శక్తికొలది కొనసాగించారు. కాంగ్రెసు పేరుప్రతిష్ఠలను, శక్తిసంపదలను ప్రజల్లోని తీవ్ర బ్రిటిష్ వ్యతిరేకతను వీరు బాగా ఉపయోగించుకొన్నారు. వారు చేయదలచుకుందేదో శక్తికొలది చేశారు. అయినప్పటికి తమ "పోరాటం" పట్ల ప్రజల్లో మొదట కనుపించిన ఉత్సాహం క్రమక్రమంగా సన్నగిలింది. దీన్ని తిరిగి ప్రజ్వలింపజేయడానికి ఎంతో ప్రయత్నించారు. కాని ఆ ఉద్దేశంతో ఎంత పెద్ద కబుర్లాడారో అంత సత్యదూర మనిపించారు.

ఈ విధమైన ప్రయత్నాల్లో 1942 ఆగస్టు 16 న బొంబాయినుంచి కాంగ్రెసు సోషలిస్టులచేత ప్రచురించబడిన కాంగ్రెసు బులెటిన్ ఒకటి. రవాణాలను అరికట్టమనీ, ఉత్పత్తిని భంగపరచమని ఇది రెచ్చగొట్ట జూచింది.

> "ఈ కార్యక్రమాన్ని జయప్రదంగా కొనసాగించడానికి ప్రతి పౌరుడు పూనుకోకపోతే, నలభై కోట్ల మన భారతీయుల విముక్తి కోసం గాంధీజీ తన ప్రాణాలను బలిదానం చేస్తారు. ఇందుకు వారు పదిహేనురోజులమాత్రమే గడువిచ్చినట్లు తెలుస్తూంది." అని ఈ బులెటిన్ ప్రజల్ని బెదరగొట్ట చూచింది.

ఈ ప్రయత్నాలన్నీ చివరకు విఫలమయాయి. పోరాటం, క్రమక్రమంగా అంతరించింది. కాని ఈ విషయాన్ని వీరెలా అర్థంచేసుకున్నారు ? ఇలా జరిగినందుకు వారిచ్చిన కారణాలనన్నిటినీ తెలియజేస్తాం

సవ్యమైన పంథా, ఫలదాయకమైన కార్యక్రమముగల ఏ విప్లవవాదీ, ఏ ప్రజానాయకుడూ అనవలసినమాటలు కావివి.

ప్రజలపై నింద

భారతస్వాతంత్ర్య విప్లవాన్ని నడుపుతున్నామనీ, విజయం అందుబాటులోనే ఉందనీ తాము నమ్మి, ఇతరులను నమ్మించడానికి ప్రయత్నించింది వీరు. కాని తాముకోరిన రీతిగా ప్రజలు నడుచుకోవడం లేదని వీరు త్వరలోనే గ్రహించగలిగారు. తనంతటదిగా బయలుదేరిన ఆ ప్రజావెల్లువ కొన్ని ప్రాంతాల్లో రెండువారాలకన్నా ఎక్కువకాలం నిలవలేదు. పోలీసు స్టేషన్లు స్వాధీనంచేసుకొనడం మొదలైన పద్ధతుల్లోకి పోయింది కొద్ది జిల్లాల్లో. అక్కడకూడా ఆ తీవ్రతఅంతా అడుగంటి, చివరకు కొంతమంది రహస్యదళాలుగ ఏర్పడి, అప్పుడప్పుడు ఏదో ఉన్నామనిపించుకునే స్థితికి దిగజారింది.

వీరిచ్చింది ప్రజావిప్లవ సందేశం అయినా ప్రజలంతగా కదిలిరాలేదు. ఇందుకు వారిచ్చిన సమాధానమేమిటి? అనాలోచితంగా వారి నోటివెంటవచ్చిన సమాధానం - ప్రజలు పిరికివారయి పోయారనీ, నిర్బంధానికి తట్టుకోగల గుండెనిబ్బరంవారికి లేదనీ. మొదట్లో ఈ సమాధానం అక్కడా అక్కడా గుసగుసలుగా వినిపించింది. రానురాను రాతల్లోకెక్కింది.

మీరెంతగానో బ్రహ్మరథంపట్టిన జైప్రకాశ్‌నారాయణ్, కాంగ్రెసు సోషలిస్టుపార్టీ నాయకుడు ఈ విషయమై ఇలావ్రాశాడు.

"మనది ప్రాచీనౌన్నత్యంగలజాతి. ఎన్నోమహత్తర విషయాలను సాధించింది. యుగయుగాలుగ వన్నెతరుగక నిలచిన జాతి మనది. ఇలాంటి జాతికి ఆత్మవిశ్వాసం ఉండవలసింది. కాని ఇప్పుడు వెల్లడయినదేమిటి ; మనవాళ్ళకు రాళ్లు రప్పలమీదఉన్న విశ్వాసం తమ శక్తిసామర్థ్యాలమీద మచ్చుకయినా కనబడడం లేదు.

(ఆగస్టు 9-సంచిక 2—4వ పేజీ – 1943 ఆగస్టు 23)

తప్పుడుపంథాలు ప్రజలను త్తేజపరచవు

నిషేధాలు, నిర్బంధాలు, ఘోరహింసలు మన ప్రజల ఉత్సాహాన్ని చల్లార్చజాలవు. వీటికి బెదరిపోవలసినవారుకాదు మన భారతప్రజలు, కాని తప్పుమార్గాలుచూపి వారిని రమ్మంటే రారు.

నిజమే, బ్రిటిష్‌వారు జరిపినహింసాకాండ కనివిని ఎరుగనిది. కాని నిజమైన విప్లవవాది చేయవలసిన పనేమిటి? అంతకునూరింతలు హింసావిధానానికి సిద్ధపడాలి, తమ ప్రజలను పూర్తిగా అర్థంచేసుకోవాలి, తమ అత్మశక్తిని, లోటుపాట్లను సరిగాఅంచనా వేసుకోవాలి. అప్పుడు స్వాతంత్ర్య విప్లవానికి శంఖం పూరించాలి.

మనకు 60 ఏళ్ల జాతీయోద్యమ అనుభవం ఉంది. [illegible]వె ఏళ్ళలో మూడు ప్రజాపోరాటాలను (సిపాయ్ తిరుగుబాటు 1920, 1930 ఉద్యమాలు) చూచాం. ఇంత అనుభవంపొందికూడా, ఒకకాంగ్రెసు గ్రూపుగాని, ఒకవిప్లవపక్షంగాని, తాము కాంగ్రెసుపేరిట సాగించదలచుకొన్న పోరాటం ప్రజల పిరికితనంవల్లనే విఫలమయిందంటే ఏమనాలి? మనప్రజలపై కారుకూతలు కూస్తున్నారని వారిని ఖండించాలి. తాము చూపిన మార్గంలోని లోపాలను గుర్తించకుండా ప్రజలనెత్తిపై దుమ్ముకొడుతున్న గుడ్డినాయకులుగ తూర్పారబట్టాలి.

మనప్రజలకు బ్రిటిష్ వ్యతిరేకత నేర్పాలా? బ్రిటిష్‌వారు దేశానికి నిరంకుశ పరిపాలకులు కాకముందే, దోపిడీవర్తకులుగా ఉంటున్న రోజుల్లోనే ప్రజలు వీరిని పచ్చిదొంగలని అసహ్యించుకొనేవారు.

మాతృదేశ స్వాతంత్ర్య బలిపీఠంమీద ఆత్మార్పణచేసిన వీరయోధులు తక్కువయ్యారా ఈనాయకులకు? మనదేశంలో ఇంచుమించు ప్రతి జిల్లాలో ఇలాంటి వీరులు ఒకరికన్నా ఎక్కువే ఉన్నారు— కొన్ని జిల్లాలలో పదికన్నా ఎక్కువ ఉన్నారు.

మనప్రజలు పిరికిపందలా? వీరోచిత పోరాటం సాగించలేని చవటలా, మనప్రజలు? సిపాయ్ తిరుగుబాటు, 1920, 1930 ఉద్యమాలు,

అసంఖ్యాక కార్మిక కర్షక పోరాటాలు— ఇవన్నీ పవిత్ర వీరగాథలుగ మనం ప్రతినిత్యం మననం చేస్తుంటాము। భారతజాతి నిర్మించిన స్వాతంత్ర్య పోరాట చరిత్ర ప్రపంచంలో ఏగొప్పజాతికయినా గర్వకారణం కాగలదే।

క్రిప్సురాయబారం భగ్నమయిన తరువాత నెహ్రూ పండితుడే మన్నాదో జ్ఞాపకం తెచ్చుకోండి. సోవియట్ దేశంలో కమ్యూనిస్టుపార్టీని మినహాయిస్తే కాంగ్రెసువంటి ప్రజాసంస్థ మరేదేశంలోను లేదని ఎంతో గర్వపడుతూ అన్నారు? చరిత్రలో ఇదివరకెన్నడూ ఎరుగని బ్రిటిష్వ్యతిరేకత, దానితోపాటే రాజకీయాల్లో మునుపెన్నడూలేని ఉత్సాహం, స్వాతంత్ర్య కాంక్ష ఆరోజుల్లో మనప్రజల్లో వెల్లివిరిశాయన్న సంగతి కళ్ళుగల ప్రతివారికి కనిపించింది. ఈవిషయాన్ని మీరు మీఉపన్యాసాల్లో గుర్తించారుకూడా.

ఇప్పుడాలోచించండి ఇంతజాతీయ చైతన్యానికి మూలకారణమైన కాంగ్రెసుపేరును, దాని బలసంపదలను, దానివర్కర్లను ఉపయోగించుకొనికూడా ఈనాయకులు స్వాతంత్ర్య పోరాటాన్ని జయప్రదంగా నడపలేకపోయారంటే స్వాతంత్ర్యం కోసము మీవారు సూచించిన విధానంలోను; అవలంబించిన పద్ధతుల్లోను, చివరికి వారిలోనూ ఏదో పెద్ద లోపముందన్న మాటేకాదా?

పొందదలచిన ఫలమొకటి, కాని ఎక్కేచెట్టు ఇంకొకటి, అయినప్పుడు ఆ ఫలమెలా లభిస్తుంది?

ప్రజల ఉత్సాహం సన్నగిలేదేపరిస్థితుల్లో? తాము తీస్తున్న దెబ్బలు నిష్ప్రయోజన మయిపోతున్నప్పుడూ. శత్రువుదే పై చేయి అయిపోతున్నప్పుడే ప్రజల ఉత్సాహం సన్నగిలుతుంది.

"మేము సన్నద్ధం కాలేదు"

పోరాటం నీళ్ళుగారిపోయినందుకు మరో కారణాన్నికూడా ప్రచారం చేశారు. వర్కింగుకమిటీ సభ్యులయిన మీరు ముందుగా ఎలాంటి సన్నాహాలు చేయలేదనీ, అందువల్లనే మీ వారసులయినవారు విప్లవాన్ని

నడుపలేకపోయారనీ వారి ప్రచారం. ఈవిధంగా రాజకీయ కారణాలవల్ల కాక. నిర్మాణ లోపాలవల్లనే ఆ పోరాటం విఫలమయిందంటారు.

"తిరుగుబాటు లేవదీయండి" అనే వ్యాసంలో రాంమనోహర్ లోహియా — మరొక కాంగ్రెసు సోషలిస్టు నాయకుడు — ఇలా అన్నాడు:

"1942 ఆగస్టు 9 తిరుగుబాటులో నిర్మాణాత్మకమైన సన్నాహాలేవీ లేవని వందసార్లయినా చెబుతాను —"

ఈ లోపానికి కారణం గాంధీజీ బ్రిటిష్వారి తత్వాన్ని సరిగా అర్థం చేసుకోక, తనను అరెస్టు చేయరని నమ్మడంవల్లనే అని అన్నాడు.

"మన తిరుగుబాటుకు తగిన సన్నాహాలు చేయలేదని గాంధీజీతో మనం తగవులాడకూడదని ఇదివరకే చెప్పాను. ఇందుకు కాంగ్రెసు వర్కింగుకమిటీనే ఖండించాలని అప్పుడప్పుడు అనిపిస్తుంది. కాని, అది కూడా సబబుకాదని నా అభిప్రాయం. అహింసాయుతుడైన సామాన్య మానవుని ఆధిక్యతను ప్రతిష్ఠించడమే తన ఆశయం కాబట్టి గాంధీజీ మన తిరుగుబాటుకు కావలసిన సన్నాహాలు చేయలేదు. వర్కింగుకమిటీకి ఇలాంటి కారణాలేవీ లేవు. అయినా వారిని ఖండించకూడదంటే కారణం వారు 25 ఏళ్లనుంచి దేశసేవా తత్పరులైన త్యాగధనులు కాబట్టే. వారింకా బుద్ధిబలంతో తగిన రాజకీయ నాయకత్వం వహించి మనల్ని నడపాలనే కోరుతున్నాం. కాని, మన తిరుగుబాటు విషయంలో నిర్మాణ లోపాలకు వారిని బాధ్యులం చేయజాలం."

('ఆగస్టు 9'–సంచిక 12–1944 జనవరి 26)

"స్వాతంత్ర్యయోధుల కందరికీ అనే శీర్షికతో ప్రచురించిన తన జాబులో జైప్రకాశ్ నారాయణ్ ఇలా అన్నాడు:

"ఆగస్టు ఘటనల్లో బ్రహ్మాండ మయిన ప్రజాశక్తి పైకుబికింది. కాని, దీనిని సరిగా నడపడానికి తగినట్లుగా జాతీయ విప్లవశక్తులు సన్నద్ధం కాలేదు. కాంగ్రెసు ఒక ప్రజాసంస్థే కాని, అప్పుడు కావలసిన తిరుగుబాటు స్థాయికి రాలేకపోయింది. ఆరోజుల్లో నిర్మాణలోపం ఎంతగా

ఉందంటే–తిరుగుబాటు కార్యక్రమం కొంతమంది కాంగ్రెస్ ప్రముఖులకే తెలియలేదు. ప్రజలు కాంగ్రెస్ కార్యక్రమాన్ననుసరించే నడుచుకొంటున్నారా? అన్న తర్జనభర్జనలు తిరుగుబాటు ప్రారంభమయినతరువాత ఎంతోకాలంవరకు సాగుతూనే వచ్చాయి. ఈ సందర్భంలోనే మరో విచారకరమైన విషయం. స్వాతంత్ర్యంకోసం తలపెట్టిన ఈ అంతిమ పోరాటానికి, అనుగుణ్యమయిన మనోప్రవృత్తి ప్రముఖ కాంగ్రెసు వాదుల్లోనే కరవయింది. మహాత్మాగాంధీ, రాజేంద్రప్రసాద్, సర్దార్ పటేల్‌వంటి నాయకుల్లో కనబడిన దీక్ష, పట్టుదల కాంగ్రెసు వాయకు లందరిలోను కనబడలేదు."

ప్రకటించిన ఆశయం స్వాతంత్ర్యమే-అందులో లోపమేమీ లేదు కదా? ఇక లోపంఉంటే సన్నాహాల్లోనే ఉండాలని వారి వాదన.

రాజకీయంగా వారెంత అమాయకులు! స్వాతంత్ర్యాశయాన్ని సాధించాలంటే, "జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను సరిగా అవగాహన చేసుకొని, సక్రమమైన రాజకీయ పాలసీని నిర్ణయించుకోవడం అవసరం కాదా? అన్న ప్రశ్నే వారికి తట్టలేదు. ఆపైని నిర్ణయించే రాజకీయ కార్యక్రమం ఆశయ సిద్ధివైపు ప్రజల్ని నడిపించేదిగా ఉండాలన్న సంగతే వారికక్కరలేకపోయింది, స్వాతంత్ర్యాశయాన్ని ప్రకటించడమే వారికి సరిపోయింది.

కాంగ్రెసువాది

సాధారణ కాంగ్రెసువాది హృదయ నైర్మల్యము, చిత్తశుద్ధిగల దేశభక్తుడు. భారతజాతీయతకు చిహ్నప్రాయుడు. ఈ లక్షణాలుండబట్టే, అతను కాంగ్రెసువాది కాగలుగుతున్నాడు. స్వాతంత్ర్యం కోసం సాగిన వివిధ ఉద్యమాల్లో కష్టనష్టాలకోర్చి, శక్తికొలది త్యాగం చేస్తాడు. ఇక కాంగ్రెసు కార్యక్రమమే జీవితంగా పెట్టుకొని, కాంగ్రెసు వర్కరవుతాడు. అతనికి మార్గం చూపడానికి విస్పష్టమైన రాజకీయసిద్ధాంతం ఏమీలేదు. ఏదో ఒక జాతీయ దినపత్రికను, అభివృద్ధికర రచనలకొన్నిటిని చదువుతాడు.

అంతే, కాని అతనికున్న రాజకీయ పరిజ్ఞానమంతటికీ మూలం, కఠోరమైన జీవితానుభవాలే-అంతవరకు రాజకీయరంగంలో తాను పొందినపరాజయాలే.

తరువాత తరువాత అహింసావాదం, హింసావాదంమధ్యా, సహాయ నిరాకరణ, సహకార వాదాలమధ్య, జాతీయదృష్టికీ, మతదృష్టికీ మధ్య తీవ్రమైన వాదోపవాదాలు జరిగాయి. ఇవి జరిగినమీదట 1920 నుంచీ కాంగ్రెసువర్కర్ గాంధీ వాదాన్ని విమర్శనదృష్టితో పరిశీలించ సాగాడు.

ఆ తరువాత పదేళ్ళకు, సామ్రాజ్యవాదులపై పాతనాయకులు పెట్టుకున్న భ్రమలను కాంగ్రెసువాదులు గుర్తించారు. ఆ భ్రమలన్నీ విసర్జించి, సంపూర్ణ స్వాతంత్ర్యమే కాంగ్రెసు ఆశయమని స్పష్టపరచాలని పట్టుపట్టారు. ఆవిధంగా తీర్మానం జరిగింది.

కార్మిక, కర్షకులకు ప్రత్యేకవర్గ సంస్థలనేర్పాటు చేయాలనీ; అప్పటికే ఉన్న వర్గసంస్థలను సోదర సంస్థలుగా గుర్తించాలనీ: కార్మిక, కర్షక హక్కులను న్యాయమైన హక్కులుగా అంగీకరించాలనీ–ఇది స్వాతంత్ర్య సమరం జయప్రదంగా సాగడానికి అత్యవసరమనీ 1930 ఉద్యమం విఫలమయిన తరువాతనే కాంగ్రెసువర్కర్ గుర్తించగలిగాడు.

ఇప్పుడు 1942 పోరాటం విఫలమయింది. మునుపటిలాగానే ఈ ఓటమి తరువాతకూడా కాంగ్రెసువాది మరోగొప్ప గుణపాఠాన్ని నేర్చుకుంటాడనీ, స్వయంనిర్ణయ సూత్రాన్ని అంగీకరిస్తాడనీ మేము నిస్సందేహంగా చెప్పగలము.

కాని ఆగస్టు పోరాటం నీళ్ళుగారిపోయిన వెనువెంటనే మాత్రం, 'ఇందుకు నిర్మాణ లోపాలే కారణమ'న్న వాదన నతడు నమ్మాడు.

భారత స్వాతంత్ర్య పోరాటమంటే ఇతని భావంలో హఠాత్ పోరాట మెన్నటికీ కాదు. 1920–30 రోజుల్లోలాగా ఆ పోరాటాన్నెప్పుడూ మహత్తరశక్తిసంపన్నమయిన పోరాటంగానే భావిస్తుంటాడు.

అందువల్లనే, నాయకులు స్వాతంత్ర్యాన్ని సాధిస్తారని ఎదురుచూచిచూచి విసుగెత్తిపోయాడు. ఈలోగా నాయకులు బ్రిటిష్‌వారిపై

పెట్టుకున్న భ్రమలన్నీ కలలైపోయాయి. అదే సమయంలో మరో "పోరాటం" కోసం కాంగ్రెసు వర్కర్ ఒత్తిడి ఎక్కువయింది.

నాయకులు "పోరాట" నినాదం ఇచ్చారు. ఆ నినాదాన్ని తను ప్రజల కందిచ్చాడు. స్వాతంత్ర్యకాంక్షతో, ఇదివరకు కనివిని ఎరుగని ప్రజావెల్లువ లేచింది. పోలీసులు కాంగ్రెసు వర్కర్లను బంధించారు. ప్రజలు హింసాకాండకు గురిఅయారు. ప్రజలు వీరోచితంగా ప్రతిఘటించారు. చివర కదంతా బ్రిటిష్‌పాలకులపట్ల మూగక్రోధంగా పరిణమించింది.

కాంగ్రెసు వర్కర్ విడుదలయాడు. కొంతకాలం కుటుంబ కష్టసుఖాల్లో కూరుకుపోయాడు. స్వాతంత్ర్యపోరాట ధ్వజాన్ని నిలబెట్టడానికి చేయగలదంతా చేశాడు. కాని అదే సమయంలో నాయకుల పంధాలను నిశితదృష్టితో పరిశీలింపసాగాడు; క్రమశిక్షణకుమాత్రం భంగం కలిగించలేదు. తనలో తాను తరచి తరచి ఆలోచించుకున్నాడు. కాంగ్రెసుసంస్థలోనే బయలుదేరిన వివిధ దృక్పధాలను జాగ్రత్తగా పరిశీలించాడు. పోరాటంలో లోపం ఎక్కడ వచ్చింది; మళ్ళా పోరాటంవస్తే కొత్త సన్నాహా లేమిటి చేసుకోవాలి అనే అంశాలను గురించి తన నిర్ణయాలకు తాను వచ్చాడు.

కార్యక్రమానికి సంబంధించిన తర్కవితర్కాలతో అతను మెదడు చించుకోలేదు. సాంప్రదాయసిద్ధంగా తనకు లభించిన భావసంపదను నూతన పరిస్థితులకు సమన్వయపరచడానికి ప్రయత్నిస్తాడు. స్వాతంత్ర్యోద్యమానికి, ప్రజాశ్రేయస్సుకి ఎంతవరకు ఉపయోగపడతాయి అన్న విచక్షణాదృష్టితో కొత్తగా రేకెత్తే భావాలను పరిశీలిస్తాడు. ఉపయోగకరంగా ఉన్నవాటిని పరిగ్రహిస్తాడు.

ప్రస్తుతం కాంగ్రెసువర్కర్ బ్రిటిష్‌వారిపై ద్వేషంతో నివురుగప్పిన నిప్పులాగున్నాడు. వాళ్ళతోపాటు, ఆగస్టుఘటనల్లో తనకుతోడ్పడని వారినందర్నీ ద్వేషిస్తున్నాడు. సత్యాగ్రహాన్నంతా వదలి తాను విప్లవవాది అయాడుగదా? అయినా, తగిననిర్మాణపటుత్వం లేకపోవడంవల్లనే

కదా విప్లవం జయప్రదం కాలేదు? సరే—రాబోయే పోరాటాని కిప్పటి నుంచి జాగ్రత్తపడాలని నిశ్చయించుకున్నాడు.

'నిర్మాణలోపం' అన్న సంజాయిషీతో కాంగ్రెసువర్కర్ ఇప్పటికి తృప్తిపడ్డాడు. వెనుకటినుంచీ మీరవలంబిస్తూవచ్చిన విధానాలను, ఆగస్టు పోరాటంలో తనకు నాయకత్వం వహించినవారిని, తనలోపాలను వీటన్నిటిపట్ల తన అసంతృప్తిని వెల్లడిచేయడాకి ఇందులో అవకాశం ఉంది. కాని, అతనిలో అంతర్భూతమై ఉన్న దేశభక్తి, అతని నిత్యానుభవాలే, ఈ సంజాయిషీ సరికాదన్న విషయాన్ని స్పష్టం చేస్తాయి—ఇందుకు సందేహం లేదు.

అనుభవమే కొత్తపాఠం నేర్పుతుంది

మావాదనలను విన్నకొద్దీ, మా సారస్వతాన్ని చదివినకొద్దీ, ఇంతవరకు మమ్మల్నిగురించి తాననుకుంటున్న దానిలో ఏదోపెద్ద పొరపాటున్నదన్న విషయాన్ని కాంగ్రెసువర్కర్ గ్రహించకతప్పదు. అతని నాయకులీవిషయాన్ని అప్పుడే పసిపట్టారు, అందుకే, "కమ్యూనిస్టు సారస్వతాన్ని చదవకండి—ఆగస్టు విప్లవంకూడా పొరపాటని మీచేత నమ్మిస్తారు; కమ్యూనిస్టులతో మాట్లాడకండి—వాదనలో మిమ్మోడించి బుట్టలో వేసుకుంటారని," అతనిచెవి నిల్లుకట్టుకొని నూరిపోస్తున్నారు.

ఈ నాడు యూరప్ స్వాతంత్ర్యపోరాటచరిత్ర కాంగ్రెసువర్కర్ల కళ్ళముందుంది. ఇండియా అనుభవించిన హింసాకాండకన్నా నూరురెట్లు భయంకరమైన ఫాసిస్టు నరకంలోకూడా ప్రజలు సంఘటితమై స్వాతంత్ర్యాన్ని సాధించగలిగారన్న గుణపాఠాన్ని చరిత్రచాటుతూంది. ప్రజావిప్లవాన్ని హింసావిధానం అణచివేయగలదనే వాదం సర్వాబద్ధమని ఈచరిత్రనుండే కాంగ్రెసువాది గ్రహించగలడు.

ఇక తూర్పుదేశాల స్వాతంత్ర్యపోరాటం తెలియజేస్తున్నదేమిటి? సోవియట్ ఏజంట్లుకాబట్టే కమ్యూనిస్టులు జపానుపై కత్తిగట్టారన్నమాట వచ్చి అబద్ధమని ఈ చరిత్ర చాటుతూంది. (సోవియటుకి జపానుతో తాటస్థ

ఒడంబడిక ఉన్నరోజుల్లోకూడా ఆయాదేశాల్లో కమ్యూనిస్టుపార్టీలు జపానువ్యతిరేకపోరాటాన్ని నడిపారు - అనువాదకుడు) కమ్యూనిస్టులు నిజమయిన ప్రజాసేవకులు కాబట్టే, తమ సోదరప్రజల స్వాతంత్ర్యాన్నే తమ పరమావధిగా పెట్టుకున్నవారుకాబట్టే, వారు జపానువ్యతిరేకపోరాటాన్ని నడిపారన్న సత్యాన్ని ఈ చరిత్ర వేనోళ్ళచాటుతోంది. కమ్యూనిస్టుపార్టీలు జపానువారిని ప్రతిఘటించడమేకాదు; తూర్పుదేశాలు తిరిగి బ్రిటిష్ ఫ్రెంచి, డచ్చి, అమెరికా సామ్రాజ్యవాదుల బానిసత్వంలోకి పోకుండా కాపాడుతున్నారు. కమ్యూనిస్టులకు మాత్రుదేశసేవేప్రప్రధానమనీ, ఆతరువాతనే ఇతర విషయాలనీ ఈ చరిత్ర రుజువుచేస్తూంది. దీనినికూడా కాంగ్రెసువర్కర్ తెలుసుకోగలడు.

ఇక, ఇటీవల సోవియట్ యూనియన్‌గురించి వెలువడిన కొత్త సారస్వతంఉంది. ఈ సారస్వతాన్ని చదివితే కాంగ్రెసు వర్కరుకి తెలియగల విషయాలేమిటి? సోవియట్ యూనియన్ ఒక కొత్తరకపు రాజ్యాంగం. స్వతంత్రభారత రాజ్యాంగాన్ని ఏ పద్ధతులపై నడపాలని అభిలషిస్తున్నాడో, సరిగా అదే పద్ధతులపై సాగుతూన్న రాజ్యాంగం అది. సోవియట్ ప్రజ ఒక కొత్త తరహా ప్రజ కాంగ్రెస్ వర్కర్ తన సోదరప్రజల్లో ఏ సంఘీభావాన్నైతే కాంక్షిస్తున్నాడో ఆసంఘీభావంతో విరాజిల్లుతున్నారు వారు. ఇదివర కెవ్వరూ చూపని ధైర్యస్థైర్యాలతో సోవియట్ పోరాడడం చరిత్రలో అపూర్వమైన విజయాన్ని చేపట్టడం కాంగ్రెస్‌వర్కర్ చూచాడు. సోవియట్ ప్రజాస్వామ్యానికీ, ఇతర ప్రజాస్వామ్యాలకుగల వ్యత్యాసాన్ని, వీటికన్నా అదెలా శ్రేష్ఠమో, కాంగ్రెసువర్కర్ అప్పుడు గ్రహించగలడు. సోవియట్ ప్రజల్లోని దుర్భేద్యమైన ఈ సంఘీభావానికి మూలకారణాన్ని కూడా అతను తెలుసుకోగలడు. వివిధజాతుల స్వయంనిర్ణయ సూత్రానికి సోవియట్ ఆటకట్టు కనుకనే అక్కడ ఈ సంఘీభావం నెలకొన్నదనీ; అందువల్లనే అక్కడి ప్రజలందరూ, అన్ని జాతులవారూ యావత్తు సోవియట్ యూనియన్ని తమ మాతృమూర్తిగ పూజిస్తున్నారనీ అతడు గ్రహించగలడు. ఈ విధ

మైన దేశభక్తిని కాంగ్రెసు దేశభక్తుడు నానాటికి అధికంగా అభినందించక తప్పదు; దానికి తన హృదయ కుసుమాంజలిని అర్పించక తీరదు.

1930 ఉద్యమం ముగిసిన తరువాత కాంగ్రెసు వర్కర్ సోషలిస్టు విప్లవంయొక్క విజయాన్నిగురించి, సోవియట్‌లో పంచవర్ష ప్రణాళికలు సాధించిన మహత్తర విజయాలను గురించి చదివాడు: సోవియట్ అభిమాని అయాడు, నేడు 1942 'పోరాటం' విఫలమయింది. ఈసారి కాంగ్రెస్ దేశభక్తుడు యూరప్‌లో నూతన ప్రజారాజ్యాల స్థాపననుగురించి చదువగలడు. ప్రజాఉద్యమాలు పెంపొందేకొద్దీ అక్కడి వివిధ దేశాల్లో కమ్యూనిస్టు వ్యతిరేకతకు నిలువ నీడ లేకుండాపోయింది. మాతృదేశ విముక్తికోసం ప్రజాపక్షాలన్నీ, తమతమ విభేదాలను మరచిపోయి సంఘటిత మయాయి. జాతుల స్వయంనిర్ణయ సూత్రాన్ని అంగీకరించిన పిదపనే ఈ ఐక్య సంఘటన సాధ్యమయింది. తాము పోరాడేది ఏ ఒక్క జాతి స్వాతంత్ర్యంకోసమో కాకుండా, దేశంలోని వివిధ జాతు లన్నిటియొక్క స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసమేననీ, తమ నాయకు లందరూ ఏకమై తమకు నాయకత్వం వహిస్తున్నారనీ గ్రహించిన ప్రజల ఉత్సాహానికి త్యాగదీక్షకు అంతులేకపోయింది. ఈ మహత్తర గుణపాఠాలన్నీ కాంగ్రెసు దేశభక్తుడు నేటి యూరప్ చరిత్రనుంచి తెలుసుకోగలడు. ఆగస్టు పోరాటం విఫలమవడానికీ, ఇండియా ఎప్పటిలాగానే దీనావస్థలో ఉండడానికి నిజ కారణాలనుకూడా ఈ గుణపాఠాలద్వారానే గ్రహించగలడు.

1942 ఉద్యమం ఎందుకు విఫలమయిందా అనే ఆలోచన హెచ్చినకొద్దీ, కాంగ్రెసు దేశభక్తునికి అదే దశలో ఇతర దేశాల్లో జయప్రదంగా సాగిన ప్రజాఉద్యమాలను గురించి తెలుసుకోవాలనే కుతూహలం పుడుతుంది. దానితో, తన ఉద్యమంలోని లోపాలను గ్రహించ గలుగుతాడు: ఆ విధంగా దానిని పెడమార్గాలు పట్టించిందెవరోకూడా తెలుసుకుంటాడు.

ఈఉద్యమం నిర్మాణ లోపాలవల్లనే చెడిపోయిందనే వాదన అసలు కారణాలను తెలుసుకోకుండా, ఒకరినొకరు నిందించడానికే ఉపయోగపడుతుంది.

ఒకరిపై ఒకరు నిందలు

ఆగష్టు పోరాటానికి నాయకత్వం వహించినవారు ముసలి నాయకులపై నేరం మోపారు: పోరాటానికి తగిన సన్నాహాలు చేయకుండా జైళ్ళకు పోయారన్నారు.

కొత్తగా బయలుదేరిన రహస్యనాయకులు 'విప్లవాన్ని' లేవదీయడం గురించి తమకు తెలిసిన సూచనలనన్నీ ప్రచారం చేశారు. కాని ప్రజావెల్లువ నానాటికి నీరసించినకొద్దీ, అవి నిరర్ధకాలని గుర్తించారు: ఆదోషం తమ అనుచరుల నెత్తిని రుద్దనారంభించారు. వారిని చేతకాని వారన్నారు. మట్టిముద్దలన్నారు: అజాగ్రత్తగాళ్ళన్నారు, ఎక్కడో రహస్యమందిరాల్లో కూర్చొని, యదార్థ పరిస్థితులను తెలుసుకోకుండా గుడ్డిగా పోతున్నారనీ; చాలినంత డబ్బుపంపడంలేదనీ, వాళ్లంతా మంచివారు కారనీ, అనుచరులు నాయకులను విమర్శింప నారంభించారు.

పోరాటంలో పాల్గొన్న వివిధగ్రూపుల నాయకులు ఒకరినొకరు ఆడిపోసుకోసాగారు. గాంధీ తత్వవాదులు తమ అహింసా వాదంతో పోరాటానికి అడ్డుతగులుతున్నారని కాంగ్రెసు సోషలిస్టు నాయకులన్నారు.

"స్వాతంత్ర్య యోధులకు" అనే శీర్షికతో జైప్రకాశ్‌నారాయణ్ ప్రచురించిన రెండవ జాబులో ఇలా అన్నాడు:

"కొద్ది మాసాలనుంచి, ముఖ్యంగా గాంధీ-వైస్రాయి ఉత్తర ప్రత్యుత్తరాలు బయటపడిన దగ్గర్నుంచీ, స్వాతంత్ర్యయోధుల్లో హింసా అహింసా అనే సమస్యపై వాదోపవాదాలు సాగుతున్నాయి.... ఈదశలో, ఈసమస్యపై వాదోపవాదం అర్థంలేని విషయం. ప్రతిస్వాతంత్ర్యయోధునికి తనకు తోచినపద్ధతి నవలంబించే స్వేచ్ఛఉంది. ఒకపద్ధతిపై నమ్మకంగల వారంతా ఒక గ్రూపుగా ఏర్పడి, క్రమశిక్షణతో వ్యవహరించాలి. మరో పద్ధతిననుసరించేవారువీరికిఅడ్డురాకుండా, ఒకరినొకరుఆడిపోసుకోవడంతో తమ శక్తి సామర్థ్యాలనుదుర్వి నియోగంచేయకుండా ఉంచేచాలు - అదే పదివేలు. 'కర్తవ్యపాలనో, లేక చావో - ఇదీమనమంత్రం. ఒకరినొకరు ఆడిపోసుకోవడానికి దీనిక్రింద తావులేదు ....' (3వ పేజీ)

"....మన కార్యక్రమంలో కొన్నిఅంశాలతో తమకేమీ సంబంధం లేదని కొందరంటున్నమాటనిజమే. అహింసావాదం పేరిట వీరిలాచేస్తున్నారు. కాని ఈ కార్యక్రమాలనే ఇదివరకు అనేక సందర్భాల్లో వీరు బలపరిచారు. శ్రీ కిశోరిలాల్ మష్రువాలా అంతటి బాధ్యతగల నాయకుడుకూడా ఈ అంశాలకేలాంటి ఆక్షేపణా చెప్పలేకపోయాడు. అయినప్పటికీ. 1942 ఆగస్టునుంచీ కాంగ్రెసుసంస్థలు అనుసరిస్తూవచ్చిన కార్యక్రమానికి పునాది, ఆ దశలో బాధ్యతగల నాయకులు నిర్వచించిన అహింసాపద్ధతులే అనడానికి ఏలాంటి సందేహం లేదు." (5వ పేజీ)

"నిర్మాణంవిషయం చెప్పినప్పుడు నేను కాంగ్రెసును మనసులో పెట్టుకునే చెప్పాను. కాంగ్రెసు సిద్ధాంతాల హద్దులను దాటిపోదలచిన వారు, తమ ప్రత్యేక కార్యక్రమాన్ని కొనసాగించడానికి వేరే సంస్థను పెట్టుకోవడం సహజం." (15వ పేజీ)

సోషలిస్టుపార్టీవారి విమర్శలిలాఉంటే. ఇక గాంధీవాదుల విషయం చూద్దాం. కార్మికవర్గాన్ని కలుపుకురాలేకపోయారనీ; తమ హింసాపద్ధతుల వల్ల పోలీసులను మరింత రెచ్చగొడుతున్నారనీ వీరు సోషలిస్టుపార్టీవారిని ఖండించారు. ఇద్దరూకలిసి ఫార్వర్డుబ్లాకుపై దుమ్మెత్తిపోశారు. పెద్దకబుర్లాడడమేగాని, చేసింది వీసమెత్తయినా లేదని దుయ్యబట్టారు.

ఫార్వర్డుబ్లాకువారేమీ ఊరుకోలేదు. పైవారిద్దరూ పాతకక్షలు పెట్టుకొనిబోసుకివీరపూజ చేయడంలేదనీ; ఆవిధంగా ప్రజల్నిఉత్తేజపరిచే అవకాశాన్ని పోగొడుతున్నారనీ వారుగోలచేశారు. వాళ్ళిద్దరూ కమ్యూనిస్టు ప్రచారాన్ని చూచి హడలిపోతున్నారట; ఫాసిస్టు అనుకూలురన్న అపవాదువచ్చి నెత్తినిపడుతుందేమో అని మడికట్టుకొని కూర్చున్నారట. 'అజాద్‌హింద్ ఫౌజు'ను నిర్మించి, భారతస్వాతంత్ర్యాన్ని తాత్కాలిక స్వతంత్రభారతప్రభుత్వాన్ని అక్షరాజ్యాలచేత అంగీకరింపజేసిన 'నేతాజీ' దేశభక్తిని, నిజాయి

తీని సంశయింప సాహసించారట. జపానువారేమిచేసేస్తారో అన్నభయముంటే, ఇటు జర్మనీ అండ మనకుందికదా అని ఫార్వర్డుబ్లాకు అభయహస్తమిచ్చింది. ఇద్దరూవచ్చి భారతదేశం నెత్తినెక్కుతారేమో అని అనుకుంటే, 'నేతాజీ' బోసు నిర్మించిన అజాద్‌హింద్ ఫౌజూ, మనందరం కలిసి నిర్మిస్తున్న స్వాతంత్ర్యమహావిప్లవశక్తి ఉంటుండగా మనకేమి భయమని భుజంతట్టారు. తామేమీ చేయలేదని కాంగ్రెసు వాదులు చేస్తున్న విమర్శలకు వింతసమాధానం చెప్పారు. మా పరువుమర్యాదలను కాంగ్రెసు నడివీధిలో పెట్టేసింది. ఇప్పుడు మే మేదయినా ఎలాచేయగలం? వాళ్ళనిప్పుడు బోసుకు బ్రహ్మరథం పట్టమనండి; మాపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించమనండి। అప్పుడు ఈ మహావిప్లవానికి మేమెంత సేవచేస్తామో చూడమనండి। అనేధోరణిలో మాట్లాడారు.

అసలు కథంతామాకు పూర్తిగా తెలుసు. ఆ నాడు వీరిలో బాధ్యతగల నాయకులుగా ఉండినవారు కొందరూ, నమ్మకమైన అనుచరులుగా ఉండినవారిలో పందలకొలదీ, తరువాతమావైపు వచ్చారు. వారినుండి విన్నయదార్థగాథే అదంతా.

ఇప్పుడు చెప్పండి—ఇది గర్వపడదగిన వీరగాథా। లేక నిర్దాక్షిణ్యంగా తూర్పారబట్టవలసిన తప్పులతడకా ?

కమ్యూనిస్టులు చెడగొట్టారట

ఆగస్టు 9న "విప్లవపోరాటా"నికి నాయకులమని పేరుపెట్టుకొన్నవారు ఇక కమ్యూనిస్టులు తుడుచుకుపోతారని హృదయపూర్వకంగా నమ్మారు. ఉత్పత్తినీ, రవాణాలనూ ఆపవలసిందని కాంగ్రెసు పేరిట కార్మికులకు జనరల్ సమ్మె నినాదం ఇచ్చారు. కమ్యూనిస్టులం చెప్పింది ఆచరణలో పెడతామని వారికి బాగాతెలుసు. అందువల్ల మే మీ సమ్మెను ప్రతిఘటిస్తామనీ, ఆవిధంగా మా గోతిని మేమే తవ్వుకుంటామనీ సంబరపడ్డారు. కార్మికవర్గం మాకు ఉద్వాసనచెప్పి, తమ రెక్కకిందికి తప్పకుండా వచ్చేస్తుందని కలలు కన్నారు. "భారత

కాంగ్రెసు కేంద్ర అధికారసంఘం" అని వారుపెట్టిన కార్యాలయం నుంచి 1942 ఆగస్టు 17 న "భారత కార్మికులకు" అని ఒక విజ్ఞప్తి ప్రకటిస్తూ, అందులో ఇలా అన్నారు.

"ఒకప్పుడు విప్లవం, విప్లవం అని విధివిరామం లేకుండా ఘోషించిన కమ్యూనిస్టులు వచ్చి ఇప్పట్లో విప్లంఅంటే" మిత్రరాజ్యాల యుద్ధకృషికి భంగ కలిగిస్తుంది. కాబట్టి ఇది తగిన సమయం కాదని మీకు నచ్చజెప్పజూస్తారు. అయితే మన రక్షణ సన్నాహాలకు బ్రిటన్ అడ్డు తగులుతూంది. దాని మిత్రదేశాలు చూస్తూ ఊరుకున్నాయి. దీని సంగతేమిటి ? కమ్యూనిస్టుల్లాంటి వెర్రివెంగళప్పలకు గంటకొట్టేవరకు విప్లవాలు ఆగిఉండవని జవాబు చెప్పండి. ఈనాడు ఈ కమ్యూనిస్టులు బ్రిటిష్ వారి తొత్తులయారు. మనకు శత్రువులయారు. ఫ్యాక్టరీలు విడిచివచ్చి వీరంటే మీకున్న రోతను ఇదివరకే ప్రదర్శించారు. వీరిని మరచిపోండి. స్వాతంత్ర్య విప్లవాన్ని జయప్రదం చేసే కార్యక్రమంలో నిమగ్నులు కండి."

పాపం, ఈ భ్రమ ఒక్క వారంరోజులయినా — కొన్ని ప్రాంతాల్లో ఒక్క రోజయినా నిలువలేదు. తమ ఆశ అడియాస అయిపోయినా, తామెందుకు నెగ్గలేకపోయారో అర్థంచేసుకోడానికీ, కార్మికవర్గంలో మాకింత బలం ఎందుకుందో తెలుసుకోడానికీ. వీ రేమాత్రం ప్రయత్నించ లేదు. బ్రిటిష్ సామ్రాజ్యవాదు లెంత రెచ్చగొట్టినా, దేశభక్తులు వ్యతిరేక ప్రచారం ఎంతచేసినా, మాపట్ల కార్మికుల విశ్వాసాన్ని చెక్కుచెదరకుండా నిలుపుకున్నాం. ఎందువల్ల ఇలా చేయగలిగామో గ్రహించడానికి వారు ప్రయత్నించలేదు. ఏవో వెర్రి మొర్రి సమాధానాలు చెప్పసాగారు. కాలం గడచిన కొద్దీ. 'తమ ఆగస్టు విప్లవం' విఫలమయి నందుకు కారణం కమ్యూనిస్టులు కార్మికులను అందులో చేరనీయకుండా చేయడమేనని చెప్పనారంభించారు.

ఈనాయకులను మేము బాగా ఎరుగుదుము, కార్మికుల్లో వారు పంచిపెట్టిన కరపత్రాలద్వారా వారి విప్లవ కార్యక్రమం ఎలాంటిదోకూడా ఎరుగు

దుము. ఈ కార్యక్రమానికి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని కార్మికు లేమాత్రం సహాయం చేసినా అది స్వాతంత్ర్య సాధనకు తోడ్పడడం కాజాలదనీ, జపాను దండయాత్రకే చేయూత అవుతుందనీ మేము స్పష్టంగా గుర్తించాము. కాంగ్రెసుపట్ల, దేశంపట్ల తమ బాధ్యతఅని అనుకొన్న దానిని నెరవేర్చడానికి వారు ప్రయత్నించారు. మా బుద్ధికి తోచిన బాధ్యతలను నిర్వహించడానికి మేము కృషిచేశాం:

ప్రపంచంలో అన్నిటికన్నా తేలికయిన పనేమిటంటే ఒకరి అవకతవకలకు దోషాన్ని మరొకరి నెత్తిపై రుద్దడం. ఉత్సాహాన్ని కోల్పోయారని ప్రజలపై తప్పుపట్టారీ నాయకులు. అనుకున్నపని జరగనందుకు ఒకరినొకరు ఆడిపోసుకున్నారు. ద్రోహం చేశామని అందరికన్నా ఎక్కువగా మమ్మల్ని తిట్టిపోశారు. మొత్తంమీద అందరిపైనా ఆరోపణలు చేశారు గాని, తమ లోపాలను మాత్రం అంగీకరించలేదు.

సూత్రప్రాయంగా చూస్తే, మేము కాంగ్రెసువాది చేయవలసిన విధులనే సక్రమంగా నెరవేర్చాము. అంతేకాదు. కాంగ్రెసు పేరును తామేగుత్తకు తీసుకున్నట్లు వ్యవహరించిన ఆ నాయకులు సూచించిన విధానం దేశానికి వినాశకరమని. తరువాత జరిగిన చరిత్రే రుజువుచేసింది.

వీరు మమ్మల్ని ద్రోహులనడం మే మంతగా లెక్కచేయలేదు. మీరు విడుదలవడం ప్రారంభించేవరకు దీనిని సరకుచేయనేలేదు. 1942 డిసెంబరు 6 వ తేది 'పీపుల్సువార్' సంచికలో "కమ్యూనిస్టుపార్టీ స్థానమేది?" అనే వ్యాసంలో ఇలా రాశాము:

"ఈ నినాదం ('ప్రజాయుద్ధం' — అనువాదకుడు) ఇచ్చినందుకూ 'పోరాటం' లో చేర నిరాకరించి నందుకూ మా సోదర దేశభక్తులు మమ్మల్ని దేశద్రోహులని ఖండించారు. దేశరక్షణను భంగపరచడం స్వాతంత్ర్య పోరాటం కాజాలదని వారి కెన్నో విధాల విశదపరిచాం; ఇంకా విశదపరుస్తాం.

మేము జాతీయ శక్తులనుండి దూరమై పోతామేమో అని మా మిత్రులు చింతించారు. మమ్మల్ని అంతమొందించడానికి అవకాశం

చిక్కిందికదా అని మా శత్రువులు పుబ్బిపోయారు. ఆ అనుమానాలుగాని, ఈ కలలుగాని నిజం కాలేదు. మేము ముందుగా చెప్పినట్లే 'పోరాటం' విఫలమయింది. మునుపెన్నడూ రానంత ఎక్కువమంది మా ఎర్రజండా క్రిందికి నేడు వస్తున్నారు. ఆనాడు మమల్ని చూడగానే ముఖం త్రిప్పేసుకున్నవారే ఈ నాడు మా దగ్గరకువచ్చి దేశంలో ఏర్పడిన విషమ పరిస్థిలను చర్చిస్తున్నారు ; వాటినుండి బయటపడేమార్గాన్ని గురించి మాతో కలిసి ఆలోచిస్తున్నారు."

ఆనాడు దేశభక్తియుతకర్తవ్యమని మేము నమ్మినదానినే నెరవేర్చాము. మా పంథాపట్ల, మా నినాదాలయెడల, మా కార్యక్రమాన్ని గురించి ప్రజలెంతో ఉత్సాహం చూపారు. అందువల్ల మా పంథాను మార్చుకోవలసిన అవసరం మాకేమీ కనబడలేదు.

1942 ఆగస్టు తరువాత మనదేశం భయంకరమైన పరిస్థితులనెదుర్కొంది. అలాంటిపరిస్థితుల్లోకూడా మా పార్టీ అపూర్వమైన అభివృద్ధినిపొందింది,

పార్టీ సభ్యత్వము — ప్రజాఉద్యమాలు

	ప్రతిష్ఠంభనకు పూర్వం.	జనవరి 1943 లెనిన్ డే.	1943 మేడే
పార్టీమొత్తం సభ్యత్వం	4,464	9,308	15,563
పూర్తికాలాన్ని పార్టీకి వినియోగించేవారు	1,200	2,015	2,637
ట్రేడ్‌యూనియన్ సభ్యత్వం	—	1,96,620	3,01,400
కిసాన్ సభ్యత్వం	—	2,95,000	3,85,370
విద్యార్థి ఫెడరేషన్ సభ్యత్వం	—	25,822	39,155
మహిళాసంఘ సభ్యత్వం	—	22,400	41,100
బాలసంఘం ..	—	6,400	9,000
వాలంటీర్లు	—	24,610	32,166

ఈనాడు మా పార్టీ మొత్తం సభ్యత్వం 30000 ను మించిపోయింది.

జాతీయాశయానికి భిన్నంగా పోయిన ఏపార్టీఅయినా రాజకీయ శక్తిగాఅభివృద్ధి పొందగలదా?

కార్యాచరణలో కాంగ్రెసుకు వ్యతిరేకంగా పోయే ఏపార్టీ అయినా ప్రజల ఆదరాభిమానాలను పొందగలదా?

చిత్తశుద్ధిగల ఏ కాంగ్రెసువాదయినా నా యీ ప్రశ్నకడగనివ్వండి జవాబు తడుంకోకుండా వస్తుంది.

కాంగ్రెసుసోషలిస్టులు, తదితరులు 'విప్లవం' లేవదీద్దామని బయలు దేరారు; అది తమకు చేతగాదని గ్రహించారు; ఇక ప్రజలపై దుమ్మెత్తి పోయ నారంభించారు. తమపిచ్చికలల్లో వంతుకలియనందుకు మాపార్టీపై మరింతనిప్పులుచెరిగారు. తమతప్పులను కప్పిపుచ్చుకోడానికి మరొకరిపై దోషం రుద్దడం ఇలాంటివారికి వెన్నతోపెట్టిన విద్య.

VIII

ప్రజలకు ఆహారమా? లేక ఆహారపదార్ధాల దోపిడియా?

ఆగస్టుపోరాటం విఫలమవడంతో దానిని నడిపినవారిలో నిస్పృహ వ్యాపించిందనీ, ఆ నిస్పృహతోనే లేనిపోనిసిద్ధాంతచర్చలకు, విచ్ఛిన్నకర పోకడలకూ దిగారనీ వివరించాం.

ఆగస్టు ఘటనలకు 'అల్లరుల'ని పేరుపెట్టి బ్రిటిష్‌వారు పశుబలంతో ప్రజలను అణచగలిగారు. తత్ఫలితంగా ప్రజల్లో బ్రిటిష్ వ్యతిరేకత పెచ్చు పెరిగింది. అంతేకాదు. తగు సహాయంకోసం ప్రజలు జపానువారివంక చూడ నారంభించారు.

అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి జరిగిన పోరాటంలో సామ్రాజ్యవాదులు మీకన్నా పైఎత్తులు వేయగలిగారు. ప్రజల్ని భయభ్రాంతుల్ని చేయడానికి దారుణమైనహింసావిధానానికి పూనుకున్నారు. ఇంతచేసి కూడా వారు ఒక్క సమస్యనైనా పరిష్కరించలేదు. భారత సమస్యను పరిష్కరించవలసిన అగత్యం లేకుండా తప్పించుకోవాలనుకున్నారు. కాని ఆప్రయత్నంలో, ఆర్థికరంగమంతటా, ఎన్నడూ ఎరుగని సంక్షో

భాన్ని తెచ్చిపెట్టారు. బెంగాల్ కరువులో ఈ సంక్షోభం దారుణ స్వరూపం దాల్చింది. ఆహారపదార్ధాలధరలు దేశమంతటా పెచ్చుపెరగసాగాయి. ప్రతికుటుంబము అల్లకల్లోల మయింది.

ఈ ఆహార సంక్షోభాన్ని గురించి మాపరిశీలనా వివరాలను. దాని నెదుర్కోడానికి మేము సూచించిన కార్యక్రమాన్ని, తెలియపరుస్తాం.

1942 అక్టోబరులోనే. ప్రభుత్వంగాని, మరే రాజకీయ పార్టీగాని, మేల్కొనకముందే మేము అహార సంక్షోభం ముంచుకొచ్చే సూచనలను కనిపెట్టాం. దేశాన్ని హెచ్చరించాం. ఆహారాన్ని రక్షించుకునే కృషి కోసం నడుం బిగించమన్నాం. "జాతీయైక్యత, దేశరక్షణలకోసం సాగే ఉద్యమం"లోనే ఈకృషి ఒకభాగమన్నాం. మేమిలా అన్నాం.

"ఆహార సంక్షోభాన్ని తొలగించగల కార్యవిధానం ప్రభుత్వానికేదీ లేదు. చేతకానితనంకొద్దీ ఈప్రభుత్వం ప్రజలను వారిదుర్గతికి వారివిడిచి పెట్టేస్తూంది.

"జపాను దురాక్రమణనుండి మనదేశ రక్షణకీసంక్షోభం ప్రమాదం కలిగిస్తూంది. ప్రజలు దీనికి తలవొగ్గి వూరుకోకూడదు. ప్రజల ఆహారం సామ్రాజ్యవాదుల గుప్పిట్లో వుండకుండా చేయాలి.

"కాబట్టి ఈ ప్రమాద పరిస్థితిలో ప్రజల కర్తవ్యం ఏమిటంటే— అధికలాభాపేక్షతో ధరలు పెంచకుండా చేయడానికి, ప్రజల కందుబాటులో ఉండేలా ధరలను నిర్ణయించడానికి అధికాహారోత్పత్తి కోసం అధికోత్పత్తిని కొనసాగించి దేశరక్షణను నిర్వహించగల జాతీయ ప్రభుత్వాన్ని సాధించడానికి. తమ సర్వశక్తులను కేంద్రీకరించి కృషిచేయాలి."

(1942 అక్టోబరులో బి. టి. రణదివె రాసిన 'ప్రజల ఆహారం జోలికి పోవద్దు, అనేపుస్తకంలో నిది)

ఆహార సంక్షోభాన్ని అరికట్టాలంటే ధరలను, ధాన్యపు స్టాకుల్ని కంట్రోలు చేయడం ప్రధానమని 1942 డిసెంబరులో సూచించాము.

"ప్రభుత్వానికీ, వర్తక సంఘాలకూ, ప్రజలకూ, పైనుంచి కింద వరకూ ఢిల్లీనుంచి పల్లెటూళ్ళవరకూ అన్యోన్య సహకారం ఉంటేనే

గాని ఈ కంట్రోలు జయప్రదంగా సాగదు. జాతీయప్రభుత్వంక్రింద దేశ మంతా సంఘటితమైననాడే అది లభ్యమవుతుంది."

('పీపుల్సువార్' సంపాదకీయం - 1942 డిసెంబరు 20 తేదీ సంచిక)

గాంధీజీ ఉపవాస సందర్భంలో (1943 ఫిబ్రవరి) మేము చేసిన తీర్మానంలో ఇలా తెలిపాము :

"ప్రభుత్వానికీ. ప్రజలకూ మధ్య ఒక పెద్ద అగాధం ఉండడం వల్లనే దేశంలో తలచూపే ప్రతిసమస్యా ఏకుమేకై పోతూంది. ఆర్థిక రంగంలో ఒడుదుడుకులంతా ముదిరి సంక్షోభంగానూ; అది తీవ్రమై జాతీయజీవన సంక్షోభంగానూ, ఆహారసమస్యగానూ పరిణమించింది".

('పీపుల్సువార్' 1943 ఫిబ్రవరి 21)

మేమిలా అంటున్నామంటే 'జాతీయప్రభుత్వం వచ్చేవరకూ మన మేమీ చేయలేమ'నీ; అందాకా చేతులు ముడుచుక్కు కూర్చుందామనీ, మా భావం ఎన్నటికీకాదని అప్పుడే స్పష్టంచేశాము. అన్ని పార్టీలు కలిసి ప్రజా ఆహారకమిటీలు స్థాపించాలని తక్షణ కార్యక్రమం సూచించాం. కమిటీలు తిరిగి దొంగల నిలవలను బయటికి తీయాలనీ; ఆహారపదార్థాల విషయంలో ప్రజల అవసరాలను లెక్కతీయాలనీ; ధరల కంట్రోలు రేషనింగు మొదలయినవాటికోసం ఆందోళన చేయాలనీ కోరాం.

బ్రిటిష్ సామ్రాజ్యవాదుల్లాగా ఈ ఆహారసంక్షోభాన్ని 'దైవప్రేరిత మనీ; దురదృష్టవశాత్తున సంభవించినద'నీ కొట్టిపారవేయకుండా. అది సామ్రాజ్యవాద పరిపాలనయొక్క దుష్ఫలితమే అని మేము నిర్ధారణ చేశాం. ప్రతిష్టంభనను తొలగించాలనీ, మిమ్ముల్ని తక్షణం విడుదల చేయాలనీ, మేము ద్విగుణీకృత దీక్షతో ఆందోళన చేశాం. నిర్మాణాత్మక మైన వినాదాలను కూడా ఇచ్చాం.

జంతు విప్లవ వాదం

ఇక మా వ్యతిరేకుల ధోరణి చూడండి. తమ ఊహల్లో ఉన్న 'విప్లవాన్ని' కొనసాగించడానికి ఒక సదవకాశంగానే ఈ ఆహార సంక్షో

భాన్ని లెక్కగట్టారు. ఆహారంకోసం దోపిడీలు సాగడం 'విప్లవానికి' మొదటి మెట్టన్నారు.

'స్వాతంత్ర్యయోధుల కంటూ' జైప్రకాశ్ నారాయణ్ ప్రచురించిన రెండవజాబులో ఇలా అన్నాడు :

"కాని, దానం చేయడంవల్ల తీరేసమస్య ఏమీలేదు. కాబట్టి స్వాతంత్రయోధుల కర్తవ్య మేమంటే: అందులోను వారి ప్రప్రధాన కర్తవ్యం —— ఆకలిమంటలతో అలమటించే వారిలో క్రోధానలం రగుల్కొలపాలి. ఈ దుర్గతి కంతటికి మూలకారణమైన పరాయి ప్రభుత్వంపైకి ఆ మంటల్ని మరలించాలి. బ్రిటిష్ పరిపాలనా యంత్రాన్ని స్తంభింపజేయగల పరిస్థితులను ఈ అన్నాతురులే కలిగించాలి. ఎక్కడ దొరికితే అక్కడ ఆహారాన్ని లాక్కోమని చెప్పాలి —— చెప్పడమేకాదు అందుకు తగు సాయంకూడా చేయాలి .... పట్టణాల్లోకూడా ఆకలి మంటలను, నిస్తబ్ధతను, నిరాశలను ద్వేషంగాను, కోపానలంగాను మార్చి ఒక నిర్మాణస్వరూపాన్నిచ్చి తగు కార్యక్రమంలోకి మరలించాలి...." (15 వ పేజీ)

రాంమనోహర్ లోహియా మరొక కాంగ్రెసు సోషలిష్టు పార్టీ నాయకుడు "తిరుగుబాటుదార్లు ముందుకు సాగాలి" అని ఒక చిన్న పుస్తకంరాస్తూ, దేశంలో ఆహారాన్ని దాచివేయడంగాని, అధికలాభాలకు అమ్మడంగాని లేదన్నాడు. రేషనింగు కావాలని కోరడం ప్రజాక్షేమానికి భంగకరమన్నాడు.

తిండిదొంగలు, దొంగవ్యాపారులు అంటూ ప్రభుత్వం చేస్తున్న గోల అంతా వట్టి అసత్యప్రచారమని పట్టణాల్లోని బీదప్రజలుకూడా గుర్తించాలి —— మునిసిపాలిటీల్లో కాంగ్రెసు పార్టీఅమని చెప్పుకునేవారు కంట్రోలు, రేషనింగుల కోసం ఆందోళనచేసేటంత అఘాయిత్యానికి ఎలాపూనుకున్నారో

నా కర్ధంకావడంలేదు. యుద్ధకృషికోసం కొత్తపన్నులు వేయమని కోరడం ఎంతఘోరమో, ఈ ఆందోళనకూడా అంత ఘోరం. కంట్రోలు, రేషనింగు అనే ముసుగుతో ప్రభుత్వం దొంగ వ్యాపారం సాగిస్తూంది. ఈ ప్రభుత్వనిలవలను స్వాధీనం చేసుకోగల శక్తి లభించేవరకు పట్టణాల్లోని బీదప్రజలు ప్రదర్శనాల ద్వారా, అప్పుడప్పుడు జైళ్ళకు వెళ్ళడంద్వారా, ఈ ప్రభుత్వ చర్యను ఖండించాలి." ('తిరుగుబాటుదారులు ముందుకుసాగాలి'- 19 వ పేజీ - 1944 జనవరి.)

రాంమనోహర్ లోహియా చిత్రించినదానికి పూర్తిగా వ్యతిరేకం యదార్ధపరిస్థితి. ప్రజలలో అన్నితరగతులవారూ బ్రహ్మాండమైన ఆందోళనచేసిన తరువాతనే ప్రభుత్వం కదలివచ్చి కంట్రోలు. రేషనింగులను అమలు జరిపింది.

వీళ్ళ ధోరణి మాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. మీరు జైల్లోపడి ఉండడమే 'విప్లవం' జయప్రదంగా సాగడానికి చక్కని అవకాశం అని వాదించిననాడే వీరి ధోరణి మాకు స్పష్టమయింది; బ్రిటిష్ నిర్బంధం ధ్వారానే విప్లవం వస్తుందని నమ్మేవారున్నప్పుడు భారతప్రజల ఆకలిమంటలే విప్లవానికి దారితీస్తాయని పిచ్చిపోకడలు పోయేవారుండడంలో వింత ఏముంది?

వీరి ధోరణి అమానుషంమాత్రమేకాదు; కుర్రకుంకతనంకూడాను.

దీనిని 'జంతు విప్లవ సిద్ధాంతం' అని అనవచ్చు. ప్రజలను చిన్నచూపు చూచే పైతరగతి పెత్తనంగాళ్ళ తలల్లోనే ఇలాంటి సిద్ధాంతాలు బయలుదేరుతాయి. వీళ్ళ దృష్టిలో ప్రజలు యోచనాశక్తిలేని జంతువులు: ఒకమూలకు తరిమి కొట్టినప్పుడే ఎదురు తిరుగుతారని వీరి అంచనా. అందువల్లనే ప్రజల బాధలను తొలగించడానికి కృషి చేసినవారి నందరినీ వీరు స్వాతంత్ర్య పోరాట వ్యతిరేకులని ఖండించారు. ప్రజలను పస్తు

పెట్టండి. — విప్లవం దానంతటదే వస్తుంది — ఇదీ వీరి విప్లవ వ్యూహం.

ఆకలిమంటల్లో మానవుని ఆత్మశక్తి అంతరించి పోతుంది. జంతువులుకూడా కృంగి కృశించిపోతాయి. ఇది అందరికీ తెలిసిన విషయమే. అయినా ఈ 'విప్లవకారులు ఆకలిమంటలే విప్లవానికి దారితీస్తాయని అన్నారంటే, ఇక వారిని గురించి ఏమనుకోవాలి?

నిస్పృహకొద్దీ ఊహావీధుల్లోకి ఎగిరిపోయి, సజీవమైన మానవకోటినిగాని, విప్లవచరిత్రలనుగాని ఏమాత్రం అవగాహన చేసుకోలేనివారే ఇలాంటి సిద్ధాంతాలను పలుకగలరు. ఈసిద్ధాంతాలవల్ల ప్రజలకు ఆహారం లభిస్తుందా, లేక తుపాకీగుండ్లు ప్రాప్తిస్తాయా అన్న విషయంతో వీరికి నిమిత్తంలేదు.

ఇంతచేసినా వారి నినాదం వట్టి నినాదంగానే ఉండిపోయింది. ఒక్క తిండిదోపిడీనైనా వీరు చేయించలేకపోయారు. అక్కడక్కడ ఎవరో కొందరు వ్యక్తులుమాత్రం దుకాణాలను దోచుకున్నారు. అంతే. ఈవిధంగా ఈ నాయకుల ధోరణే వారి బండారాన్ని బయటపెట్టింది.

బాధా నివారణే మా పంథా

కాంగ్రెసు వాదుల, లీగు సభ్యుల, హిందూమహాసభవారి సహకారంతో ఆయా ప్రాంతాలలో ప్రజల ఇబ్బందులను తీర్చడానికి మా పార్టీ కృషిచేసింది. మా సర్వశక్తులను, మా వర్కర్ల నందరిని ఆ కృషిలో కేంద్రీకరించాం. ప్రజాసేవకుల నందరినీ ఈ కృషిలో నిమగ్నులను చేయడానికి ప్రయత్నించాం.

అలా చేయకుండా తిండి దోపిడీలను సాగించినట్లయితే ప్రజలకు పట్టెడయినా ఆహారం దొరకకపోవడం అటుంచి, పోలీసులువచ్చి మన గ్రామాలను మరింత భీభత్సం చేయడానికి దారితీసేది. బెంగాల్ విషాదగాథ దేశమంతటా ప్రతిధ్వనించేది. దేశంలో అరాజకం తాండవించేది. జపాను, ఫాసిస్టుమూకల నోము పండేది. దురాక్రమణ ప్రారంభమయేది.

తమ తిండిదోపిడీ కార్యక్రమం కొనసాగకపోయేసరికి, 'ఆ విప్లవకారులు' మా కృషిని ఖండించ నారంభించారు. మాపై రెండు బాణాలను ప్రయోగించారు.

1. 'కరువు నివారణ మొదలైన కార్యక్రమంలో పాల్గొనాలంటే ఈనాడు ప్రభుత్వంతో కొంతవరకయినా చేతులుకలపక తప్పదుకదా? మన నాయకులు జైళ్లలో మ్రగ్గుతుండగా ఇంత పాపకార్యానికి ఒడికట్టగలమా ఎంతమాట? అనిచెప్పి కాంగ్రెసు పెద్దలను గందరగోళం చేయబోయారు.

2. ఆగస్టు రోజుల్లో పైకివచ్చిన కొత్త అతివాదకాంగ్రెసు యువకుల దగ్గరకు వెళ్ళి—'కరువు నివారణ మొదలయిన కార్యక్రమం ద్వారా కమ్యూనిస్టులు బ్రిటిష్ ప్రభుత్వాన్ని మనదేశంలో చిరస్థాయిని చేస్తున్నార'ని ప్రచారం చేశారు.

స్వాతంత్ర్య విప్లవాన్ని ధ్వంసంచేసింది కమ్యూనిస్టులే అని ఆనాడెంత ధీమాతో అన్నారో, అంత ధీమాతోనే ఈనాడు ఆహార విప్లవాన్ని కమ్యూనిస్టులే చెడగొట్టారన్నారు.

విధ్వంస కార్యక్రమంలో పాల్గొని జపానువారికి తోడ్పడకుండా కార్మికవర్గాన్ని ఆనాడు వారించాము. ఈనాడు ప్రభుత్వం చేతుల్లోనుంచి ఆహారాన్ని లాక్కొని ప్రజలకు పంచిపెట్ట కృషిచేశాం.

'కరువు నివారణ అత్యుత్తమ ప్రజాసేవకాదా? కాంగ్రెసు సాంప్రదాయాల కది వన్నెతేదా? అని కాంగ్రెసు పెద్దల నడిగాం.

"ఆ యా ప్రాంతాల్లోని ప్రజానాయకులందరూ ఏకమై 'సంయుక్త సంఘాల'ను పెడితే ప్రజల మనోనిబ్బరం హెచ్చుతుందా? అడుగంటుతుందా? అలాంటి సంఘాలు ప్రజల ఇబ్బందులను తీర్చి, నిరంకుశాధికారుల ఆటలను అరికట్టడానికి ఉపయోగపడతాయా? లేక ప్రభుత్వానికి ఉపయోగపడతాయా? ప్రజలకు ఆపత్సమయంలో కాంగ్రెసు యిలాంటి పంథా అనుసరించలేదా? ఇలాంటి సమయంలో సహకారం చేయడమా, మానడమా? అని తర్జన భర్జన చేయడం ఆకలిమంటల కాహుతి అవు

తున్న నీ సోదరప్రజలపట్ల నీ తక్షణ కర్తవ్యాన్ని విడిచిపెట్టి పారిపోవడమన్నమాటే; అని కాంగ్రెసు పెద్దలతో వాదించాం.

కాంగ్రెసు యువక వర్గాలకుకూడా మా పంథాను వివరించాం.

కరువు నివారణ కర్తవ్యంపట్ల అతనికి ఉత్సాహం లేనందుకు మూల కారణాన్ని విశద పరచాం. కరువు నివారణ అంటే అతని మనసుకు తట్టేదల్లా—గొప్పవాళ్ళు బీదవారికి దానధర్మాలు చేయడం—అందువల్లనే అతని కీనాడు ఉత్సాహంలేదు. వెనుకటి రోజుల్లో నాయకులవలంబించిన కార్యక్రమాలలాంటివి. కాని, మీ కార్యక్రమ మెలాంటిదో పరిశీలించమన్నాం. ప్రజలలో స్వయంసహాయక పద్ధతుల నెలా అమలు జరుప ప్రయత్నిస్తున్నామో విశద పరిచాం. కరువు నివారణ కార్యక్రమానికి, ప్రజలనుండీ, ధనికుల నుండీ బీదలనుండీ కూడా విరాళాలు వసూలు చేయడం, సహాయం అవసరమున్నవారే ఈకార్యక్రమంలో ఎంతోదీక్షతో పాల్గొనడం - అంతా వివరించాం. ఈపద్ధతుల్లో ఈకార్యక్రమాన్ని సాగించడం ఫలితంగా ప్రజల్లో సంఘీభావం ఎలా దినదినాభివృద్ధి పొందుతూందో స్పష్టపరిచాం. ఈ పద్ధతుల ననుసరించడంవల్ల, సహాయాన్ని పొందిన వారిలో తా మేదో అల్పులమనే భావం ఎలా ఏర్పడడం లేదో నొక్కిచెప్పాం. మా కృషి ప్రభుత్వంపై ఆధారపడే బుద్ధికి తావివ్వక, ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని ఎలా పెంపొందింప జేస్తుందో చూపించాం.

మావ్యతిరేకులు 'విప్లవం విప్లవం' అంటూ రంకెలువేశారు: కాని గడపదాటి బయటికి తొంగిచూడలేదు. మేము ప్రజల్లోకి చొచ్చుకుపోయాం. అహోరాత్రులు కృషిచేసి వారిలో ప్రజాస్వామిక చైతన్యాన్ని వికసింపచేశాం. తమ ప్రాణాలను, ఆలుబిడ్డలను కాపాడుకోడానికి తమశక్తి కేది సాధ్యమో దానిని ప్రజలే నెరవేర్చేలా పాటుపడ్డాం.

కరువురాకాసి భారతదేశాన్నంతటినీ కబళించకుండా చేయడానికి తక్షణమే కంట్రోలు, రేషనింగుల నమలుజరపాలని, ప్రభుత్వం కళ్లు తెరవక ముందే ఎంతోకాలంనుంచి ఆందోళన ప్రారంభించాం. మాఆందోళన,

నిజపరిస్థితులు, ప్రభుత్వాన్నిలొంగదీసి, ఈరెండూ అమలు జరిగేంతవరకూ విశ్రాంతి ఎరుగకుండా కృషిచేశాం.

ఈ కృషి ప్రభుత్వాన్ని మనదేశంలో శాశ్వతంగా కూర్చోబెడుతుందని మా వ్యతిరేకులన్నారు. ఆహారపరిస్థితిని చక్కబరచడానికి ప్రభుత్వం చేసే కొద్ది ఏర్పాట్లతో సహాయనిరాకరణ చేయడం; రహస్యంగా వాటిని వ్యతిరేకించడం, త్వరలో ఆప్రభుత్వాన్ని కూలదోస్తుందన్నారు.

స్వాతంత్ర్యం కావాలంటే ప్రజలు వస్తుండాలనడం ఎంతసబబో ఇది అంత సబబే అని మేము బదులు చెప్పాం.

కంట్రోలు, రేషనింగుల ఆవశ్యకత

యుద్ధపరిస్థితుల్లో కంట్రోలు, రేషనింగులు ఎలాఅవసరమో మేము స్పష్టపరిచాము. రేషనింగుద్వారా ప్రజలందరికీ న్యాయమైన సరఫరాలందగలవు; కంట్రోలుద్వారా తిండిదొంగల పన్నాగాలు భగ్నమవుతాయి. ప్రపంచంలో అన్నిదేశాల్లోను ఈరెండూ అమలుజరిగాయి. మనదేశంలో తిష్టవేసుకూర్చున్నది పరాయిప్రభుత్వం; ప్రజలకష్టసుఖాలు దానికక్కర లేదు. అందువల్ల అది ఈరెంటినిగురించి మొట్టమొదటే ఆలోచించలేదు. ఫలితం. ఆహారసంక్షోభం! ప్రజాందోళనకు లొంగివచ్చి చివరకది కంట్రోలు రేషనింగులను అమలుజరిపింది. అది పరాయి ప్రభుత్వం కాబట్టి వాటిని వ్యతిరేకించాలనడం—హాస్పిటల్స్ ప్రభుత్వంవారివి కాబట్టి చికిత్సకోసం వాటికి వెళ్ళకూడదు; బడులపై పెత్తనం ప్రభుత్వానిది కాబట్టి చదువుకోసం మీ బిడ్డలను వాటికి పంపకూడదనడం ఎంత తెలివయినమాట?

ఈ ప్రభుత్వం పరాయిప్రభుత్వం కాబట్టే! ఇదిచేతకానిది, ప్రజలతో సంబంధంలేనిదికాబట్టే. ప్రజలు పూనుకోకపోతే, ఆహారం విషయంలో అదిచేసే ఏర్పాట్లన్నీ తిండిదొంగల పెత్తనంక్రిందికిపోతాయి. అలాజరుగనివ్వడమా? అనేదే ప్రధానసమస్య అని మేము స్పష్టపరిచాం.

అందువల్ల అధికారుల అవినీతిని, తిండిదొంగల పేరాసను. అరికట్టాలంటే అన్నిపక్షాలనుకలిపిప్రజా ఆహారసంఘాలను, స్థాపించాలన్నాం.

నిరంకుశ ప్రభుత్వపు అవకతవకలను, తిండిదొంగల ఘాతుకత్వాన్ని వీటిద్వారా బట్టబయలు చేయాలన్నాం. ప్రజావాంఛలను వీటిద్వారా ప్రకటించాలని సూచించాం.

ఆహారపరిస్థితి అత్యంత తీవ్రమయిన రోజుల్లో మే మలాంటి సంఘాలను స్థాపించాం. వందలకొద్దీ కాంగ్రెసువాదులు ఈ సంఘాలకు తోడ్పడ్డారు. ఈ సంఘాల నాయకత్వం క్రింద ప్రజల్ని సమీకరించడానికి అహోరాత్రులూ కృషి చేశాం. మా కృషిని ప్రజలు అభినందించారు; మమ్మల్ని ప్రేమతో ఆశీర్వదించారు. నిరంకుశాధికారులు, తిండిదొంగలు మాపై శాపనార్థాలు కురిపించారు. అందుకు మాకెంతో ఆనందం కలిగింది.

బెంగాల్ కరువునుగురించి ఆందోళన చేయడంలోను, ఆ తరువాత ఆహారసమస్యను ప్రధానసమస్యగా తీసుకొని కృషిచేయడంలోను, మాపార్టీ పత్రికలు దేశమంతటా అందరిచేత మన్ననలను పొందాయి. శత్రు, మిత్ర, తటస్థ, భేదంలేకుండా అన్ని రాజకీయవర్గాలు ఈ కృషిలో మా పత్రికలను గౌరవించాయి. ప్రభుత్వాన్ని, ప్రజాద్రోహులయిన తిండిదొంగల్ని నిర్భయంగా తూర్పారబట్టి దేశంలోని పరిస్థితులను యథాతథంగా చిత్రించడంలో మా పత్రికలు సాటిలేనివని గుర్తించారు.

మేధావుల్లో అభివృద్ధికాములు మాకు ఆహారసమస్యపై నిపుణులమని బిరుదిచ్చారు.

అన్ని వివరాలను మే మెలా తెలుసుకోగలిగామా అని కాంగ్రెసు పెద్దలు ఆశ్చర్యపోయారు. మా కార్మేడ్సుకి ఇంత ఉత్సాహం ఎక్కడిదా అని ముక్కుపై వ్రేలుపెట్టుకున్నారు. "ఇప్పుడేమీ చేయలేము....అదీ, ఇదీ అని ఎందుకు వృథాశ్రమ పడడం?" అని తా మనుకొంటున్నప్పుడు మే మింతపని ఎలా చేయగలుగుతున్నామా అని ప్రశ్నించుకున్నారు.

"ఆహారసమస్యపై మీతో మే మేకీభవిస్తాము, మీతో కలిసి పని చేస్తాం. కాని యుద్ధం విషయంలో మీ విధానాన్ని అంగీకరించము." అని ఆ దశలో సోదర కాంగ్రెసువాదులనుండి మేము తరుచుగా వినేవాళ్ళం.

ఆహారసమస్యపై మా పాలసీకి, యుద్ధము, జాతీయసమస్యల విషయంలో మే మనుసరించిన పంథాలకూ, మూలం ఒక్కటే. మాలో పొంగులుతీస్తున్న దేశసేవాదీక్ష, వాస్తవిక పరిస్థితులను అవగాహన చేసుకోగల శక్తి, ప్రజా శ్రేయస్సును చేకూర్చే మార్గాలను సూచించగల ఆత్మవిశ్వాసమూ—ఇవే మా విధానాలకు మూలం. కాని, ఆ రోజుల్లో ప్రభుత్వ నిర్బంధవిధానం జాతీయోద్యమాన్ని చెల్లాచెదరుచేసింది; ప్రజల్లో దిగ్భ్రాంతి, దేశభక్తుల్లో అపోహలు వ్యాపించి ఉన్నాయి. ఆస్థితిలో ఆహార సమస్యపైన, యుద్ధం విషయంలోను, మే మనుసరించిన పంథాలు మా జాతీయవిధానంలోని భాగాలే అన్న సత్యాన్ని కాంగ్రెసువాదులు అంత సులభంగా గ్రహించగలరని మేము వెర్రి ఆశలేమీ పెట్టుకోలేదు. అయినప్పటికీ, ఆనాడు ప్రజల జీవన్మరణ సమస్య అయిన ఆహార సమస్యపై ఏకీభావం కుదరడమే పదివేలనుకొని సంతోషించాం.

కంట్రోలు, రేషనింగులు అమలు జరగడంవల్ల ఆర్థిక సంక్షోభం మరింత తీవ్రంకాకుండా ఆగింది. కాని ధరల నిర్ణయం ఎంతో ఆలస్యంగా జరిగింది. యుద్ధానికి పూర్వం ఉండిన వాటికన్నా రెండింతలు, మూడింతలుగ నిర్ణయింపబడ్డాయి.

మాపై దొంగవ్యాపారుల దాడి

ఆ రోజుల్లో కంట్రోలు ఏర్పాట్లన్నీ తిండిదొంగల చేతుల్లోకే పోయాయి. అందువల్లనే ధరలనిర్ణయం అలాజరిగింది. 'పరిస్థితినిమరింత అధ్వాన్నం చేయము' అని వారినుండి ఒకవాగ్దానంపొంది గుడ్డిప్రభుత్వం సంతృప్తి చెందింది. యుద్ధానికి సంబంధించినంతవరకు ఆర్థిక వ్యవస్థకు భంగం రానివ్వమని పెద్దపెట్టుబడిదారులు హామీ ఇస్తే చాలు పదివేలనుకుంది పరాయి సామ్రాజ్యవాద ప్రభుత్వం. ఇలా సంతృప్తిపడి ఊరుకోవడమే తమకు చాలమనుకున్నారు భారత దేశ పెట్టుబడిదారులు. తాము గుంజుకోగల లాభాలకు హద్దూపద్దూ ఉండదన్నసంగతి ఖాయమయింది. అందు

వల్ల ప్రజలకు కలిగే నష్టకష్టాలకు దోషమంతా ప్రభుత్వం నెత్తిమీద కొట్టవచ్చు; తమదేమీ లేదని నంగనాచి కబుర్లాడవచ్చు.

అందువల్లనే ఆరోజుల్లో మనజాతీయ పత్రికలన్నీ కంట్రోలుకు వ్యతిరేకంగా, మాపార్టీకి వ్యతిరేకంగా తెరపిలేని ప్రచారంసాగించాయి; ఈ జాతీయపత్రికల్లో అత్యధికభాగం దురాశాపరులైన దొంగవ్యాపారుల చేతుల్లోకి, లేదా పెత్తనంక్రిందికి పోయాయి. కావాలంటే ఈ విషయం మీకు రుజువుచేస్తాము. అదేపనిగా ఈ పత్రికలన్నీ మాపై విషప్రచారం సాగించాయి. అదంతా ఒక అసహ్యాకరమైన గాథ. మేము ప్రభుత్వానికి అమ్ముడుపోయామట. ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్లు నటించే నట ప్రజాదరము నిలబెట్టుకో గలిగాము. ఈ నటనద్వారా ప్రజల్లో ఉన్న బ్రిటిష్ వ్యతిరేకతను మా 'యజమానుల' కు అనుకూలంగా ఉపయోగించామట. సామ్రాజ్యవాదం క్రింద దొంగవ్యాపారం తప్పదనీ, కంట్రోలువల్లనే ధరలు పెరిగాయనీ. ఈ కంట్రోలు బ్రిటిష్ యుద్ధకృషిలో ఒకభాగమనీ—ఏమేమో ప్రచారంచేసి ప్రజలను మభ్యపెట్టజూచాయి ఈజాతీయపత్రికలు. ఇక కమ్యూనిస్టులపై అన్నిరకాల నీచప్రచారమూ సాగించాయి. మాపైని సాగిన ఈ విషప్రచారానికి జి. డి. బిర్లా సూత్రధారుడని మాకు బాగా తెలుసు. ఈ ప్రచారముయొక్క అంతిమ ఆశయాలమాట అటుంచి, ఆ దశలోనే సాధించదలచిన లక్ష్యం ఒకటుంది. దొంగవ్యాపారానికి వ్యతిరేకంగా మేము సాగించిన ప్రచారానికి ప్రజాదరణలేకుండా చేయడమూ, ఆ ప్రచారము మధ్యతరగతి ప్రజల్లోకి వ్యాపించకుండా చేయడమూ. అప్పటి దానిఆశయం."

అనాటి ఆర్థికసంక్షోభంలో మధ్యతరగతికి వెన్ను విరిగినంత పనయింది. భారతజాతి పునరుజ్జీవనానికి మన పవిత్ర జాతీయోద్యమానికి ఎవరయితే పునాదివేశారో ఆ మధ్యతరగతికే అంతవిపత్తు సంభవించింది. తామలవాటుపడిన జీవనవిధానాన్ని నిలబెట్టుకోడానికి ఈ మధ్యతరగతి వారికి రెండే రెండు మార్గాలు కనబడ్డాయి. ఆనాడు అధికారవర్గంలో వ్యాపించిన అవినీతికి తాముకూడా తలఒగ్గి లంచాలను గుంజడం, లేదా

దొంగవ్యాపారంలో తామూ భాగస్వాములై ధనికవర్తకులకు తాబేదార్లుగ పనిచేయడం - మరోమార్గం వారికి కనబడలేదు. ఏది ఎలా గుంటుందో తెలియని ఆరోజుల్లో, ప్రతిష్టంభన పరిష్కారమయే జాడలయినా కనబడని ఆ దశలో, ప్రతివ్యక్తీ, ప్రతిజాతీ, ప్రతి నాయకుడూ - ఎవరిదారి వారు చూచుకొంటున్నట్లు కనుపించింది.

ఒక్క రాజకీయాల్లోనే కాకుండా, సామాజిక జీవనంలోకూడా అంతా తారుమారయింది. రాజకీయంగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించడంలో అంతా ఒక్కటయ్యారు. కాని సాంఘికంగా ఎవరిదారిని వారు చూచుకుంటూ, ఎదుటివాడిని వ్యతిరేకించ నారంభించారు. దేశస్వాతంత్ర్యానికీ, స్వంతఐశ్వర్యాభివృద్ధికీ అడ్డుదారులు కనిపెట్టడంకోసం బుద్ధిబలాన్ని ఉపయోగింపసాగారు. వెనుకటి ప్రపంచం శిధిలమయిపోవడం కళ్లారా చూచారు. ఆ ప్రపంచంలో ఏర్పడిన రాజకీయ సంస్కృతికి విలువలు కూడా అంతరించిపోయాయి. కళ్లయెదుట ఒక కొత్తప్రపంచం రూపొంద సాగింది. ఆటవిక నీతికే అందులో స్థానమనుకున్నారు. శక్తికలవారిదే రాజ్యంగాని, నీతి నియమాలకు విలువ లేదన్నారు.

దేశదౌర్భాగ్యంకొద్దీ ఈ పరిస్థితులు కాంగ్రెసు కుటుంబాలకుకూడా వ్యాపించసాగాయి.

భరింపరాని ఆవేదనతో ఈ మాటలను రాస్తున్నాం. మా పార్టీలో ప్రతి ఒక్కరంకూడా ఈదారుణ పరిస్థితులను ప్రతిఘటించాం. మాబంధువులు లంచాలు తీసుకోకుండా, రైతుబాబులు అధికధరలకాసపడి ధాన్యాన్ని తిండిదొంగలకమ్మకుండా, మంచిబియ్యంకోసం కక్కుర్తిపడి మాతల్లులు దొంగమార్కెట్టు నాశ్రయించకుండా, వేయికళ్లతో కనిపెట్టి చూచాం. సాధారణ పరిస్థితుల్లో పాటిస్తూవచ్చే నియమాలను ఆనాటి అసాధారణ పరిస్థితుల్లో పాటించలేకపోయిన కామ్రేడ్స్‌ని తమ ప్రాణప్రదమయినపార్టీ నుంచి కూడా తొలగించవలసి వచ్చింది. అందువల్లనే ఈ విషాదగాధ నంతా తిరిగి రాయడం మా కెంతో బాధగావుంది.

ఈ ఆర్థిక సంక్షోభాని కంతటికీ బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఒక్కటే కారణమని చాలమంది కాంగ్రెసువాదు లన్నారు. తిండిదొంగల పేరాశకు చింతించారు. యుద్ధం పూర్తిఅయేవరకూ, లేదా పరిష్కారం కుదిరే వరకూ, ఏమీ చేయలేమని పెదవి విరిచారు. బ్రిటిష్ వ్యతిరేకత అంతా దేశభక్తుల్లోకూడా నిస్పృహగా పరిణమించింది. భారతజాతికి మహోన్నతిని చేకూర్చిన సత్సంప్రదాయాలన్నీ ఎలా మట్టిపాలవుతున్నాయో ఆనాటి పరిస్థితులు స్పష్టపరిచాయి.

ఆ పతనంలో మేముకూడా కొట్టుకుపోకుండా, మా నిజాయితీని కాపాడుకున్నాం. అవినీతిపరులైన అధికారులను, ప్రజాకంటకులైన తిండిదొంగలను ప్రతిఘటించడానికి బ్రహ్మాండమైన ఉద్యమాన్ని సాగించి, సోదరప్రజల్లో నూతన చైతన్యాన్ని రేకెత్తించ కృషిచేశాం. మా కృషి ఫలించింది. అవినీతిపరులకు, ప్రజాకంటకులకు మా పత్రికలన్నా! మా ప్రచారకులన్నా కలిగిన భయమే ఇందుకు నిదర్శనం. తమబాధలు భరింపరానివైనప్పుడు వాటినుండి గట్టెక్కే మార్గం తెలుసుకోడానికి బీదప్రజలు మా పార్టీకార్యాలయాలకు రావడం మరోనిదర్శనం. సాధారణ పరిస్థితుల్లో వీరు తమ స్థానికకాంగ్రెసు కార్యాలయాలకు ఈవిధంగానే వెళ్ళేవారు. ఈ బాధలను తొలగించడాని కేదయినా ఉద్యమం అవసరమైతే మేము నడిపిస్తామనీ; వాటినిగురించి ఆందోళనచేయడానికి అధికారులవద్దకు వెళ్ళవలసివస్తే మేము వెళ్తామనీ వారికి బాగాతెలుసు.

జాతీయప్రభుత్వమే పరిష్కారమార్గం

1943-1944 లో బహిరంగంగా ప్రజాందోళన సాగించినందుకు అరెస్టుయిందల్లా మా కామ్రేడ్సే. తమతమ ప్రాంతాల్లో అధికారుల అవినీతిని, తిండిదొంగలను ఎదుర్కొని ప్రజాపోరాటం సాగించినందుకు వీరిని అరెస్టుచేసింది ప్రభుత్వం. కావాలంటే సరిగా ఎంతమంది అరెస్టయారో మీకు లెక్కలివ్వగలం.

ఆహారపరిస్థితి కొంత కుదుట బడేసరికల్లా ఇతర జీవితావసరాలకు కరువు వ్యాపించింది. వెంటనే బట్ట, కిరసనాయిలు, పంచదార మొదలైన సరకులను సక్రమంగా ప్రజల కందివ్వడానికి కో ఆపరేటివ్ ఉద్యమాన్ని నిర్మించడానికి తోడ్పడ్డాము. ఈ విషయంలో మా కృషినిగురించి మచ్చుకు కొన్ని ఉదంతాలను 'పీపుల్సువార్' ద్వారా మీరు తెలుసుకోగలరు.

కాంగ్రెస్ లేకపోవడంచూచి, ఇదే సమయమని ప్రజల్లో పలుకు బడి సంపాయించుకోవాలనే స్వార్ధదృష్టితోనే ఇదంతా చేస్తున్నామని మా వ్యతిరేకు లన్నారు. కాని ప్రజ లేమనుకున్నారు ?

"లోగడ కాంగ్రెసు ఏమిచేసేదో, ఇప్పుడయినా నాయకులు బయట ఉంటే ఏమిచేసేవారో సరిగా అదే మీరుచేస్తున్నార"ని ప్రజలు మమ్మాశీర్వదించారు.

ఇదే మా శక్తి సామర్ధ్యాలను ఇనుమడింపచేసింది. మా గర్వ కారణం కూడా ఈ ప్రజాదరణే;

మా కృషిద్వారా ఆర్థిక ప్రతిష్టంభన పరిష్కారమవుతుందనే పిచ్చి భ్రమలు మేమేమీ పెట్టుకోలేదు. ప్రజల బాధా నివారణకృషిగానే దానిని లెక్కించాముదానివల్ల ప్రజలకు మేలు కలిగింది. అంతేకాదు వారిలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించింది, నిరాశను పోగొట్టి ఆశను రేకెత్తించింది. రాజకీయ ప్రతిష్టంభన వల్లనే ఆర్థిక సంక్షోభం కలిగిందని అహోరాత్రులూ ప్రజల్లో ప్రచారం చేశాం. జాతీయ ప్రభుత్వస్థాపనా మీ విడుదలలే యీ ప్రతిష్టంభనను తొలగించగల మార్గాలని గుర్తింపజేశాం.

గాంధీజీ ఉపవాస సందర్భంలో ఇలా అన్నాం :

"గాంధీజీ విడుదలకోసం బ్రహ్మాండమయిన ఆందోళన సాగించవలసిందని కార్మిక, కర్షక, విద్యార్థి సంఘాలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. గాంధీజీ ఉపవాసాన్ని అవకాశంగా తీసుకొని దేశంలో అరాజకాన్ని రెచ్చగొట్టజూచేవారిని తూర్పారపట్టండి; ప్రజలనుండిదూరంచేయండి ఒక్క అడుగు ముందుకువేస్తే చాలు. నిరంకుశ ప్రభుత్వాన్ని లొంగదీయగలం; దేశాన్ని ఘోర విపత్తునుండి కాపాడగలం. ఈ అడుగేయక పోతే యావద్భారతజాతి వినాశం తప్పదు."

('పీపుల్సువార్' 1943 ఫిబ్రవరి 21.)

1943 మేడేనాడు ప్రకటించిన ప్రణాళికలో మాపార్టీ ఇలాచెప్పింది:

"ఈనాటివరకు మనకు జాతీయ ప్రభుత్వము, పరిపాలనాధికారము లభించలేదంటే కారణం, ప్రధాన రాజకీయసంస్థలు రెంటికీ మనం ఐకమత్యం కుదర్చలేకపోవడమే, ఈ కారణంవల్లనే ఈనాడు మననాయకులు ఇంకా జైళ్ళలో మ్రగ్గుతున్నారు: లక్షలకొలది సోదరప్రజలు హిందువులూ ముస్లింలూ ఆకలి మంటలతో అలమటించి పోతున్నారు. గాంధీజీని పోగొట్టుకొంటామేమోఅన్న ప్రమాదపరిస్థితి ఏర్పడిందీకారణమువల్లనే"

("పీపుల్సువార్" సంపుటి 1. సంచిక 42-1943 ఏప్రిల్ 25.)

అంతకు పూర్వం 'దేశ రక్షణకోసమే జాతీయ ప్రభుత్వం' అనే నినాదాన్ని ఇంటింటికీ అందజేశాం. ఆహార సంక్షోభం ఏర్పడిన తరువాత "ప్రజలకు తిండికోసం, దేశ రక్షణకోసం. జాతీయ ప్రభుత్వం" అనే నినాదాన్ని ప్రజల్లో ప్రచారంచేశాం.

IX

జపాను అనుకూల ప్రచారం

తాము 'ఆగస్టు విప్లవం' నడుపుతున్నామనీ, మేము దేశానికి ద్రోహం చేశామనీ బాకాలూదుతూ బయలుదేరినవారు చివరకా 'విప్లవం' నీళ్లు కారిపోయేసరికి, బ్రిటిష్ నిర్బంధానికి ప్రజలు తట్టుకోలేక పోయారని వెర్రిమొర్రి సమాధానాలు చెప్పడం పైన వివరించాం.

దైనందిన అనుభవాన్నిబట్టయినా ఈ "విప్లవకారులు" తమ పంథాను మార్చుకోడానికి ప్రయత్నించలేదు, 'ఆగస్టు విప్లవా'నికి నాయకత్వం వహించినవారిమితప్పుచేస్తామా ? అనే వారిధీమా. తమ తప్పును

తెలుసుకోడానికి బదులు, వారింకా తప్పులు చేయసాగారు. తమ ప్రజల్లో విశ్వాసం కోల్పోయారు. జంతువుల్లాగా ప్రజలుకూడా ఒకమూలకు తరుమ బడినప్పుడే ఎదురుతిరిగి పోరాడుతారనే సిద్ధాంతానికి వచ్చారు. మరో విప్లవానికి సన్నద్ధం కావడమే వారు తమ కొత్త కార్యక్రమంగా పెట్టుకున్నారు. ఆహార సంక్షోభం నానాటికీ తీవ్రమయేకొద్దీ ప్రజల జీవితం దుర్భరమౌతుందనీ, దానితో వారు తిరుగుబాటుకు సిద్ధపడతారనీ వీరు అంచనావేశారు. ఆరితేరిన విప్లవకారులుంటే ఈతిరుగుబాటు జయప్రదంగా కొనసాగించవచ్చు నన్నారు. ఇండియాపై దుముకడానికి సిద్ధంగాఉన్న జపాను ఫాసిస్టుల్నీ బోసు తయారుచేసిన "అజాద్ హింద్ ఫౌజు"నీ తమ 'విప్లవానికి అండగా లెక్కించారు. ఈ విధంగా బయలుదేరిన వీరు తమ కేమీ చేతకాదనేది రోజు రోజుకీ స్పష్ట మయేకొద్దీ సిగ్గువిడిచి పూర్తిగా బోసుపైనీ, జపాను మూకలపైనీ ఆధారపడ నారంభించారు.

వీరు రెండు కొత్తనినాదాలను లేవదీశారు:

1—"ఒక చిన్న విప్లవదళంగా ఏర్పడదాం."

1943 వ సంవత్సరం మొదటి ఆరుమాసాల్లో వీరు విధ్వంసక చర్యలను గురించి పాఠాలు ఒక పుస్తకంగా అచ్చువేయించి పంచిపెట్టారు ప్రజా వెల్లువ అణుగారిపోయింది; "తిరిగి శక్తి సామర్ధ్యాలను కోలుకోడానికి కొంత వ్యవధి పడుతుంద"నే మాటలతో ఈ పాఠాలు ప్రారంభమయాయి.

> ఈ లోగా విప్లవానికి అగ్రగాములుగా ప్రతి జిల్లాలోను మెరపు దళాలను తయారుచేయాలి. వీరికి తగు నైపుణ్యము రాజకీయ శిక్షణ ఉండాలి. గెరిల్లాపద్ధతులలో వీరు శత్రువును విధీ విరామం లేకుండా ప్రతిఘటిస్తూ ఉండాలి. "అజాద్ దస్తాన్" అని వీరికి హిందూస్తానీలో నామకరణం చేయాలి అని నిర్ణయించారు.
>
> (ఏ. బి. పి. ఆఫ్ డిప్లొకేషన్—8 వ పేజీ)

'స్వాతంత్ర్యయోధుల' కంటూ జై ప్రకాశ్ నారాయణప్రచురించిన మొదటిజాబులో ఇలా అన్నాడు.

"లోగడ వేలకొలది ప్రజలకు సాధ్యంకాని విషయం ఇప్పుడు తగు శిక్షణతో బహుకొద్దిమందికే సాధ్యంకావచ్చును. కాబట్టి ప్రతిఫిర్కా, తాలూకా, ఠానాలోనూ, ప్రతిఫాక్టరీలోనూ, వర్కుషాపులోనూ, ఇతర పారిశ్రామిక కేంద్రాల్లోను, మనం కొంతమంది కార్యశూరులను తయారు చేసి, రాబోయే విప్లవానికి సిద్ధంగా ఉంచాలి." (13 వ పేజీ)

"భారతజాతీయకాంగ్రెసుయొక్క పక్షపత్రిక" అనే హోదాతో అచ్యుతపట్వర్ధన్ సంపాదకత్వం క్రింద సి. యస్. పి. (కాంగ్రెసు సోషలిస్టుపార్టీ) నాయకులు నడిపిన 'ఆగస్టు 9' అనే రహస్య పత్రిక ఇలా అంది.

"ఈ రహస్యదళాలను గురించి దాచవలసిందేమీ లేదు....రోడ్డులు తెగగొట్టడమో, తీగలు తెంచడమో, రైలుపట్టాలు పీకడమో, లేక పోలీసుస్టేషన్లు, జైళ్ళు, కలెక్టర్ల కార్యాలయాలను ధ్వంసంచేయడానికి ప్రజల్ని దాడినడిపించడమో — చేయదలచిందేపనయినప్పటికీ, ఆయా దళాల్లో అందుకు ప్రత్యేకతరిఫీదుపొందినవారు ఉండాలి."

('ఆగస్టు 9'—సంచిక 12-3 వ పేజీ - 1944 జనవరి 26)

ఈవిధంగా వారు నిర్ణయించుకొన్న కార్యకలాపం ముఖ్యంగా గమనించతగ్గది. ఆకార్యక్రమమే వారి రెండవ నినాదానికి దారితీసింది.

2. "ఇతరదేశాల సహాయంలేనిదే చరిత్రలో ఏదేశమూ తన స్వాతంత్ర్యాన్ని సాధించలేదు."

ఆరోజుల్లో భారతప్రజలపై బ్రిటిష్ సామ్రాజ్యవాదుల హింసాకాండ శృతిమించసాగింది. అందువల్ల ఈ సామ్రాజ్యవాదుల శత్రువులు 'భారత స్వాతంత్ర్య విప్లవా'నికి మిత్రులని వాదించారు.

మాతృదేశంపై కత్తిదూసిన కరకు ఫాసిస్టులను సర్వశక్తులతో ప్రతిఘటించాలనడం పోయి. మిత్రులని స్వాగతం పట్టాలన్నారు. భారత స్వాతంత్ర్యానికి వారే దిక్కన్నారు!

బ్రిటిష్‌వారిపై ద్వేషమే జపాను అనుకూల ధోరణిగా వెల్లడయే దశ దాటిపోయింది. జపాను అనుకూలవాదం పరిపక్వమై ఇంకా పై మెట్టుకు దారితీసింది.

వారి మాటలే ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయి.

"మనమింతకన్నా ఏమిచేయగలం? రష్యా, జర్మనీ ఒడంబడికో; చైనా, జపాను సంధో, బ్రిటిష్‌వారికొక పెద్దపరాజయయో, లేక మనదేశంపై దండయాత్రో— ఇలాంటిదేదో జరుగుతేనేగాని, మనమేమీ చేయలేమని నా నమకం. దీనిని బహిరంగంగా చెప్పడానికి నాకేమీ బిడియం లేదు" అని జైప్రకాశ్‌నారాయణ్ 'స్వాతంత్ర్యయోధులము' అనే తన ౧౪౦౨జాబులో రాశాడు. (14వ పేజీ)

దీనిఅర్ధమేమిటి? రాజకీయంగానో లేకయుద్ధరంగంలోనో ఫాసిస్టుకొక గొప్పవిజయం చేకూరుతేనేగాని ఇండియాకు మోక్షం లేదన్నమాట 1936 లగాయతు కాంగ్రెస్ చేస్తూవచ్చిన ప్రతితీర్మానానికీ, అరస్టయేవరకు మీలో ప్రతి ఒక్కరూ చేస్తూవచ్చిన ఉపన్యాసాలకూ, ఈ ప్రకటనలకూ, ఈధోరణి పూర్తిగా విరుద్ధంకాదా?

జపానువారితో సహకారమట

భారత దేశంపై జపాను దండయాత్ర ప్రారంభమయితేనేగాని యేమీ చేయలేమనే స్థితికి వారెలావచ్చారో వివరించాం. సరే - జపాను దండయాత్ర ప్రారంభమయిందనే అనుకుందాం, ఆ పరిస్థితుల్లో ప్రజలేమి చేయాలని జైప్రకాశనారాయణ సూచన? వర్కింగుకమిటీలోని నెహ్రూ పండితుని గ్రూపు సూచించినట్లుగా జపానువారిని ప్రతిఘటించాలంటాడా? లేక మహాత్మాజీగ్రూపు అన్నట్లుగా జపానుతో సహాయ నిరాకరణచేయాలి; కాని మిత్రరాజ్యసేనల కేలాంటి ఆటంకాలూ కలిగించకూడదంటాడా? యేమన్నాడో చూడండి;

"యుద్ధరంగంగా మారే ప్రదేశాల్లోనూ, లేక జపానువారు చొరబడడమో, ఆక్రమించుకోవడమో జరిగిన ప్రదేశాల్లోనూ. పరాయి ప్రభుత్వం బలహీనమైపోతుంది. కూలిపోవచ్చుకూడా. అలాంటి ప్రదేశాల్లో మనం వెంటనే స్వరాజ్య ప్రభుత్వాన్ని స్థాపించాలి. పరాయిసేనలతో కలిసి పారిపోతూన్న భారతీయసేనల్ని ఆగవలసిందనీ, ప్రజాసైన్యంగా ఏర్పడవలసిందనీ, ఈ ప్రభుత్వంపేరిట విజ్ఞప్తి చేయాలి, దేశమంతటా తన పరిపాలనను నెలకొల్పి ప్రభుత్వాన్ని తూర్పురాష్ట్రాల్లో స్థాపించడానికి మనమిప్పటినుంచీ తయారుకావాలి, ఈ విషయంలో అనేక ప్రశ్నలు వస్తాయి. వాటిని గురించి ఇందులో చర్చించడానికి వీల్లేదు. అనుసరించవలసిన విధానాన్ని స్పష్టపరచి స్వాతంత్ర్యయోధులు, ప్రజాసామాన్యమూ దానిని గమనించేలా చేస్తేచాలు." ('స్వాతంత్ర్యయోధులకు'రెండవజాబు-11వపేజీ)

'అగస్టు 9' పత్రికలో అచ్యుతపట్వర్ధన్ ఇతన్ని మించిపోయాడు. జపాను కిరాతకుల రాక్షస కృత్యాలను కప్పిపుచ్చడానికే పట్వర్ధన్ సాహసించాడు.

ఇలా రాశాడు:

"బర్మా, మలయా. జావాల్లో జపానువారి దుర్మార్గాలను, దుష్టపరిపాలనను చాటిచెప్పడానికి మిత్రమండలివారు యిప్పటికి 18 మాసాల నుంచి ప్రయత్నిస్తున్నారు. కాని యింతవరకు వారికొక్క నిదర్శనం కూడా దొరకలేదు."

('అగస్టు 9' - సంచిక 6 - 9 వ పేజీ - 1943 అక్టోబరు 23.)

జైప్రకాశ్ నారాయణ్ ఈవైఖరిని సమర్ధించాడు. జపానువారు బర్మాకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించారన్నాడు. సోవియట్ యూనియన్ కూడా టోజో నిందుకు ప్రశంసించిందన్నాడు.

"జపానువారు బర్మాకు స్వాతంత్ర్య మిచ్చారన్న వార్త కొంత ప్రచారమయింది, ఈవిషయం సోవియట్ ప్రభుత్వాని కెంతో సంతోషం కలిగించిందనీ- టోజో ప్రభుత్వంయొక్క ఉదారస్వభావాన్ని వారు అభినందించారనీ ఒకవార్త వచ్చింది."

('స్వాతంత్ర్య యోధులకు' రెండవజాబు—10—11 పేజీలు)

అంతటితో ఆగలేదు వీరి తెలివితేటలు. అక్షరాజ్యాలు నిజానికి సామ్యవాద ప్రభుత్వాలే అని 'ఆగస్టు 9' లో చెప్పసాహసించారు.

అక్షరాజ్యాలు తమ కార్యక్రమాన్ని స్పష్టం చేశాయి. ఇందులో నిజమైన సామ్యవాద కార్యక్రమం చాలాఉంది; అది అప్పుడే ఆచరణలోకి వచ్చింది కూడా."

('ఆగస్టు 9'—సంచికలో 1943 సెప్టెంబరు 24—7 వ పేజీ)

ఈవిధంగా కాంగ్రెసు సోషలిస్టుపార్టీ నాయకులు దేశ కళ్యాణానికి. స్వాతంత్ర్యాశయానికి భంగకరమైన విధానాన్ని చేపట్టారు. భారత ప్రజలకే శత్రువులయారు. జపాను ఫాసిస్టులు బాంబులు కురిపించి మన సోదరుల్ని పొట్టపెట్టుకుంటూంటే సంతోషంతో పరవశులయే స్థితికికూడా వచ్చారు. (అ) 1943 అక్టోబరు 10 వ తేదీని జపానువారు మద్రాసుమీద బాంబులు వేశారు, 'ఆగస్టు 9' దానినిగురించి ఏమనిరాసిందో చూడండి :

జపానువారు మౌంట్‌బేటన్ కోసం రంగూనులో కాచుకొని కూర్చోలేదు. వెతికివెతికీ అతని బలాన్ని ధ్వంసం చేయడానికి గత వారం మద్రాసుమీదికి వచ్చారు. రేపో మాపో కలకత్తామీదికికూడా రావచ్చు." ('ఆగస్టు 9' — 1943 అక్టోబరు 23 — 3 వ పేజీ.)

(ఆ) 1943 డిశంబరు 5 వ తేదీని జపాను ఫాసిస్టులు కలకత్తాపై బాంబులు కురిపించారు, 330 మందికి పైగా దారుణ మరణం పొందారు. వీరిలో ఎక్కువమంది కార్మికులు. పట్వర్ధన్‌గారి 'ఆగస్టు 9' మళ్లా ఇలా వ్యాఖ్యానించింది :

"తూర్పుఇండియాలో జపానువారి కొత్త కార్యకలాపాలనుగురించి ఈ దిగువ వివరాలను ప్రచురించ గలుగుతున్నందుకు మాకెంతో సంతోషంగా ఉంది. మా సోదర పత్రిక 'ఇంక్విలాబ్' యొక్క 1943 డిశంబరు పదవ తేదీన సంచికనుండి వీటిని సంగ్రహించాం.

('ఆగస్టు 9'— 1944 జనవరి — 12 వ పేజీ.)

ఈ 'ఇంక్విలాబ్' ఒక మాసపత్రిక. రాంమనోహర్‌లోహియా, అరుణా అసఫాలీ లిద్దరూకలిసి దీనిని నడిపేవారు. 'భారతజాతీయ కాంగ్రెసు తూర్పురంగ ప్రధానకార్యాలయ మాసపత్రిక' అని దీనికి పేరుపెట్టారు, కాంగ్రెసుపేరిటే ఇలారాశారు :

"తనప్రాణ, ధనాలకు కొత్తగాసంభవించిన ఉపద్రవానికి బ్రిటిష్ వారే కారాణమని ప్రజాసామాన్యంగుర్తించింది. ఈ బ్రిటిష్‌పాలకులు తమకు ఎదురులేదని విర్రవీగినరోజు లంతరించిపోయినందుకు ప్రజలు పరమానందంపొందుతున్నారు.? (ఇంక్విలాబ్' సంపుటి 8 -1943 డిశంబరు 10-13వ పేజీ)

కాంగ్రెసుపేరిట బాహాటంగా జపాను అనుకూల ప్రచారాన్ని: స్వాతంత్ర్యంపేరిట రహస్యంగా విధ్వంసక కార్యక్రమాన్నీ కాంగ్రెసు సోషలిస్టుపార్టీ నాయకులు సాగించిన తీరుఇదంతా. దేశంలోని కరువును, బియ్యం పంపిస్తానని బోసుచేసిన ప్రకటనను కలిపారు.

"తన ప్రజలు పడుచున్న బాధలనుచూచి శ్రీయుత సుబాస్‌బోసు కరిగిపోయాడు. బ్రిటిష్ ప్రభుత్వం ఒప్పుకుంటే ఒక లక్షటన్నుల బర్మా బియ్యాన్ని, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ వారి ఓడలమీద బెంగాలుకు పంపుతానని వారు జపాను ప్రభుత్వ అనుమతితో రేడియోలో ప్రకటించార"ని. ("ఆగస్టు 9"—1943 సెప్టెంబరు 24) ప్రచారం చేశారు.

"ఇందులో జపాను ప్రభుత్వం అనుమతితో అన్నమాటలను గమనించాలి. ఒక్క సుభాస్‌బోసేకాదు, జపాను ప్రభుత్వంగూడా మన

దేశంలో కరువును గురించి ఆందోళన పడుచున్నారని ప్రజ అనుకోవాలి. ఇదీ ఈ ప్రచారంయొక్క ఉద్దేశం. బోసు దండెత్తివస్తే లక్షలకొలది బస్తాల బియ్యం తెస్తాడు; బీదప్రజల కష్టాలన్నీ కడతేరిపోతాయని ఆరో జుల్లో బెంగాల్ రాష్ట్రమంతటా గుసగుసలు ప్రారంభించారుకూడా.

సరిగ్గా మన దేశానికి జపాను ప్రమాదం అతిశయించిన రోజుల్లోనే కాంగ్రెసు సోషలిష్టుపార్టీ నాయకులు తమ జపాను అనుకూల ప్రచారమూ చర్యలూ సాగించారు. స్టాలిన్‌గ్రాడ్‌వద్ద రెడార్మీ విజయం నాజీ హిట్లరుకు ఇండియాపై దండెత్తే అవకాశం లేకుండా చేసింది. ఆ దండయాత్రమీద బోసు పెట్టుకొన్న ఆశలన్నీ నేల కూలాయి. ఇండియాకు 'విముక్తి' కలిగించాలంటే ఒక జపానే గతి అనుకున్నాడు. 1943 మే, జూన్ మాసాలమధ్య బెర్లిన్ విడిచి సింగపూరు చేరుకున్నాడు.

జపానువారు తమ సేనల్ని, ఆయుధబలాన్ని, చింద్విన్‌నది ఆవలి గట్టుమీద సేకరిస్తూన్న రోజులవి బోసుకూడా తన అజాద్ హింద్‌ఫౌజు తయారుచేయనారంభించాడు. ఆరకాన్‌లో పేరుకు ఏదోయుద్ధం సాగుతుంది. ఇండియామీదికి రాగల దమ్ములు జపానువారికి లేవని బ్రిటిష్ వారు నిర్లక్ష్యంచేయసాగారు. మన ప్రజలలో చాలామందికూడా ఆమాటలను నమ్మారు.

మేము హెచ్చరించాం

ప్రమాదం మునుపటికన్నా తీవ్రమయిందనే సత్యాన్ని మేమొక్కరిమే గుర్తించాం. 1943 నవంబరులోనే దానిని గురించి ప్రజలను హెచ్చరించాం. ఆనెల 21 వ తేదీని పీపుల్సువార్‌లో పి. సి. జోషీ జపాను వారు వస్తారా అనే శీర్షికతో ఒక వ్యాసం వ్రాశాడు. అందులో ఇలా అన్నాడు.

"దండయాత్రకు జపానువారు ఆతురపడుచున్నారు. అటు రెడార్మీ విజృంభణ తీవ్రమయేకొద్దీ, ఇటు టోజో తెంపరితనం ఎక్కువ కాక తప్పదు .... దండయాత్ర చేయాలనుకొంటే ఈ శీతకాలమే వారికి మంచి

అవకాశం. ఆతరువాత మిత్రమండలి తమ సర్వశక్తులను వారిపై కేంద్రీకరించ గలరు. కాబట్టి ఇండియాపై తమ దురాక్రమణను సాధించడానికి జపానువారికి ఈ అదను దాటిపోతే మరి అవకాశం చిక్కదు.

మేమిలా రాసినందుకు ప్రభుత్వం చిందులు తొక్కింది. ప్రజల్లో భీతావహం కలిగిస్తున్నామని చెప్పి. మాపై చర్య తీసుకుంటామని బెదిరించింది. కాని, జరిగిందేమిటి. అయిదునెలల్లోనే మా హెచ్చరిక నిజమయింది. జపానుమూకలు విరుచుకుపడ్డాయి.

అవి నిజంగా దారుణమైన పరిస్థితులు.

1\. జపాను ప్రమాదం ఇక ఊహల్లోని విషయం కాదు. అది గుమ్మంలోకే వచ్చేసింది.

1944 ఏప్రిల్‌లో ఇంఫాల్ నగరంపై దాడిచేసి జపాను వారొక చిన్న విజయాన్ని సాధించారనీ, నగరంవద్దనే రెండు బ్రిటిష్ సేనలను ఉచ్చులో బిగించారనీ అందరికీ తెలిసినవిషయమే. అప్పుడేగాని వారు మరికొంత ముందుకు సాగి దిమాపూర్ — కలకత్తారైలుమార్గాన్ని తెగగొట్టి నట్లయితే మరొక ముఖ్యవిజయం సాధించిఉండే వారన్నదికూడా ఈనాడు అందరికీ తెలుసు. ఎందువల్లనంటే బర్మాలోనిస్టిల్‌వెల్ సేనలకూ అస్సాంలోని బ్రిటిష్‌సేనలకూ ప్రధాన సరఫరామార్గం ఆ రైలుదారే, అంతే కాదు, ఈ రైలుదారిని చేరుకొన్నట్లయితే జపానువారు దక్షిణంగాతిరిగి తూర్పు బెంగాలుకి తక్కిన దేశంతో సంబంధంలేకుండా చేయగలిగిఉండేవారు. దాని ఫలితంగా కలిగిన అల్లకల్లోలాన్ని అవకాశంగా తీసుకొని కలకత్తామీదికూడా ఉరికేవారు.

బ్రిటిష్ రెండవసేనా, భారతీయ ఏడవపటాలమూ కోహిమావద్ద నిలబడి తీవ్రంగా ప్రతిఘటించడంవల్లనే ఆఘోరవిపత్తు తొలగిపోయింది. బర్మాలోగాని, ఆగ్నేయ ఆసియాలోగాని, మరేరంగంలోనూ జరుగనంతటి తీవ్రయుద్ధాలు ఆ రంగంలో జరిగాయి. బ్రిటిష్ రెండవసేనా, భారతీయ ఏడవపటాలమూ చాల నష్టంపొందాయి; అంతకన్నా ఎక్కువనష్టం శత్రుమూకలకు కలిగించాయి. ఈవిషయాలు ఈనాడు అందరికీ తెలిసినవే.

2. అలాంటి పరిస్థితుల్లో మన ప్రజలస్థితి ఎంతో శోచనీయంగా ఉంది. తమ హింసాకాండతో బ్రిటిష్ ప్రభుత్వం ప్రజల్లో తీవ్రద్వేషాన్ని రెచ్చగొట్టింది. మరోవైపు ఆర్థికదుస్థితి వారిలో నిస్పృహను వ్యాపింపజేసింది. ఇంకోవైపు ఎటుచూచినా ఉద్యోగుల అవినీతి. దొంగవ్యాపారుల దురాగతాలే! ఈ పరిస్థితుల్లో ఏది ఎలాగైతేనేం - ఇంతకన్నా చెడేదేదీ లేదనే ధోరణిలో పడ్డారు ప్రజలు.

కాంగ్రెసునాయకుల్లోనూ, వర్కర్లలోను ఎక్కువమంది జైళ్ళలో ఉన్నారు. బయట ఉన్న కొద్దిమందీ నిస్తబ్ధులయారు.

కొత్త ప్రమాదపరిస్థితుల్ని, ఈ గ్రూపులు అవలంబించిన కొత్త దృక్పథాలు, నినాదాలను మేము శ్రద్ధగా, దీర్ఘంగా చర్చించి, ఒక ముఖ్యమైన నిర్ణయానికి వచ్చాము. మిలిటరీరీత్యా, రాజకీయంగా, ఆర్థికంగా ఆనాడేర్పడిన పరిస్థితుల్లో జపాను అనుకూలవిధానాన్నవలంబించి, విధ్వంసక కార్యక్రమాలను ప్రోత్సహించే ఏ వ్యక్తినీ, ఏగ్రూపునూకూడా ఇక నేమాత్రం దేశభక్తులని పిలవడానికి వీల్లేదనీ, ప్రపంచంలో ఇతర దేశాల్లోలాగానే మనదేశంలోకూడా వారిని పంచమాంగదళమనే పిలవాలనీ నిశ్చయించుకొన్నాం.

విధ్వంసక కార్యక్రమాన్నరికట్టాలని మేము కార్యక్రమమిచ్చాం. 'దేశరక్షణ కోసం జాతీయప్రభుత్వాన్ని సాధించగల జాతీయైక్యతను నిర్మించాలి' అనే ప్రధాన నినాదాన్నిచ్చాము. కాంగ్రెసు సోషలిష్టుపార్టీ, ఫార్వర్డుబ్లాకూ పంచమాంగదళశాఖలన్నాం; జపాను ఫాసిస్టుశత్రువుల ఏజంటులన్నాంకూడా. ఆగస్టు 9 వెనువెంటనే ఏర్పడిన పరిస్థితుల్లో, వీరు అహింసావిధానాన్ని మూలసూత్రంగా గుర్తించి, స్వాతంత్ర్య విప్లవానికి ప్రజాసామాన్యాన్ని సమీకరించబోయారు, కాని, ఆనాడు వీరిని 'గ్రుడ్డి దేశభక్తుల'ని మాత్రమే విమర్శించాం.

మరికొద్దిరోజులకే వీరు బాహాటంగా విధ్వంసక కార్యక్రమాన్నిచ్చారు; దేశంలో విధ్వంసక చర్యలు జరుగ నారంభించాయి. అప్పుడు వీరిని 'పొరపాటుపడుతూన్న దేశభక్తుల'ని పేర్కొన్నాం. ఆరోజుల్లో

వారిఉద్దేల్లు మంచివే అని మాకుతెలుసు. వారు బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేకులనీ, అప్పటికింకా జపాను అనుకూల ధోరణికి రాలేదనీ మేమెరుగుదుము. కాబట్టే మేమలా పేర్కొన్నాం. వ్యక్తిగతంగా, మా పత్రికల ద్వారా వారు తమపొరపాటును గుర్తించేలా చేయడానికి ప్రయత్నించాం. విధ్వంసకచర్యలు స్వాతంత్ర్యాన్ని ఎంతమాత్రం చేకూర్చవు సరికదా. జపాను ఫాసిస్టుపిశాచాన్ని తెచ్చిపెడతాయని ప్రజల్లో ప్రచారంచేశాం.

పంచమాంగదళమని ఎందుకన్నాం

ఆతరువాత, దేశాన్నెదుర్కొన్న ప్రమాదం అతిశయించిన దశలో వీరు స్పష్టంగా జపాను అనుకూలప్రచారం చేయనారంభించారు- జపానుమూకల్ని ప్రతిఘటించడానికి కాకుండా వారికి తోడ్పడడం కోసం విధ్వంసక చర్యలకు, గెరిల్లా పోరాటాలను చక్కగా నడపడానికి తమఅనుచరులను తరిఫీదు చేయనారంభించారు. ఆపరిస్థితుల్లో వారిని పంచమాంగదళమని బట్టబయలు చేయడానికి నిర్ణయించుకున్నాం.

సామ్రాజ్యవాద వ్యతిరేకత్వంనుండి, వారు ఫాసిస్టు సామ్రాజ్యవాద అనుకూలత్వానికి పతనమయారు. బ్రిటిష్‌వారిపై కక్షకొద్దీ వారు జపాను సామ్రాజ్యవాదులతో పొత్తుకలిపారు.

సోదర ప్రజల్లో వారివిశ్వాసం అంతరించింది. ఫాసిస్టు సామ్రాజ్యవాదులపై నమ్మకం అతిశయించింది.

వెనుకటిదశలో విధ్వంసకచర్యలు బ్రిటిష్ సామ్రాజ్యవాదులమీద దెబ్బతీయడానికే అని వారు ప్రజలతో చెబుతూవచ్చారు. జపానువారిని గురించి మాత్రం పల్లెత్తు మాటాడలేదు. కాని నూతనపరిస్థితుల్లో. అటు ముంచుకువస్తున్న జపాను దండయాత్రకు సహాయకరంగా ఇటు విధ్వంసక చర్యలను సాగింపజూచారు.

ఈ విధంగా మేమాలోచించాం: ఇతరులతో వాదించిందికూడా యీవిధంగానే. మా పరిశీలన సరియైనదని గట్టిగా నమ్మాం. మా పార్టీ ఆవిధంగా నిర్ణయించిందనేకాదు ఈ నమ్మకం; కాంగ్రెసుయొక్క ఫాసిస్టు

వ్యతిరేకపంథాకు వీరు పూర్తిగా భిన్నంగా పోతున్నారని నిత్యానుభవంలో చూచాముకాబట్టే ఆ నమ్మకం కలిగింది. జపానువారువస్తే మీరేమిచేయ దలచుకున్నారో మీలో కొందరు స్పష్టంగా ప్రకటించారు. ఆ ప్రకటనలను గుర్తుకు తెచ్చుకున్నాం. మే మవలంభించిన వైఖరి సరియైనదే అన్న నమ్మకం మరింత బలపడింది.

క్రిప్సు రాయబారం విఫలమయిన తరువాత ఒక పత్రికా ప్రతినిధుల సమావేశంలో నెహ్రూ పండితుడు మాట్లాడాడు. బోసు కార్యక్రమం ఆచరణలోకివస్తే తప్పకుండా ప్రతిఘటించటమే కాంగ్రెసు విధానమని ఆయన స్పష్టపరిచారు. వారిలా అన్నారు:

"ఆయన అవలంబించినది తప్పుమార్గం. దానిని ప్రతిఘటించాలి. ఈనాడు బయటనుంచి వచ్చే ఏ సేన అయినా జపానుచేతిలో కీలుబొమ్మగానే వస్తుంది. అది శత్రువులకే తోడ్పడుతుంది...."

(బొంబాయి క్రానికల్ - 1942 ఏప్రిల్ 13.)

ఈ పంచమాంగదళానికి పెద్ద ప్రాముఖ్యత ఏమీ లేదన్నమాట నిజమే. వారుచేసిందికూడా ఏమీలేదు. స్వంతంగా యేమీచేయలేనివారు కాబట్టే వారు జపాను దండయాత్రకోసం ఎదురుచూడ నారంభించారు.

ఒకవైపు జపాను దండయాత్ర ముంచుకొస్తున్న రోజులవి. మరోవైపు ప్రజల్లో మనోనిబ్బరం అధ్వాన్నంగాఉంది. ఆ పరిస్థితుల్లో జపాను అనుకూల భావాలూ, కార్యక్రమమూ దేశానికి ద్రోహకరములనీ మన జాతీయోద్యమం నిర్మించిన సంప్రదాయాలకు గొడ్డలిపెట్టనీ తూర్పారబట్టడం మా విధి అని నిశ్చయించుకున్నాం.

వారి పంచమాంగదళ భావాలు రాజకీయ వర్కర్లలో వ్యాపించకుండా మా పత్రికలద్వారా ప్రతిఘటించాం. అపాయ ప్రదేశాల్లోని ప్రజల్లోకి చొచ్చుకుపోకుండా ప్రజా ఉద్యమాలద్వారా కృషిచేశాం.

'పీపుల్సువార్'లో ఈ 'పంచమాంగదళం' అనే ఒక్కమాటను మినహాయించి మిగతా వాటినంతటినీ మెచ్చుకునే కాంగ్రెసువాదులు వందలకొద్దీ ఉన్నారు. పాతప్రపంచపు మతవాదులుగానో, లేక నెహ్రూవాదులు

గానో వీరిని చూచేవాళ్ళం. పరిస్థితుల పోకడనుగుర్తించి వీరే మాతో ఇలా అన్నారు.

"వాళ్ళనుగురించి వీరన్నది నిజం. వారుచెబుతున్నది కాంగ్రెసు విధానం కాదు, వారు భ్రుతిమించి పోతున్నారు. కాని వారి ఉద్దేశాలు దేశభక్తి పూరితాలే. వాళ్ళనుగురించి అట్టే గాబరాపడకండి: యుద్ధరంగం వెనుక వారు చేయగలిగిందేమీలేదు.

వీరితో మేమిలా వాదించేవారం.

1. దేశభక్తులైన యువకులు, వాళ్ళరాతలను ఎంతోకుతూహలంతో చదువుతున్నారు. ఈ యువకులకు ఇదివరకు రాజకీయఅనుభవం లేదు. యుద్ధానికిపూర్వం ఈ యువకులు వట్టి బాలురుగా ఉండేవారు యుద్ధకాలంలోనే వీరిలో రాజకీయచైతన్యం అంకురించింది. అంతకు పూర్వం కాంగ్రెసు వెలిబుచ్చిన ఫాసిస్టువ్యతిరేకభావాలను వీరేమాత్రం అవగాహన చేసుకోలేదు, బ్రిటిష్‌వారిపై ద్వేషంకొద్దీ వీరిలో జపాను అనుకూలభావాలు అప్పుడే అస్పష్టంగా ఏర్పడుతున్నాయి. దేశం బానిసగానే పడిఉండడం, మీరు జైళ్ళలోమ్రగ్గడం, బ్రిటిష్‌పాలకుల అవకతవకలకు గురిఅయి ప్రజలమందరం నానాబాధలను పడడం. ఈ ద్వేషాన్ని నానాటికి అతిశయింపజేస్తూవచ్చింది. అలాంటి యువకులు వీరు. ఇలాంటి వారికీ కాంగ్రెసుసోషలిస్టు నాయకులు తమ విజ్ఞప్తులన్నీ ప్రత్యేకంగా అందజేస్తున్నారు. అలాంటప్పుడు వాళ్ళ దేశద్రోహకరభావాలను తూర్పారబట్టకపోతే, ఈయువకులు మరింతఅధ్వానస్థితికి దిగజారేలాచేసినవారమవుతాం.

2. ఈ పంచమాంగదళానికీనాడు ప్రాముఖ్యం లేకపోవచ్చు. కాని. రేపు జపానుదండయాత్ర ప్రారంభమయినప్పుడు [illegible] బయటపడక తప్పదు.

కాబట్టి ముందుగానే జాగ్రత్తపడి, వీరిని తక్షణం బట్టబయలు చేయాలి.

ఈపరిస్థితుల్లో తటస్థవైఖరికి అవకాశంలేదు. తాటస్థ్యం వారికే తోడ్పడుతుంది. దేశభక్తులయిన యువకులను పాడుచేయడానికే. జపాను వారు వచ్చి భారతస్వాతంత్ర్యం కోసం కృషిచేసి ప్రతివాడినీ చిత్రవధ చేయడానికే ఆతటస్థవైఖరి తోడ్పడుతుంది.

X

గాంధీజీ ఉపవాసం తదనంతరం

ఆగస్టు వెల్లువలోపడి మేము కొట్టుకుపోలేదు. మొదట కొద్ది రోజులు మాత్రమే ఊగిసలాడాము. ఆపొంగు ఎంత హటాత్తుగాలేచిందో అంత అకస్మాత్తుగా అణగారింది. గడచిపోయిన విషయాలను గురించి వ్యాఖ్యానాలుచేస్తూ, జరుగబొయేవాటిని గురించి కలలు కంటూ, అక్కడక్కడ కొన్నిగ్రూపులు మాత్రం మిగిలిపోయాయి. కాంగ్రెసు సాధారణ సభ్యులందరూ అయోమయావస్థలో మునిగారు. దేశంయొక్క దీనావస్థను తొలగించే మార్గం తెలియక అలమటించారు.

ఇలాంటి పరిస్థితుల్లో 1943 ఫిబ్రవరి 9 తేదీని గాంధీగారు ఉపవాసం ప్రారంభించాడు. ఆగస్టు ఆరెస్టులు కాంగ్రెసువాదుల్లో ఎంత సంచలనం కలిగించాయో, ఈ ఉపవాసంకూడా అంత సంచలనం కలిగించింది. కాని ఈసారి ప్రజావెల్లువ ఏమీరాలేదు. దానికి బదులు నిస్పృహావస్థ కాంగ్రెసువాదుల్లో అంతటా అలముకుంది. గాంధీజీని తక్షణమే విడుదల చేయవలసిందని మేమప్పుడు తీవ్రమైన ఆందోళనచేశాం. ఆసందర్భంలో వేలకొద్దీ కాంగ్రెసువాదుల్నికలుసుకున్నాం.నాయకుడిని విడిపించుకోగల శక్తిఅయినా దేశానికిలేదని దిగులుపడ్డారు. అది తమకేదో వ్యక్తిగతమయిన అవమానమన్నట్లు మాట్లాడారు. ఆనాటిపరిస్థితులు మాకేఎంతో దుఃఖంకలిగించాయి. కాని మేము మూలపడలేదు. విధివిరామం లేకుండా ప్రజల్లోకివెళ్లి ప్రచారం చేశాం. ప్రజలపై నమ్మకాన్ని ఎప్పుడూ పోగొట్టుకోవద్దనీ, దేశానికి మోక్షంలేదనే నిస్పృహ కేపరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదనీ మా పార్టీ మాకు నూరిపోసింది.

'గాంధీ చస్తే చావనీయండి; నేనుమాత్రం విడుదలచేయన, నిఅహంకారంకొద్దీ లిన్‌లిత్గో అన్నమాటలు సాధారణ కాంగ్రెసువాదుల్ని దిగ్భ్రాంతుల్నిచేశాయి. ఆగస్టుతీర్మానాన్నిగురించి, ఆ తరువాత జరిగిన ఘటనలను గురించి గాంధీజీ తెలిపిన అభిప్రాయాలు దేశాన్నంతటినీ ఆలోచనలో ముంచాయి. గాంధీ వైస్రాయి లేఖలు కాంగ్రెసువాదుల్లోఉన్న అయోమయావస్థనుపోగొట్టి, చాలవరకువారి భావాలనొకతీరుకు తెచ్చాయి.

ఆరోజుల్లో తగాదాఅంతా మాకూ, కాంగ్రెసుసోషలిస్టుపార్టీ, ఫార్వర్డుబ్లాకులు, వాటి ననుసరించే కాంగ్రెసువాదులకూ మధ్యనే అని తెలిపాం. ఆనాడు బయలుదేరిన సమస్యలనుగురించీ, జరిగిన ఘటనలను గురించీ, కాంగ్రెసు అధికార నిర్ణయం ఏమిటో తెలియక కాంగ్రెసువాదులందరూ అవస్థపడ్డారు. కాని, కాంగ్రెసు సోషలిస్టులు మొదలైనవారు ప్రచారంచేస్తున్నది కాంగ్రెసువిధానం ఎంతమాత్రం కాజాలదని క్రమక్రమంగా గుర్తించసాగారు. తాముగుర్తించినదానిని బహిరంగంగాచెప్పక. గుసగుసల్లోనే దాచిపెట్టారు.

మమ్మల్నిగురించి మీ రిపోర్టునుచూచినట్లయితే గాంధీ - వైస్రాయి ఉత్తరప్రత్యుత్తరాలు జరగనే లేదా అనిపిస్తుంది. కాని మీ ఆగస్టువిధానాన్ని అమలు జరపడానికి గాంధీజీని ఏకైకనాయకుడినిచేసింది మీరే. దానిని వ్యాఖ్యానించగల అధికారాన్ని వారికిచ్చిందికూడా మీరే. అందువల్లనే మీ రిపోర్టులో పేర్కొన్నసమస్యలపై వైస్రాయికిరాసిన జాబుల్లో గాంధీజీ తెలిపిన అభిప్రాయాలను ఉదహరిస్తున్నాం.

ఆగస్టు ఉద్యమాన్ని గురించి గాంధీజీ అభిప్రాయాన్ని ఈక్రింద ఇస్తాం. మాకూ మా వ్యతిరేకులకూ వివాద కారణమైన సమస్యలను గురించికూడా వారు వ్యాఖ్యానించారు. వాటినీ ఉదహరిస్తాం. ఎందువల్లనంటే, ఆ విషయాల్లో మా వ్యతిరేకుల వాదనలనే ప్రత్యక్షంగానో పరోక్షంగానో మీరుకూడా ఉపయోగిస్తున్నారు.

ఆగస్టు ఘటనలను గురించి మేమన్నది, గాంధీగారన్నది ఇవిగో—

ఎవరు బాధ్యులు ?

కమ్యూనిస్టులం చెప్పింది

1942 ఆగస్టు 9 న. మీ రరెస్టయిన కొద్ది గంటలకు పి. సి. జోషీ ఒక పత్రికా ప్రకటనలో ఇలా అన్నారు.

"దురహంకారులైన సామ్రాజ్యవాదులు మొదటి దెబ్బతీశారు. రాయబారాలకు కాంగ్రెసు సంసిద్ధతను తెలిపింది. దానికిజవాబుగ ప్రభుత్వం జాతీయ నాయకుల్ని అరెస్టుచేసింది. అంతేకాదు. ప్రభుత్వం ప్రజలను రెచ్చగొట్టింది. అరాజక పరిస్థితులను తెచ్చిపెట్టింది, దుర్మధాంధత్వంతో జాతీయ విద్రోహకర, కాంగ్రెసు వ్యతిరేక సంఘటనను నిర్మింపజూస్తుంది......"

గాంధీగారన్నది

ఆగస్టు అరెస్టులయిన తరువాత అయిదు రోజులకు 1942 ఆగష్టు 14 వ తేదీన గాంధీజీ వైశ్రాయికి జాబురాస్తూ ఇలా అన్నారు:

"ఈ విధంగా ప్రతిష్టంభననుతెచ్చిపెట్టడంలో ఇండియా ప్రభుత్వం తప్పుచేసింది....తొందరపడి నేను పోరాటం ప్రారంభించ దలచుకోలేదని ఏ. ఐ. సి. సి. సమావేశంలో నేను చేసిన ఉపన్యాసాలనుబట్టి మీరు తెలుసుకోగలరు. తీర్మానం చేయడానికి, పోరాటం ప్రారంభించడానికి మధ్య మేమిచ్చిన వ్యవధిని మీరు పుపయోగించుకొని, కాంగ్రెసు కోరికను తీర్చడానికి ప్రయత్నించి ఉండవలసింది."

స్వాతంత్ర్య విప్లవమా ? లేక జాతీయ ప్రతిష్టంభనా ?

ప్రభుత్వ విధానం మన దేశాన్నొక నరక కూపంలో తోసేస్తుంది, దారుణనిర్బంధాలు; వాటిని సహించలేక తీవ్రమైనసమ్మెలు చెలరేగుతాయి. జాతీయోద్యమాన్ని అణగద్రొక్కాలనుకోవడం, దేశభక్తితో కూడుకున్న బ్రిటిష్ వ్యతిరేకతను విరాశావాదంగా

మార్చి ఫాసిస్టు అనుకూలధోరణికి దారితీయగలదు. దేశరక్షణ కోసం అంటూనే, ఆ దేశరక్షణకు ఆధారంగా ఉండగల శక్తులపై ప్రభుత్వం దెబ్బతీస్తూంది. ప్రభుత్వ విధానమే గాని కొనసాగినట్లయితే, ఇండియా మరొక బర్మా అవకతప్పదు."

(ఆగస్టు 9 న జోషీ చేసిన పత్రికా ప్రకటన)

"కాంగ్రెసు కోరికను అంగీకరిస్తే ఇండియా అల్లకల్లోల మయిపోతుందనడం, మానవకోటిలోఎవ్వరు నమ్మలేని విషయం. ఏది ఎలాగున్నా ఆ కోరిక నిలా పూర్తిగా తృణీకరించడం దేశాన్ని, ప్రభుత్వాన్ని అయోమయావస్థలో పడద్రోసింది. మిత్ర మండలిపక్షం చేరడానికి కాంగ్రెసు శాయశక్తులా ప్రయత్నిస్తూ వచ్చింది."

(1942 ఆగస్టు 14 న గాంధీజీ వైస్రాయికి రాసిన జాబు)

ప్రభుత్వం ఎందుకు దెబ్బతీసింది ?

1942 ఆగస్టు 16 వ తేదీ 'పీపుల్సువార్' సంపాదకీయం చాల ముఖ్యమయినది. కమ్యూనిస్టు పార్టీ పాలసీ, కార్యక్రమాల నందులో వివరించారు. ప్రభుత్వాన్ని ఖండిస్తూ అందులో ఇలా రాశాం:

"సామ్రాజ్యవాద దురహంకారంతో వీరు పిచ్చెత్తిపోతున్నారు. మన మాతృదేశాన్ని తమ గుప్పిట్లోనే పెట్టుకోవాలనే దురాశను వీరు వదులుకో లేకుంటున్నారు. అందువల్ల మన జాతీయశక్తుల్ని నాశనం చేయడానికి వీరు ఎగబడుతున్నారు. భారతదేశానికి వారు మేలుచేయడం లేదు ; చిత్రవధ

పైన ఉదహరించిన జాబులోనే గాంధీజీ ఇలా రాశారు :

" మిత్రమండలి ఆశయంతో కాంగ్రెసు ఏకీభవించింది, ఈవిధంగా సమాన ఆశయాన్ని ప్రకటించినా లక్ష్యంచేయక ప్రభుత్వం నిర్బంధ విధానానికి పూనుకుంది. దీనినిబట్టి మిత్రమండలి ఆశయం కన్నా, భారతదేశాన్ని తమ అధీనంలో ఉంచుకోవడమే బ్రిటిష్ ప్రభుత్వానికి ప్రధానమయిందని స్పష్టమవుతుంది. ఈ ఉద్దేశంతోనే వారు కాం

చేస్తున్నారు. మిత్రరాజ్య ఆశయాలను వారు బలపరచడంలేదు; భగ్న చేస్తున్నారు."

గ్రెసు కోరికను తృణీకరించారు; నిర్బంధాన్ని ప్రారంభించారు."

దేశభక్తియుత ఆవేశమా? లేక అహింసాయుత విప్లవమా?

పై సంపాదకీయంలోనే ఇలా రాశాం:

సామ్రాజ్యవాద ప్రభుత్వం ప్రారంభించిన హింసాకాండ దేశంలో చిచ్చురగిల్చింది. ప్రజల్లోఉన్న ఆగ్రహాన్ని,అసంతృప్తిని రెచ్చగొట్టి వారు తీవ్రచర్యలకు పూనుకొనేలా చేయడం - ఆపైని లాఠీలు, తుపాకులు, విషవాయువులు విచ్చలవిడిగా ఉపయోగించడం - ఇదీ సామ్రాజ్యవాద ప్రభుత్వపు పన్నాగం. ప్రభుత్వానికిది ఆత్మవినాశకర పంథా. ఒకవైపు ఫాసిస్టు దండయాత్ర ముంచుకురానున్న సమయంలో కూడా దేశాన్ని నిస్తబ్దంచేసి, నిర్వీర్యంగా అణచి వుంచాలనే సామ్రాజ్యవాద దుష్ఫలితం ఇది."

1942 సెప్టెంబరు 23 వ తేదీని ఇండియాప్రభుత్వ హోమ్ సెక్రటరీకి జాబురాస్తూ గాంధీజీ ఇలా అన్నారు:

"కాంగ్రెసు నాయకుల నందరినీ అరెస్టు చేయడంతో ప్రజలు కోపోద్రేకులై, ఆత్మనిగ్రహణ కోల్పోయినట్లున్నారు. దేశంలో జరిగిన విధ్వంసానికి బాధ్యత ప్రభుత్వానిదేగాని, కాంగ్రెసు దెంతమాత్రంకాదని నా అభిప్రాయము."

ప్రజలు కోరవలసిందేమిటి?

ఆగస్టు 9వ తేదీన చేసిన పత్రికా ప్రకటనలో పి.సి. జోషి ఇలా అన్నారు:

పై నుదహరించిన జాబులోనే గాంధీజీ ఇలా అన్నారు:

".... కాంగ్రెసు నాయకులను వెంటనే విడుదలచేసి, భారత జాతీయ వాంఛను నెరవేర్చడానికి రాయబారాలు ప్రారంభించవలసిందని, ముక్తకంఠంతో కోరుతున్నాం. భారత ప్రజల శ్రేయస్సుకోసమే కాదు, మిత్రరాజ్య ప్రజలందరి శ్రేయస్సుకోసం ఇది ప్రధానమని కోరుతున్నాం. ఈ విషయంలో ఎంతకాలం వృధా అవుతే ఫాసిస్టు దురాక్రమణదారుల కంత ఎక్కువ ప్రయోజనం."

"ఈపరిస్థితిలో ప్రభుత్వం చేయదగిన సవ్యమైన పనేమిటంటే - కాంగ్రెసు నాయకులను విడుదల చేయాలి; నిర్బంధ శాసనాలన్నిటిని ఉపసంహరించుకోవాలి; కాంగ్రెసు వాంఛను నెరవేర్చగల మార్గాలనాలోచించాలి. రహస్యంగా ఏదైనా దౌర్జన్యం జరిగే సూచనలుంటే, దానినెదుర్కొనగల శక్తిసామర్థ్యాలు ప్రభుత్వానికున్నాయి. నిర్బంధవిధానంవల్ల కలిగేది అసంతృప్తి పెచ్చుపెరగడం; ద్వేషం అతిశయించడం మాత్రమే."

అది గాంధీగారి సహజధోరణి. 'నాయకులను విడుదలచేయడం మంచిద'నో, లేక వారిపై సక్రమంగా విచారణజరపడం బాగుంటుందనో సూచించడానికి మేము మతవాదులం కాము. మాదృష్టిలో బ్రిటిష్‌వారు న్యాయభిక్ష పెట్టవలసిన ధర్మమూర్తులుకారు. కాంగ్రెసునాయకులైన మీపై దురాగతానికి ఒడిగట్టిన అక్రమదారులు వారు. అంతేకాదు. స్వతంత్ర రాజ్యంగా, ప్రపంచంలోని స్వాతంత్ర్యశక్తులతో భుజం భుజం కలిపి ఫాసిజాన్ని ప్రతిఘటించగల అవకాశం మాకివ్వండని భారతీయులు కోరిన న్యాయమైన కోర్కెను కాలదన్నారు. మీ ఆశయాన్ని న్యాయమైన ఆశయంగా గుర్తించాము: దానితో ఏకీభవించాము. మనందరికీ సమానమైన ఈ ఆశయసిద్ధికి నాయకత్వం వహించవలసింది మీరే అని నమ్మాము. అందువల్లనే, మిమ్మల్ని బేషరతుగా విడుదలచేయాలని అడిగాము. ఇండియా, బ్రిటిష్ ప్రజలక్షేమంకోసమే కాకుండా, ప్రపంచ ప్రజల శ్రేయస్సునాలోచించి. భారతసమస్యను పరిష్కరించడానికి వెంటనే రాయబారాలు ప్రారంభించాలని కోరాము.

కాంగ్రెసులో సుస్థిరమైన సిద్ధాంతాల ననుసరించి నడచుకుంటూ, ఏపరిస్థితుల్లోనూ వాటికి భిన్నంగాపోకుండా ఉండేది గాంధిగారూ- కమ్యూనిస్టులే అని అంటే అందరూ అంగీకరిస్తారని నమ్ముతున్నాం. దీనివల్ల ఒక్కొక్కప్పుడు సోదర కాంగ్రెస్ వాదులందరికీ దూరమవడంకూడా తటస్థించేది.

వెనుకటిరోజుల్లోనూ, ఇటీవలకూడా, కొన్నికొన్ని సమస్యలపై గాంధీజీకీ మాకూ చాల తీవ్రమైన భేదాభిప్రాయాలు కలిగాయి.

గాధీంజీ సిద్ధాంతాలు—ఆచరణ

గాంధీజీ కార్యక్రమాలకు చుక్కాని వారి అహింసా సిద్ధాంతం. ఆచరణలో పొందిన అనుభవాలనుబట్టి వారు తన పంథాను నిర్ణయిస్తుంటారు. 1941 డిసెంబరులో మీరు విడుదలయిన నాటినుండి 1942 లో ఆగస్టు తీర్మానం జరిగినంతవరకు గల దశలో యుద్ధంపట్ల వారు తటస్థ విధానాన్ని అవలంబించింది ఈఅహింసాసిద్ధాంతాన్ని అనుసరించే. కాని ఈ విధానం ఆచరణలో జపాను అనుకూలధోరణికి దారి తీస్తుందని నెహ్రూ పండితుడూ, ప్రపంచంలోని అభివృద్ధికాముకులూ ఏకగ్రీవంగా ఖండించారు. దానితో వారు తప్పుకొని యుద్ధంపట్ల కాంగ్రెసువైఖరిని నిర్ణయించే పనిని నెహ్రూపండితునికి వప్పగించారు.

కాని తన తటస్థ విధానంపట్ల పొందిన అనుభవానికిందులో స్థానముండాలని పట్టుపట్టారు, అదే, పోరాటం అనే బెదరింపు, నెహ్రూపండితుడు నిర్ణయించే పంథా నిష్ప్రయోజన మయినపక్షంలో — అంటే జాతీయ ప్రభుత్వ స్థాపనకు బ్రిటిష్‌వారు అంగీకరించక పోయినట్లయితే పోరాటం ప్రారంభిస్తామనే బెదరింపు ఉండాలని గాంధీజీ పట్టుపట్టారు.

ఆవిధంగానే ఆగస్టు తీర్మానం తయారయింది. తదనంతరం జరిగిన ఘటనలను గాంధీజీ గమనించారు. తాను సూచించిన బెదరింపుయొక్క ప్రత్యక్ష ఫలితాలు తన మూలసూత్రమయిన అహింసాసిద్ధాంతానికే ఎలా భిన్నంగా పరిణమించాయో గుర్తించారు. ఆగస్టు 8 కి పూర్వం తాను

వేసుకున్న ప్లానులన్నీ ఎలా తలక్రిందులయాయో చూచారు. ఈ ఘటనలకు తన బాధ్యత ఏమీ లేదని నిష్కల్మష హృదయంతో వెంటనే స్పష్టపరిచారు.

గాంధీజీ ఆచరణనుబట్టి తన సిద్ధాంతాన్ని పరీక్షిస్తుంటారు. తన అహింసామార్గం తటస్థ విధానానికి దారితీసింది. ఆచరణలోకి వచ్చేసరికి నెహ్రూపండితుడూ, ప్రపంచంలోని అభివృద్ధికరశక్తులూ తన తప్పును సవరించడానికి మాటల్లో ఒప్పుకున్నారు. తిరిగి తన సిద్ధాంతాన్ననుసరించే బెదరింపు సూచన చేశారు, తత్ఫలితంగా జరిగిన ఘటనలు తా ననుకొన్న దానికే ఎదురు తిరిగేసరికి మళ్లా పొరపాటును దిద్దుకొన్నారు. ఆ ఘటనలకు కాంగ్రెసు బాధ్యత ఏమాత్రమూ లేదని స్పష్టపరిచారు. తనపై విషప్రచారం చేసిన సామ్రాజ్యవాదుల్ని ఖండించారు.

తనసిద్ధాంతం విషయంలో విపరీతమైన పట్టుదల: ఆచరణలోదాని ఫలితాలను, చిత్తశుద్ధితో పరిశీలించడం—ఇవీ గాంధీగారి లక్షణాలు. ఈ విధంగానేవారు, సత్యవ్రతాన్ననుసరించి, ఆయాపరిస్థితుల్లో తనస్థానాన్ని నిర్ణయించుకుంటూవచ్చారు. వాస్తవికజగత్తుకు తన అస్పష్ట అహింసావిధానాన్ని అన్వయింపబోయేసరికి తప్పుదారులు త్రొక్కవలసివచ్చింది. కాని కళ్లుమూసుకొని ఆ తప్పుదారిలోపడి కొట్టుకుపోకుండా, తన అహింసా సిద్ధాంతాన్నే గీటురాయిగా తీసుకొని ఈ ఫలితాలను పరిశీలించి, క్రమక్రమంగా తనతప్పును దిద్దుకోవడం గాంధీగారిపద్ధతి.

అంతమానసికశక్తీ, అంత సత్యసంధత్వమూ, మహాపురుషులకే సాధ్యము. సరియయిన నిర్ణయానికి గాంధీజీ ఏయేపద్ధతుల్లో వస్తారనేది మాకప్రధానము. వారానిర్ణయానికి రావడమేమాకు కావలసింది. అందువల్లనే ఆగస్టు తీర్మానంలోని మొదటిభాగంతో వారేకీభవించినందుకెంతో సంతోషించాము. కాని, ఆ రెండవభాగానికివారు నెహ్రూపండితుని చేతకూడా ఒప్పించినందుకు ఆందోళనచెందాము. కాని, ఈ రెండవభాగం ఎక్కడికి దారితీసిందో స్పష్టంగాగుర్తించి, ఆదుష్ఫలితాలకు తనకూ, కాంగ్రెసు ఏమీ బాధ్యతలేదని చెప్పినందుకు తిరిగిసంతోషించాం.

ఇక మా సంగతి.

మా సిద్ధాంతం కమ్యూనిజం. మానవజీవితాన్ని నడుపుతూన్న నియమాలను అర్థంచేసుకోగల శాస్త్రీయదృష్టిని మాకి కమ్యూనిస్టు సూత్రాలే ప్రసాదిస్తున్నాయి. మన క్షేమంకోసమూ, ప్రపంచప్రజల శ్రేయస్సుకోసమూ, జీవనవిధానాన్ని మార్చగల పద్ధతులను ఈ సిద్ధాంతాన్నిబట్టే నిర్ణయించుకోగలుగుతున్నా ఈ సిద్ధాంతాన్నిబట్టే మేమానాటిపరిస్థితులను పరిశీలించాం. పరిశీలించి, దేశరక్షణఅప్పటి ప్రధానకర్తవ్యమనే నిర్ణయానికి వచ్చాం. ఈ రక్షణకు భంగంకలిగించే ప్రతివిషయమూ మనతోపాటు ప్రపంచప్రజలందరియొక్క జీవితానికీ, స్వాతంత్ర్యానికీ భంగంకలిగిస్తుందని గ్రహించాం. దేశరక్షణను మనప్రజల అధీనంలోకి తేగల ప్రతిమార్గమూ (జాతీయప్రభుత్వాన్ని స్థాపించడం, భారతదేశ విముక్తినిచేకూర్చడమే కాకుండా ప్రపంచ స్వాతంత్ర్యసమరంలో తగినపాత్రను నిర్వహించగల అవకాశాన్ని మనకు కలిగిస్తుందని కమ్యూనిస్టుసూత్రాలవల్లనే మాకు స్పష్టమయింది.

ఈవిధంగా 'దేశరక్షణ' అనే గీటురాయినిబట్టే ఆనాటి వివిధ పక్షాలనూ, విధానాలను పరిశీలించాం. ఆగస్టు తీర్మానంలోని పరస్పర వైరుధ్యాన్ని గమనించాం; ఆ తీర్మానంలోని రెండవభాగం ఎటు దారితీస్తుందో చూడగలిగాం.

ఆతీర్మానం తరువాత జరిగిన ఆగస్టు ఘటనలనుకూడా ఈవిధంగానే పరిశీలించాం. అందువల్లనే అప్పటి వెల్లువలోబడి కొట్టుకుపోకుండా నిలబడగలిగాం. మాతృదేశంపట్ల మా విద్యుక్తధర్మాన్ని నెరవేర్చడానికి కృషి చేయగలిగాం; కాంగ్రెసు అడిగినవాటికీ, ఆశించినవాటికీ, ఆనాడు దాని పేరిట జరుగుతున్నదంతా ఎలావిరుద్ధమో కాంగ్రెసువాదులకు వివరించగలిగాం.

గాంధీజీ ఆశయమూ మా ఆశయమూ ఒకటే; సత్యంపట్ల ఇరువురికీ సమాన గౌరవం ఉంది. అందువల్లనే సిద్ధాంతాలు విభిన్నమయినవే అయినప్పటికీ వారూ మేమూ ఒకేలాంటి నిర్ణయాలకు రాగలిగాం. జైళ్ళలోనుంచి గాంధీగారు వైస్రాయికి రాసిన వాటికీ, బయట మేము ప్రజల్లో ప్రచారం చేసిన వాటికీ గమనించతగిన ఏకీభావం ఎంతో ఉంది.

వెంటనే సాధించవలసిన ఆశయమొకటే అయినప్పుడు, పరిస్థితులను వాస్తవిక దృష్టితో పరిశీలించగల ధైర్యం ఉన్నప్పుడు నిర్ణయాలు కూడా ఒకేలాంటివవుతాయి. సిద్ధాంతాల్లో విభేదాలు అడ్డురావు.

గాంధీవాదులకు కాంగ్రెసు సోషలిస్టులకు మధ్య చీలిక

కాంగ్రెసువాదుల్లో మా సారస్వతాన్ని చదివినవారూ, మా ఉపన్యాసాలను విన్నవారూ, "మొదటినుంచీ కమ్యూనిస్టు లంటున్నదాన్నే గాంధీగారు చెప్పార" ని అప్రయత్నంగా అనుకోసాగారు.

ఆగస్టు పోరాటానికి కాంగ్రెసుదేమీ బాధ్యతలేదని స్పష్టపరిచారు. కాని, గాంధీగారు ఉదారస్వభావులు. అందుచేతనే, ఆపోరాటాన్ని నడిపిన వారిని ఖండించలేదు. అయినప్పటికీ గాంధీజీ అలా స్పష్టంగాచేసిన ప్రకటనే ఆపోరాట నాయకులను కాంగ్రెసునుండి వేరుచేసింది; ఛిన్నాభిన్నం చేసింది. అంతవరకూ వారినందరినీ కలిపికట్టి ఉంచింది కాంగ్రెస్‌పేరే: కాంగ్రెసు తీర్మానాన్నే నిజంగా కొనసాగిస్తున్నామని కొందరిలో ఉన్న నమ్మకమే. వారిపాలిట గాంధీ—వైస్రాయి లేఖలు ఒక పెద్దపిడుగయింది.

కాంగ్రెసు పేరును ఉపయోగించగల హక్కు వారికి లేకుండాపోయింది.

వారిలోనుంచి మొట్టమొదట విడిపోయింది గాంధీవాదులు. ఇలా విడిపోయిన గాంధీవాదులంతా కలిసి "సత్యాగ్రహ కౌన్సిళ్లను స్థాపించుకున్నారు. వీరు విధ్వంసక కార్యక్రమాన్ని. హింసావిధానాన్ని ఖండించారు. కాని, సామ్రాజ్యవాద దురహంకారానికి జవాబుగా, వీలయినప్పుడల్లా చిహ్నప్రాయమైన సత్యాగ్రహంచేసి, కాంగ్రెసు జెండాను నిలబెటాలని నిశ్చయించుకున్నారు.

కాంగ్రెసు సోషలిస్టులకిక ప్రజల్లో సానుభూతి అంతరించింది. కాంగ్రెసు కార్యక్రమాన్నే కొనసాగిస్తున్నామనే దంభాల నిక వారు పలుకలేక పోయారు. చెట్టుపేరుచెప్పి కాయలమ్ముకున్నట్లు, కాంగ్రెసుపేరు చెప్పు కొని అంతకాలం ప్రజల్లో వ్యవహరించారు. గాంధీగారి అభిప్రాయాలు బయటపడడం ఇక వారికాధారం లేకుండాపోయింది, ప్రజలఎదుట తమ కాళ్ళమీద తాము నిలబడవలసి వచ్చింది. అది జీవితంలో వారెన్నడూ ఎరుగని పని.

కాని, కాంగ్రెసువాదులతో వారిలా వాదించారు:

"గాంధీజీ మమ్మల్ని నడిసముద్రంలో ముంచారు: మీరుకూడా ఆ పనే చేస్తారా? పోలీసు పెద్దపులులకు మమ్మల్ని వప్పగించేస్తారా?"—అని కాళ్ళ వేళ్ళ పడ్డారు. "తెలిసో తెలియకో మేముచేసిందంతా మంచిఉద్దేశాలతోనే కదా చేశాం? కాంగ్రెసు తీర్మానాన్ని ఆధారంగా తీసుకొని బ్రిటిష్ వారిని ప్రతిఘటించడమే కదా మేము చేసినపని?

"గాంధీగారు అహింసా సిద్ధాంతంనుండి కదలరు. కాని సామ్రాజ్యవాదుల హింసాకాండకేమిటి జవాబు? ప్రజ లే విధంగా జవాబు చెప్పాలను కొంటారో అదే మేముచేశాము. మేము అహింసా సూత్రపు హద్దులను దాటిపోయిఉండవచ్చు. కాని, ఒక్కగాంధీజీని మినహాయిస్తే అహింసను నమ్మేదెవరు?

"చేయగలదంతా చేశాము. జయం పొందలేకపోయినందుకు మమ్మల్ని తన్నిపారాస్తారా?"

ఈ విధంగా కాంగ్రెసువాదుల వద్ద ప్రాధేయపడ్డారు. వారుపడిన పాట్లకు కాంగ్రెసువాదులు జాలిచూపారు. కాని వారి రాజకీయపరిజ్ఞానాన్ని గురించి, దేశానికి నాయకత్వం వహించగల సామర్థ్యాన్ని గురించి మునుపు ఉండిన భ్రమలన్నీ పోయాయి. అనుభవంలో నిర్ధారణమైన విషయాలను, గాంధీజీ ఖాయపరిచారు. కాని గాంధీజీ వీరిని వ్యక్తిగతంగా ఖండించలేదు; వారి నిజాయితీని సంశయించలేదు; వారి ఉద్దేశాలు మంచివే అనిచెప్పి ప్రశంసించారు.

వ్యక్తిగతఉపవాసాన్ని గాంధీజీ తలపెట్టినప్పుడు, మేము ప్రజాందోళనను తీవ్రపరిచాము.

గాంధీజీ లేఖలు బయటపడినతరువాత వాటిప్రాధాన్యాన్ని ప్రజల్లో ప్రచారం చేశాం. వాటిల్లో వెల్లడయిన కాంగ్రెసు నిజఉద్దేశాలను ప్రజలకు తెలియజేశాం. విధ్వంసకకార్యక్రమం కాంగ్రెసుది కాదని వాటినాధారం చేసుకొని తెలియజేశాం. అప్పటికి కూడా గాంధీజీ చొరవతీసు కొనే అవకాశాన్ని వైస్రాయికే విడిచిపెట్టారు. మేము ప్రజలవద్దకు వెళ్ళాం. దేశభక్తుల కర్తవ్యాన్ని గురించి ప్రచారంచేశాం. ప్రతిష్ఠంభన నుండి బయలుపడగల మార్గాన్ని చూపించాం.

ప్రతిష్ఠంభనా కావలసింది? పరిష్కారమా?

ఆనాడు రాజకీయంగా మనల్నెదుర్కొన్న సమస్యలివి:

1. ఒకవైపు మనదేశాన్ని ధ్వంసంచేసేస్తూ. మరోవైపు తమ బానిసగా బంధించి ఉంచడానికి సామ్రాజ్యవాదులు ప్రతిష్టంభననుకొనసాగిస్తున్నారు, ప్రతిష్టంభనను భగ్నంచేయడానికి ప్రయత్నించాలా? లేక, కాంగ్రెసు సోషలిస్టులు వాదించినట్లు. మరో విప్లవానికి తయారు కాడానికి కావలసిన వ్యవధినిస్తుంది కాబట్టి, ఆ ప్రతిష్టంభనను అలాగే ఉంచాలా?

2. మనదేశం [illegible]క్క స్థితిగతులకు మన ప్రజలనే అధినాధులను చేయగల పరిష్కార[illegible] కోసం కృషిచేయడమా? జపాను ఫాసిస్టుల పన్నాగాలను భగ్నం చేయడానికి, ఆగ్నేయ ఆసియా దేశాలకు విముక్తి చేకూర్చడానికీ ప్రధానంగా కృషిచేస్తున్న మిత్రరాజ్యాలతో భుజంభుజం కలిపి ఉచితపాత్రను నిర్వహించ ప్రయత్నించడమా? లేక, పరిష్కారమంటే "బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు దాసోహమనడమే; మన దేశంమీద వారి పెత్తనాన్ని సుస్థిరంచేసి, ఆగ్నేయ ఆసియాను తిరిగి వారికి అప్పగించడమే" అని చెప్పి ఆ ప్రయత్నాలను వ్యతిరేకించడమా?

ఆనాటి రాజకీయ పరిస్థితులను పరిశీలిస్తే తేలేదేమిటి? జపాను వారు బయలుదేరగానే తిరిగి తమ 'విప్లవాన్ని' ప్రారంభించడానికి తగు సన్నాహాలు చేసుకోడానికి ప్రతిష్టంభన కొనసాగడమే మంచి అవకాశమని కాంగ్రెసు సోషలిస్టుల దృక్పథం. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు దాసోహం అనకుండా, భారతదేశానికి భారతీయులే కర్తలు, భర్తలుకాగల అవకాశం ప్రతిష్టంభన పరిష్కారంద్వారానే లభిస్తుందని నమ్మాము. ఈ పరిష్కారాన్ని సాధించడానికి గాంధీజీ తన ఉత్తర ప్రత్యుత్తరాల్లో మొదటిచర్య తీసుకున్నారు. వర్కింగుకమిటీ సభ్యులు బయటికి వచ్చినతరువాత మిగతాదంతా జరుగుతుందని ఆశించాము. నాయకులు బయటికివస్తే జరిగేది ఇదే అని వాళ్లకూడా అనుకున్నారు. పైన మే ముదహరించినవారి రాతలను బట్టే ఇది రుజువవుతూంది.

ఆ రోజుల్లో వారు మమ్మల్నంతగా లెక్కచేయలేదు. మేము బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు అమ్ముడుపోయామని వారు ప్రచారం చేశారు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని కొనసాగించడమే పనిగా పెట్టుకున్నామని ఆకోపించారు.

కాని, వా రెక్కువగా ఆందోళన పడింది ఒకందుకు. మీ రెక్కడ విడుదలైపోతారో అని వారు దిగులుపడ్డారు. విడుదలైవచ్చి తమ 'విప్లవ సన్నాహాల'ను భగ్నం చేసేస్తారేమో అని బెంగపెట్టుకున్నారు. జైల్లో ఉండే గాంధీజీ తమకు చేయవలసినంత హాని చేశాడుగదా! వాళ్లకూడా మిమ్మల్ని విడుదల చేయాలనే తహతహలాడారు? జపానువారు త్వరగా వచ్చేస్తే, తమ 'విప్లవాన్ని' జయప్రదంగా సాగించి, తమ చేతులతో మిమ్మల్ని విడుదల చేయాలని వాళ్ల స్వప్నం.

అవేగాని సాధారణ పరిస్థితులయినట్లయితే ఇదంతా వట్టి పిచ్చి వాగుడుక్రింద కొట్టిపారవేసేవాళ్ళం, కాని అవి అతి ప్రమాద పరిస్థితులు. దేశంలో కరువుదేవత; గుమ్మంలో ఫాసిస్టు పెనుభూతం! ప్రజలకు దారి చూపవలసిన మీరాజైళ్ళలో. రాజకీయ జీవితమంతా స్తంభించిపోయింది. ఆ పరిస్థితుల్లో శ్రేయస్కరమైన మార్గాన్ని కనిపెట్టడానికి, ప్రజలను

ఉత్తేజితులను చేయడానికి శక్తివంచనలేకుండా మేము కృషిచేశాం. ఈ దిగువ నినాదాలను ప్రచారం చేశాం:

1. ప్రతిష్టంభన కొనసాగడమంటే మన భారతజాతి నశించడ మన్నమాట; బ్రిటిష్ సామ్రాజ్యవాద పెత్తనం సుస్థిరమవడమూ, జపాను ప్రమాదం అతిశయించడ మన్నమాట.

2. జాతీయ ప్రభుత్వ స్థాపనను ప్రాతిపదికగాగల పరిష్కారం కోసం కృషిచేయాలి.

3. మిత్రమండలిలో భారతదేశానికి అర్హస్థానం చేకూర్చడానికి కృషిచేయాలి.

4. దేశంలో స్వయంనిర్ణయ సూత్రాన్ని ప్రాతిపదికగా తీసుకొని, కాంగ్రెసు, లీగు ఐక్య సంఘటనను నిర్మించడానికి కృషిచేయాలి.

5. పై కర్తవ్యాలను జయప్రదంగా నెరవేర్చడానికి జాతీయనాయకులను తక్షణమే విడిపించుకోవాలి; కాంగ్రెసుపై నిషేధాన్ని రద్దు చేయించాలి.

లీగుసభ్యుల సానుభూతి

ఈ నినాదాలపట్ల ప్రజలెంతో ఉత్సాహాన్ని చూపారు, మా కార్య దీక్షను, ఆందోళనా పద్ధతులను చూచిన ప్రజలు, రాజకీయ జీవితాన్ని పునరుద్ధరించారని మమ్మల్నాశీర్వదించారు. ప్రతిష్టంభనను బట్టబయలు చేయడమూ, మీ విడుదలకోసం ఆందోళనా, ప్రజలను యెక్కువగా ఆకర్షించాయి. 1942 ఆగస్టుతరువాత ఎన్నడూలేనంత ఎక్కువగా కాంగ్రెసు వాదులు మాపట్ల సానుభూతి సహకారాలను చూపారు.

మా ఈ కార్యక్రమం లీగువారిలోకూడా కొంత మార్పుతెచ్చింది. మేము కాంగ్రెసుయొక్క ఏజంటులమని వారిలో అదివరకుండిన దురభిప్రాయాలు తొలగిపోసాగాయి. "పాకిస్తాన్ సూత్రాన్ని లీగునాయకుల కన్నా మీరే చక్కగా వివరిస్తున్నార"ని మమ్మల్ని మెచ్చుకున్నారు. ముస్లి

మేతరులు ఇలా చేయగలుగుతున్నందుకు ఆశ్చర్యపోయారు. ఇంతకూ ఆ విషయంలో మేము చేసింది అట్టేలేదు. పాకిస్తాన్ కోరిక స్వయం నిర్ణయసూత్రంపై ఆధారపడిన స్వాతంత్ర్యవాంఛగా మేము గుర్తించాం; దానితో ఏకీభవించాం. యావద్భారతదేశ స్వాతంత్ర్యానికీ, ముస్లిం జన్మభూముల స్వాతంత్ర్యానికీగల అవినాభావ సంబంధాన్ని విశదపరిచాం. అంతే.

కాంగ్రెసు నాయకుల విడుదలకోసం ఆందోళన చేయడం సాధారణ దేశభక్తియుత కర్తవ్యమని లీగువారికి నచ్చజెప్పాం. తద్వారా ముస్లిమేతరులలో తమ విషయమై గల అపోహలు తొలగిపోగలవనీ, వారు తమ కోర్కెను గురించి సహృదయంతో ఆలోచించగల అవకాశం కలుగుతుందని వాదించాం. వారు మా మాటలను ఎంతో శ్రద్ధతోవిన్నారు. ప్రతిష్టంభనను భగ్నంచేయడానికి కాంగ్రెసు-లీగు ఐక్యతకోసం జరిగిన కృషిలో ఉత్సాహంతో పాల్గొన్నారు. మన రాజకీయజీవితం ఐక్యతా మార్గాన్ని పట్టిపోవాలని మే మేనాడో ప్రచారం ప్రారంభించాము. అప్పటికింకా కేంద్రశాసనసభలో ఐకమత్యం కుదరలేదు; గాంధీ-జిన్నాల సమావేశంకూడా జరుగలేదు.

గాంధీ-వైస్రాయి లేఖలతో కాంగ్రెసువాదుల భావాలు ఒకతీరుకు వచ్చాయి. దానివల్ల ప్రతిష్టంభనను అంతమొందించాలనే ఆందోళనలో కాంగ్రెసువాదుల్ని, లీగువారినీ ఒకేవేదికపైకి తేవడం సాధ్యమయింది. పరిష్కారానికి తగు సూచనలను వారిరువురూ ఒకేవేదికనుండి చేసే అవకాశం కలిగింది.

శ్రీయుతులు బార్డోలాయ్, శ్రీ ప్రకాశ్. గోపీనాథ శ్రీ వాత్సవ మొదలైన రాష్ట్ర నాయకులుకూడా కొందరు స్వయం నిర్ణయ సూత్రాన్ని అంగీకరించారు.

లీగులో కేంద్రనాయకత్వం మౌనం వహించినప్పటికీ, లీగు నాయకుల్లో కొందరు కాంగ్రెసు నాయకుల విడుదలకోసం ఆందోళన చేయనారంభించారు.

బెంగాల్ శాసన సభలో గాంధీగారిని బేషరతుగా విడుదల చేయాలనే తీర్మానాన్ని అసెంబ్లీ లీగుపార్టీ, ఏకగ్రీవంగా బలపరిచింది. రాష్ట్ర ముస్లింలీగుకీ, అసెంబ్లీ లీగుపార్టీకీ నాయకుడయిన ఖ్వాజా సర్ నజీముద్దీన్‌గారు, గాంధీజీ విడుదలవుతారనీ, హిందూ ముస్లిం ఐక్యత సిద్ధిస్తుందనీ నమ్ముతున్నా నన్నారు.

కాన్పూరులో లీగువారూ, ముస్లిమేతరులూ కలసి మౌలానా హజ్రత్ మెహానీ అధ్యక్షతను సభచేశారు: గాంధీజీ విడుదలను కోరారు.

కౌన్సిల్ ఆఫ్ స్టేట్‌లో ముస్లింలీగు సభ్యుడయిన హాజి మహమ్మద్ హుస్సేన్ (అలహాబాదు) గారూ: మహారాష్ట్ర, బెంగాల్ రాష్ట్రాల్లో మీర్జా అబ్బాస్‌బేగ్. మౌల్వీ అబ్దుల్ గనీలాంటి నాయకులూ, బీహార్‌లోని చాప్రా లీగు నాయకులూ గాంధీగారిని బేషరతుగా విడుదల చేయాలని ఆందోళన చేశారు.

ఒరిస్సాలో గాంధిజీ విడుదలకై జరిగిన ఆందోళనకు రాష్ట్ర ముస్లింలీగు నాయకత్వం పూర్తిగా తోడ్పడింది. రాష్ట్ర ఆర్గనైజరు యం. ఏ. ఆనిమ్ ఇలా అన్నాడు:

జాతీయ ప్రభుత్వాన్ని సాధించాలంటే జాతీయైక్యత ఒక్కటే మార్గం. కాబట్టి భారత దేశంలోని ముస్లింల శ్రేయస్సుకోసం మేము మహాత్మా గాంధీగారి విడుదలను కోరుతున్నాం. వారులేనిది ఐక్యత సాధ్యంకాదు."

(పీపుల్సువార్ 1943 మార్చి 7.)

ఇలాంటి ఉదాహరణలు ఎన్నయినా ఇవ్వగలం.

"ఇక నేమీ చేయలేమనే." నిస్పృహ ఆ రోజుల్లో దేశ మంతటా అలముకొనిఉంది. అలాంటప్పుడు, ప్రతిష్టంభనను సహించి ఊరుకోవడమంటే బానిసత్వానికి తల వొగ్గిపడి ఉండడమే అని మే మొక్కరమే ఆందోళన చేశాము. దానినుండి బయటపడే మార్గాన్ని గురించి చాలమంది కాంగ్రెసువాదులచేతా, లీగువారిచేతా ఆలోచింప జేశాము.

ప్రతిష్టంభనను కొనసాగించడమే బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల పన్నాగమని ఎన్నోవిధాల రుజువయింది. అలాంటప్పుడు ఆ ప్రతిష్టంభనను భగ్నంచేయడానికి దీక్షబూనినవారు, బ్రిటిష్‌ప్రభుత్వపుమిత్రులెలా కాగలరు? అయినప్పటికీ మమ్మల్ని బ్రిటిష్‌సామ్రాజ్యవాదుల మిత్రులనేకదా ఈ నాడు మీ ఉపన్యాసాల్లో పేర్కొంటున్నారు?

XI

గాంధీజీ విడుదల ఆతరువాత

వృద్ధాప్యంలో దీర్ఘకాల ఉపవాసం. ఆపైని కస్తూరిబాపోవడం. వీటివల్ల గాంధీగారి ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది, ఇక పరాయి ప్రభుత్వమా? మనజాతీయ ఆర్థిక వ్యవహారాలను సక్రమంగా నడపగలనని దంబాలు పలికింది. చేతకాక, బెంగాల్‌కరువును తెచ్చిపెట్టింది. 35 లక్షలమంది బెంగాల్ సోదరులు ఆ కరువుకుబలిఅయారు. బర్మానుండి జపానువారిని తరిమకొట్టేస్తున్నామనీ; ఇండియాపైకి రావడంవారి తరంకాదనీ బాకాలు ఊదిందీపరాయిప్రభుత్వం. అవన్నీవట్టి అబద్ధాలనిత్వరలోనే తేలిపోయింది. ఆ పరిస్థితుల్లో దేశంలోనూ, ఇతరదేశాల్లోనూ గాంధీగారి విడుదలకోసం సాగిన తీవ్రఅందోళనను ఇకనేమాత్రం ధిక్కరించలేకపోయారు. లొంగివచ్చి మిమ్మల్ని విడుదలచేయక తప్పిందికాదు.

జాతీయనాయకుల్లోప్రప్రధానులు, గాంధీజీవిడుదలయారు. ఆయనపైపడిన బాధ్యత ఇతంతకాదు. దేశానికి నాయకత్వం వహించి. తక్షణ ఆశయాన్ని సాధించవలసిన కర్తవ్యం వారిది. జీవితమంతా వారికి చేదోడువాదోడుగాఉండిన మీరాజైళ్ళలో ఉన్నారు. తనపైనున్న భారాన్ని గాంధీజీ పూర్తిగా గుర్తించారు. విడుదలయిన తరువాత వారిని కలుసుకున్న ప్రతివారికీ ఈ విషయం స్పష్టమయింది.

ఆరోజుల్లో దేశాన్నెదుర్కొన్న ముఖ్యసమస్యలు మూడు :

1. ఇండియా బ్రిటనులమధ్య ఒడంబడిక.
2. దేశంలో కాంగ్రెసు లీగులమధ్య ఒడంబడిక.
3. కాంగ్రెసులోనే ఐక మత్యం. 1942 అగస్టు తరువాత వివిధ కాంగ్రెసుగ్రూపులు అనుసరించిన విధానాలను పరిశీలించడం.

దేశనాయకునిగా గాంధీజీ 20 ఏళ్ళ అనుభవాన్ని సంపాదించాడు. అగస్టు తీర్మానం వారిపై పూర్తిబాధ్యత పెట్టింది అందువల్లనే దేశాన్నెదుర్కొంటున్న ప్రధానసమస్యలను గురించి వారు నూతన నిర్మాణాత్మకమైన పంధా నవలంబించారు.

న్యూస్ క్రానికల్ విలేఖరి అయిన స్టువర్ట్ గెల్డర్ గాంధీజీని కలుసుకున్నారు. ఆయనతో జరిగినసంభాషణలో ఇండియా బ్రిటన్ ఒడంబడికను కుదుర్చుకోవానికి తన సంసిద్ధతను గాంధీజీ స్పష్టపరిచారు.

అగస్టు అనంతరం జరిగిన ఘటనల్ని, వైస్రాయికి రాసిన జాబులో కన్నా ఇంకా తీవ్రంగా ఖండించారు గాంధీజీ. అంతేకాదు. తానులేనప్పుడు కాంగ్రెసు పేరిట ఇంకా సాగించ దలచుకున్న కార్యక్రమాన్ని కూడా ఖండించారు.

వర్కింగుకమిటీ సభ్యుల్ని కలుసుకోవాలని గాంధీజీ తహతహలాడారు.

వారిలా అన్నారు :

"పరిస్థితుల నన్నింటినీ తిరిగి పరిశీలించవలసి వుంది. విడుదలయిన నాటినుండి నేనెన్నో విషయాలు తెలుసుకున్నాను. వాటినిగురించి వర్కింగుకమిటీవారి అభిప్రాయాలెలావుంటాయో తెలుసుకోవాలి.

"1942 లో ప్రభుత్వ చర్యలవల్ల తెగిపోయిన దగ్గర్నుంచీ మా కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలి. మొట్టమొదట సంప్రదింపులు జరపాలనుకున్నాం. వాటివల్ల లాభంలేకపోయి, నేను

అవసరమని అనుకుంటే, సత్యాగ్రహం ప్రారంభించాలని అప్పటి నిర్ణయం."

(టైమ్సు ఆఫ్ ఇండియా - 1944 జులై 11)

వర్కింగు కమిటీ విడుదలైవస్తే తాము పోరాటం ప్రారంభిస్తారా అని అడుగుతే గాంధీగారిలా అన్నారు :

"ఈనాడు సత్యాగ్రహం ప్రారంభించాలనే ఉద్దేశం నాకు లేదు. 1942 నాటి పరిస్థితులకు దేశాన్ని తీసుకుపోలేను. చరిత్రకు పునరుక్తిదోషం లేదు. కాంగ్రెసు అనుమతి లేకపోయినా, నేను చేయాలనుకుంటే సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించగలను. కాని అలాచేస్తే బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టినవాడి నవుతాను. అది నా ఆశయం కాజాలదు."

(టైమ్సు ఆఫ్ ఇండియా - 1944 జులై 11)

బ్రిటిష్ ప్రభుత్వంతో వెంటనే సంప్రదింపులు ప్రారంభించడానికి స్పష్టమైన సూచనలు చేశారు.

"1942 లో నేను కోరినదానికీ, ఇప్పుడు కోరదలచినదానికీ వ్యత్యాసం ఉంది.

1. ఈనాడు సివిల్ పరిపాలనపై సర్వాధికారాలుగల జాతీయ ప్రభుత్వంతో ఇండియా తృప్తిపడుతుంది. ఎన్నుకోబడిన కేంద్రశాసన సభాసభ్యుల్లోనుంచే ఈ ప్రభుత్వవర్గాన్ని నియమించాలి. ఈ విధంగా జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించడంతోపాటే యుద్ధానంతరం భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం యిస్తామని ప్రకటించాలి.

2. రైల్వేలు, పోస్టాఫీసులు మొదలైనవన్నీ జాతీయ ప్రభుత్వం చేతిక్రిందనే ఉన్నప్పటికీ, వాటి విషయంలో మిలిటరీవారికి పూర్తి సౌకర్యాలు కలిగిస్తాము.

3, సైన్యంమీద సర్వాధికారాలు వైస్రాయికి, సర్వసేనాధిపతికి చెందుతాయి,

4. సివిల్ విషయాల్లో ఇంగ్లండులో రాజుగారికి ఎంత అధికారం ఉందో ఇక్కడ వైస్రాయికి అంతే అధికారం ఉండాలి. బాధ్యత గల మంత్రుల సలహాననుబట్టి ఆయన నడుచుకోవాలి,

5. దేశరక్షణశాఖ జాతీయ ప్రభుత్వం చేతిక్రిందే ఉంటుంది. రక్షణ విషయంలో అత్యంత శ్రద్ధవహిస్తూ, అందు కనుకూలమైన విధానాలను నిర్ణయించడంలో ఎంతైనా తోడ్పడగలదు. ఈ శాఖద్వారా జాతీయ ప్రభుత్వం మిలిటర్కీ విషయాలలో సలహాలను విమర్శనల ఇస్తుంటుంది.

6. వైస్రాయిని కలుసుకోవాలనుకోవడం, మిత్రమండలి కృషికి తోడ్పడాలనే ఉద్దేశంతోనేకాని, దానికి ఆటంకం కలిగించాలనికాదు,"

("టైమ్సు ఆఫ్ ఇండియా" — 1944 జులై 11)

ప్రతిష్టంభనను భగ్నం చేయడానికి గాంధీగారి సూచనలెంతో తోడ్పడగలవని మేము సంతోషించాము.

"గెల్డర్‌ద్వారా చేసిన సూచనలతోను, కాంగ్రెసు - లీగు ఐక్యతకు రాజాజీ ప్రతిపాదనలను బలపరచడంద్వారాను, ప్రతిష్టంభనను భగ్నం చేయగల చొరవను గాంధీజీ తన చేతిలోకి తీసుకున్నారు. కాంగ్రెసును జపాను అనుకూలసంస్థ అనీ. ఓటమి తత్వంతో నిండిఉందనీ కారుకూతలు కూసిన అమెరీ, లిన్‌లిత్గోముతా పన్నాగాలకు గొడ్డలిపెట్టు పెట్టారు."

("పీపుల్సువార్" సంపుటి 3; సంచిక 3 — 1944 జులై 16)

కాని ఈ సూచనలు విఫలమవుతాయని కూడా అన్నారు.

వేవెల్‌తో పరిష్కారంకోసమే ముఖ్యంగా ప్రయత్నిస్తున్నారు. అది అపజయానికి మార్గమని 1944 మే 21 వ తేదీన—అంటే గాంధీగారు విడుదలయిన పదిహేనురోజులకే మేము హెచ్చరించాము.

"వేవెల్‌తో ఒడంబడికకు ప్రధానస్థానమిస్తున్నారు. జిన్నాగారితో ఒప్పుదలకు రెండవస్థాన మిస్తున్నారు. ఇది మొట్టికాయలు తినడానికే మార్గం....బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ప్రతిష్టంభనను తెచ్చిపెట్టారు. దానిని పరిష్కరించాలని కోరుతున్నారు అన్ని

పార్టీల్లోని దేశభక్తులు. జిన్నాగారిదగ్గరుకు వెళ్ళడం అన్నదమ్ములతో ఐక్యత కుదుర్చుకోవడమే; అజేయమైన శక్తిని సంపాదించడమే; జిన్నాగారితో ఒడంబడిక కుదుర్చుకున్న తరువాతనే వేవెల్‌ని జయప్రదంగా ఎదిరించవచ్చు; అంతకు పూర్వం సాధ్యంకాదు."

('పీపుల్సువార్'—సంపుటి 2; సంచిక 47—1944 మే 21.)

బ్రిటిష్‌ప్రభుత్వపు తలబిరుసుతనం చూచి, అదంతా విజయాలవల్ల కలిగిన బలాధిక్యతే అని కాంగ్రెసు వాదుల్లో చాలమంది అనుకున్నారు. ఆగస్టు పోరాటంలో ఓడిపోయి మనమెంత బలహీనపడిపోయామో దీనివల్ల రుజువవుతుందని వాదించారు.

మేమీ వాదనల నెదుర్కొన్నాం. నాజీ హిట్లరుపై సాధిస్తున్న విజయాలవల్ల బలపడుతున్నది యూరప్ ప్రజలేగాని, చర్చిల్ ఎంతమాత్రంకాదని విశదపరిచాము. యూరప్‌చరిత్ర రథానికి నాడు ప్రజలే సారథ్యం వహించారని వివరించాము. మామాటలను చాలకొద్దిమంది కాంగ్రెసువాదులే నమ్మారు. తమలో నాటుకున్న నిస్పృహకొద్దీ ఈ యుద్ధంలో అమెరికా, బ్రిటిష్‌సామ్రాజ్యవాదాలే అఖండవిజయం సాధిస్తున్నాయని దిగులుపడ్డారు. చర్చిల్. అమెరీల శని మనకిక తప్పదని నిరాశచెందారు. వేవెల్‌కూడా లిన్‌లిత్గోలాగానే గాంధీజీ సూచనలను తృణీకరించడం ఇందుకు నిదర్శనమన్నారు. తమ వాదనే సరియయినదనీ, మాదితప్పనీ దీనితోరుజువుచేయబోయారు.

దీనికూడా మేము సమాధానం చెప్పాం. గాంధీజీ, వంటరిగా కాకుండా జిన్నాగారితో కలిసి ఎదుర్కొన్నట్లయితే, వేవెల్ ఆయన ముందు నిలబడలేడన్నాం. విభేదాలతో భారతదేశం చీలి వున్నంతకాలమూ వైస్రాయి తిష్టవేసే ఉంటాడని హెచ్చరించాం, భారతరాజకీయ నాయకులలో ఐక్యత కుదరదనే ధైర్యం ఉన్నంతకాలమూ అతను మననాయకులనీవిధంగా అవమానిస్తూనే ఉంటాడన్నాం. కాంగ్రెసు లీగులు కలవనంతకాలమూ మనకు లభించేది జాతీయప్రభుత్వంకాదు; అవమాన పరంపరలే అని వివరించాము. ఆనాటి పరిస్థితులను మేమలా అర్థంచేసుకున్నాము.

గాంధీ జిన్నాల సమావేశం

సంప్రదింపులకు వేవెల్ నిరాకరించినతరువాత గాంధిజీ జిన్నాగారికి జాబు రాశారు. విడుదలైవచ్చి యదార్థపరిస్థితులను తెలుసుకున్న మీదట, అందులోనూ వేవెల్‌ధోరణిని గ్రహించిన తరువాత గాంధీజీ ఈ అవసరాన్ని గుర్తించారు. నాయకులిద్దరూ ఇలా కలుసుకోవాలని మొదటి నుంచీ ఆందోళనచేసింది మేమొక్కరమే. మాఆందోళనకు కొంత సానుభూతికూడా లభించింది. కాని, ఇలాంటిసమావేశం అసంభవమనే ఎక్కువమంది కాంగ్రెసు వాదులనుకున్నారు. కాని తీరా సమావేశం ప్రారంభమయేసరికి, అది తప్పక జయప్రదం అవుతుందనే ఆశ మిన్నుముట్టింది. 1942 ఆగస్టులో బొంబాయి ఏ. ఐ. సి, సి. సమావేశం రోజుల్లో స్వాతంత్ర్య పోరాటం ప్రారంభమవుతుందనే ఆశ. ఇటీవల సిమ్లాసమావేశం ఫలిస్తుందనే నమ్మకం వారిలో ఎంతఅధికంగా కలిగిందో అప్పుడూ అంతగా ఎక్కువగా కలిగింది.

ఆ సమావేశం ఫలించాలనే ఆకాంక్ష కనబడిందేగాని, దానికి గల ఆటంకాలను గుర్తించి, వాటిని తొలగించాలనేదీక్ష ఎక్కడా లేకపోవడం మేము గ్రహించాము.

"సంప్రదింపులు విఫలం కాకూడదు" నే వ్యాసంలో పి. సి. జోషీగారిలా రాశారు ;

"కాంగ్రెసు లీగుల కలయికద్వారానే దేశానికి ముక్తికలుగుతుందని నమ్ముతున్నాం. ఈ విషయాన్ని గుర్తించాము కాబట్టే, ఆ ఐక్య సంఘటనకు గల ప్రతిబంధకాలనుకూడా స్పష్టంగా గుర్తిస్తున్నాం.

"ఏ ప్రదేశమయినా స్వతంత్రరాజ్యంగా ఏర్పడాలనుకుంటే, ఆ విషయమై ఆ ప్రాంతంలోని ప్రజల నిర్ణయాన్ని ముందుగా తీసుకోవాలని గాంధీగారు పట్టు పట్టుతారు. తాము అత్యధిక సంఖ్యాకులుగా నివసిస్తున్న తమ జన్మభూములలో స్వతంత్రరాజ్యాలను స్థాపించుకోవడం తమ జన్మ

హక్కనీ. వేరేగా నిర్ణయించవలసిన విషయం ఎంతమాత్రం కాదనీ, జిన్నాగారు ఆక్షేపిస్తారు.

"ఎవరి అభిప్రాయాలను పట్టుకొని వారు భీష్మించి కూర్చుంటే —ఇక ఒడంబడిక జరిగే ఆశే ఉండదు."

('పీపుల్సువార్' 1944 ఆగస్టు 20)

చివరకు నిజంగా జరిగిందికూడా ఇంతే. మేము హెచ్చరించిన విధంగానే సమావేశం భగ్నమయింది.

సమావేశం భగ్నమయినా. ద్వేషాలు రెచ్చగొట్టే పనేమీ చేయవద్దని నాయకులిద్దరూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పత్రిక లా విజ్ఞప్తిని పాటించలేదు. నిష్పాక్షికమైన చర్చలకు అవకాశమివ్వకుండా అసహ్యకరమైన దుష్ప్రచారం సాగించాయి. పక్షపాతానికి తావివ్వకుండా, నిర్మాణాత్మకమైన విమర్శనచేసింది మా పత్రికలొక్కటే.

ఆ సమావేశం విఫలమయిన తరువాత 'తిరిగికలుసుకోవాలి' అని జోషీగారొక వ్యాసంరాశారు. నాయకులిద్దరిలోను ఉన్న లోపాలను ఎత్తిచూపుతూ వారిలా రాశారు :

"గాంధీగారు ఈ విషయాలను గుర్తించడం లేదు :

1. పాకిస్తాన్ వినాదం ముస్లింప్రజల స్వాతంత్ర్యవాంఛయొక్క స్వరూపం.

2. ముస్లింప్రజలకు తమ జన్మభూములలో సర్వసంపూర్ణ స్వాతంత్ర్యాన్ని నెలకొల్పడానికే లీగు ముస్లింజాతీయోద్యమాన్ని నడుపుతూంది.

3. జిన్నాగారేమంటున్నారు అన్నదికాదు గమనించవలసింది. భారతీయులలో నాలుగోవంతు ప్రజలను (ముస్లింలను) దేశస్వాతంత్ర్యానికై ఐక్యపోరాటానికి ఎలా సమీకరించడం అన్నదే ప్రధానసమస్య.

"జిన్నాగారీదిగువ విషయాలను గుర్తించడంలేదు.

1. పాకిస్తాన్ బ్రిటిష్ సామ్రాజ్యవాదులు పెట్టవలసిన భిక్షకాదు. యావద్భారత స్వాతంత్ర్యానికి ఐక్యపోరాటం జరపడంద్వారా లభించగల ఫలమది.

2. హిందూపరిపాలనను స్థాపించడానికి కాదు, కాంగ్రెసుజరుపుతూన్నకృషి. అది సాగిస్తున్నది భారతస్వాతంత్ర్యోద్యమమే.

3. పాకిస్తాన్‌యొక్క ఆప్తబంధువులు సోదరహిందువులే. వారి సహకారంలేనిది, వారు అధికసంఖ్యాకులుగాఉన్న కాంగ్రెసుయొక్క, దాని నాయకులయొక్క తోడ్పాటులేనిది, పాకిస్తాన్‌దుర్లభం....

"జిన్నాగారి సూచనల్లో ప్రతిబింబమైన స్వాతంత్ర్య కాంక్షను గాంధీజీ గుర్తించలేదు. గాంధీజీ చేసిన సూచనల్లోని ప్రజా స్వామిక స్వభావాన్ని జిన్నాగారు గుర్తించలేదు. కాని, ఇరువురూ స్వాతంత్ర్యము. ప్రజా స్వామ్యాలే తమ జీవితాశయా లంటారు. విచారకరమైన విషయం ఇదే!"

సమావేశం విఫలమైన దోషం జిన్నాదే అని కాంగ్రెసువారూ; గాంధీజీదేఅని లీగువారూ ఆడిపోసుకోవడం ప్రారంభించారు. ఎవరిమట్టుకు వారు ఎదుటిపక్షం దిగివస్తేనేగాని లాభంలేదని వాదించ సాగారు. ఆ పరిస్థితుల్లో నిర్మాణాత్మకమైన సూచనలు చేసింది మే మొక్కరమే. సమావేశంలో తేలిన అభివృద్ధికర అంశాలను ఆధారంగా తీసుకొని రెండు పక్షాలకు సఖ్యత కుదర్చడానికి పాటుబడ్డాము.

మా సూచనలు

"తిరిగి కలుసుకోవాలి" అన్న వ్యాసంలోనే ఈ దిగువ సూచనలను చేశాం:

"రెండు సంస్థలయొక్క ప్రధానాశయాలను సాధించడానికి కాంగ్రెసు లీగుల ఐక్య సంఘటనను నిర్మించాలి. బ్రిటిష్ ప్రభుత్వంతో రాజీకి ఎవరిమటుకు వారు ప్రయత్నించకూడదు.

2. "లీగుయొక్క లాహోరు తీర్మానాన్ని అనుసరించి, ముస్లిం ప్రజలు తమ జన్మభూములలో స్వతంత్ర రాజ్యాలను స్థాపించుకునే హక్కును, బేషరతుగా అంగీకరించాలి.

3. "పాకిస్థాన్ ప్రాంతంలోనివసించే ముస్లింలూ, ముస్లిమేతరులూ వయోజన వోటింగు పద్ధతి ననుసరించి ఎన్నుకొనిన ప్రత్యేక ప్రజా పరిషత్తే పాకిస్తాన్ రాజ్యాంగ ప్రణాళికను తయారు చేయాలి.

(తమ స్వతంత్రరాజ్యాన్ని స్థాపించుకోవడం ముస్లిం ప్రజల జన్మహక్కుఅని జిన్నా కోరిన కోరికా, ముందుగా ప్రజానిర్ణయం కావాలి అని గాంధీగారు పెట్టిన షరతూ ఈవిధంగా నెరవేరగలవని విశదపరిచాం.)

4. పాకిస్థాన్ సరిహద్దులను నిర్ణయించే విధానాన్ని స్పష్టపరచాలి. ముస్లిం స్వపరిపాలనాధికారాన్ని ఉపయోగించుకొని ముస్లిమేతరుల హక్కులను అణగద్రొక్కడంగాని, వారి ప్రదేశాలను ఆశించడంగాని ఉండదని ఖచ్చితంగా తెలియపరచాలి."

ఈసరిహద్దులను నిర్ణయించడానికూ్కడా ఒకవిధానాన్నిసూచించాం.

(అ)"తాము అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న ప్రదేశాల్లో, తమ ప్రజా పరిషత్సభద్వారా స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించుకునే హక్కు ముస్లింలకుంది.

(ఆ) సరిహద్దుల్లో ముఖ్యమైన మార్పులేవైనా జరగాలంటే, అది ఒక హక్కుగా కోరకూడదు. దేశంలోని ఇతరజాతులతో పరస్పరాంగీకారం మీదనే అలాంటివి జరగాలి."

5. "దురాక్రమణ నెదుర్కోడంలో ఒకరికొకరు సాయంచేసుకోడానికి హిందూస్తాన్, పాకిస్తాన్లు ఒడంబడిక కుదుర్చుకోవాలి. తమ పరిపాలనా ఫలితంగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు విడిచిపెట్టిపోయే దారిద్ర్యాన్ని కరువుకాటకాలను అంతమొందించి దేశాన్ని సుభిక్షం చేయగల ఆర్థిక పునర్నిర్మాణానికి పరస్పరసహకారంతో పూనుకోవాలి. పాకిస్థాన్, హిందూస్తాన్లకు పరస్పర విశ్వాసం కుదరగలందులకు కాంగ్రెసు, లీగులు ఇప్పుడే సంధిపత్రాలను తయారుచేయాలి. తరువాత ఆయా రాజ్యాంగాలు వాటిని ఖాయం చేయగలవు."

('పీపుల్సువార్' సంపుటి 3- సంచిక 15–1944 అక్టోబరు 8)

నేరారోపణలు, దూషణలు హద్దూపద్దూ లేకుండా సాగుతూన్న రోజుల్లో పక్షపాతదృష్టికిపాల్పడకుండావున్నది మేమొక్కరమే. నిరాశా, నిస్పృహలనుకూడా మాదగ్గరకు రానీయలేదు. పరిష్కారానికి నిర్మాణాత్మకమైన సూచనలుచేశాం: అక్రమమైన కోర్కెలను యీ సూచనల్లో ఖండించాము. యావద్భారత స్వాతంత్ర్యానికి తోడ్పడగల సూచనలవి. న్యాయదృష్టి గలవారెవ్వరూ నిరాకరింపజాలని సూచనలవి. ఆయాపక్షాల కోర్కెల్లోని న్యాయాన్నిగుర్తించి, స్వాతంత్ర్యదీక్షతో కృషిచేశాం కాబట్టే మేము నిర్మాణాత్మకంగా ఆలోచించగలిగాము. తక్కినవారు ఉహాగానాలతో బయలుదేరారు. తరువాత కావలసినదంతా నాయకులే చేసిపెడతారులే అని కూర్చున్నారు, సమావేశం చెడిపోయేసరికి ఒకరినొకరు తిట్టుకోవడం ప్రారంభించారు. సోదర దేశభక్తుల్లో ప్రజ్వలిస్తున్న స్వాతంత్ర్యకాంక్షకూ, దేశాన్నెదుర్కొన్న సమస్యలపై వారిలో కలిగేభావాలకూ, మధ్య యెంత పెద్ద అగాధమేర్పడిందో మాకానాడు విశదమయింది.

దొంగ ఉత్తరాలు

ఇందుకొక ఉదాహరణ యిస్తాం:

గాంధీ - జిన్నా సమావేశం భగ్నమైన తరువాత బొంబాయిలోని 'మాతృభూమి' కలకత్తాలోని 'నేషనలిస్టు' మొదలైన కొన్ని పత్రికల్లో ఈ దిగువ జాబు ప్రచురించబడింది. ఇంకా మరికొన్ని జాబులు వస్తాయన్నారు:

అలిండియా కార్యాలయం — లండను
వైట్‌హాలు — 1944 ఆగస్టు 20

ప్రియమైన జిన్నాగారూ:

జులై 24 వ తేదీన శ్రీనగరు నుండి మీరురాసిన జాబుకికృతజ్ఞుడిని.

త్వరలో మీకూ, గాంధీగారికీ జరుగబోయే సంభాషణలను ఇక్కడి ప్రభుత్వంవారు చాల శ్రద్ధతో గమనిస్తారు. మీరు కోరుతూన్న విడిపోయే హక్కును గాంధీగారు పెద్ద షరతులేవీ పెట్టకుండానే అంగీకరించవచ్చునని ఇతరత్రా (మీ జాబు చేరకముందే) నాకు తెలిసింది. గాంధీగారే అలా చేసినట్లయితే సమస్యయొక్క స్వరూపమే పూర్తిగా మారిపోతుందనుకుంటాము.

జపానుపై సాగిస్తున్న యుద్ధంలో ముస్లింలు పూర్తిగా తోడ్పడతారని మీరిచ్చిన వాగ్దానం నన్నెంతో సంతోషపరచింది. ముస్లిం ప్రజల్లో కాంగ్రెసుకి అట్టే పలుకుబడి లేదన్న సంగతిని ఇక్కడ మేమంతా గుర్తించాము.

మీ జాబులోని రెండోవిషయాన్ని గురించి ఇంకా కొంత ఆలోచించాలి. అది మరొకనాటికి వాయిదావేయడం మంచిదనుకుంటాను.

ఈలోగా ఈ దిగువ విషయాలకు మీరు సమాధానాలు పంపితే చాల కృతజ్ఞుడ నవుతాను;

1. ముస్లిం సంస్థానాలు స్వపరిపాలనాధికారంగల ముస్లిం రాష్ట్రాలతో కలిసి సమాఖ్యగా ఏర్పడాలి అన్న విషయాన్ని అలాఉంచుదాం. యుద్ధానంతర ఆర్థికపునర్నిర్మాణం చాలా పెద్దసమస్య అవుతుంది. బలమైన కేంద్రప్రభుత్వం లేనిది స్వతంత్ర ముస్లిం రాష్ట్రాలు ఈ సమస్య నెదుర్కోగలవా ?

2. ఎదుర్కోగలవనే మీ అభిప్రాయమైతే అందుకు సంబంధించిన వివరాలూ, మరోఉపాయం ఏదైనా ఉంటే అది తెలియజేస్తారా ?

ఎదుర్కోలేవని మీ రనుకుంటే యుద్ధానంతర పునర్నిర్మాణానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందో చెప్పగలరా ? పదేళ్లు పడుతుందనుకోండి అప్పుడు ముస్లింప్రజలు విడిపోయే హక్కునుగురించి ఈ పదేళ్లలోగానే బ్రిటిష్‌ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయడం మంచిదంటారా ?

3. మంచిదనుకుంటే జపానుతో యుద్ధం ముగిసిన తరువాత ఇలా ప్రకటిస్తే మీకు తృప్తి కలుగుతుందా: యుద్ధంలో భారత ముస్లింలు

తమంతటతాము చేసిన సహాయానికి కృతజ్ఞతా సూచకంగా, వారు అత్యధిక సంఖ్యాకులుగాఉన్న రాష్ట్రాలకు సంపూర్ణ స్వపరిపాలనాధికారం ఇవ్వాలి; ఈ రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వానికి జవాబుదారీగా ఉండాలి.

4. జపానుపై యుద్ధం పెద్దఎత్తున ప్రారంభమయేలోగా, బ్రిటిష్ వారి యుద్ధకృషిపట్ల గాంధీగారు బేషరతుగా సంపూర్ణ సహకారం ప్రకటిస్తే మీరేమంటారు ? కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ తాత్కాలిక మార్పులకు అంగీకరించి, ముస్లింరాష్ట్రాల స్వపరిపాలనా సమస్యను, జపానుతో సంధి జరిగిన తరువాత చర్చించడానికి వొప్పుకుంటారా ?

యం. ఏ. జిన్నాగారికి,
బొంబాయి.

మీ విశ్వాసపాత్రుడు,
లియొపొల్డు యస్. అమెరీ.

ఈ ఉత్తరం భాషలో ఉన్న అవకతవకలనుబట్టి, మా టైపిస్టు తనికీచేయగా బయటపడిన టైపింగు తప్పులనుబట్టి, ఇది దొంగ ఉత్తరమని తెలుసుకున్నాం. మా పాఠకులకూ, బుద్ధిగలవారెవ్వరికయినా సరే స్పష్టమయేలా దీనిని మా 'పీపుల్సువార్' లో రుజువుచేశాం.

కాని జాతీయపత్రికలన్నీ ఈ జాబును పెద్దపెద్ద శీర్షికలతో ప్రచురించాయి; అది నిజమైన జాబే అని చాలపత్రికలు నమ్మాయి. ఇక దానిపై వాటి సంపాదకీయా లెలాఉంటాయో మీరే ఊహించుకోవచ్చు. ఈ ఉత్తరం సంగతంతా పచ్చి అబద్ధమని అమెరీ, జిన్నాలు ప్రకటించారు. వీరు నిజాన్ని కప్పిపుచ్చుతున్నారని కొన్నిపత్రికలనుకున్నాయి. కాని "దొక్కశుద్ధిలేని ఒక తుంటరి చేసిన మోసంలో మనమందరమూ పడిపోయామే" అన్న చింత ఏపత్రికకూ కలగలేదు. ప్రజల మనోభావా లెంత విషాదకరస్థితికి వచ్చాయో, మన రాజకీయా లెంత పతనమైపోయాయో తెలుపడానికి కదొక నిదర్శనం. నమ్మరానిదాని నయినా నమ్మే స్థితికి వచ్చారు మన ప్రజలు.

గాంధీ - జోషీ లేఖలు

గాంధీజీని కలుసుకొని, తాను లేనప్పుడు జరిగిన విషయాలను, మేము చేసిన పనులను నివేదించడానికి ప్రయత్నించాము. ప్రజాశ్రేయస్సు కోసం, దేశక్షేమంకోసం వారేమి చేస్తే బాగుంటుం దనుకుంటున్నామో చెప్పా లనుకున్నాం. నాయకుడు విడుదలయేరనేసరికి కాంగ్రెసులోని ఏ గ్రూపయినా చేయాలనుకొనేదే ఇది. కాని గాంధీజీని కలుసుకున్నప్పుడు మా ఉద్దేశాలు నెరవేరలేదు. వారు మాకు కొన్ని పశ్నలిచ్చారు. ప్రపంచమంతటా అభివృద్ధి నిరోధకులు, నెత్తిని నోరుపెట్టుకొని ఘోషిస్తున్న కమ్యూనిస్టు వ్యతిరేక దూషణే ఈప్రశ్నల్లో ప్రతిబింబించింది. అంతకుమించి వాటిలో మరే విశేషమూలేదు. తమ దివాలాకోరు తనాన్ని కప్పిపుచ్చుకోడానికి కాంగ్రెసు సోషలిస్టులు, ఫార్వర్డుబ్లాకు వారు దేశంలో ప్రచారంచేస్తూ వచ్చింది ఈ దూషణలే;

మాశక్తికొలది ఆప్రశ్నలకు జవాబు చెప్పాం. గాంధీజీ ఈప్రశ్నలడగడం సహజమే అనుకున్నాం. ఎందువల్లనంటే—వారికి గౌరవనీయులూ, కాంగ్రెసులో బాధ్యతగల స్థానాల్లో ఉన్నవారూ అలాంటి విషయాలు చెబుతూవచ్చినప్పుడు వారింకేమి చేయగలరు? అంతేకాదు వారి నైతిక సిద్ధాంతాలనుబట్టి చూచినా ఆప్రశ్నలడగడంలో వింతలేదు. మా సమాధానాల్లో రాజకీయ సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వలేదు. మా నీతి నియమాలకు సంబంధించిన సమస్యలనే ప్రధానంగా తీసుకున్నాం; ఇది బుద్ధిపూర్వకంగానే చేశాం. ఎందువల్లనంటే ఒకపార్టీ మొత్తంమీద: చిన్నవారైనప్పటికీ ఎన్నదగిన సంఖ్యలోఉన్న దేశభక్త కుటుంబంమీద మా వ్యతిరేకులెంత నీచమయిన ఆరోపణలల్లారో, జంకూ గొంకూ లేకుండా వాటిని తనముందు పెట్టడానికెలా సాహసించారో గాంధిజీకి ఈవిధంగానే స్పష్టం చేయగలము. దీనిని తెలుసుకొని గాంధిజీ "ఇంత నీచానికి ఒడిగట్టినవారి రాజకీయాలు ఎంతసవ్యంగా ఉండగలవ"ని తనను తాను ప్రశ్నించుకుంటారని ఆశించాం. కాని, మాఆశ నెరవేరలేదు. దీని ద్వారా మేమొక గుణపాఠం నేర్చుకున్నాం. మా ముందెంత కఠిన సమస్యలున్నాయో, ప్రజల భవిష్యత్తుకు మార్గమెంత కంటకావృతమో మేము తెలుసుకోగలిగాం.

కమ్యూనిస్టులపై నిందారోపణలు చేస్తూ దేశం నలమూలలనుంచీ గాంధీజీకి రిపోర్టులు పంపించారు కమ్యూనిస్టు వ్యతిరేకులు, అదొక ఉద్యమంలా సాగించారు. మేమేమీ జోక్యం కలిగించుకోలేదు. వాళ్ళపై ఎదురునేరాలు మోపలేదు. మా ఆత్మగౌరవాన్ని కాపాడుకున్నాం. పదకొండుమాసాల వ్యవధిగడచినతరువాత కూడా గాంధీజీ ఎలాంటి నిర్ణయానికీరాలేదు.

గాంధీజీ కమ్యూనిస్టువ్యతిరేకనిర్ణయానికి వచ్చారనీ, కమ్యూనిస్టులనిక కాంగ్రెసులో ఉండనివ్వకూడదనీ మావ్యతిరేకులు పత్రికల్లో అసత్య ప్రచారం సాగించారు.

అప్పుడే విడుదలయిన కాంగ్రెసువాదుల్లో ఈ విషప్రచారం సాగుతూన్న రోజుల్లోనే గాంధీజీతో మా ఉత్తరప్రత్యుత్తరాలు, జరిగాయి. ఆ పరిస్థితుల్లో గాంధీగారి అభిప్రాయం ఎలావుందో తెలియజేస్తాం.

కమ్యూనిస్టులతో కలిసిపనిచేయడం గురించి స్వామి రామానంద తీర్థులు గాంధీగారితో చర్చించారు. ఈ చర్చఫలితాలను రామానందగారు వ్రాశారు. తాను వ్రాసింది సరిగ్గాఉందోలేదో గాంధీజీకి చూపించారు. అదంతా చదివి గాంధీ తన మాటలుకూడా కొన్ని వ్రాశారు. ఈ పత్రం ప్రతిని దిగువనిస్తున్నాం.

"కమ్యూనిస్టులపట్ల ఏలాంటి వైఖరి అవలంబించాలన్నది నైజాంలోని ఆంధ్రప్రాంతాల్లో చాల తీవ్రసమస్య అయింది. ఈ సమస్య నన్నెంతో కలవరపెట్టింది. ఒకరుచెప్పింది మరొకరు కాదంటూ కాంగ్రెసువాదులు ప్రకటనలుచేశారు. దీనివల్ల అసలే అయోమయంగా ఉన్న పరిస్థితులు మరింతగందరగోళమయాయి. అందువల్ల గాంధీగారిని దర్శించి ఈ విషయమై వారి అభిప్రాయాన్ని తెలుసుకోవాలనుకున్నాను. డాక్టర్ సయ్యద్ మహమద్‌గారిని సమక్షంలో వారితో ఈ విషయం చర్చించాను. ఈదిగువమాటల్లో గాంధీజీ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

"కమ్యూనిస్టులు కాంగ్రెసులో సభ్యులుగా ఉండకూడదని విషేధించడానికి వీల్లేదు. కాంగ్రెసు ఆశయాన్నంగీకరించి, సభ్యత్వ రుసుం చెల్లించేవారందరూ సభ్యులుగా ఉండవచ్చునని కాంగ్రెసు నిబంధనావళిలో ఉంది. నేనిలా అంటే చాలమంది నిరసించారు. కాని, నాకు న్యాయమని తోచినదానిని చెప్పకతప్పదు. ఇక కార్య నిర్వాహక వర్గాల విషయమా— వాటిని ఎన్నుకునేవారు తమకేది సరియయినదని తోస్తే అదే చేయనీయండి. కమ్యూనిస్టులుండాలని ప్రజలు కోరితే వారి నెన్నుకుంటారు. కమ్యూనిస్టు లయినంత మాత్రంచేత ఎవరిపైనా చర్య తీసుకోడానికి వీల్లేదు. ఆ విధంగానే కమ్యూనిస్టు పార్టీమీద ఏ చర్యా తీసుకోడానికి వీల్లేదు. కాంగ్రెసు క్రమశిక్షణకు భంగం కలిగించిన వ్యక్తులమీదనే చర్య తీసుకోవచ్చు. ఇంతకూ కమ్యూనిస్టులు దేశభక్తులే. వారినిచూచి కాంగ్రెసువాదులెందుకు బెదరిపోవాలి? ఒకరికన్నా మనమసమర్థులము, అల్పులమనే భావం ఉన్నప్పుడే ఇలాంటి బెదురు పుడుతుంది. మీరు నిర్మాణ కార్యక్రమం సాగిస్తున్నప్పుడు వారు వచ్చి చిత్తశుద్ధితో పనిచేస్తే ఆహ్వానించండి."

బాపూజీ రాసినది :

"ఇది ప్రచురణార్థంకాదు. మీరు తెలుసుకోవడం కోసమే. దీని నవగాహన చేసుకుంటే, దీనిప్రకారం మీరు నడచుకోవచ్చు. నేను మీకేమీ సలహా లివ్వడంలేదు. నా అభిప్రాయాన్ని మాత్రమే తెలిపాను. నా అభిప్రాయాన్ని కొంతమట్టు కిదివరకే ప్రకటించాను. అవసర మైనప్పుడు ప్రజలకు నా అభిప్రాయాన్ని పూర్తిగా తెలుపుతాను.

4—2—45 బా పు"

స్వామీ రామానందతీర్థులు హైదరాబాదు సంస్థాన కాంగ్రెసు నాయకులు ఇది రాసిన ఒక వారానికే దాని ప్రతి మాకు చేరింది.

ఇలాంటి సత్యాన్ని తమ కనుకూలంగా వుపయోగించుకోకుండా ఉండేవారు కాంగ్రెసులో ఎవరయినా వున్నారేమో చెప్పండి?

మేముమాత్రం దాని నావిధంగా వుపయోగించుకోలేదు. ఎందువల్ల? గాంధీగారి ఆదరణనుబట్టికాదు మేము ప్రజల్లో నిలబడేది. మాకాళ్ళమీదనే మేము నిలబడతాము. తాను ప్రచురణార్థం కాదు అన్నదాన్ని ప్రచురించకుండా ఆగి గాంధీజీపట్ల మా ప్రేమనూ గౌరవాన్ని నిరూపించాము. ఈ సమస్యపై కాంగ్రెసులో ప్రజా స్వామిక పద్ధతులపై చర్చ జరిగేవరకు వేచి ఉండాలని అనుకొన్నాం.

మేము చేసినదానిలో దాచుకోవలసిం దేమీలేదు. దానిని పూర్తిగా సమర్ధించుకోవడంవల్లా, తక్షణ కర్తవ్యాలకు అనుగుణ్యంగా కాంగ్రెసు విధానాన్ని మార్చడంలో తగుపాత్రను నిర్వహించుకోవడంవల్లా, మాకు అధిక తర లాభమే కలుగుతుందిగాని. నష్టం ఆవగింజంతయినా ఉండదు. అంతవరకు నిర్మాణాత్మకమైన కార్యక్రమాన్ని సాగించిందీ, ఐక్యతా ప్రచారం జరిపిందీ మే మొక్కరమే. అంతేకాదు. ఆహారము, ఉత్పత్తి దొంగ వ్యాపారము, హిందూ, ముస్లిం ఐక్యత మొదలైన జీవిత సమస్యలనుగురించి పరిశోధనలు చేశాం. వీటిలో కొన్నింటిని ప్రచురించాం. ఇంకా కొన్ని ప్రచురణకు సిద్ధంగా ఉన్నవి. మరే పుస్తకాలు చెల్లనంతగా ఆ పుస్తకాలు చెల్లాయి. జీవితాన్ని గురించి ప్రజలకు శ్రేయోదాయకంగా సమస్యలను పరిశీలించడం గురించి శ్రద్ధ వహించే వారందరూ ఈ పుస్తకాల నెంతో ప్రశంశించారు.

కాంగ్రెసువర్కర్ల అసెంబ్లీలు.

ఆనాడు దేశాన్నెదుర్కొన్న మూడు ప్రధాన సమస్యలనూ గాంధీజీ తీసుకొన్నారు. కాని ఒక్కదాన్నికూడ పరిష్కరించలేదు.

1. గెల్డర్ ప్రకటన తరువాతకూడా వేవెల్ గాంధీజీకి మొండి చెయ్యి చూపించాడు, దానితో కాంగ్రెసు యువకుల్లో బ్రిటిష్‌వారిపై ద్వేషం పెచ్చుపెరిగింది. కాంగ్రెసు పెద్దల్లో నిరాశా నిస్పృహలు ఎక్కువయాయి.

బ్రిటిష్‌వారి అహంకారాన్ని ఎదుర్కో లేక, ఆకోపాన్ని ఒకరిపై నొకరు వెళ్ళగ్రక్క నారంభించారు. రానురాను అది లీగు వ్యతిరేక, కమ్యూనిస్టు వ్యతిరేక ధోరణిగా రూపొందింది.

2. గాంధీ జిన్నాల సమావేశం విఫలమయింది. ఎందువల్ల అలా జరిగిందో నాయకులిద్దరూ వివరించలేదు. ప్రజలు నిర్మాణాత్మకంగా ఆలోచించడానికి నాయకుల్లో ఎవరూ దారిచూపలేదు. దానితో, ప్రజల్లో పునరాలోచన జరగడానికి బదులు, తప్పులెంచడం మితిమీరిపోయింది. విచ్ఛిన్నకర పరిస్థితులకు దారితీసింది. నిర్మాణాత్మకంగా ఆలోచించింది మేమొక్కరమే. రాజకీయాలంటే శ్రద్ధగలవారి మన్ననలను పొందాము. కాని, జాతీయపత్రికలన్నీ జిన్నాగారిని ఒక మహాపరాధిగచేసి. ఆయనపై విష ప్రచారం సాగించాయి. 'క్విట్ ఇండియా' ప్రచారంకన్నా ఇంకా ఎక్కువ ఆవేశాన్ని కుప్పించాయి. గాంధీజీపైనీ, కాంగ్రెసుపైనీ లీగు పత్రికలు దుమ్మెత్తి పోశాయి. ముస్లింలను బుట్టలో వేసుకోదలచిన హిందూ మోసగాడని ఆడిపోశాయి.

3. కమ్యూనిస్టులతో కలిసిపోయారని గాంధీజీని ఖండించారు కొందరు. గెల్డర్ సమావేశం మేము పన్నిన పన్నాగమేనని, గాంధీజీ జిన్నాను కలుసుకునేలా చేసింది మేమే అనీ వారు ప్రచారం చేశారు.

ఈరెండు సమావేశాలు నిష్ప్రయోజన మయాయి. దానితో మా వ్యతిరేకులు ప్లేటు మార్చారు. ఆనాడు కమ్యూనిస్టులతో కలిసిపోయారన్న గాంధీజీ, ఈనాడు కమ్యూనిస్టు వ్యతిరేక నిర్ణయం చేశారని గుసగుసలు ప్రారంభించారు.

ఈధోరణి హాస్యాస్పద మనుకున్నాం. కాని యిలాంటి చిలిపి మాటలకు కూడా ప్రచారం లభించేటంత అధ్వాన్నపు పరిస్థితులేర్పడ్డాయని మొదట్లో అనుకోలేదు. అవిషయాన్ని గుర్తించడానికి కొంతకాలంపట్టింది.

గాంధీజీ విడుదలయిన తరువాత కాంగ్రెసువాదులు జట్టులు జట్టులుగా విడుదల కాసాగారు. ఆగస్టుపోరాటం కాంగ్రెసు పోరాటమేననీ.

ఆగస్టు తీర్మానాన్ననుసరించి జరిగిందనీ వీరిలో చాలమంది నమ్మారు. కాంగ్రెసు కేలాంటి బాధ్యతలేదని గాంధీజీ అనడం ఒకరాజకీయపు ఎత్తుగడ అని వాదించారు. అంతవరకు కాంగ్రెసుపేరును దుర్వినియోగం చేస్తూ వచ్చినవారి వలలో తేలికగా పడ్డారు,

వీరిచెవినిల్లుకట్టుకొని వారు చేసిన దుర్బోధఇది :"మమల్ని, ఆగస్టు పోరాటంలో అసువులర్పించినయోధుల్నీ తనవారుకారు పొమ్మన్నాడు గాంధీజీ. మీరయినా మాకు తోడ్పడాలని అడిగేహక్కుమాకుంది, మీరు లేనప్పుడు కాంగ్రెసుజెండాను నిలబెట్టింది మేమే. బ్రిటిష్‌దౌర్జన్యాలు మా శక్తికిమించిన వయిపోయాయి. అయనప్పటికీ, అదివరకెన్నడూ ఎరుగని గొప్పవిషయాలను మేము సాధించాము. కొన్నిప్రాంతాల్లో, కొద్దిరోజు లయినా, కాంగ్రెసురాజ్యాన్ని స్థాపించగలిగాము. కమ్యూనిస్టులా—మాకడ్డం తగిలారు; మా వెన్నునపొడచారు."

ఈ ధోరణిలోనించేపుట్టాయి. "కాంగ్రెసును పునర్నిర్మించండి." "కమ్యూనిస్టులను వెళ్ళగొట్టండి."అనే నినాదాలు. జైలుకువెళ్ళిన కాంగ్రెసువాదులు బ్రిటిష్ వారిపై ఆరని ద్వేషాలతో బయటికి వచ్చారు. కాని, దేశంలో జరిగినఘటనలను గురించినపరిజ్ఞానంవారికి శూన్యం. జరిగినవాటిని గురించి, చిలవలు పలవలు కల్పించిచేసిన వర్ణనలను, నిజమే అని స్వీకరించారు. బ్రిటిష్‌వారిపై వీరిలో రగులుతూన్నద్వేషాన్ని కమ్యూనిస్టులపైకి మళ్ళించడానికి ప్రయత్నాలు జరిగాయి. "కమ్యూనిస్టులు ద్రోహంచేశార"న్నవాదనను అందుకు ఉపయోగించారు మా వ్యతిరేకులు.

ఇలాంటిపరిస్థితుల్లో ఏర్పడ్డాయి "కాంగ్రెసువర్కర్ల అంసెబ్లీలు" "ఇవి కాంగ్రెసు సమావేశాలుకావు; కొంతమంది కాంగ్రెసువాదులు ప్రత్యేకంగా జరుపుకుంటున్నసభల"ని సాకుచెప్పి కమ్యూనిస్టు కాంగ్రెసువాదులను, ఈ అసెంబ్లీ సమావేశాలకు రానివ్వలేదు. ఇలాఅన్న నోటితోనే, తాముచేసిన నిర్ణయాలను కాంగ్రెసు నిర్ణయాలంటూ ప్రజల్లో ప్రచారం చేశారు. ఇది కాంగ్రెసు కాదు ; కాబట్టి మీరు రాడానికి, వచ్చి మాట్లాడ

డానికి, హక్కులేదని కమ్యూనిస్టులకుచెప్పడం. ఇదికాంగ్రెసే; కమ్యూనిస్టుల నిది వెళ్ళగొట్టిందని ప్రజలలో ప్రచారంచేయడం. ఇదీ ఈఅసెంబ్లీ వారు ప్రవర్తించినతీరు.

మేమీ అసెంబ్లీలో చేరడానికి ప్రయత్నించలేదు. కాంగ్రెసు నిబంధనావళిపట్ల మాకున్న గౌరవమూ, కాంగ్రెసు సాంప్రదాయాలయెడల మాకుగల భక్తీ, మాకుగల క్రమశిక్షణ, మమ్మల్నీ సంస్థలకు దూరంగా ఉంచాయి.

1944 డిసెంబరు 15వ తేదీన లూధియానా (పంజాబు) లో కాంగ్రెసు వర్కర్ల సమావేశం జరిగింది. 700 వందలమందికి పైగా కాంగ్రెసు వర్కర్లు అక్కడికి వెళ్లారు. కమ్యూనిస్టులనీ, కమ్యూనిస్టు సానుభూతిపరులనీచెప్పి, వీరిలో 370 మందిని సమావేశంలోనికి రానివ్వలేదు. కాంగ్రెసు అసెంబ్లీపార్టీ ఛీఫ్ విప్ అయిన సర్దార్ సోహన్‌సింగ్ జోష్‌కీ; శాసనసభలో కాంగ్రెసు సభ్యుడూ, అకాలీ ఉద్యమంలో కాకలు తీరిన స్వాతంత్ర్య యోధుడూ అయిన సర్దార్ తేజ్‌సింగ్‌స్వతంత్రకీ అందులో స్థానంలేకపోయింది.

కాంగ్రెసు నాయకత్వంక్రింద స్వాతంత్ర్య పోరాటమే జీవితంగా గడుపుతూవచ్చిన తమ కిలాంటి అవమానం జరిగినందుకు ఆ కమ్యూనిస్టులు బాధపడ్డారు. కాని తమ దేశభక్తియుత ధర్మాన్ని మరచిపోలేదు. లూధియానాలో అలా 'వెలి' వేయబడిన 370 మందీ ఒక సభజరిపి ఒక తీర్మానం చేశారు. అందులో ఇలావుంది:

“ప్రస్తుత పరిస్థితులు అతిక్లిష్టమైనవి. కాంగ్రెసు సంస్థపై ఇంకానిషేధంవుంది. కాంగ్రెసునాయకులింకా జైళ్లలో మ్రగ్గుతున్నారు. ఈపరిస్థితుల్లో గాంధీజీ ఏకైకనాయకత్వంక్రింద ఒక్కత్రాటిని నడవలసిన బాధ్యత కాంగ్రెసువాదులందరిపైన ఉంది. ఆహార సమస్యను పరిష్కరించడానికీ, ప్రజా కార్యక్రమాలను పునరుద్ధరించడానికీ. మార్గంగా జాతీయైక్యతను నిర్మింప కృషి చేయాలి. ప్రస్తుత ప్రతిష్టంభనను భగ్నంచేయడాని కిదొక్కటే

పద్ధతి. స్వాతంత్ర్య గమ్యస్థానానికి మనల్ని ముందుకు తీసుకుపోగలది యీ మార్గమే.”

(పీపుల్సువార్ - సంపుటి 3, సంచిక 27, 1944 డిసెంబరు 31)

లూధియానా సమావేశంలో ఏర్పడిన కమిటీ నాయకత్వం క్రిందే పనిచేయాలనికూడా తీర్మానించుకున్నారు. కాని ఆ సమావేశకర్తలు వీరి విజ్ఞప్తిని పాటించలేదు. వీరుకూడావచ్చి పనిచేయడం కమ్యూనిస్టు వ్యతిరేకులకు నచ్చలేదు.

కమ్యూనిస్టు వ్యతిరేకత

ఈ అసెంబ్లీలలో జరిగిన ఉదంతాలు కాంగ్రెసుచరిత్ర కేమాత్రం వన్నె తేజాలవు.

ఇవి చేసిన తీర్మానాల్లో అధికభాగం మాటవాసికిచేసినవే. అవి నిర్మాణశూన్యం. గాంధీజీపట్ల విశ్వాసం ప్రకటిస్తూ, జిన్నాపై నిప్పులు చెరగడం సర్వసాధారణ విషయం. గాంధీ-వైస్రాయి లేఖల నాధారంగా తీసుకొని, ఆయా రాష్ట్రాలలో జరిగిన ఘటనలను పరిశీలించడం మచ్చుకైనా లేదు. ఒక్క యు. పి. రాష్ట్ర కాంగ్రెసువాదులు మాత్రం సిద్ధాంత రీత్యా స్వయంనిర్ణయసూత్రాన్ని చర్చించడానికి ప్రయత్నించారు. కాని ఫలితం ? గాంధీజీ వచ్చినంతమేరకయినా రాలేక, మళ్ళా వెనుకటిదశకే వెళ్ళారు.

ప్రతిష్టంభనను అంతమొందించగల సూచనలు చేసిన పుణ్యాన ఒక్క రాష్ట్రఅసెంబ్లీకూడా పోలేదు. యుద్ధం పూర్తిఅయేవరకూ ఏమీ లాభంలేదు; రాబోయే పోరాటానికి సంసిద్ధం కావడమే ఈలోగా చేయగల'పని అన్నదే వీటిలో ప్రధానంగా కనబడిన ధోరణి. యువకుల నుద్దేశించి. విప్లవ పదజాలాన్ని ప్రయోగించి 'ఆగస్టు 9' ప్రకటించిన అభిప్రాయాలే ఇవి. దానికీ దీనికీ గల వ్యత్యాసం ఏమంటే, ఆ ప్రచారం రహస్యంగా సాగించింది. వీరు 'నిజమైన కాంగ్రెసు' అభిప్రాయాలంటూ, చట్టసమ్మతమైన రూపంలో జరిపిన ప్రచారమిది.

రాజకీయంగా దేశం ఏమయిపోతూందో అని ఆలోచించిన అసెంబ్లీ' ఒక్కటిలేదు. అప్పటిమట్టుకు దేశానికి అధోగతి తప్పదని నిర్ణయం చేసేసుకున్నారు. (జపానువారు వస్తే తప్పవచ్చునేమో అనుకున్నారు. కాని కాంగ్రెసు సభల్లో ఆ మాటలు చెప్పడంఎలా ?) ఇదంతా వారికి అప్రధానమైంది. కాంగ్రెసుసంస్థపై పెత్తనం చేజిక్కించుకొనడం ఎలా అన్నదే ప్రధానమైంది. ఒకవేళ జపానువారు రాకపోయి ఇటు గాంధీ బ్రిటిష్‌వారికి లొంగిపోతూ" మరోవైపు జిన్నాను "సంతృప్తి" పరుస్తూ చివరకు పరిష్కారం కుదుర్చుకొని, కాంగ్రెసుపై నిషేధాన్ని రద్దు చేయించేస్తే, అది తమచేతిలోనుంచి జారిపోకుండా చేసుకోవాలి. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చేతుల్లోనుంచి అధికారాన్ని గుంజుకుంటామని బయలు దేరారు. చివరకు కాంగ్రెసుపై పెత్తనం చేజిక్కించుకోవాలనే పన్నాగాలకు దిగజారారు.

ఈ పరిస్థితుల్లో కాంగ్రెసు అసెంబ్లీలు సమావేశమయ్యాయి, విడుదలయిన కాంగ్రెసువాదులు కానీయండి, అసలు జైలుకు వెళ్లనివారు కానీయండి — ఆగస్టు తీర్మానాన్ని, దాని తరువాత జరిగిన ఘటనలను సమర్థించినవారికే వాటిలో స్థానం లభించింది.

కాంగ్రెసు నాయకులుగా పేరుగన్న వారిచుట్టూ ముఠాలు కట్టారు. వాటికి ప్రధానసూత్రం ఒక్కటే — కమ్యూనిస్టులను తీవ్రంగా ఎదుర్కొవడం, ఈ సూత్రాన్ని తు. చ. తప్పకుండా అనుసరిస్తే పూర్తిగా తోడ్పడతామని 'ఆగస్టు వర్గాలు' వీటికి హామీ ఇచ్చాయి. వీరిని వారూ, వారిని వీరూ తమ స్వప్రయోజనాలకు బాగా ఉపయోగించుకుంటున్నామని తృప్తి పడ్డారు.

ఇదంతా అక్రమమని చిత్తశుద్ధిగల కాంగ్రెసువాది ఎవరైనా నోరెత్తి సాహసిస్తే. "స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలర్పించిన వీర యోధులకూ, పోలీసులచేత తరుమబడుచున్న త్యాగమూర్తులకూ ద్రోహం చేస్తారా ?" అని చెప్పి వాళ్లనోరు మూయించారు.

'స్వాతంత్ర్యం' పేరుచెప్పి, 'హింసాకాండకు గురిఅయినవారి క్షేమంకోసం' అనిచెప్పి వారు తమ అంతరాత్మను చంపుకొనేలా చేశారు.

ఈ ముఠాల్లో వేటిలోనూ చేరకుండా ఉండిన కాంగ్రెసువాదుల్లో చాలమంది ఇదంతాచూచి సిగ్గుపడ్డారు. వీరిలో గాంధీవాదులూ ఉన్నారు. మితవాదులూ ఉన్నారు. ఈ కాంగ్రెసు అసెంబ్లీసమావేశాల వివరాలను 'పీపుల్స్‌వార్'లో ప్రకటించాం.

కేరళ కాంగ్రెసు సమితి	సంపుటి 3	సంచిక 25
ఢిల్లీ కాంగ్రెసువాదుల సమావేశం	,,	సంచిక 26
బెంగాల్ కాంగ్రెసు వర్కర్ల సమావేశం	,,	సంచిక 27
పంజాబు కాంగ్రెసువర్కర్ల సమావేశం	,,	సంచిక 27
తమిళనాడు కాంగ్రెసు సంఘం	,,	సంచిక 33
బీహారు కాంగ్రెసువాదుల సమావేశం	,,	సంచిక 33

రాబోయే సమరానికి "గాంధీగారే నాయకులుగా ఉండాల"ని అంగీకరించడం. "ఆగస్టు విప్లవా"నికి ఒక హోదానివ్వడంకోసమే; ఆవిధంగా ఆగస్టు ఘటనలను గురించి గాంధీజీ చెప్పినదానినంతా రద్దుచేయడం కోసమే! ఆగస్టు పోరాటాన్ని ప్రస్తుతించడంతోనే, కాంగ్రెసులోనుంచి కమ్యూనిస్టులను వెళ్ళగొట్టాలనే నినాదం ప్రారంభమయింది. కొన్నిరాష్ట్ర అసెంబ్లీలు తమ స్వంత అధికారంమీద వెళ్ళగొట్టాయికూడా. మరికొన్ని అసెంబ్లీలు ఇంకోఅడుగు ముందుకు పోయాయి. కమ్యూనిస్టులతోను, లీగు సభ్యులతోనూ ఏవిషయంలోనూ కలసి పనిచేయకూడదని నిషేదించాయి. ప్రజల క్షేమంకోసమయినా సరే కమ్యూనిస్టులతోకలిసి పనిచేయడమంటే కాంగ్రెసులో ఎలాంటి స్థానంలేకుండా పోవడమన్నమాటే.

గాంధీవాదులను సంతృప్తిపరచడానికి నిర్మాణ కార్యక్రమమంటూ ఒక మంత్రాన్ని వల్లించేవారు. ఆచరణలో మాత్రం అది హుళక్కి.

ఈవిధంగా జరిగిన సభలు, సమావేశాల పర్యవసానమేమిటి? కమ్యూనిస్టువ్యతిరేకత, కాంగ్రెసు అధికారవిధానంగా చెలామణీ కాసాగింది

అలా వీలుకానిచోట్ల అధిక సంఖ్యాక కాంగ్రెసువాదుల అభిప్రాయంగా ప్రచారమయింది. వారికి కావలసిందీ అంతే— మరేమీ అక్కరలేక పోయింది. గాంధీ వైస్రాయి జాబులవల్ల తమకు కలిగిన నష్టాన్ని ఈ విధంగా పూడ్చుకోప్రయత్నించారు.

ఆదశలో మేము చేసిన పని

ఈపోకడలవల్ల కలిగే ప్రమాదాన్ని మేమప్పుడు తక్కువ అంచనా వేశాం. వారంతవరకూ అనుసరిస్తూ వచ్చిన విధానాలు వాటి బండారాన్న వే బయట పెట్టుకోవడం చూచాము. గాంధీజీ లేఖలు బయటపడిన తరువాత వీరి వాగాడంబరానికిక నెవరూ భ్రమసిపోరనుకున్నాం. అక్కడే పొర పాటు పడ్డాం.

వేవేల్‌తో సంప్రదించడానికి, జిన్నాతో ఒడంబడిక కుదుర్చుకోడా నికి గాంధీజీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆ తరువాత దేశాన్ని ముందుకు నడిపే మరొక మార్గం ఆలోచించడానికి బదులు. గాంధీజీ మౌనం వహించారు. ఆ మౌనం ఫలితంగా దేశంలో రాజకీయ శూన్యా వస్థ ఏర్పడింది. బ్రిటిష్‌వ్యతిరేక వాగాడంబరం ఈ శూన్యాన్ని నింపగలుగు తుందని మేము ఊహించలేకపోయాం. వట్టిద్వేషము, నిస్పృహభావాలతో నిండివున్న నినాదాలు అట్టే కాలం నిలవగలవని మేమనుకోలేదు.

నిర్మాణాత్మకమైన మా కార్యక్రమాలను, ప్రతిష్టంభనను భగ్నం చేయాలనే రాజకీయాందోళనను తదేక దీక్షతో కొనసాగిస్తూ వచ్చాం. దేశ పరిస్థితుల్ని మరింత కళంకితం చేయకుండా సవ్యమైన మార్గానికి తేడాని కిదే పద్ధతి అని నమ్మాం.

మిమ్మల్నెరిగి. మాతో కలిసి పనిచేసిన స్థానిక కాంగ్రెసువాదులూ, జిల్లా, రాష్ట్ర కాంగ్రెసు నాయకులూ, మాకు వ్యతిరేకంగా సాగుతూన్న ప్రచారాన్నీ, చర్యలనూ ఎంతో అసహ్యించుకున్నారు. ఈ ప్రచారమూ, ఈచర్యలూ ఏవిధంగానూ సమర్థింపరానివనీ, కాంగ్రెసు సంప్రదాయాలకే భిన్నమనీ గుర్తించారు. అంతేకాదు. ఆగస్టు తీర్మానాన్నిగురించి తదనంత

XII

మీరు దురభిప్రాయ పడుతున్నారు

జైలునుంచివచ్చిందే తడువుగా మీరు మాపార్టీవిధానాన్ని, మాపార్టీ నిర్వహించిన పాత్రను ఖండించ నారంభించారు. మీరు జైలులోవున్న మూడు సంవత్సరాల్లోను దేశంలో ఏమిజరిగిందో తెలుసుకొనేటంత ఓపి కకూడా మీకు లేకపోయింది. ఆదశలో మేమనుసరించిన విధానాలను పరిశీ లించి తెలుసుకోవాలనే శ్రద్ధకూడా మీకు లేకపోయింది.

మేము "ఎదిరిపక్షంతో చేరిపోయామ"ని నెహ్రూపండితుడు, జంకూగొంకూ లేకుండాఅన్నారు. ప్రభుత్వంతో కలిసిపోయామని వారి భావం.

మా పైలాతీలను ప్రయోగించమని పట్టాభి సీతారామయ్యగారు ఆంధ్రకాంగ్రెసువాదులకు హితబోధచేశారు. ఒక్క కమ్యూనిస్టుకయినా కబురుపంపి, వాళ్లు చెప్పదలుచుకుందేదో విందామన్న బుద్ధే ఆయనకులేక పోయింది. పైగా, ఆంధ్రకమ్యూనిస్టులకు నాయకుడూ, లోగడఏ.ఐ.సి.సి. సభ్యుడూఅయిన పుచ్చలపల్లి సుందరయ్య, కమ్యూనిస్టులు కాంగ్రెసు సమస్యనుగురించి చర్చిద్దామని వెళితే, చర్చింప నిరాకరించారాయన.

చేయదలచుకుందేదో మీరదివరకే పక్షపాతదృష్టితో నిర్ణయం చేసు కున్నారనీ, మేము వెంటనే గ్రహించాము. యదార్థపరిస్థితులను బట్టికాక, మీ బుర్రల్లోఉన్న దురభిప్రాయాలనుబట్టే మీరు నిర్ణయాలుచేస్తున్నారని మాకు స్పష్టమయింది. యుద్ధాన్ని "ప్రజాయుద్ధమ"ని పేర్కొన్నంతమాత్రం చేత మమ్మల్ని ఖండించడం సబబయినపనేఅని అనుకున్నారుమీరు.

ఇంతత్వరగా మీరిలాంటి నిర్ణయాలకెలా రాగలిగారు. మీకున్న ఆధారాలేమిటి? జైలులో ఉంటుండగా ఎవరిచర్యలనైతే మీరు ఖండిం చారో, వారుచేసిన ఫిర్యాదులు, తెలిపిన విషయాలేకదా మీ ఎదుటఉన్నవి?

లోగడతామనుకున్నదంతా జరక్కపోయినందుకు కాంగ్రెసు సోషలిస్టులు మాపై నిందలు, నేరారోపణలు కురిపించడంతప్ప మరొకటిచేయరని మీకు తెలియదా? కొత్తగాఏర్పడిన కాంగ్రెసు అసెంబ్లీలు, దురభిప్రాయాలకు పరవశులై. కమ్యూనిస్టు వ్యతిరేకుల ప్రోత్సాహంతో, మమ్మల్ని దేశద్రోహులంటూ వెలివేయడం మీరెరుగరా -

ఇంతజరిగినా మే మోపికపట్టాం. ఆగస్టు రోజుల్లో మాకార్యక్రమం మీ ఎదుట విచారణకు వచ్చేటప్పుడు, మీరు అపోహలు పోనాడి న్యాయ దృష్టితో పరిశీలిస్తారని ఆశించాము.

మీ సబ్‌కమిటీ రిపోర్టు ఈ ఆశను అడియాస చేసింది. మాపార్టీ విధానాన్నిగాని, ఆదశలో మేమన్న మాటలను, చేసిన పనులను గానిజాగ్రత్తగా పరిశీలించడానికి మీ రేమాత్రమూ ప్రయత్నించలేదు. ఇది మా కెంతో బాధ కలిగించింది.

మా వ్యాసాల్లోనుంచి, ఉపన్యాసాలలోనుంచి కొన్ని మాటలను, సందర్భ శుద్ధిలేకుండా తీసి అపార్థాలను వచ్చేలా ఉదహరించడలోనే పై విషయం స్పష్టమవుతూంది. ఇంకొకరెవరో ఈ ఉదాహరణలను ఏర్చి తీసినట్లూ, వాటిని మీరు మీరిపోర్టులలో కూర్చినట్లూ కనబడుతూంది.

ఇలాంటివాటిపై మీ రెందు కాధారపడాలి? మా పాలసీకి సంబంధించిన పత్రాల నన్నిటినీ మమల్నడుగకూడదా? సంతోషంతో వాటి నన్నిటినీ మీ కిచ్చేవారమే! ప్రజల్లో ప్రచారం చేసిన వాటినే కాకుండా మాపార్టీ సభ్యులకోసం ప్రత్యేకించిన వాటివికూడా మీముందు పెట్టేవారిమి. కమ్యూనిస్టులమయిన మాకు దాచుకోవలసిన వేవీ లేవన్న సంగతి మీరు గ్రహించాలి. మా ఆర్థిక విషయాలను గురించి గాంధీజీ ప్రశ్నించినపుడు మా అకౌంట్ పుస్తకాల నన్నిటిని వారి ఎదుట బెట్టడానికి సిద్ధమయామన్న సంగతి మీకు తెలిసిందే. ఆ విధంగా మా పాలసీకి, మా కార్యకలాపాలకు సంబంధించిన పత్రాలను అడిగి తెలుసుకుందామనే శ్రద్ధ మీకు లేకపోయింది.

రం జరిగిన ఘటనలను గురించి గాంధీజీ రాసినదానికీ, విడుదలయిన తరువాతనే బ్రిటన్‌తో ఒడంబడికకోసం. లీగుతో ఐక్యతకోసం వారు చేసిన ప్రయత్నాలకూ కూడా అవి ప్రత్యక్ష విరుద్ధాలని గుర్తించారు.

ఈవిషయం గుర్తించినప్పటికీ వారు నోరుమెదపక ఊరుకున్నారు. వాటిని ఖడించనూలేదు; మమ్మల్ని సమర్ధించనూలేదు; అంతా మీవిడుదల కోసం ఆతృతతో ఎదురుచూచారు. నానాటికీ పెరిగిపోతున్న సమస్యలను మీరువచ్చి తప్పక పరిష్కరిస్తారని అందరూ కాచుకూర్చున్నారు. బరువెక్కిన హృదయాలతో, నిష్కల్మషమైన అంతరాత్మతో మా కార్యకలాపాలను మేముసాగిస్తునే వచ్చాం.

మీ విడుదలకోసం ఎదురు చూడడంతో మే మూరుకోలేదు. మీవిడుదలకోసం కృషిచేశాం. గాంధీజీ దేశాన్ని కొంతవరకు ముందుకు తెచ్చి విడిచిపెట్టారు, వర్కింగ్‌కమిటీ సభ్యులైన మీరు అక్కడనుంచి ఇంకా ముందుకు తీసుకుపోతారని ఆశించాం.

ఆగస్టు ఘటనలు కాంగ్రెసువాదుల్లో తెచ్చిపెట్టిన గందరగోళాన్ని మీరు సరిచేస్తారనుకున్నాం. నెహ్రూగారు తన నవీన దృక్పథంతో, బూజుపట్టిన పాతభావాలను ప్రతిఘటించగలరని ఆశించాము.

నాయకత్వం లేకపోవడంవల్ల, ప్రజల్లో అణగిఉన్న జాతీయ భావాలు విచ్ఛిన్నకరపోకడలు పోసాగాయి. దేశాభివృద్ధికే భంగంకలిగే పరిస్థితులేర్పడ్డాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి గాంధీజీ కొంత ప్రయత్నించారు. మీరందరూ కలిసి ఆలోచించి గాంధీజీకన్నా ముందుకు పోతారనుకున్నాం. ఆధునిక ప్రపంచాన్ని అర్ధంచేసుకుని, దేశానికి చక్కని మార్గం చూపిస్తారని కొండంత ఆశతో ఎదురు చూశాం.

మా ఆశలన్నీ అడియాసలైనందుకెంతో బాధపడ్డాం.

మాపై మీ దుష్ప్రచారం

జాతీయ సంస్థల్లో తలమానికము కాంగ్రెసు. ఆసంస్థ నాయకుల్లో అగ్రగణ్యులు మీరు. అలాంటి మీరు మాపైని నేరారోపణను రుజువు చేసుకోవడానికి టాటన్‌హాం మాటలనుకూడా ఆధారంగా తీసుకుంటారని మేము కలలోనయినా అనుకోలేదు. సామ్రాజ్యవాద ఏజంట్లయిన టాటన్‌హాంది దుష్ప్రచారానికి పెట్టింది పేరు. మీపై నానా దుష్ప్రచారం సాగించింది ఈ టాటన్‌హామే.

1943 ఫిబ్రవరిలో "అల్లరులకు కాంగ్రెసు బాధ్యత" అన్న పుస్తకాన్ని ఈ టాటన్‌హాం ప్రచురించాడు, అప్పుడు అతని పచ్చి అబద్ధాలను తూర్పారబట్టినవారిలో మేము మొట్టమొదటివారమన్న సంగతి మీకు తెలియదా ?

1943 మార్చి 14 వ తేదీన వెలువడిన 'పీపుల్సువార్'లో బి. టి. రణదివె 'బాధ్యులెవరు ?' అని ఒక వ్యాసాన్ని రాశాడు. టాటన్‌హాం రాసిన పచ్చి అబద్ధాలను అందులో తీవ్రంగా ఖండించాం. మరే ఇతర జాతీయ పత్రికా అంత తీవ్రంగా ఖండించలేదు.

> "పరస్పర-విరుద్ధమైన మాటలతోనూ, వట్టి బుకాయింపులతోను, ఆధారంలేని ఆరోపణలతోను ఇది ('అల్లరులకు కాంగ్రెసు బాధ్యత') నిండివుంది. కాంగ్రెసుపై యిది రుజువుచేసిన నేరం ఒక్కటే — అది దేశభక్త సంస్థ; దేశరక్షణకోసం జాతీయ ప్రభుత్వాన్ని కోరుతూన్న సంస్థ అన్నదే ఆ నేరం. ఇంతకు మినహా అది రుజువుచేసింది మరేమీలేదు.
>
> "మహాత్మునిపట్ల, కాంగ్రెసుపట్ల ప్రభుత్వం అవలంబించిన విధానం సబబైనదని ఇది ఏమాత్రమూ నిరూపించలేకపోయింది. పైగా మే, జులై, ఆగస్టు మాసాల్లో కాంగ్రెసు చేసిన తీర్మానాలను అనుబంధంలో ఉదహరించారు. ప్రభుత్వ విధానంపై ఇంతకన్నా తీవ్రమైన ఖండన ఇంకొకటి ఉండబోదు...."
>
> (పీపుల్సువార్ - సంపుటి 1; సంచిక 36; 1943 మార్చి 14)

ఆవిధంగా అతని అసత్యప్రచారాన్ని యెదుర్కొని మిమ్మల్ని సమర్థించాము. కాని. ఈనాడు మీరుచేస్తున్నదేమిటి ? మమ్మల్నిఖండించడానికి ఆ విషప్రచారకునే ఆధారంగా తీసుకున్నారు.

ఆ సర్క్యులర్‌లోనే టాటన్‌హాం అన్న తక్కిన మాటలను మరుగుపరచి, మీకు ఉపయోగపడేవాటినే ఎత్తి ఉదహరించారు. ఇది మరింత విచారకరము. ఆ సర్క్యులర్‌ని టాటన్‌హాం రాష్ట్రప్రభుత్వాలకు పంపించాడు మా పార్టీని ఒకకంట కనిపెడుతూఉండవలసిందని దీనిలో హెచ్చరించాడు. అతనిలా అన్నాడు :

> "ఈ పార్టీ మాటల్లో అంతర్జాతీయతను అనుసరిస్తున్నప్పటికీ ప్రధానంగా ఇది భారతదేశ స్వాతంత్ర్యం కోసం కృషిచేస్తూన్న ఒక జాతీయపక్షమే. బ్రిటిష్ పరిపాలనను అంతమొందించడం ఆశయంగా పెటుకుంది కాబట్టే దీని సభ్యుల్లో చాలమంది ఆకర్షింపబడ్డారు."
>
> ('పీపుల్సువార్' - సంపుటి 3, సంచిక 42 - 1945 ఏప్రిల్ 15)

ఈమాటలను మీరెందుకు మరుగుపుచ్చారు ? మేము ప్రభుత్వంతో ఎంతమాత్రం కలియలేదన్న విషయాన్ని తేటతెల్లం చేస్తూందనా ఈ భాగాన్ని కప్పిపుచ్చారు ?

మేము అంతర్జాతీయత మంత్రాన్ని వల్లించే జాతీయవాదులమని టాటన్‌హాం అంటాడు. జాతీయతను గంగకలిపిన అంతర్జాతీయవాదులమని మీరు మమ్మల్ని వర్ణిస్తున్నారు: మీ ఇద్దరిదీ పొరపాటే. ఇద్దరి పొరపాటుకీ కారణంకూడా ఒక్కటే.

మేమేగాని నిజంగా అంతర్జాతీయవాదులమయినట్లయితే, కాంగ్రెసుపై ప్రభుత్వం తీసుకున్న చర్యను ఖండించి ఉండకూడదని టాటెన్‌హాం అనుకున్నాడు.

నిజమైన జాతీయవాదులం మేమే అయినట్లయితే, మీ పొరపాటు పంథాలను, కొన్ని గ్రూపులు సాగించిన విధ్వంసకకార్యక్రమాలను మేము విమర్శించి ఉండకూడదని మీ అభిప్రాయం.

మా పార్టీ విధానం మీ దృక్పథాలకు అనుగుణ్యంగా ఉండాలనే మీయిద్దరి అభిలాష. మా తీర్మానాన్ని దుర్వినియోగం చేశారు.

1942 సెప్టెంబరులో మా పార్టీ సెంట్రల్‌కమిటీకి పి. సి. జోషి, జి. అధికారీలు చేసిన రిపోర్టులోని భాగాలంటూ మీరు ఏవో కొన్నింటిని ఉదహరించారు.

ఇవి సక్రమమయిన ఉదాహరణలు కానేకావు. కావాలని అపార్థాలు వచ్చేలా ఈ భాగాలను తీశారు. మీ ఉదాహరణలను, అసలు రిపోరులోని భాగాలను ఇక్కడిస్తున్నాం, మా సెంట్రల్‌కమిటీ సభ్యులూ, రాష్ట్ర నాయకులూ కలిసి జరిపిన సమావేశంలో కామ్రేడ్ అధికారి ఇచ్చిన రిపోర్టే ఇది.

మీరు ఉదహరించినది :

"అజాద్ మొదలైనవారున్న ఫాసిస్టు వ్యతిరేక గ్రూపు ఒకటి. రెండవదానిలో గాంధీజీ. పటేల్, రాజేంద్రప్రసాద్ మొదలైనవారున్నారు. యుద్ధ పరిశ్రమలను, రవాణా సౌకర్యాలను స్తంభింపజేసి బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని లొంగదీయాలని ఈ రెండవ గ్రూపుయొక్క ఉద్దేశం. వర్కింగు కమిటీలో ఈ గ్రూపుదే పై చేయి అయింది. అందువల్ల అల్లరుల సమయంలో రవాణా సౌకర్యాలు, రోడ్లపైని, బ్రిడ్జిలపైని రాకపోకలు, పారిశ్రామిక ఉత్పత్తి దెబ్బతినడం, అరాజకచర్యలు సాగడం ఈ రెండవగ్రూపుయొక్క భావాలను అనుసరించే జరిగాయన్నమాట."

అసలు రిపోర్టులోని భాగం

"బొంబాయి ఏ. ఐ. సి. సి. జరిగింది. వర్ధా తీర్మానం ఆమోదింపబడింది. కాని, రెండు విభిన్నపక్షాలున్నట్లు స్పష్టమవుతూంది. జరిగిన తీర్మానం ఒక్కటేఅయినా ఈరెండూ దానిపట్ల అవలంభించిన దృక్పథాలు

వేరు. (1) ఫాసిస్టు వ్యతిరేకపక్షం. దీనిలో అజాద్ మొదలైనవారున్నారు, వాళ్ల దృష్టిలో ఈ తీర్మానం వట్టి బెదరింపుమాత్రమే. దీనివల్ల అసలు పోరాటమే అవసరంలేకుండా చేసుకోగలమని వారినమ్మకము. (2) రక్షణ సన్నాహాలకు గట్టి దెబ్బతీస్తే ప్రభుత్వం లొంగివస్తుందని హృదయపూర్వకంగా నమ్మేవారు రెండవపక్షం; వెనుకటి దృక్పథమే ఈ విధంగా వ్యరాకదశకు వచ్చింది. ఈ పక్షాన్ని ఫాసిస్టు అనుకూల పక్షమని పిలవడం చాల తప్పు. అసలు విషయం ఏమింటే—పరిస్థితులపోకడ, వారనుసరిస్తూవచ్చిన విధానము, వారిచేత ఫాసిస్టులకు అనుకూలపడే పనులను చేయించాయి. చొరవతీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం చేతిలో విడిచిపెట్టడంవల్లనే ఇలా జరిగింది."

అప్పటికి ప్రారంభదశలో ఉన్న ఆగస్టు పోరాటాన్నిగురించి అందులో ఇలాఉంది :

"మొదటి రెండురోజుల్లో జరిగిందంతా వట్టి అరాజకచర్య అన్నమాట నిజమే. ఆ తరువాత కొన్నివర్గాలు జోక్యం కలిగించుకొని దానికొక స్వరూపాన్ని తెచ్చాయి. పైన పేర్కొన్న రెండవ పక్షం (రాజేంద్రబాబు, గాంధీజీ వ్యాసాలు వగైరా) ఏరూపాన్నయితే ఊహించిందో ఆ రూపాన్నే ఇచ్చారు. ఇప్పుడు సాగుతూన్న పోరాటం, ఇంచుమించుగా, కాంగ్రెసునాయకత్వంలో కొన్ని వర్గాలు ఊహించిన పద్ధతులపైనే సాగుతూంది."

(6 వ పేజీ.)

మీరుపేర్కొన్న ఉదాహరణను సప్లయిచేసినవానిది ఎంతకుటిల బుద్ధో మీకిప్పుడు స్పష్టంకాగలదు. ఈ జవాబులో "వంకరటింకర మార్గంగుండా ఆగస్టువైఖరి" అనే భాగంలో మీ ప్రకటనలను కొన్నిటిని ఉదహరించాము. వాటిలో రుజువవుతున్నదానికన్నా అధికారిచెప్పిందాంట్లో విశేషం ఏమీలేదు. ఆనాడు జరుగుతూన్న ఘటనలను మాపార్టీ నాయకులూ, సభ్యులూ సవ్యంగా అర్థంచేసుకొనుటలో తోడ్పడదానికే కామ్రేడ్ అధిక్కారి ఆ రిపోర్టిచ్చాడు.

యుద్ధంవిషయంలో మీకూ మాకూగల అభిప్రాయభేదాలనుగురించి ఆరోజుల్లో మేము ప్రస్తావించనేలేదు. మా పత్రికలను చదివినవారూ, మా ఉపన్యాసాలను విన్నవారూ ఎవరయినా మీకీ విషయాన్ని రుజువు చేయగలరు, ఆరోజుల్లో మిమ్మల్నిగురించి మా ముఖ్యనినాదాలివి.

"వారందరూ ఫాసిస్టు వ్యతిరేకులే. దేశాన్ని రక్షించాలనే వారి తహతహ. ఆరక్షణను జయప్రదంగా సాగించడంకోసం వారు జాతీయ ప్రభుత్వాన్ని కోరారు. తక్షణం వారిని విడుదలచేయాలి. పరిష్కారం కోసం సంప్రదింపులు జరపాలి!"

యుద్ధాన్నిగురించి మీకూ మాకూగల అభిప్రాయ భేధాలు దేశభక్త కుటుంబంలోని అభిప్రాయ భేదాలుగానే మేము పరిగణించాము. మనలో మనం చర్చించి తీర్చుకోవలసిన విషయాలుగానే భావించాం. మీరు బయటికి వచ్చినతరువాత! అప్పటికది ఇంకా పరిష్కారం కాకుండా ఉంటే మీతో చర్చించాలనుకున్నాం.

ఆరోజుల్లో మేము ప్రచురించిన వ్యాసాలు మొదలైన వాటినుండి విస్తారంగా ఉదాహరణలు తీసి చూపించాము; మేము. టాటన్‌హాంకన్నా ముందే బయలుదేరి, ఆగస్టు అల్లరులకు బాధ్యతనంతా మీనెత్తిని రుద్దామని మీరు ఆరోపణజేయడం న్యాయమేనేమో మీఅంతరాత్మనేఅడగండి. నిజంగా జరిగిందేమిటి? టాటన్‌హాం మీపై అల్లిన అసత్యాలను తూర్పారబట్టి దేశంలోనూ, మా సోదర పార్టీలద్వారా విదేశాల్లోనూ, మిమ్మల్ని సమర్థిస్తూ వచ్చాము.

భూలాభాయ్ నిర్ణయం

మారచనల్లోనుంచి ఉదాహరణలను పేర్కొన్న పద్ధతినే మీరు శ్రీ భూలాభాయ్ నిర్ణయం విషయంలోకూడా అవలంబించారు. కాంగ్రెస్ యొక్క "భావాలకు, విధానానికి" వ్యతిరేకమైన ప్రచారం సాగించామని శ్రీ భూలాభాయ్ దేశాయిగారిచ్చిన నిర్ణయానికి "చాల ప్రాధాన్యత" ఉండవి మీరన్నారు. అది పి. సి. జోషీ కోరినమీదట దేశాయిగారిచ్చిన నిర్ణయమవడమే అప్రాధాన్యతకు కారణమన్నారు.

మాపై వచ్చిన నేరారోపణలను రాజాజీ, సరోజినీదేవి, భూలాభాయ్ దేశాయి— గౌరవనీయులైన ఈముగ్గురు నాయకులూ పరిశీలించాలని జోషి కోరారు. మీరాసంగతిని గుర్తించరేమి? 1944 సెప్టెంబరు 28తేదీన గాంధీజీకి రాసినజాబులో జోషీగారిలా రాశారు;

"మాపై జరిగిన విషప్రచారాన్ని గురించి రాజాజీ. సరోజినీదేవి. భులాభాయిదేశాయిలు మీతో ఏమిచెబుతారో తెలుసుకోవాలని మేమాతృతతో ఎదురుచూస్తున్నాం."

(గాంధీ - జోషీ లేఖలు)

మాపై వచ్చిన నేరారోపణల పూర్తి ప్రతిని మాకిచ్చి, వాటికి సమాధానం చెప్పగల అవకాశాన్ని కలిగించవలసిందని జోషీ కోరారు. ఈ సంగతిని కూడా మీరు మరుగుపుచ్చారెందుకు? కమ్యూనిస్టు వ్యతిరేకులు తమ నదివరకే కమ్యూనిస్టు పక్షపాతులని ఆడిపోస్తున్నారుకాబట్టి యీ విషయమై తమ అభిప్రాయాన్ని ప్రకటించజాలమని రాజాజీ. సరోజినీదేవి అన్నారు. దీనికి మీరేమంటారు?

ఈ నేరారోపణ పత్రాలు తనవద్ద 11 మాసాలు పడివున్నప్పటికీ భూలాభాయిగారు దానిలో ఒక్కదాన్నికూడా సంజాయిషీకోసం మావద్దకు పంపలేదు. ఈ విషయాన్ని మీరు వెల్లడిచేయరెందుకు?

మేము చెప్పదలచుకున్నదేదో వినకుండానే భూలాభాయిగారు మాపై తీర్పుచెప్పారు. 'ప్రజాయుద్ధం' విషయంలో వారిలా అన్నారు;

"యూరపులో మొన్నమొన్ననే ముగిసిన యుద్ధాన్ని తాము ప్రజాయుద్ధంగా పరిగణిస్తున్నామని జోషీగారు నిష్కపటంగా ఒప్పుకున్నారు. అందుకు కారణాలను కూడా తెలియజేశారు."

"అంటే, ఆ విషయాన్ని తప్పించుకుపోవడానికి అవకాశంలేదన్న మాట" అని మీరు హేళనగా రాశారు.

దీనినిగురించేగాని భూలాభాయి దేశాయిగారు మా సంజాయిషీని అడిగివున్నట్లయితే, "అయ్యా, ఈ యుద్ధం ఒక్క యూరపులోనేకాదు: మన గుమ్మంలోకే వచ్చేసింది. ఆగస్టుకి పూర్వం వర్కింగుకమిటీ నాయకులే ఈ ప్రమాదాన్ని యెంతగానో గుర్తించారు. మీ రా విషయం మరచిపోయినట్లుంది" అని సమాధానం చెప్పేవారము.

ఆ యుద్ధాన్ని ఏ కారణాలచేత మేము 'ప్రజా యుద్ధమ'ని నిర్వచించామో; 'ప్రజాయుద్ధ' విధానాన్ని ఎలా అమలు జరిపామో సవివరంగా తెలియజేశాం. తప్పించుకొనిపోయేది మేము కాదని గుండెమీద చేయివేసుకొని చెప్పగలం.

భూలాభాయిగారు వ్రాసినదానిని మేము కాదవలేదని మీ రన్నారు. ఇది నిజంకాదు. వారి నిర్ణయం తెలిసిన వెంటనే మేము గాంధీజీకి రాశాము. పి. సి. జోషీ తీవ్రంగా నిరసిస్తూ ఇలా రాశారు:

"ఈనిర్ణయానికి రాడానికి భూలాభాయిగారికి ఏడాది పట్టింది. 'జడ్జి' గారు 'ముద్దాయి' ని పిలిచి నేరారోపణలకు సంజాయిషీ అడుగుతారని ఎదురు చూచాను. అధమపక్షంమాపైనున్న 'ఫిర్యాదు' లేమిటో పూర్తిగా తెలియజేస్తారనయినా ఆశించాను."

(1945 సెప్టెంబరు 5 వ తేదీని గాంధీజీకి జోషీ రాసిన జాబు)

ఒక్క 'ప్రజాయుద్ధం' విషయమేకాకుండా, మా నీతి నియమాలపై కూడా ఆరోపణలను దేశాయిగారి ఎదుట పెట్టారు. ఈ ఆరోపణ పత్రాలను మా కిప్పించవలసిందని జోషీగా రడిగారు. కాని వాటి నివ్వలేదు. పైన పేర్కొన్న జాబులోనే జోషీగా రిలా రాశారు:

"మీరుగాని, దేశాయిగారుగాని ఆ పత్రాలను మాకు పంపనందుకు విచారిస్తున్నాను. ఇప్పుడయినా వాటి ప్రతిని పంపవలసిందని కోరుతున్నాను. వాటిని; వాటికి మా సమాధానాలను ప్రకటిస్తాను. కమ్యూనిస్టు వ్యతిరేకులను పూర్తిగా బట్టబయలు చేయడానికి ఆ పత్రాలను

ప్రకటించడమే చాలునని మాకు బాగా తెలుసు. అందువల్లనే ఇంత పట్టింపుగా అడుగుతున్నాను."

"భూలాభాయిగారు కమ్యూనిస్టులను నిర్దోషులని ప్రకటించార"ని మీ రన్నారు. కాని పైన పేర్కొన్న జోషీగారి లేఖను చదవండి. దోషం కప్పిపుచ్చబడింది కమ్యూనిస్టు వ్యతిరేకులదే అని స్పష్టమవుతుంది.

మా పాలసీ విషయంలో మరో అంశానికూడా మీ సబ్‌కమిటీ రిపోర్టు అపార్థంకల్పించింది. 1942 ఆగస్టులోనూ, తదనంతరమూకమ్యూనిస్టులు, "ప్రభుత్వానికి పూర్తి మద్దతునిస్తూ వచ్చారు; యుద్ధకృషిని బేషరతుగా బలపరచాలని ప్రచారం చేస్తూ వచ్చారు" అని అన్నారు. ఇందులో ప్రతి అక్షరమూ సత్యదూరము. మిత్రమండలి సాగిస్తున్న యుద్ధానికే బేషరతుగా తోడ్పడాలని మేము మొదటనుంచీ ప్రచారంచేశాము. అంతేగాని, ఇండియాలో బ్రిటిష్‌ప్రభుత్వం, సామ్రాజ్యవాద పద్ధతులపై సాగిస్తున్న యుద్ధకృషికికాదు, ఈవిషయాన్ని మా జవాబులో మరోచోట వివరించాము.

యుద్ధస్వభావం మారినప్పటికీ, యుద్ధకృషియొక్క స్వభావంగాని, ఆకృషిని సాగిస్తూన్న ప్రభుత్వంయొక్క స్వభావంగాని మారలేదని మేము స్పష్టంగా ప్రకటించాము. "యుద్ధకృషి సామ్రాజ్యవాద. నిర్బంధ పద్ధతుల్లో సాగుతున్నది. అందువల్లనే అది జయప్రదంగా సాగడంలేద"ని మేము తెలియజేశాము.

అందువల్లనే యుద్ధకృషి విషయంలో, "ప్రజలకు శ్రేయోదాయకంగా ఉన్నప్పుడు తోడ్పడతాము; ప్రజలకు హానికరంగా ఉన్నప్పుడు ప్రతిఘటిస్తామ"ని స్పష్టపరిచాము. ప్రజల శ్రేయస్సుకు భంగం కలిగించే యుద్ధకృషికి మేమెక్కడ తోడ్పడ్డామో చూపించండని సవాలుచేస్తున్నాము

మీరిపోర్టులో ఉదాహరణలుగా పేర్కొన్న ఇతరవ్యాస భాగాలను గురించి వేరే చెప్పనక్కరలేదు. అవన్నీ ఒక్క తీరుగానే ఉన్నాయి.

సందర్భ శుద్ధిలేకుండా మా వ్యాసాల్లోనుంచి తీశారు; అపార్థాలు వచ్చేలా వికృతం చేశారు.

రెండు గొంతులు

మీ రిపోర్టులో మీ వైఖరిని వివరించిన తీరుకూడా వింతగా ఉంది.

ఆగస్టు తీర్మానంలోని పాలసీని, కార్యక్రమాన్ని వ్యతిరేకించామని మాపై నేరారోపణ చేశారు.

"ఏదో ఒక రూపంలో కాంగ్రెసువాదులందరూ పాల్గొన్న యీ ప్రజా ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ నిరంతర ప్రచారం చేశా" మని మాపైని నేరం మోపారు.

అలా అన్న నోటితోనే మరో నేరంకూడా మోపారు,

"ఆగస్టు తీర్మానం తరువాత జరిగిన ఘటనల కన్నిటికీ కాంగ్రెసూ, కాంగ్రెసువాదులే బాధ్యులని కమ్యూనిస్టులు నేరారోపణ చేశార"ని మమ్మల్ని నిందించారు.

ఆగస్టు తీర్మానా న్ననుసరించి కాంగ్రెసువాదులు నడిపిన ప్రజా ఉద్యమాన్ని వ్యతిరేకించామని ఒకవైపు నిందిస్తున్నారు. మరోవైపు కాంగ్రెసువాదులకు ఏలాంటి సంబంధమూ లేకుండా, ఆగస్టు తీర్మానం తరువాత జరిగిన ఘటనలకు బాధ్యతను అన్యాయంగా వారి నెత్తిన రుద్దుతున్నామని ఖండిస్తున్నారు. ఇవి ఒకదానికొకటి పొసగని పరస్పర విరుద్ధమైన నేరారోపణలు.

ఈ విషయాన్ని మీరు గుర్తించలేకపోయారు. ఎందువల్ల? ఈనాడు మీ వైఖరిలో ఈ పరస్పరవైరుధ్యం ఇమిడిఉంది. ఆగస్టు ఉద్యమం కాంగ్రెసుదే అని ప్రజలయెదుట చెబుతున్నారు: దానికి కాంగ్రెసు కేమీ బాధ్యతలేదని వైస్రాయితో అంటున్నారు: ఒకవైపు ఆ వుద్యమం మాదే నంటున్నారు. మరోవైపు కాదంటున్నారు. అందువల్లనే మాపై పరస్పర విరుద్ధమైన నేరాలు మోపగలిగారు.

మా పై చాల తీవ్రమైన ఆరోపణలు చేస్తూ మీకు చాల రిపోర్టులు వచ్చాయన్నారు. వాటిని మాకు పంపమన్నాము. మీరు నిరాకరించారు. ఆ రిపోర్టు లెంత అసభ్యమైనవో మీరు గుర్తించారు కాబట్టి ఇలా నిరాకరించారని అనుకుంటున్నాము.

మాకు చూపడానికే సంకోచం కలిగించేటటువంటి రిపోర్టులను మీకివ్వగలిగిన వ్యక్తుల నీతినియమాలు, దేశభక్తిఎలాంటివై వుండగలవో మీలో మీరెందుకు ప్రశ్నించుకోలేదు? మేము వ్యతిరేకించినవారి విధానాలపై మా విమర్శనలను మేము నిర్మొహమాటంగా ప్రజలఎదుట పెట్టాం. మాపై తాముచేసే విమర్శనలను ఇలాగే ప్రజలఎదుట పెట్టగల సాహసం లేనివారిని గురించి యేమనుకోవాలి?

ఈ విషయాన్ని మేమనవసరంగా సాగదీస్తున్నామనీ మీరనుకుంటారేమో. మీ మాటలనే మీకెత్తి చూపిస్తాము. ఇలాంటివీ, ఇంతకన్నా అధ్వాన్నమైనవీ ఎన్నయినా చూపగలం.

'ఆగస్టు పోరాటం'పై

వైస్రాయితో మీరన్న మాటలు:

"ఏ. ఐ. సి. సి. పేరిట ప్రచారమయిన రహస్య ఉత్తరవుల ననుసరించే ఈ విధ్వంసక కార్యక్రమం సాగిందని రుజువు చేయడానికి మీ వద్ద కావలసినంత భోగట్టా ఉందంటున్నారు. ఆ భోగట్టా ఎలాంటిదో మాకేమీ తెలియదు. కాని, ఒకటి మాత్రం మాకు బాగా తెలుసు: మా అధికార హోదాతో నొక్కి చెప్ప

ప్రజల ఎదుట మీరన్న మాటలు:

1945 జూలై 17 న లాహోరు రైల్వేస్టేషన్‌లో నెహ్రూగారి ప్రసంగం:

"1942 ఘటనలకు నేనెంతో గర్విస్తున్నాను.—ఆ ప్రజావెల్లువలో లోపా లెంచడం సోఫాల్లోకూర్చునే విమర్శకులకు సులభమే. అందులో సమర్థింపరాని విషయాలుండవచ్చును. కాని, ఆ ఘటనలను

గలం. ఇలాంటి కార్యక్రమం సాగించాలని ఎ. ఐ. సి. సి. ఏ దశలోనూతలపెట్టలేదు; అలాంటి ఉత్తరువులను రహస్యంగా గాని, వేరే విధంగాగానిఇవ్వలేదు." (కాంగ్రెసు పేరిట సి.యస్.పి. వ్యవహరించాడాన్ని ఖండిస్తూ 1943 ఫిబ్రవరి 13 న అజాద్ లిన్‌లిత్గోకి రాసిన జాబు)

ఖండించినవారు, వాటివిషయమై ప్రజలకు దురభిప్రాయాలు కలిగించడానికి ప్రయత్నించినవారు వట్టి పిరికిపందలు."

(ఫ్రీప్రెస్ జర్నల్ - 1945 ఆగస్టు 18)

1945 ఆగస్టు 30 వ తేదీన ఢిల్లీ ప్రజలఎదుట నెహ్రూప్రసంగం:

"1942 ఘటనలకుపూర్తిబాధ్యత వహించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఎందువల్లనంటే, దేశంలో అలాంటి ఘటనలు జరిగే పరిస్థితులను కలిగించింది నేను."

(ఫ్రీప్రెస్ జర్నల్ 1945 ఆగస్టు 31)

వాస్తవికమైన రుజువులేమీ లేకుండా, అపార్థాలువచ్చేలా మావ్యాసభాగాలను ఉదహరించి, మాపై అభియోగాలు దెచ్చారు. వాటికి సంజాయిషీ చెప్పుకోమన్నారు. మీనేరారోపణలో ఉన్నపరస్పరవైరుధ్యాన్నయినాగుర్తించుకోలేక పోతున్నారు. అలాంటప్పుడు ఈ విషయాన్ని మీకు స్పష్టంచేయవలసిఉంది. మీస్వయం వ్యతిరేకవైఖరికి మమ్మల్ని బలిచేయకండి అని కోరవలసిఉంది.

ఆగస్టు ఘటనలనుగురించి మీరు ప్రభుత్వందగ్గరొకమాట. ప్రజల ఎదుట వేరొకమాట ఎలాచెప్పగలుగుతున్నారు? ఆగస్టునాటికి మీ భావాలు రెండురకాలుగాఉన్నాయి. ఆ పరిస్థితుల్లో పోరాటం ప్రారంభించడం మీకిష్టములేదు. అది బ్రిటిష్‌వారిని లొంగదీయడానికిబదులు జపానువారికే అనుకూలపడుతుందని గుర్తించారు, కాని ఆశయసిద్ధికి పోరాటంతప్ప మరోమార్గం లేదనుకున్నారు. ఇప్పుడుమీరు విడుదలై వచ్చారుకాని, మీ స్వయం వ్యతిరేకవిధానం దేశాన్ని ఏగతికి తీసుకుపోయిందో, కాంగ్రెసు

లోని వివిధగ్రూపులెలా పనిచేశాయో మీకు ప్రత్యక్షఅనుభవంలేదు. అందువల్ల 1920,1930 ఉద్యమాలను ఏ దృష్టితోనయితేచూచారో 1942 ఉద్యమాన్నికూడా అదేదృష్టితో చూడసాగారు.

నిజానికి మీరు ప్రారంభించని ఈ ఉద్యమంతో మీకు సంబంధం లేదని ప్రభుత్వంతో అన్నారు. దీనినొక బెదరింపుగానే మీరుద్దేశించారు, ఆ బెదరింపుతో ఇండియా బ్రిటనులకు ఒండంబడిక కుదిరిపోతుందనీ. జాతీయప్రభుత్వం వచ్చేస్తుందని మీరు భ్రమపడ్డారు.

కాని మీ రూహించిందొకటి, జరిగింది వేరొకటి. ప్రభుత్వం మిమ్మల్ని అరెస్టుజేసింది. దానిని సహించలేక ప్రజలు ఉప్పెనగాలేచారు, సామ్రాజ్యవాదులు క్రూర నిర్బంధవిధానం ప్రయోగించి దానిని అణచివేశారు. ఇంకా ఎన్నో జరిగాయి. అరెస్టుకాకపూర్వం మీరుచేసిన సూచనల ననుసరించే 'జాతీయ పోరాటం' నడుపుతున్నామని కాంగ్రెసు పేరు చెప్పుకొని వ్యవహరించినవారు ప్రచారం చేసుకున్నారు. గాంధీజీకొక సిద్ధాంతం ఉంది: అదే అహింసా సిద్ధాంతం. దానినిబట్టే వారు నడుచుకుంటారు. అందువల్లనే వారు వెంటనే ఒక నిర్ణయానికి రాగలిగారు. ఆగస్టు ఘటనలకు బాధ్యత తనది కాదన్నారు. మీకు దారిచూపడానికి అలాంటి సిద్ధాంతా లేవీ లేవు. మొదటినుంచీ మీ మనసు రెండువిధాలుగా పనిచేసింది. ఇప్పటికయినా పరిస్థితుల తీవ్రతను గుర్తించి మీ రాలోచించడంలేదు. ఏదో ఒకవిధంగా బయటపడాలనే చూస్తున్నారు.

కాంగ్రెసు తీర్మానంలో 'అహింసాయుత పోరాటమ' నే ఉన్నది కాబట్టి, ఆగస్టు పోరాటాన్ని 'కాంగ్రెసు పోరాటమ'ని మీ రనలేకపోయారు. దానికి మీ దేమీ బాధ్యతలేదని మీరూ, గాంధీజీ, వైస్రాయికి రాసిన జాబుల్లో స్పష్టం చేశారు.

కాని, దానితోపాటు మీకేలాంటి సంబంధంలేదనికూడా అనలేకపోయారు. ఎందువల్లనంటే, పోరాటం ప్రారంభిస్తామని బెదరించింది మీరే. మీరు లేకపోయేసరికి కొంతమంది కాంగ్రెసువాదులు, చొరవ తీసుకొని, తమంతట తాము పనిచేయ నారంభించారు. ప్రజలెంతో ఉత్సాహం

చూపించారు. పోలీసులు దారుణ హింసాకాండను ప్రారంభించారు. అందువల్ల, ఆ పోరాటాన్ని నడిపినవారితో ఏలాంటి సంబంధమూ లేదని మీ రనలేకపోయారు.

ఈ సందిగ్ధావస్థలోనుంచి బయటపడగల మార్గంకోసం వెతుకులాడారు. ఆగస్టుపోరాటాన్ని నడిపినవారు దాన్ని కాంగ్రెసు పోరాటమే అన్నారు. కాని, మీరలా అనకుండా దానికి "ప్రజాపోరాట"మని బిరుదిచ్చారు. ప్రజలు తమంతట తాము వెల్లువగా లేచారనీ; సామ్రాజ్యవాదుల దురహంకారానికి జవాబుచెప్పి, అధికారాన్ని గుంజుకోడానికి కొంతమంది కాంగ్రెసువాదులు ఆ వెల్లువను ఉపయోగించడానికి ప్రయత్నించారని మీ రూహించారు.

నిజంగా జరిగింది ఇదేఅయితే మీబిరుదు సార్ధకమయేది, కాని దురదృష్టవశాత్తు అది నిజంకాదు. ఆగస్టు ఘటనలనుగురించి ప్రజల ఎదుట మీరు చిత్రిస్తున్నదృశ్యంలో కొన్నివిషయాలను అతిసామాన్య విషయాలుగ చిత్రించారు; కొన్నిటిని తడిపీతడవనట్లు విడిచిపెట్టారు; మరికొన్నింటికి చిలవలుపలవలు కూర్చారు; కొన్నింటిని పూర్తిగ మరుగుపుచ్చారు,

ఆగస్టు అనంతరం జరిగిన ఘటనలను ఉద్రిక్తులయిన ప్రజలు వెల్లువగాలేచి జరిపినస్వాతంత్ర్యపోరాటం అంటూనే, అది పోలీసు నిర్బంధచర్యలచేత అణచివేయబడిందన్నారు. వీరగంధంపూసినచోటనే విషాదరేఖలు దిద్దుతున్నారు.

జపానుప్రమాదాన్ని మరుగుపుచ్చారు

బ్రిటిష్‌ప్రభుత్వపు చర్యకు క్రోధావేశంతో ప్రజలు వెల్లువగా లేచారన్నమాట నిజమే. కాని, ఆ వెల్లువ తగ్గిపోవడం ప్రారంభం కాగానే, కొంతమంది బయలుదేరి దానిని విధ్వంసకచర్యలవైపు త్రిప్పబోయారు. ఆ ప్రయత్నం విఫలమయినకొద్దీ వారు జపాను ఫాసిస్టుల సహాయంకోసం ఎదురుచూడసాగారు.

మీ రిపోర్టులో 1942 ఆగస్టుకి కొద్దిరోజులుముందూ, కొద్దిరోజులు తరువాతా మేమనుసరించిన విధానాలూ, సాగించిన కార్యక్రమాలనే ముఖ్యంగా పేర్కొన్నారు. అందులో అయిందీ, కానిదీ అంతా ఉంది. కాని ఒక్కమాటమాత్రం లేదు—జపాను ప్రమాదం అన్నమాట వెతికినాకనబడదు. ఆ రోజుల్లో జపాను దురాక్రమణ ఒక నూతన విపత్తుగా ముంచుకురాలేదు? అది మీ దృష్టిలోకూడా అన్నిటికన్న పెద్ద సమస్యకాలేదా? ఆ సమస్యమీదనే కదా వర్కింగుకమిటీ సభ్యుల్లో మునుపెన్నడూ లేనంత తీవ్రభేదాభిప్రాయలు కలిగాయి? ఆ ప్రమాదాన్ని గుర్తించేకదా మీలోమీరు తిరిగిసామరస్యం కుదుర్చుకున్నారు. ఆ ప్రమాదాన్ని గుర్తించడ మేకదా మీ ఆగస్టు తీర్మానానికి మూలసూత్రం.

జపానుపట్ల మీ వ్యతిరేకతను మీరు సుస్పష్టం చేయలేదా? మిత్రరాజ్యాలపట్ల మీసంఘీభావాన్ని చాటిచెప్పలేదా? జపానును జయప్రదంగా ప్రతిఘటించి, ప్రపంచ ప్రజాస్వాతంత్ర్యము, ప్రజాస్వామ్యాలపట్ల మీ విద్యుక్తధర్మాన్ని నెరవేర్చడానికేకదా మీరు జాతీయప్రభుత్వాన్ని కోరింది? జపాను ఫాసిస్టులు ఈ రెండింటికీ బద్ధశత్రువులని మీరేకదా గుర్తించింది?

1942 నుంచి 1944 వరకు మన దేశాన్నొక పీడకలగా పట్టి వేధించిన జపాను ప్రమాదాన్ని మీ భావాల్లోనుంచి పూర్తిగా తుడిచివేయగలిగితే, మీ రిపోర్టు సత్యమవుతుంది. మాపై మీ అభియోగము రుజావు అవుతుంది.

కాని 1942 లో మీరు ప్రధాన సమస్యగా గుర్తించి, ఆగస్టు తీర్మానంలో పేర్కొన్నదేమిటి? జపాను దురాక్రమణను జయప్రదంగా ప్రతిఘటించగలందులకు, బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చేతుల్లోనుంచి అధికారాన్ని గుంజుకోవడం.

1944 లో మాపైదేశద్రోహనేరం మోపారు. ప్రభుత్వం దెబ్బతీసింది; ప్రజలు వెల్లువగా లేచారు—కాని కమ్యూనిస్టులయిన మీరో!— అని మాపై నిప్పులు చెరిగారు,

ఈ 1942—44 మధ్యకాలంలోనే జపానుప్రమాదం తలచూపడమే కాకుండా రోజురోజుకూ పెరిగిపోయింది. రెండుసార్లు మన మాతృదేశాన్ని ముంచెత్తడానికి ప్రయత్నించింది, 1943 లో అరకాన్ దండయాత్ర ;1944 లో ఈశాన్య ఆగ్నేయదిక్కుల నుండి ఒకేసారి విరుచుకు పడడం జరిగాయి.

విధ్వంస కార్యక్రమ ఫలితం బానిసత్వమే అయేది

ఆపరిస్థితుల్లో దేశమంతటా విధ్వంసక కార్యక్రమాలు సాగించాలని కాంగ్రెసుపేరు చెప్పుకుంటూ కొందరు తలపెట్టారు. వీలయినంత వరకు సాగించారుకూడా; దీనిపర్యవసానం ఏమయేదో మీరెందుకు ఆలోచించరు? జైలుకు వెళ్ళకుండా ఉండినట్లయితే మీరు అలాచేసేవారా? లేక, ఈ కార్యక్రమం బ్రిటిష్‌వారిపై దెబ్బకొటుతున్నట్లు కనబడుతున్నప్పటికీ నిజానికి జపాను దురాక్రమణదారులకే తోడ్పడుతుందని మాలాగా గుర్తించేవారా? భారతప్రజాకోటికి ప్రత్యక్షంగా నెత్తిమీద కూర్చున్నశని, బ్రిటిష్‌సామ్రాజ్యవాదులు; జపాను దురాక్రమణ వేలమైళ్ళ దూరంలోఉన్న ప్రమాదం మాత్రమే. ప్రజలు గుర్తించేది నిత్యానుభవంలో ఉన్న విషయాలను మాత్రమే. అందువల్ల మేము ప్రజలనేమీ అనలేదు. కాని, నాయకులమని చెప్పుకుంటూ బయలుదేరి బ్రిటిష్‌వారిని మాత్రమే దృష్టిలో పెట్టుకొని, ముంచుకొస్తున్న జపాను ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేసేవారి నేమనాలి? అరెస్టు కాకపూర్వం మీరేమిచేశారు? వీరి నెదుర్కొనడమా, వారిని ప్రతిఘటించడమా అనే విషయాన్ని, తేల్చుకోడానికి కృషిచేశారు. చివరకు జపాను దురాక్రమణను ప్రతిఘటించడమే ప్రధానమని నిశ్చయించుకున్నారు

విధ్వంసక కార్యక్రమాన్ని తలపెట్టినవారు అంతటితో ఆగలేదు. బ్రిటిష్‌వారిని లొంగదీయడం తమకసాధ్య మయేసరికి జపానువారినే మిత్రులుగా భావించి, వారిరాకకోసం ఎదురుచూడసాగారు. వీరు అన్నెము పున్నెము తెలియని పల్లెటూరి కుర్రవాళ్ళుకారు. యవ్వనం గడచిన మేధావంతులు. 1930 నుండీ కాంగ్రెసులో బాధ్యతాయుత స్థానాల్లో ఉంటూ

వచ్చిన ప్రముఖులు. భారత స్వాతంత్ర్య పోరాటానికి జపాను ఫాసిస్టులు తోడ్పడగలరనీ వీరునిర్ణయించుకున్నారు. మిత్రరాజ్యాలఆశయం సామ్రాజ్యవాద దోపిడీయే అని ప్రచారం చేశారు. జపానుఫాసిస్టులపై స్తోత్రపాఠాలు కురిపించారు.ఆసియాలో వారా క్రమించుకొన్న దేశాల్లో స్వాతంత్ర్యాన్ని వెలకొల్పారనే భ్రమను ప్రజల్లో కలిగించారు. ఆనాటి ప్రపంచపరిస్థితులను గురించి వారుచేసిన వ్యాఖ్యానాలూ. ఫాసిస్టు జపాన్ను గురించి, దాని శొత్తులను గురించి వారు చేసిన వర్ణనలూ, వీటిపట్ల వారివై ఖరీ-ఇవన్నీ వారి స్వంతమాటల్లోనే మన ముందున్నాయి.

వీరి జపాను అనుకూలప్రచారానికి మీరు తాళంవేసేవారా ? లేక, శాయశక్తులా దానిని ప్రతిఘటించిఉండేవారా ? "భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఫాసిస్టులతో పొత్తు" అనే పంథా వారిది. ఆ రోజుల్లో మౌనం వహించడమంటే ఈ ఆత్మవినాశకర పంథాను కొనసాగనివ్వడమన్న మాటే. సకాలంలో మేము దానిని బట్టబయలు చేశాము. ప్రపంచ స్వాతంత్ర్య శక్తులతో చేతులు కలిపి ఫాసిస్టుశక్తులను ప్రతిఘటించడమే మన దేశభక్తియుత పంథా అని మీరు 1942 అగస్టులోనే స్పష్టంచేశారు. ఇప్పుడు చెప్పండి. జపాను అనుకూలప్రచారం ఏమిటి ? అణచివేయవేయబడిన దేశభక్తి వక్రమార్గంపట్టి పోవడమా ? లేక దేశభక్తియొక్క పవిత్ర నిజస్వరూపమా ? ఆగస్టు తీర్మానాన్ని మనసులో ఉంచుకొని జవాబు చెప్పండి.

వారి ప్రచారఫలితంగా జాతీయభావాల కెంత నష్టం కలిగిందో చెవులు విప్పి వింటే మీకే తెలుస్తుంది.

1942 లో మీరు అరెస్టయిననాటినుండి 1945 లో విడుదలయివంతవరకు ఏర్పడిన ప్రతి సమస్య విషయంలోనూ, వారన్న మాటలకూ మేమన్న మాటలకూ వ్యత్యాసాన్ని పరిశీలించండి.

పరిశీలించి చెప్పండి. అందులో మే మనకూడని మాటలేమిటి ? వారిది సక్రమమయి, మాది తప్పయినదెక్కడ ?

వారుచేసిన పనులను పరిశీలించండి. మా కార్యకలాపాలను చూడండి.

మేము చేసివుండకూడనిదేదో చెప్పండి. మేము నెరవేర్చినదాని కన్నా అదనంగా మీరేమిటి సూచించి ఉండేవారో తెలపండి.

మేముచేసిన పనులను ఆధారంగా తీసుకొని ఉన్నట్లయితే మీ అభియోగం సక్రమమనిపించుకొనేది. 1942 - 1946 మధ్య యేర్పడిన విషమ పరిస్థితుల్లో కాంగ్రెసువాదుల కర్తవ్యమేమిటో క్లుప్తంగా అయినా మీ రిపోర్టులో చెప్పివుంటే సవ్యంగా ఉండేది.

మేముచెప్పిన ప్రతిమాటా, మేముచేసిన ప్రతిపనీ, అంతకుముందు మీరు చేసిన తీర్మానాలకూ, ప్రకటనలకూ అనుగుణ్యంగానే వున్నవని మేము రుజువుచేశాము; చేయగలం.

ఇది కాంగ్రెసు పోరాటం కాదనిచెప్పి మీరు మీ బాధ్యతలనుండి తప్పించుకుంటున్నారు.

ఇటు మావైపు తిరిగి ఇది ప్రజాయుద్ధమంటూ, అందులో పాల్గొన నందుకు మమ్మల్ని ఖండిస్తున్నారు.

జపానువాళ్ళమాటే ఎత్తరు. విధ్వంసక కార్యక్రమాలను గురించి మూకీభావం వహిస్తారు.

బ్రిటిష్ ప్రభుత్వం మన నెత్తిమీద ఉంటుండగానే యుద్ధాన్ని 'ప్రజాయుద్ధమ'న్నందుకు మాపైని పెద్ద నేరం మోపారు. సంజాయిషీ యిచ్చుకోమన్నారు.

ఇదంతా యెటు దారితీస్తుందని అడగవచ్చునా?

ఇదేనా న్యాయం?

ఎంతో ఆవేదనకరమయిన ఈ అధ్యాయాన్ని ముగిస్తున్నాం. మీరు అపోహపడుతున్నారు. మీ నేరారోపణలు అస్పష్టంగా ఉన్నాయి. పరస్పరవిరుద్ధంగా ఉన్నాయి. మాపై నేరారోపణలు చేస్తూ మీకు చేరిన

పత్రాలను మాకు పంపమంటే నిరాకరించారు. విచారణ జరక్కముందే. మీ రిపోర్టులోనే మాపై తీర్పుచెప్పేశారు.

బ్రిటిష్‌వారి న్యాయపాలనను మొదటినుంచీ హేళనచేస్తున్నాం. అది సామ్రాజ్యవాదన్యాయపాలన అన్నాం. వాళ్ళకన్నా అక్రమమైన పద్ధతులకు మనం ఒడిగట్టాలా? మా పార్టీ వయసులోచిన్నది; దేశభక్తి ప్రపూరితమైన పార్టీ. మీరో పెద్దలు; అందరిగౌరవాన్ని చూరగొన్నవారు. దేశభక్తసంస్థల్లో అగ్రగణ్యమైన కాంగ్రెసునాయకులు. అలాంటి మీరే సోదర కాంగ్రెసువాదులపట్ల, సోదరపార్టీలయడల ఇలాంటి పద్ధతుల ననుసరిస్తే; సవ్యమైన ప్రజాస్వామిక పద్ధతులకోసం, న్యాయంకోసం మీరే పట్టుపట్టకపోతే—ఇకమన దేశానికి ప్రజాస్వామికభాగ్యం ఎక్కడిది?

అపోహలతో బయలుదేరినట్లయితే ఇక మీరు మమ్మల్ని విచారణ చేయడమెక్కడిది?

మమ్మల్ని సక్రమంగా విచారించాలిఅంటే, మిమ్మల్నిమీరు విచారణ చేసుకోగలిగి ఉండాలి. దేశం ఏస్థితిలో ఉందో ప్రశాంతంగా, నిష్కపటంగా పరిశీలించగల శక్తీ, దీక్షా ఉండాలి. మనల్ని పీల్చిపిప్పి చేస్తూన్న పరాయిపాలకులు దేశానికెంత దుర్దశప్రాప్తింపజేశారో గ్రహించ గలిగిఉండాలి. కాంగ్రెసువాదుల్లోనే ఎలాంటి విభేదాలు కలిగాయో తెలుసుకోగలిగి ఉండాలి. ఈ విషమపరిస్థితులనుండి అందరినీ బయటకు చేర్చేమార్గమాలోచించ గలిగిఉండాలి.

1942 లో మీ సమరనినాదం — "క్విట్ ఇండియా" ఆనాడు మహత్తర శక్తివంతమైన జాతీయోద్యమం మీకు అండగాఉంది.

1945 లో మీరు బయటికి వచ్చారు. అన్నివిధాలా మునుపటికన్నా దీనస్థితికి దిగజారిన బానిస భారతదేశంలోకే మళ్లా వచ్చారు.

"ఎందువల్ల ఇలా జరిగింది? ఇండియానుండి బ్రిటిష్ వారికి ఉద్వాసన చెప్పలేకపోయా మెందుచేత?" అన్న ప్రశ్నకు మీలో ఒక్కరు

కూడా సమాధానం చెప్పడానికే ప్రయత్నించలేదు. మీ విషయజ్ఞత, మీ వాస్తవిక దృష్టి అంతే.

బయటికివచ్చి మీరు చేయగలిగిందంతా ఒక్కటే — మా పైన అభియోగపత్రం ప్రయోగించారు.

ఆగస్టు తీర్మానాన్ని ఆధారంచేసుకొని మీ రీ అభియోగం తెచ్చారు. ఆ తీర్మానాన్ని ఆధారంగా తీసుకొనే మే మీ సమాధానంకూడా చెప్పాము. అపోహలను విడిచి, సహృదయంతో అర్థం చేసుకోవాలనే దృష్టితో దీనిని చదివితే మీ కీ దిగువ విషయాలు స్పష్టం కాగలవు :

1. ఆగస్టు 8 తరువాత మేము చెప్పింది, చేసింది అంతా ఆ తీర్మానంలోని మొదటిభాగాన్ననుసరించే ఉంది. దాని నాచరణలో పెట్టడానికి తత్ఫలితంగా ఏర్పడే బాధ్యతలను నెరవేర్చడానికి జరిగినకృషే అదంతా.

2. మీరు లేనప్పుడు ఆగస్టు పోరాటాన్ని నడిపిన వారంతా రెండవ భాగాన్ని శక్తికొలది అమలుజరుప ప్రయత్నించినవారే ఈనాడు కమ్యూనిస్టు వ్యతిరేక ధ్వజమెత్తింది వీరే.

మమ్మల్నీ వారిని పరిశీలించవలసింది మీరు. అలా పరిశీలిస్తేనే ఆగస్టు తీర్మానంలోని మీ స్వయం వ్యతిరేకధోరణి ప్రస్ఫుటమవుతుంది. ఆతీర్మానం అనంతరం, బ్రహ్మాండమైన ప్రజావెల్లువ తరువాత, జరిగిన ఘటనలు ప్రజలకెలా నానాటికీ కంటకప్రాయంగా పరిణమించాయో: తేటతెల్లమవుతుంది. దానివల్ల ప్రజల భావాలు ఎంత పతనమయిపోయాయో గ్రహించగలరు.

మీ తీర్మానంలోని ఈ పరస్పర వైరుధ్యం జాతి జీవితంలోకే వ్యాపించింది. 1942–45 మధ్యకాలంలో నాటి భారతదేశ చరిత్రే అది.

నేడు మాపై మీరు అభియోగం తేవడంచూచినా, ఆ అభియోగాన్ని తెచ్చిన తీరునుచూచినా ఒకవిషయం సుస్పష్టమవుతూంది. మీరు ఖండించిస్తున్నది మమ్మల్ని మాత్రమేకాదు; మిమ్మల్నే మీరు ఖండించుకుంటున్నారుకూడా.

కమ్యూనిస్టు వ్యతిరేకులు కమ్యూనిస్టులపై సాగించిన దుష్ప్రచారాన్నే మీరు ఆధారంగా తీసుకున్నారు: దాని నంతటినీ తిరిగి పునశ్చరిస్తున్నారు. దీనినిబట్టి చూస్తే, మీతీర్మానంలోని రెండవభాగంయొక్క వారసుల నందరినీ మీరు స్వీకరిస్తున్నట్లుంది.

ఇక మీరు మాపై అభియోగం తెచ్చారు: మాపాలసీకి అపార్థాలు కల్పించారు. ఒకరు చెప్పినమాటలు వినకుండా, మేము చేసిన పనులను పరిశీలించండయ్యా అంటే, నిరాకరిస్తున్నారు. దీనినిబట్టిచూస్తే మీ తీర్మానంలోని మొదటిభాగంయొక్క జాతీయాశయంయొక్క, ప్రపంచ ప్రజాస్వామ్యము, ఫాసిస్టు వ్యతిరేకతలయొక్క సక్రమ వారసులను తృణీకరిస్తున్నారని స్పష్టమవుతుంది.

భారతప్రజలందరి పవిత్రమైన కుటుంబం కాంగ్రెసు దానికి పెద్దలు మీరు. కుటుంబంలోని వారంతా చెప్పే విషయాలను మీరు చెవియొగ్గి వినాలి. తీక్షణంగా ఆలోచించాలి. మీరే ఆత్మపరీక్ష చేసుకోవాలి. అపుడే సరియైన మార్గం కనుగొంటారు. న్యాయమైన తీర్పు చెప్పగలుగుతారు.

ఎవరిది తప్పు — ఎవరిది ఒప్పు

మీరెందుకు తీక్షణంగా ఆలోచించరు.

1. దేశంయొక్క తక్షణఆశయం జాతీయప్రభుత్వమని కాంగ్రెసు తరఫున మీరు ప్రకటించారు.

కాని మీరు అరెస్టయిన తరువాత, కాంగ్రెసు ప్రతినిధులమంటూ వ్యవహరించిన వారేమన్నారు? అలా కోరడం "బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు దాసోహం అనడమే" అన్నారు. ఎందువల్ల? ఏఉద్దేశంతో వారలా అన్నారు?

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు సాగించిన హత్యాకాండతో మతిపోయి వారు జపాను ఫాసిస్టులమీద ఆశలు పెట్టుకున్నారు. అందువల్లనే కదా అలా అన్నారు? మేమీ విషయాన్నే బట్టబయలు చేశాం. రుజావు చేశాం

2. ఆగస్టు 'పోరాటా' నికి తామే నాయకులమని చెప్పుకున్నవారు మీ విడుదలకై జరిగిన ఆందోళనను వ్యతిరేకించారు. మీ విడుదలకై ప్రధానంగాఆందోళచేసిన మమ్మల్ని మీ నిర్బంధానికి కారకులైన సామ్రాజ్య వాదుల తొత్తులమన్నారు.

దీనికి కారణ మేమయి ఉంటుంది?

వారు జపాను తోడ్పాటుతో "స్వాతంత్ర్య విప్లవా"న్ని సాగింపజూచారు. కాంగ్రెసు పేరు ప్రతిష్టలనందుకు వినియోగించాలనుకున్నారు. మీరేగాని విడుదలైతే "బ్రిటిష్ సామ్రాజ్యవాదుల"కు దాసోహం అంటారనీ. అందువల్ల తమ ప్రయత్నాలు సాగకుండా పోతాయనీ వారనుకున్నారు. మీ విడుదలకై సాగిన ఆందోళనను వారు వ్యతిరేకించడానికి కారణం ఇదే. దీనినేకదా మేము అనాడే బట్టబయలు చేశాం. ఈ జవాబులో రుజువుచేశాం.

3. కరువురాకాసి విలయనృత్యం ఎంత ఉద్ధృతంగా సాగుతుందో ఆకలి మంటలకు ప్రజలు ఎంతగా మాడి మసిఅవుతారో, అంత త్వరగా విప్లవం వస్తుందని కలలు గన్నారు ఈ "విప్లవకారులు". ప్రజలన్నా, ప్రజల జీవితసమస్యలన్నా. వారి చైతన్యస్థాయిఅన్నా, వీరికి గల జ్ఞానమెంత ?

ఒకవైపు ప్రజాసేవాతత్పరత ; తిండిదొంగలనూ, వారికి మద్దతుగా నిలిచే అధికారులను, విధివిరామంలేకుండా ఎదుర్కోవడం — మరోవైపు "స్వాతంత్ర్య విప్లవమం"టూ కాగితాలమీద కోటలు కట్టడం, ప్రజల ఆకలిమంటలను, దోపిళ్ళను, రైతుచేత ధాన్యాన్ని అమ్మించకుండా చేయడం, పట్టణవాసులచేత రేషనింగును వ్యతిరేకింపజేయడం, ఇలాంటి దారుణ పరిస్థితులను ఈ 'స్వాతంత్ర్య విప్లవా' నికి పునాదులుగా నిర్ణయించడం. వీటిలో ఏది దేశభక్తి ? ఆగస్టు తీర్మానంయొక్క మూలసూత్రాన్ని కొనసాగింప జేయడమేది ?

ఆ పరిస్థితుల్లో నిజమైన ప్రజల బిడ్డడు చేయవలసిన కర్తవ్యమేమిటని మీరు నిర్ణయిస్తారు ?

ఒకప్పుడు ప్రజల బిడ్డలుగాఉండి వారెందుచేత అలా మతిభ్రమణం పొందారు ?

సోదర ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయి, స్వాతంత్ర్య ప్రసాదం కోసం జపాను ఫాసిస్టుదేవుళ్ళ నారాధించడంవల్లనేకదా ? దీనినేకదా మేము రుజువుచేసింది ?

4. మా వ్యతిరేకులు మమ్మల్ని ప్రభుత్వగులాము లన్నారు. దానిని రుజువు చేయడానికి వారు ప్రకటించిన పత్రాలన్నీ నీచమయిన దొంగపత్రాలని, చిత్తశుద్ధిగలవారందరికీ సంతృప్తి కలిగేలా మేము నిరూపించాం. మేము మోసగాండ్రమనీ, వ్యభిచారులమనీ, పశుప్రాయులమనీ. రక్తపిపాసులమనీ మీకు రిపోర్టులు పంపేవారి నీతినియమాలను గూర్చి ఏమనుకోవాలి ? వాళ్ళ మానసికస్థితి ఎలాంటిదై ఉండాలి ?

రాజకీయ ప్రయోజనాలకోసం నీచ ప్రచారాన్ని సాధనంగా ఎవరుపయోగిస్తారు ? ఏ స్థితిలో ఉపయోగిస్తారు ? మన జాతీయోద్యమంలోను ప్రపంచ ప్రజాస్వామికోద్యమంలోను ఎవరిపైని ఎవరు ఈసాధనాన్ని ప్రయోగించారు ? ప్రజాద్రోహులూ, స్వాతంత్ర్య వ్యతిరేక రౌడీమూకలేకదా ?

వారు నీచ ప్రచారంచేసి. అపార్థాలు కల్పించింది మాకు. కాని, మేము వాళ్ల నెదుర్కొన్నప్పుడు వాస్తవిక ఘటనలనే తీసుకున్నాం. వాళ్ల రచనలనే ఉపయోగించాం. ప్రజాజీవితాన్ని, మాతృదేశ స్వాతంత్ర్యావశ్యకతలనే మూలసూత్రంగా తీసుకొని వాళ్లను ప్రతిఘటించాం.

మమ్మల్ని మీరు కాలదంతున్నారు; వారిని కౌగిలించుకుంటున్నారు, కాంగ్రెసు తీర్మానాల్లో దేని నాధారంగా తీసుకొని ఇలా చేశారు ? ఇందుకు మీకే యితర ఆధారాలున్నాయి, మీ అంతరాత్మ ఇందుకెలా ఒప్పుకుంది?

మీరు అరెస్టయిన తరువాత, వారూ, ఆగస్టు తీర్మానాన్ని ఉపయోగించుకునే పనిచేశారు; మేమూ దానినే ఆధారంగా తీసుకున్నాం.

కాని వారనుకున్నట్లు ప్రజలు నడుచుకోలేదు. అందువల్ల త్వరలోనే వారికి ప్రజలపై విస్వాసం అడుగంటింది. మేమో—నిజమైన ప్రజాసేవకు

ల్లాగ ప్రజలనే అంటిపెట్టుకొని పనిచేశాం. వాళ్ళ కడగండ్లు అధికమౌతున్న కొద్దీ ఇంకా ఎక్కువగా వారికి చేదోడు వాదోడుగా నిలిచాము,

వాళ్లు ఫాసిస్టు సామ్రాజ్య వాదులను నమ్ముకున్నారు. ఆనమ్మకంతోనే వ్యవహారించారు. మీపైనే ఆశలుపెట్టుకున్నాం మేము; మీవిడుదలకోసమే పాటుపడ్డాం.

ఈ అభియోగం మీపైనే—మామీదకాదు

అయినప్పటికీ నెహ్రూ పండితుడు మాకు అపార్థాలు కల్పించారు; తనలాంటివారికి తగనివిధంగా చేశారు. 1945 అక్టోబరు 24 వ తేదీని బీహార్‌లో వారొక ఉపన్యాసం చేశారు. స్వాతంత్ర్య వాగ్దానం లేనిదే జాతీయశక్తులను సంఘటితపరచడం కాంగ్రెసుకు గాని, కాంగ్రెసు నాయకాగ్రేసరులకుగాని సాధ్యంకాదని వారన్నారు అని—

" కాంగ్రెసు చేయనిదానిని ఒక్క కమ్యూనిస్టుపార్టీయే చేయడానికి ప్రయత్నించింది. స్వాతంత్ర్య వాగ్దానం అవసరం లేకుండానే జాతీయ శక్తుల్ని సమీకరించబోయింది. కాని, చేయలేకపోయింది."

(బొంబాయి సెంటినల్—1945 అక్టోబరు 25.)

మా వ్యతిరేకులు నిర్మించుకున్న ఊహాసౌధాలను మేము నిర్మించుకోలేదు. భారతస్వాతంత్ర్యవిప్లవాన్ని సాగించేస్తున్నామని వారు భ్రమపెట్టారు. అలాంటిభ్రమలేమీ మేము పెట్టుకోలేదు. వాస్తవిక పరిస్థితులను సరిగా అవగాహన చేసుకొని నిజమైన విప్లవకారులుగా పనిచేయడం మార్క్సిజం మాకుబోధించింది.

కాంగ్రెసులో ఒకభాగంమాత్రమే మేము. మా పార్టీ వయసులో చిన్నది. అలాంటిమేము కాంగ్రెసు మహాసంస్థఅంతటియొక్క పాత్రమ నిర్వహించ గలమనీ, దేశభక్తులందరూ కలిసి కొనసాగించగల కర్తవ్యాలను కొనసాగించగలమని వెర్రి ఊహలు ఊహించలేదు

అందువల్లనే కాంగ్రెసునాయకులయిన మీరు తిరిగి ప్రజల్లోకి రావాలని మేము కోరాం; దానికోసమే కృషిచేశాం. మీరువచ్చి కాంగ్రెసు-లీగు ఐక్యతకు దారిచూపి, జాతీయైక్య సంఘటనను సాధించి, పరిపాలనాధికారం ప్రజల హస్తగతమయేలా చేయాలని, మే మందువల్లనే ఆందోళన చేశాం.

దేశరక్షణ జయప్రదంకావాలన్నా, ప్రజలకు తిండి దక్కాలన్నా మీరు విడుదలకావాలి, జాతీయ ప్రభుత్వం ఏర్పడాలన్నదే ఆ రోజుల్లో మా ప్రధాన నినాదమయింది.

అందువల్ల ఈ నాడు మీరు మాపై నేరారోపణ చేయడమంటే. మీపైని మీరే అభియోగం తెచ్చుకోవడమన్నమాట; మీ గతచరిత్ర నంతా మీరే తృణీకరించడమన్న మాట :

1942—1945 మధ్యకాలంలో మేము కాంగ్రెసుయొక్క ఉత్తమ సాంప్రదాయాలనే అనుసరించామనీ, ప్రజల్లో వాటినే ప్రచారం చేశామనీ, ఆనాడు నమ్మాం; ఈనాడు మరీగట్టిగా నమ్ముతున్నాం. కాంగ్రెసుయొక్క స్వాతంత్ర్య వాంఛను, ఫాసిస్టు వ్యతిరేక వైఖరులనే మా ఉపన్యాసాల్లో ప్రతిబింబింప జేశాము. మీవిడుదలను, కాంగ్రెసు ఆశయసాధనను, ప్రజాశ్రేయస్సును చేకూర్చగల కార్యక్రమాన్నే అనుసరించాము.

మీ ఆగస్టు తీర్మానంలోనే పరస్పర వ్యతిరేక దృక్పథాలున్నాయి. తత్ఫలితమే కాంగ్రెసులోని వివిధవర్గాలు విభిన్నమార్గాల ననుసరించడం. పరిస్థితులను, బాధ్యతలను ఎవరు అర్థంచేసుకున్నట్లు వారు నడచుకున్నారు.

ఆగస్టు తీర్మానంనాటినుండీ జపాను ఫాసిస్టుల కనుకూలంగా నడచిన వారిని గురించి మాకు తెలిసిన విషయాలన్నిటినీ మేము చెప్పలేదు. అలా చెప్పగల రోజు ఇంకా రాలేదు.

కాని ఒకవిషయం ఖచ్చితంగా చెప్పగలం. కాంగ్రెసునాయకులైన మీకూ, అనుచరులమైన మాకూ గల సంబంధాన్ని గురించీ, కాంగ్రెసులో

ఒక భాగంగా మేము నిర్వహించిన పాత్రనుగురించీ కలత జెందవలసిన విషయం ఏమీలేదు. సంజాయిషీ చెప్పుకోవలసిందేమీ లేదు; అంతా సమర్థించ వలసిందే! సిగ్గుపడవలసిం దావగింజంతైనా లేదు! అంతా గర్వకారణమే ;

జాతీయనాయకులు ప్రజలకు తమపైగల భక్తి విశ్వాసాలతో చెలగాట లాడకూడదు? బాధ్యతలను గుర్తించి వాటిని ఉపయోగించాలి. అలా జరిగినాడే సిద్ధాంతాల పరువు నిలుస్తుంది. ప్రజలయెదుట వట్టి వాగాడంబరాలకు, పాలకులవద్ద రాజకీయ పన్నాగాలకు పతనం కావలసిన అగత్యం ఉండదు.

వాగాడంబరాన్ని వాగాడంబరంతోను, నీచప్రచారాన్ని నీచప్రచారంతోను ఎదుర్కొడానికి మేము ప్రయత్నించలేదు. కాంగ్రెసు సత్సాంప్రదాయాల్లో ప్రతిబింబమయే సర్వసాధారణమైన న్యాయసూత్రాలను, స్వాతంత్ర్య సిద్ధాంతాలనే ఆధారంగా తీసుకున్నాం. మా వ్యతిరేకుల స్వంతమాటలను ఉపయోగించేవారి నెదుర్కొన్నాం. మమ్మల్ని విచారించి, కాంగ్రెసు తరపున తీర్పుచెప్పవలసిన బాధ్యత మీపైన నేడు పడిం[illegible]. [illegible]వాడు మీరుచేసే నిర్ణయానికి రేపో, మరి కొద్దికాలంలోనో మీ[illegible] జవాబుదారీ కావలసిఉంటుంది. మమ్మల్నిగురించి మాకేమీ దిగులు లేదు. కాని ఆయాసమస్యలను పరిష్కరించడానికి మీ రనుసరిస్తున్న పద్ధతులను, కాంగ్రెసును, మన మాతృదేశాన్ని మీరు నడుపుతున్నతీరును చూస్తుంటేనే మాకు దిగులుగా ఉంది.

అనుబంధం

కాంగ్రెసు వర్కింగు కమిటీచే నియమింపబడిన సబ్‌కమిటీ రిపోర్టు

కాంగ్రెసులో ఉన్న కమ్యూనిస్టుపార్టీ సభ్యులపై అభియోగ పత్రము

అఖిలభారత కమ్యూనిస్టుపార్టీ, కాంగ్రెసులోవున్న కమ్యూనిస్టులూ, కాంగ్రెసుపట్ల అవలంబిస్తున్న ప్రవర్తనను గురించి అనేక ఫిర్యాదులు, నేరారోపణలు ఎ. ఐ. సి. సి. ఆఫీసుకు చేరాయి. ఈ విషయాన్ని పరిశీలించి, అవసరమైతే అభియోగాలు పెట్టమని వర్కింగుకమిటీ మమ్మల్ని నియమించింది. ఈ అభియోగం పెట్టబడిన వ్యక్తులను సంజాయిషీ ఇవ్వమని అడుగవచ్చునని చెప్పింది. మా ముందు పత్రాలు, నివేదికలు లెక్కలేనన్ని ఉన్నాయి. వీటిలోని విషయాలు చాలవంతు అస్పష్టంగాను, అసందర్భంగాను ఉన్నాయి. వ్యక్తిగతంగాను, లేక సమిష్టిగాను చేసిన పనులను గురించి కొన్ని తీవ్రమైన నేరారోపణ లున్నాయి. కాని, పూర్తి నిదర్శనాలుండి, సవివరంగా పరిశీలిస్తేనేగాని వీటిపై ఏలాంటిచర్య తీసుకోడానికి వీలులేదు. అస్పష్టంగాను, రుజువు కాకుండాను ఉన్న ఇలాంటి ఆరోపణలను ప్రస్తుతం పరిశీలించడంగాని, వాటిని గురించి దర్యాప్తు చేయడంగాని మా ఉద్దేశంకాదు; విశాల రాజకీయాలకు సంబంధించిన విషయాలను పరిశీలించడమే వర్కింగుకమిటీ నిర్ణయంగాని, ఇలాంటి వ్యక్తిగత నేరాలను గురించి కాదని మా అభిప్రాయం. కాంగ్రెసు పాలసీకి భిన్నంగా ప్రవర్తించే సభ్యులపై తగుచర్య తీసుకోడానికి కాంగ్రెసు నిబంధనావళి ప్రకారం రాష్ట్ర కమిటీలకుగాని, వాటి కార్యనిర్వాహక వర్గాలకుగాని అధికారం ఉంది. కొన్ని రాష్ట్ర కమిటీలు అప్పుడే కొందరిపై ఇలాంటిచర్య తీసుకోవడమో, లేక తీసుకోవలసిందని సిఫారసు చేయడమో జరిగిందని

షూకు తెలుస్తూంది. అందువల్ల విశాల రాజకీయాలకు సంబంధించినంత వరకే ఈ రిపోర్టు నిస్తున్నాం. అయినప్పటికీ భారతదేశ మంతటినుండీ చాలమంది కాంగ్రెసువాదులు కమ్యూనిస్టుల చర్యలను గురించి నేరారోపణలు చేశారు. వీనికి ప్రత్యేక ప్రాధాన్యత లేకపోలేదు అంతేకాదు, మత సమస్యపట్ల కమ్యూనిస్టుపార్టీ వైఖరీ, ముస్లింలీగు యొక్క పాకిస్తాన్ కోరికను వారు బేషరతుగా బలపరచడమూ అదివరకే వారికీ కాంగ్రెసువాదులకూ మధ్యనున్న ఆగాధాన్ని మరింత పెంచాయి. భారతదేశంలో కమ్యూనిస్టుపార్టీ సభ్యులపట్ల అన్ని ప్రాంతాల్లోను తీవ్రమైన నిరసనభావం ఉందన్నసంగతి స్పష్టంగా కనబడుతూంది. దీని ప్రభావం కాంగ్రెసు సాధారణ సభ్యుల్లో ఎక్కువగా కనబడుతూంది. కాని మా పరిశీలన తరువాత ఏవైనా చర్యలు తీసుకోవలసివస్తే ఈ ప్రభావానికి లోబడకుండా మేము జాగ్రత్తపడతాము.

ఇంతకుముందు అన్ని వర్గాలవారికి, అన్ని మతాలవారికి, అన్ని రాజకీయపక్షాలవారికి కాంగ్రెసుసభ్యత్వ అర్హతవుండేది. ఒక్కటేషరతు-భారత స్వాతంత్ర్యసాధనే తమ ఆశయమని అంగీకరించాలి; న్యాయసమ్మతము, శాంతియుతమైన పద్ధతులనే అందుకు అనుసరిస్తామని ఒప్పుకోవాలి. ఇంత విశాల ప్రాదిపదికగల సంస్థలో వివిధసిద్ధాంతాలకు స్థానం లభించింది; కాంగ్రెసు నాయకవర్గం అవలంబించే సిద్ధాంతానికి భిన్నమైనవికూడా స్థానం సంపాదించుకున్నాయి. కాంగ్రెసులక్ష్యాన్ని, పద్ధతులను అంగీకరించిన విదేశీయులుకూడా చేరడానికి అవకాశం ఉండేది. ఈవిధంగా కాంగ్రెసు ఒక ఉద్యమంగా ఉంటూవచ్చిందేగాని, సంకుచిత రాజకీయ పార్టీగా ఎన్నడూలేదు. అయినప్పటికీ కొన్ని కొన్ని పరిస్థితుల్లో, ముఖ్యంగా శాసనసభల్లో, కాంగ్రెసు ఒక పార్టీలాగానే పనిచేసింది. దేశవ్యాపితమైన తీవ్రపోరాటాలను తరుచుగా జరుపుతూన్న సంస్థ కాబట్టి కాంగ్రెసు కఠినమైన క్రమశిక్షణతో పనిచేసే సంస్థగా మారక తప్పింది కాదు. అనేక రాజకీయ, ఆర్థిక సమస్యలపై విభిన్నదృక్పథాలు గలవారున్నప్పటికీ ఈ మార్పు జరిగింది. ఈ విధంగా కాంగ్రెసు ఒకవైపు

విశాల ప్రాతిపదికగల ఉద్యమం ; మరోవైపు క్రమశిక్షణగల పార్టీ. తమ తమ విభిన్నభావాలను వెల్లడిచేసుకోడానికి అందరికీ సంపూర్ణ స్వాతంత్ర్యం ఇస్తూ ఆచరణలో, ముఖ్యంగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడం విషయంలో ఏకముఖంగా నిలబడాలని ఆదేశించడంవల్ల పై రెండు లక్షణాలకు సామరస్యం కుదిరింది. ఆచరణలో ఇదెలా రూపొందింది? ఏదైనా ఒకవిధానం నిర్ణయం అయేముందు దానిని అన్ని దృక్పధాలనుండి చర్చించగల స్వాతంత్ర్యం ఉంది. నిర్ణయమైన తరువాత మాత్రం సాధ్యమైనంతవరకు దాన్ని అంటిపెట్టుకొని ఉండాలి ; ఏ పరిస్థితుల్లోను వ్యతిరేకించకూడదు. క్రియారంగంలో ఏకముఖంగా ఉండాలనే నిబంధనే లేకపోయినట్లయితే కాంగ్రెసు తన కార్యదక్షతను కోల్పోయి, తలొకతీరుగా పోయే ఒక మూకగా తయారయేది ; ఏమీ చేతగాని స్థితికి దిగజారేది. కాబట్టి కాంగ్రెసులో వివిధ దృక్పథాలవారున్నప్పటికీ, ఏ సభ్యుడైనా కాంగ్రెసు పాలసీకి భిన్నంగా పోయినట్లయితే అతనిపై డిసిప్లినరీ చర్య తీసుకోవచ్చు ; అలా తీసుకున్న ఉదంతాలు ఉన్నాయికూడా. కాంగ్రెసు కార్యనిర్వాహక సంఘాల సభ్యులవిషయంలో ఈ సూత్రం ముఖ్యంగా వర్తిస్తుంది. ఒక కార్యనిర్వాహకసంఘ సభ్యుడుగా ఉంటూ, ఆ సంఘం అనుసరించవలసిన పాలసీని ఆమోదించకపోవడంగాని, వ్యతిరేకించడంగాని హాస్యాస్పదం.

భారతదేశంలోని వివిధ మతసంస్థలకూ కాంగ్రెసుకీ అభిప్రాయభేదాలు పెరిగాయి. ఆకారణంచేత కొన్ని సంవత్సరాల క్రితం కాంగ్రెసు నిబంధనావళిలో ఈదిగువఅంశం చేర్చవలసి వచ్చింది; "వర్కింగుకమిటీ దృష్టిలో దేశ క్షేమానికి వ్యతిరేకమైన కాంగ్రెసు. లక్ష్యానికి కార్యక్రమానికి విరుద్ధమైన లక్ష్యాన్ని కార్యక్రమాన్ని అనుసరించే మతసంస్థల సభ్యులు కాంగ్రెసులోఅధికారస్థానాలకు గాని. కార్యనిర్వాహక వర్గాలను ఎన్నుకొనే కమిటీలకుగాని ఎన్నుకోబడతగరు." ఈ విషయంలో ఒకసంగతిని గమనించాలి. మతసంస్థల సభ్యులు కాంగ్రెసులో సాధారణ సభ్యులుగా ఉండ

డానికి ఏలాంటి ఆటంకమూ పెట్టలేదు అధికారస్థానాల్లోగాని, కార్యనిర్వాహక వర్గాల్లోగాని ఉండరాదని మాత్రమేఅన్నారు.

1920 ఆ ప్రాంతాల్లో కమ్యూనిస్టుపార్టీ బాహు కొద్దిమందితో ప్రారంభమయింది. చాలకాలం అది రహస్యసంస్థగానే ఉండేది, ఈపార్టీ సభ్యుల్లో కొద్దిమంది కాంగ్రెలో చేరారు. కాని సాధారణంగా కాంగ్రెసు విధానాన్ని విమర్శించడం, హేళనచేయడం, ఖండించడమే ఈపార్టీ విధానంగా ఉంటూ ఉండేది' ప్రజాసామాన్యంలోకి. ముఖ్యంగా రైతులోకంలోకి చొచ్చుకుపోయి, అపూర్వస్థాయిలో ప్రజా పోరాటాలను నడుపుతూ ఉండిన కాంగ్రెసును అభివృద్ధి నిరోధక ధనికవాద సంస్థఅనీ; ప్రజా చైతన్యం దాని సహజమార్గాన ప్రజ్వరిల్లకుండా అరికడుతూందనీ, ఈపార్టీ విమర్శించేది. ప్రజాభివృద్ధికి ఆటంకం కలిగిస్తుందని ముఖ్యంగా కాంగ్రెసు నాయక వర్గాన్ని ఈ పార్టీవారు ఖండించేవారు. అధికారరీత్యా కాంగ్రెసు నిర్ణయించిన విధానాన్ని వీరు అపహాస్యం చేసేవారు. ఇంతచేసినా కమ్యూనిస్టుల మీద కాంగ్రెసు ఏలాంటిచర్య తీసుకోలేదు. వీరు బహుకొద్దిమంది కావడం, వీరి కేలాంటి పలుకుబడి లేకపోవడం ఇందుకు ఒక కారణం, వీరిది రహస్యసంస్థ అవడం, ప్రభుత్వనిర్బంధ విధానానికి గురికావడం మరొకకారణం. ప్రభుత్వనిర్బంధ విధానానికి గురిఅయిన వారందరిపట్ల కాంగ్రెసు ఎల్లప్పుడూ సానుభూతి చూపుతూనేవచ్చింది; 1928లో మీరట్ కుట్రకేసు సందర్భంలో ప్రముఖ కమ్యూనిస్టులపై విచారణ జరిగినప్పుడు కాంగ్రెసునాయకు లెందరో ముద్దాయీల పక్షం పనిచేశారు.

1930 ఆ ప్రాతంలోకూడా కాంగ్రెసుపట్ల భారతకమ్యూనిస్టుపార్టీ వైఖరిమారలేదు. తీవ్రంగా విమర్శించడం, అపహాస్యంచేయడం సాగిస్తూనే వచ్చింది. 1935–36 లో మాత్రం ప్రపంచమంతటా కమ్యూనిస్టుపార్టీల విధానం మారింది, "సంయుక్త సంఘటనలు", "పాపులర్ ఫ్రంటులు" (ప్రజాపక్షాలన్నిటియొక్క ఐక్యసంఘటన) స్థాపించడానికి అనేకదేశాల్లో కమ్యూనిస్టుపార్టీలు ప్రయత్నాలు చేశాయి. కాని భారత కమ్యూనిస్టుపార్టీకి ఈ కొత్తపంథా వంటబట్టడానికి కొంతకాలం పట్టింది.

అంతవరకు వారవలంబిస్తూవచ్చిన వైఖరికి ఇది భిన్నంకావడంవల్ల మొదట్లో దీనిని వ్యతిరేకించారుకూడా, ఎలాగైతేనేం 1936 లో భారత కమ్యూనిస్టులు కాంగ్రెసుపట్ల స్నేహభావాన్ని చూపసాగారు. దానిలో చేరమని ప్రజల్లోప్రచారం చేశారు; స్థానికకాంగ్రెసుకార్యవర్గాల్లో ప్రవేశించడానికి ప్రయత్నించారు. అప్పటినుండి 1939 మధ్యవరకు—అంటే మూడుసంవత్సరాలపైని కొద్దికాలంవరకు కాంగ్రెసులో కమ్యూనిస్టులకు, ఇతర వర్గాలకు తరుచు ఘర్షణలు జరుగుతున్నా, మొత్తంమీద అంతా కలిసే పనిచేస్తూవచ్చారు. పెద్దప్రతిష్టంభన (చిక్కు) ఏమీరాలేదు. ఈ సందర్భంలో ఒకవిషయాన్ని గుర్తించాలి. ఈకాలంలో కమ్యూనిస్టులకూ ఇతర వర్గాలకూవచ్చిన పై ఘర్షణలు భారతదేశ ఆంతరంగిక సమస్యలపై. అవలంభించవలసిన విధానాలనుగురించే వచ్చేవిగాని, కమ్యూనిస్టుసిద్ధాంతాన్ని గురించిగాని, సోవియట్ యూనియన్ గురించిగాని కాదు. కమ్యూనిజం, సోషలిజంలోని కొన్నిలక్షణాలను ఆమోదించేవారు కాంగ్రెసులో చాలమందున్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆమోదించనివారూ ఉన్నారు. ముఖ్యంగా హింసాపూర్వకమైన పద్ధతులను కమ్యూనిస్టులు ప్రచారంచేయడం కాంగ్రెసు అవలంబించే శాంతియుతపంథాకు పూర్తిగా వ్యతిరేకం. అయినప్పటికీ అప్పుడప్పుడుకొన్ని ప్రదేశాల్లో తప్ప, ఆచరణలో ఎక్కడా వైరుధ్యానికిది దారితీయలేదు. ఈ విభిన్న దృక్పథంవల్ల సాధారణంగా ఏ. ఐ. సి. సి. సమావేశాల్లో దీర్ఘమైన చర్చలు జరిగేవి; ఒకొక్కప్పుడు చాల ఆవేశంతోకూడా జరిగేవి. కొద్దిమంది కమ్యూనిస్టులు ఏ. ఐ. సి. సి. సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. మొత్తం ఏ. ఐ. సి. సి. సభ్యత్వంలో వీరు నూరింట ఇద్దరో ముగ్గురో ఉంటారు. కాంగ్రెసులో ఉన్న ప్రతిమైనారిటీగ్రూపుకు దాని సంఖ్యకు తగినప్రాతినిధ్యం లభించగల ఎన్నికల విధానాన్ని (ప్రపోర్షనల్ రిప్రజంటేషన్—సింగిల్ ట్రాన్స్ఫరబుల్ వోటు) అవలంబించడంవల్ల కమ్యూనిస్టులకు అవకాశం లభించింది.

మరో విషయాన్ని గుర్తుంచుకోవాలి, సోవియట్ యూనియన్ అనుసరించిన పద్ధతులను కాంగ్రెసువారిలో అందరూ సరిసమానంగా హర్షించకపోయినా, ఆదేశంసాధించిన విజయాలపట్ల కాంగ్రెసులో అపారిమైన ప్రశంసాభావం ఉండేది.

1939 సెప్టెంబరులో యుద్ధం ప్రారంభమయిన నాటికి కాంగ్రెసు కమ్యూనిస్టుల సంబంధం ఇది, చరిత్రలో ఒక నూతన దశను తెచ్చిన ఈ యుద్ధం ప్రారంభం కాకముందూ, ఆ తరువాతా కాంగ్రెసు అనుసరించిన పంథా అందరికీ తెలిసిందే. 1939 సెప్టెంబరు 14 న వర్కింగు కమిటీ చేసిన ప్రకటన దీనిని స్పష్టంగా వివరించింది. దీని ననుసరించే రాష్ట్రాల్లో కాంగ్రెసు మంత్రివర్గాలు రాజీనామా నిచ్చాయి. ఆరోజుల్లో భారత కమ్యూనిస్టు పార్టీ ఆయుద్ధాన్ని సామ్రాజ్యవాద యుద్ధమని పేర్కొంది. అది ప్రారంభమయిన తక్షణమే భారతదేశ విముక్తికోసం దేశవ్యాపిత పోరాటం జరపనందుకు ఆపార్టీ కాంగ్రెసును, గాంధీజీనితీవ్రంగా విమర్శించింది. 1940 షైలో రాంఘర్ కాంగ్రెసు సందర్భంలో డాక్టరు జి. అధికారి గాంధీ తత్వ విమర్శన నొకదానిని ప్రచురించారు. అందులో ఈ దిగువ భాగాలను చూడండి :

1. బ్రిటిష్ పరిపాలనయొక్క స్థితిగతులను నిర్ణయించగల శక్తి గాంధీ తత్వానికి ఒకప్పుడుండేది. అన్యాయమైన, దురాక్రమణ వాంఛలతో కూడుకున్న సామ్రాజ్యవాద యుద్ధం చెలరేగుతూన్న ఈరోజుల్లో ఆ బ్రిటిష్ ప్రభుత్వంతోనే " బేషరతుగా సహకారం " చేసే ధోరణికి వచ్చింది గాంధీ తత్వం. గాంధీ తత్వం శిధిలావస్థకు వచ్చింది. జాతీయోద్యమ చరిత్రలో అత్యంత విషమ ఘట్టంలో గాంధీజీ తత్వం స్వాతంత్ర పోరాటానికొక ప్రతిబంధకంగా తయారయింది.

2. ఈ యుద్ధం ప్రారంభమయిన మరుక్షణంలో గాంధీజీ ఇంగ్లండు ప్రాన్సులపట్ల పూర్తిగా సానుభూతి ప్రకటించారు. వైస్రాయి ఆహ్వానాన్నందుకొని అతనితో సంభాషణలుజరిపారు.

ఈచర్యను నిరసించిన ప్రజలకు, ప్రతికా విలేఖరులకు ఈవిధంగా సమాధానం చెప్పారు: "ఈయుద్ధానికి కారకుడు హిట్లరే అని నేను నిర్ధారణకు వచ్చాను. డాంజిగ్, పోలిష్ కాలిడార్లను గురించి తన కోరికలున్యాయమైనవని అనుకొన్నట్లయితే హిట్లరువాటినొక నిష్పాక్షికవిచారణ సంఘంయెదుట పెట్టి ఉండవలసింది. న్యాయపక్షాన్నవలంబించి బ్రిటనిప్పుడు యుద్ధంచేస్తుంది. న్యాయపక్షాన్ని - అందులో తనశత్రువుచేరిఉన్నాసరే—బలపరచడం సత్యాగ్రహి ధర్మం ". ఈ విధంగా "అహింసా" మంత్రాన్ని సామ్రాజ్యవాదయుద్ధాన్ని బలపరచడానికిఉపయోగించారు. ఈవిషమఘట్టాన్ని అవకాశంగాతీసుకొని గాంధీజీ సామ్రాజ్యవాద ప్రభుత్వంతో బేరమాడదలచుకో లేదు. బ్రిటన్ ఇబ్బందుల్లో చిక్కుకున్న ఈ అదనును భారతదేశ స్వాతంత్ర్యసిద్ధికి సద్వినియోగం చేయదలచుకోలేదాయన. 1939లో ప్రజాభిప్రాయమంతా ఈ ధోరణికి వ్యతిరేకంగా ఉంది. స్వాతంత్ర్య పోరాటాన్ని తక్షణం ప్రారంభించాలని ప్రజలు వాంఛించారు.

3. గత ఆరుమాసాలనుంచి ప్రతిష్టంభనను కొనసాగించడమే పద్ధతిగా పెట్టుకొన్నారు. దీనిఫలితాలు స్పష్టంగా కనబడుతున్నాయి. మొదటిఫలితం—జాతీయశక్తుల్లో విప్లవకరమైన అగ్రదళం (కార్మిక. కర్షకవర్గం—అనువాదకుడు) ఏకాకిఅయిపోయి ప్రభుత్వ నిర్బంధానికి గురిఅయి దెబ్బతింటుంది. రెండవది—కాంగ్రెసులో అతివాద మితవాదులకు మధ్యస్థంగాఉండే వర్గాలలో నిస్పృహ వ్యాపిస్తుంది; ఎలాంటి పోరాటమూ సాధ్యంకాదు—గాంధీగారి పద్ధతే ఉత్తమమైనదనే స్థితికి వస్తారు.........నైతిక ఔన్నత్యమనే మెరుగులన్నీ కడిగేస్తే మిగిలే నగ్నదృశ్యమేమంటే—పిరికితనంతో రాజీకి సిద్ధపడే ధనికవర్గ పద్ధతిది.... జాతీయోద్యమానికి నాయకత్వం ఇంకా గాంధీతత్వానిదే. సత్వరాభివృద్ధి పొందుతూన్న విప్లవశక్తులను అరికట్టి, అంతమొం

దించడానికి ఈ స్థానాన్ని ఉపయోగించుకో జూస్తుంది గాంధీ తత్వం. సామ్రాజ్యవాదాన్నెదుర్కొని సంపూర్ణ విజయాన్ని సాధించడానికి ప్రస్తుతమున్న అవకాశాలను జారవిడిచి. అవమానకరమైన రాజీకి, చివరకు ఓటమికి దారితీసే పరిస్థితులను కల్పిస్తుందీ నాయకత్వం.

1940 వేసవిలో ఫ్రాన్సు పడిపోయింది; ఇంగ్లండుమీద విమాన దాడులు తీవ్రంగా ప్రారంభమయాయి. ఈఘటనలు భారతదేశంలో గొప్ప సంచలనంకలిగించాయి. రాంఘర్ కాంగ్రెస్‌లో తీర్మానించినట్లు శాసనోల్లంఘనోద్యమాన్ని ప్రారంభించడాని కదినమయం కాదనుకున్నారు. ఆగస్టు-అక్టోబరు ప్రాంతానికి పశ్చిమరంగంలో పరిస్థితులు కొంతనిలకడచెందాయి. అదేసమయంలో భారతదేశ పరిస్థితులు మరింత అధ్వాన్నం కాసాగాయి. 1940 అక్టోబరులో. గాంధీజీ షరతుల ననుసరించి, వారి అజమాయిషీ క్రింద కాంగ్రెసు వ్యక్తి సత్యాగ్రహాన్ని ప్రారంభించింది. దీనిని గురించి 1940 నవంబరు మాసపు "కమ్యూనిస్టు" సంచిక ఇలా రాసింది:

"స్వాతంత్ర్య పోరాటాన్నిధ్వంసంచేసి, జాతీయోద్యమాన్ని విచ్ఛిన్నం చేయాలంటే ఇంతకన్నా మంచినిబంధనలు మానవ బుద్ధికి తట్టడం అసంభవం.... శత్రువుకు మనం దాసోహం అనే పరిస్థితులకే ఈసత్యాగ్రహం దారితీయగలదని ప్రతి కాంగ్రెసువాది చేతా గుర్తింపజేయాలి....ఇలాంటి కార్యక్రమం ఇవ్వగల జాతీయ నాయకత్వం ఉండడం చాల విషాదకరం."

1941 మార్చి సంచికలో "కమ్యూనిస్టు" ఇలా రాసింది.

"ఈ ఉద్యమం ఒక తమాషా. దీనిని హేళన చేసేవాడా, నోరుమూసుకో! ఇదేమిటనుకున్నావ్? ఒకజాతి గంభీరంగా.... అహింసాయుతంగా....ఆత్మహత్య చేసుకోవడం. చరమావస్థలో గాంధీ తత్వానికి మిగిలివున్నమార్గం ఒక్కటే—పోరాట వ్యతిరేక, రాజీపోకడల ననుసరించడం....ఇంతవరకు కాంగ్రెసు సాధించిన దంతా మట్టిపాలవడమే గాంధీతత్వంకింద మనంపొందగలఫలితం"

1941 వేసవిలో జర్మనీ సోవియట్‌పై దాడి ప్రారంభించింది. భారతదేశమంతటా సోవియట్‌పట్ల సానుభూతి వెల్లివిరిసింది: సోవియటేమవుతుందో అనే ఆందోళన వెల్లడయింది. భారత కమ్యూనిస్టుపార్టీలో ఇది తక్కినవారిలోకన్నా గాఢంగా కనబడడంసహజమే. కాని, అంతకు ముందునుంచీ యుద్ధవ్యతిరేక విధానం అనుసరిస్తూ రావడంవల్ల ఇప్పుడు తమ వైఖరిని హటాత్తుగా మార్చుకోవడం అంత సులభమైన పనికాదు. అందుకు వారికి కొన్నిమాసాలు పట్టింది, మార్పు వచ్చినతరువాత మాత్రం వారు ఈచివరినుంచి ఆచివరకు ఒరిగిపోయారు; "సామ్రాజ్యవాదయుద్ధం" అనే నినాదంపోయి, "ప్రజాయుద్ధం" అనే నినాదం వచ్చింది. బ్రిటన్‌తో సహకారం చేయాలని ప్రచారం చేయసాగారు. అప్పుడూ, ఆతరువాతా కాంగ్రెసు అవలంబించిన వైఖరికి ఇది పూర్తిగా వ్యతిరేకం క్రిప్సు రాయబారాల తరువాత కొద్దిరోజులకే భారతకమ్యూనిస్టుపార్టీపై నిషేధాన్ని ప్రభుత్వం తొలగించింది; ఆ పార్టీ చట్టసమ్మతమయింది. అప్పటినుండి కమ్యూనిస్టుపార్టీ తన నూతనవైఖరిని విరివిగా ప్రచారంచేసింది. దీనితో కాంగ్రెసు కార్యక్రమం, ప్రచారాలతో వైరుధ్యం ఏర్పడింది. ఈ ప్రచారాన్ని తీవ్రతరంగా సాగించడానికి భారతకమ్యూనిస్టుపార్టీ "పీపుల్సువార్" అనే వారపత్రికను ప్రారంభించింది కాంగ్రెసు కార్యవర్గంలో సభ్యులుగా ఉన్న కమ్యూనిస్టులు ఈ విధంగా వైమనస్యంకలిగించగల పరిస్థితుల్లోకి వచ్చారు. వీరు కమ్యూనిస్టుపార్టీ విధానాన్నే అనుసరించడంవల్ల వారిపై ఫిర్యాదులు ఎక్కువ కాసాగాయి. సభల్లో, ముఖ్యంగా ఆంధ్రదేశంలో ఘర్షణలు జరిగాయి; కమ్యూనిస్టులు బలప్రయోగంచేశారు కూడా. యు. పి. మొదలైన కొన్ని రాష్ట్రాల్లో స్థానికకార్యవర్గసభ్యుల్లో కమ్యూనిస్టుపంథా ననుసరించేవారిపై డిసిప్లినరీ చర్యలు తీసుకున్నారు. ఇదంతాకూడా ఆగస్టుకు పూర్వమే 1942 జూన్. జులై మాసాల్లో జరిగింది. అంటే ఆగస్టు తీర్మానం జరక్కపూర్వమే పరిస్థితులు విషమించాయన్నమాట. ఎవ్వరు కూడా కార్యవర్గసభ్యులుగా ఉంటూ పరస్పరవ్యతిరేకదృక్పధాలు కలిగి ఉండజాలరు; ఉండకూడదన్నది ఆనాటికే సుస్పష్టం అయింది. కాని,

కాంగ్రెసు బ్రహ్మాండమైనసంస్థ; దానితోపోలిస్తే కమ్యూనిస్టుపార్టీ బహు చిన్నది. అందువల్ల ఈ సమస్యకు పెద్దప్రాధాన్యతలేకపోయింది. అయినప్పటికీ దీనివల్ల అన్యోన్యద్వేషభావం చాలాకలిగింది.

1942 ఆగస్టు 8 వ తేదీన ఏ. ఐ. సి. సి. తీర్మానం జరిగింది. తదనంతరం అనేకమంది కాంగ్రెసువాదులు అరెస్టవడం, ఆ తరువాత జరిగిన ఘటనలూ అందరెరిగినవే. ప్రభుత్వం ఆవలంబించిప దమననీతి ఫలితంగా దేశమంతటా ప్రజలు తమంతటతాము తిరుగుబాట్లు సాగించారు; హర్తాళ్ళూ, సమ్మెలూ జరిగాయి, కొన్నిచోట్ల ప్రజలు హింసకుకూడా పూనుకున్నారు. అధికారరీత్యా ఏ. ఐ. సి. సి. గాని, గాంధీజీగాని ఎలాంటి ఉద్యమం ప్రారంభించలేదన్నది స్పష్టమే. కాని, అపూర్వ స్థాయిలో సంభవించిన ఆ ప్రజావెల్లువ అంతకుపూర్వం జరిగిన ఘటనలప్రత్యక్ష ఫలితమే అన్నవిషయంకూడా సుస్పష్టమే. ఏ ప్రజలకై తేప్రాతినిధ్యం వహిస్తున్నానని కాంగ్రెసుచాటుతూవచ్చిందో ఆ ప్రజా వాంఛే ఈ విధంగా వ్యక్తమయిందనడానికి ఏలాంటిసందేహంలేదు.

భారత ప్రజాశక్తులకు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి జరిగిన ఆ మహా సంఘర్షణలో, బ్రిటిష్తుపాకులకు గురిఅయి వేలకొలది ప్రజలు హతమారిపోయిన ఆ పరిస్థితుల్లో, యుద్ధభీభత్సాలన్నీ నిరాయుధులైన మన పట్టణ గ్రామ ప్రజలపై విరుచుకుపడిన ఆ సందర్భంలో, భారత కమ్యూనిస్టుపార్టీ బ్రిటిష్ ప్రభుత్వంతో చేతులు కలిపినట్లు కనబడింది. బ్రిటిష్వారి పోకడలను అప్పుడప్పుడు వీరు మెత్తగా విమర్శించినమాట నిజమే. కాని చాలమంది కాంగ్రెసువాదులను, అనేక కాంగ్రెసు గ్రూపులను దేశద్రోహులని వీరు ఖండించారు; ప్రజాఉద్యమానికి వ్యతిరేకంగా తీవ్రప్రచారం సాగించారు. కమ్యూనిస్టుపార్టీ పాలసీ సరియయినదా కాదా అన్న విషయాన్ని చర్చించడం మా ప్రస్తుత కర్తవ్యంకాదు. కాని కాంగ్రెసు పాలసీకి, ప్రజావెల్లువవల్ల అప్రయత్నంగా ఉద్భవించిన పాలసీకి కమ్యూనిస్టుపార్టీ విధానం విరుద్ధమన్న విషయం నిస్సందేహం. అప్పుడుగాని, ఇప్పుడుగాని ఈ రెండింటికీ సామరస్యం కుదరడం అసంభవమయింది. ఏదో ఒక

రూపంలో కాంగ్రెసువాదులందరూ పాల్గొన్న ఈ ప్రజా ఉద్యమాన్ని ఖండిస్తూ "పీపుల్సువారు", వివిధభాషల్లో వెలువడుతూన్న కమ్యూనిస్టు పార్టీ పత్రికలూ ఎడతెగని ప్రచారం సాగించాయి.

1942 ఆగస్టు 23 వ తేదీ 'పీపుల్సువార్' సంచికలో ఈవిధంగా ఉంది :

"కార్మికులను రాజకీయసమ్మెకు పురికొల్పడం బ్రిటిష్ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం కాజాలదు. దేశంయొక్క పురోగమనాన్ని అరికట్టి, కార్మికులను అనవసరంగా ఆకలిమంటలకు ఆహుతి చేయడానికే అది దారి తీస్తుంది. ప్రభుత్వం ఎటువంటిదయినాసరే ఉత్పత్తిని అవిచ్ఛిన్నంగా కొనసాగించడం యుద్ధావసరాలలో ముఖ్యమైనది". అదే సంచికలో ఈవిధంగాకూడా ఉంది : "దేశరక్షణ కార్యక్రమంలో కార్మికులపాత్ర ఉత్పత్తిని కొనసాగించడమే అనీ, రవాణాసౌకర్యాలకు అంతరాయం కలిగించకుండా ఉండడమంటే ఫాసిస్టులపై దెబ్బ తీయడానికి తోడ్పడమే అనీ, కమ్యూనిస్టుల మెరుగుదుము. భారత స్వాతంత్ర్యానికి భారత జాతీయైక్యతద్వారా జాతీయప్రభుత్వాన్ని సాధించడం ఒక్కటే మార్గమనీ, వేరే అడ్డుదారులు లేవనీ, ఇతరులకన్నా మేము స్పష్టంగా గుర్తిస్తున్నాము. సత్యాగ్రహమూ, విధ్వంసక కార్యక్రమమూ ఇందుకు మార్గంకాదు. వీటివల్ల జరిగేది మన దేశరక్షణ భగ్నం కావడం, ఫాసిస్టు శత్రువులకు ద్వారం తెరవడం మాత్రమే." జోషీగారు రాసిన జాబుల్లోని ఈ దిగువ మాటలు గమనించతగ్గవి: "నేటి పరిస్థితుల్లో సమ్మె కార్యక్రమం దేశక్షేమానికి భంగకరమని మేమెంచాము సమ్మె కార్యక్రమమం అటు జపాను దురాక్రమణదారులకు తోడ్పడం మాత్రమే కాకుండా, ఇటు మన ప్రజల ఆర్థిక దుస్థితిని మరింత దుర్భరం చేస్తుందని మేము గుర్తించాం. అందువల్ల సమ్మె కార్యక్రమాన్ని విసర్జించాము. తమస్థితి నానాటికి దుర్భరమయి పోతున్నప్పటికీ, కార్మికులు రెచ్చిపోయి సమ్మెలకు దిగకుండా ఆపగలిగాము. దీనినిబట్టే మీరు గ్రహించగలరు—కార్మికుల్లో మాకెంత పలుకుబడి ఉందో. అంతేకాదు.

దేశ క్షేమమే తమ క్షేమమని కార్మికులు ఎంతగా గుర్తించారో కూడా దీనివిబట్టి స్పష్టమతుంది." ("గాంధీ జోషీ లేఖలు:— III వ లేఖ 14 వ పేజీ—అనువాదకుడు) ఆయన ఇంకా ఇలారాశారు: "మీకు రాసిన వ్యక్తుల విషయం మీరు విచారించే పక్షంలో ఈ క్రింది విషయం స్పష్టంగా తేలిపోతుంది. వీరు ఆగస్టు విధ్వంసక చర్యలనునడిపిన వారూ, బలపరిచిన వారూ అయివుంటారు. లేదా వీరి దుర్బోధలకు లోనయి మాపై గాఢమైన దురభిప్రాయాలు కలిగినవారై ఉంటారు. వారికి మామీద ఇంత తీవ్ర ద్వేషం దేనికి? మేం విధ్వంసక చర్యలను వ్యతిరేకించాము. వారి రంగును వుత్తమాటల్లోనే గాక, క్రియా రూపకంలో బయటబెట్టాం. ఇవే మాపై వారి ద్వేషానికి కారణాలు."

('గాంధీ జోషీ లేఖలు' VII వ లేఖ 31 వ పేజీ—అనువాదకుడు)

కమ్యూనిస్టుపార్టీ మొదటి సమావేశం 1942 సెప్టెంబరులో జరిగింది. జోషీ అధికారికి పార్టీ రిపోర్టును రాశారు. కాంగ్రెసు వర్కింగు కమిటీలో రెండుగ్రూపు లున్నాయని అందులో అన్నారు. "అజాద్ మొదలైన వారున్న ఫాసిస్టు వ్యతిరేకగ్రూపు ఒకటి. రెండవదానిలో గాంధీజీ, పటేల్, రాజేంద్రప్రసాద్ మొదలైన వారున్నారు. యుద్ధపరిశ్రమలను రవాణా సౌకర్యాలను స్తంభింపజేసి బ్రిటిష్‌సామ్రాజ్యవాదాన్ని లొంగదీయాలని ఈరెండవ గ్రూపుయొక్క ఉద్దేశం. వర్కింగుకమిటీలో ఈగ్రూపుదే పైచేయి అయింది. అందువల్ల అల్లరుల సమయంలో రవాణాసౌకర్యాలు రోడ్లపైని, బ్రిడ్జీలపైని రాకపోకలు, పారిశ్రామిక ఉత్పత్తి దెబ్బతినడం, అరాజకచర్యలు సాగడం ఈ రెండవ గ్రూపుయొక్క భావాలను అనుసరించే జరిగాయన్నమాట." దీనినిబట్టిచూస్తే ఆగష్టు ఘటనలకు ప్రత్యక్ష బాధ్యత కాంగ్రెసువర్కింగు కమిటీదేనని 1942 సెప్టెంబరులో కమ్యూనిస్టులు నిస్సందేహంగా పేర్కొన్నారు. ఈ అల్లరుల విషయమై టాటెన్‌హాం నివేదిక ప్రకటించబడటానికి ఎంతోపూర్వమే ఇదిజరిగింది.

ఆ మొదటి సమావేశంలోనే భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ చేత ప్రతిపాదింపబడి, ఆమోదింపబడిన తీర్మానంలోనివే ఈ దిగువ భాగాలు. "ప్రస్తుత ప్రజావెల్లువను నడుపుతూన్న మార్గం జాతీయవిచ్ఛిన్నకర మార్గం. క్లిష్టపరిస్థితులనుంచి దేశాన్ని బయటికితీసి. స్వాతంత్ర్యాన్ని చేకూర్చే మార్గంకాదు. దేశానికి అత్యవసరమయిన రక్షణలను ధ్వంసం చేస్తుంది. ప్రజల్లో అల్లకల్లోలానికి అరాజకానికి, చివరకు దోపిడీలకు. ఇండ్లు తగులబెట్టడానిక్కూడా దారి తీస్తుందీమార్గం. రెచ్చగొట్టి అణచివేయాలని సామ్రాజ్యవాద ప్రభుత్వం వేస్తున్న పన్నాగాలకు మన జాతీయోద్యమం బలి అయిపోతుంది. ఇదంతా 'పోరాటం' అన్న పేరుతోనే జరిగిపోతుంది. చివరకు 'దేశభక్తి' బురఖాతో పంచమాంగదళం ప్రజల్లో జొరబడి తన కార్యక్రమం సాగించడానికి అవకాశం కలుగుతుంది.... నైతికంగా రాజకీయంగా మనజాతి విచ్ఛిన్నమయి స్తంభించిపోయే పరిస్థితులకు దారితీస్తుంది. ప్రజల్ని స్వాతంత్ర్య గమ్యస్థానానికి చేర్చడానికి బదులు ఈమార్గం శత్రువుకు రాజబాటవేయగలదు. ప్రజాశక్తులపై అంతే ఐక్యతావిధానంపై ఆధారపడకుండా చొరవతీసుకునే అవకాశాన్ని సామ్రాజ్యవాద ప్రభుత్వానికే విడిచిపెట్టే పంథా ననుసరిస్తూ రావడం యొక్క దుష్ఫలితమే ఇదంతా," ఈ క్రింది మాటలింకా ఖచ్చితంగాఉన్నాయి.

"ఈనాడు పార్టీ నెరవేర్చవలసిన కర్తవ్యాలు మూడు....

(2) ప్రస్తుత పోరాటం, వినాశనానికి, అరాజకానికి ఎలా దారి తీస్తుందో, ఇది ఎలా ఆత్మహత్యా మార్గమో కార్మికులకు. కర్షకులకు, ఉత్సాహంతో పనిచేసే విద్యార్థులకు. కాంగ్రెసువాదులకు విధి విరామంలేకుండా వివరించి చెప్పాలి." ఇంకా యిలా అన్నారు.

"పారిశ్రామిక కేంద్రాలల్లో యూనియన్ల నాయకత్వాన్ని పార్టీ నాయకత్వాన్ని తిరిగి నెలకొల్పాలి. తప్పుదారిబడిన దేశభక్తులూ, కార్మికులను రెచ్చగొట్టి ప్రభుత్వనిర్బంధానికి గురిచేయ జూస్తున్నవారు. దేశవినాశకరమైన విధ్వంస కార్యక్రమంలోకి, అరాజకంలోకి కార్మికులనుకూడా దిగ లాగాలని చేసిన ప్రయత్నాలను పూర్తిగా వమ్ముచేయాలి."

"విధ్వంసకార్యక్రమవాదులను. అరాజకవాదులను బట్టబయలుచేస్తూ రైతుల్లో తీవ్రమైన రాజకీయప్రచారం చేయాలి."

"విద్యార్థుల్లో రాజకీయపరిస్థితులనువివరిస్తూ ప్రచారంసాగించాలి. శాశ్వతసమ్మె కార్యక్రమం తీసుకోవడం, విధ్వంసకచర్యలకు పూనుకోవడం, అరాజకానికిదిగడం, ఎలా స్వాతంత్ర్యపోరాటంలో తమపాత్రను నిర్వహించడంకాదో వివరించి చెప్పాలి."

ఒక ఏడాదితరువాత 1943 సెప్టెంబరు 20 వ తేదీన ఇండియా ప్రభుత్వం ఒక సర్క్యులర్ ప్రకటించింది. కమ్యూనిస్టుపార్టీ పైకార్యక్రమాన్ని తూచ తప్పకుండా కొనసాగించిందని ఈ సర్క్యులర్ రుజువు చేస్తూంది. అందులోని ఈ దిగువభాగాలను చూడండి.

(1) మొత్తంమీద పార్టీ విద్యార్థులు ఆవేశపూరితులు కాకుండా ఆపింది. విద్యార్థుల్లో దానికి అట్టే ఎక్కువ పలుకుబడి లేకపోయినా. ఉన్నంతవరకు విద్యార్థులు సమ్మెలుచేయకుండా, అల్లరిప్రదర్శనలు చేయకుండా వారించడానికి ఉపయోగపడింది.

(2) కార్మికుల్లో పార్టీకి ఉన్నపలుకుబడినంతా సమ్మెలను వ్యతిరేకించడానికి, లేక వాటివల్లకలిగేనష్టాన్ని తగ్గించడానికీ ఉపయోగించినట్లుకనబడుతూంది.

(3) 1943 మే 23 నుంచి జూన్ మొదటితేదీవరకు బొంబాయిలో పార్టీకాంగ్రెసు జరిగింది. కాంగ్రెసుయొక్క నిర్మాణశూన్యమైన విధానాన్ని ఇందులో ఖండించారు. ఆసభలో జరిగిన తీర్మానం కాంగ్రెసు సోషలిస్టుపార్టీని, ఫార్వర్డుబ్లాకును మొట్టమొదటిసారిగా, బాహాటంగా పంచమాంగదళంకింద లెక్కపెట్టింది. 1942 ఆగస్టులో కాంగ్రెసుచేసిన తీర్మానాన్ని అవకాశంగా తీసుకొని ఈ రెండు సంస్థలు దేశాన్ని ప్రమాదకర పరిస్థితుల్లోకి తెచ్చారని ఖండించింది.

(4) విజయం (మిత్రమండలివారిది-అనువాదకుడు) కోసం కృషిచేసింది ఇంచుమించు కమ్యూనిస్టుపార్టీ ఒక్కటే. అంతేకాదు. సంకోచిస్తూ అయినాసరే, కాంగ్రెసుయొక్క ఓటమి తత్వాన్ని రాజ

కీయంగావిమర్శించిందికూడా ఒక్క కమ్యూనిస్టుపార్టీయే. ఈ విషయంలో వారికీ తక్కినవారికీ తేడాఉంది. ఉదాహరణకు ముస్లిం లీగు విమర్శ అంతా మత దృష్టితోనే ఉంటుంది. కాంగ్రెసులోనుంచి పుట్టిన కాంగ్రెసు సోషలిస్టుపార్టీ, ఫార్వర్డు బ్లాకులను దేశద్రోహ సంస్థలని కమ్యూనిస్టులు ఖండించారు.

ఆగస్టుతీర్మానాన్నికమ్యూనిస్టులు మొదటినుంచీ ఏకరీతిగా ఖండించారనీ, దేశ క్షేమానికది వ్యతిరేకమని విమర్శించారనీ కాంగ్రెసు కమిటీల నుండి లెక్కలేనన్ని రిపోర్టులున్నాయి. ఆగస్టు తీర్మానం తరువాత జరిగిన ఘటనల కన్నిటికీ కాంగ్రెసూ కాంగ్రెసువాదులే బాధ్యులని కమ్యూనిస్టులు నేరారోపణ చేశారు. అదేవిధంగా మొదటినుంచీ వారు ప్రభుత్వానికి పూర్తిమద్దతునిస్తూ వచ్చారు: యుద్ధకృషిని బేషరతుగా బలపరచాలని ప్రచారంచేస్తూవచ్చారు. యుద్ధకృషికి ఆటంకం కలిగించే చర్యలనుగాని, ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించే చర్యలనుగాని ఎవ్వరూ - కర్షకులు, కార్మికులు, విద్యార్థులు, ఎవ్వరూకూడాతీసు కోకూడదని వారిస్తూ వచ్చారు. ఆగస్టు 9 తరువాత దశలో కమ్యూనిస్టులు కాంగ్రెసు ప్రముఖులను తీవ్రంగా దూషించారని, వారిపై నీచప్రచారం గావించారనీ; కొంతమంది కాంగ్రెసువాదులపై పోలీసులు తీసుకున్న చర్యలకు తోడ్పడ్డారనీ అనేక రిపోర్టులున్నాయి. తగిన పరిశోధనలు జరిగిన తరువాతనే ఈ రిపోర్టులు తయారుచేసినట్లు కనబడుతూంది. కాంగ్రెసుకమిటీలు జరిపిన సభల్లో ముఖ్యంగా ఆంధ్రరాష్ట్రంలో కమ్యూనిస్టులు రౌడీతనానికి ఒడిగట్టిన అనేక ఘటనలను వివరాలతో పేర్కొన్నారు. వీటిలో కొన్నిటినిగురించి దర్యాప్తులు, మద్రాసు కోర్టుల్లో విచారణలు ఇంకా జరుగుతూఉన్నాయి. మరో ప్రక్క కాంగ్రెసు వాదులపై కమ్యూనిస్టులు చేసిన నేరారోపణలున్నాయి. ఒకరిపై ఒకరు వేసుకున్న ఈ నిందలను గురించి మేము పరిశీలన జరుపలేదు. సాకల్యమైన విచారణలు జరపనిదే ఇదమిద్ధమని తేల్చడం కష్టం. అప్పుడయినా ఏదో ఒకనేరం రుజువయినా అది కమ్యూనిస్టు పార్టీయొక్క సాధికార విధానపు ఫలితమేనని చెప్పడానికి వీల్లేదు. కాని, ఒకవిషయంలో

ఏలాంటి సందేహం లేదు. 1942 ప్రారంభం నుంచీ ముఖ్యంగా 1942 ఆగస్టు 8 నుంచీ కాంగ్రెసు అవలంబిస్తూ వచ్చిన విధానంయొక్క మూల భావాన్నే కమ్యూనిస్టులు — కాంగ్రెసు సభ్యులుగా ఉన్నవారు ఇతరులు కూడా—వ్యతిరేకిస్తూవచ్చారు.

కాంగ్రెసులో కమ్యూనిస్టుల కార్యకలాపాన్ని గురించి శ్రీ గాంధీజీకి శ్రీ పి. సి. జోషికి ఉత్తర ప్రత్యుత్తరాలు దీర్ఘంగా సాగాయి; ఇటీవల వాటిని ప్రచురించారు కూడా. జోషిగారి సూచన న[illegible]రించి ఈ విషయం శ్రీ భూలాభాయ్ దేశాయ్‌గారి ఎదుట పెట్టబడింది. "మీదగ్గరున్న కమ్యూనిస్టు వ్యతిరేక ఫైలంతా అందరికీ విశ్వాసపాత్రులయిన సుప్రసిద్ధ దేశభక్తుల ఎదుటపెట్టండి. ఉదాహరణకు సరోజినీదేవి, రాజాజీ, భూలాభాయ్ వీరు ముగ్గురు మీ అనుచరులు. వీరికి మాపై దురభిప్రాయాలులేవు. నాకు కూడా ఆఫైలు ప్రతి ఒకటివ్వండి. ఏ విషయంమీద నన్ను జవాబు ఇవ్వమన్నా వారికి నేను జవాబు ఇస్తాను. వారి నిర్ణయం విన్నాక మీరు ఆకమ్యూనిస్టు వ్యతిరేక ఫైళ్ళన్నీ మంటలో పడవేస్తారని నాకు నమ్మకముంది" అని జోషిగారు రాశారు.

('గాంధీ జోషీలేఖలు'— VII వ లేఖ 39 వ పేజీ—అనువాదకుడు)

దేశాయ్‌గారు గత ఆగస్టు 20 తేదీని తన అభిప్రాయాన్ని తెలియజేశారు. "యూరపులో ఇప్పుడిప్పుడే ముగిసిన యుద్ధాన్ని తాము 'ప్రజా యుద్ధం' గా పరిగణిస్తున్నామని జోషిగారు నిష్కపటంగా ఒప్పుకున్నారు. అందుకు కారణాలనుకూడా తెలియజేశారు." అని దేశాయ్‌గారు రాశారు. అంటే ఆవిషయాన్ని తప్పించుకు పోవడానికి అవకాశం లేదన్నమాట. 'పీపుల్సు' వార్‌లో విధివిరామం లేకుండా ప్రచారం సాగుతూన్నప్పుడు ఈ విషయాన్ని ఒప్పుకోడానికి నిష్కాపట్యం అంతగా అక్కరలేదు. దేశాయ్‌గారు ఇంకా ఇలా రాశారు: "ఆగస్టు 9 అనంతరం కాంగ్రెసు అనుసరించిన అభిప్రాయాలకు పాలసీకి వ్యతిరేకంగా ప్రచారం చేయడం కమ్యూనిస్టుపార్టీ దృక్పధమూ, అభిప్రాయమూ అయినట్లుగా కన్పించుతోంది." శ్రీ భూలాభాయిగారు పంపిన పత్రంయొక్క నకలును జోషిగారికి పంపబడింది. భూలాభాయిగారి నిర్ణయాలు ఎక్స్‌పార్టీ నిర్ణయాలని అనడం మినహా జోషిగారు వీటినేవిధంగాను ఖండించలేదు. నిజానికి అనేక ఇతరవిషయాల్లో భూలాభాయ్‌గారు కమ్యూనిస్టులు నిర్దోషులని నిర్ణయించారు. ఆగస్టు 9 తరువాత కాంగ్రెసు అనుసరించిన అభిప్రాయాలకు, పాలసీకి వ్యతిరేకమైన ప్రచారాన్ని కమ్యూనిస్టుపార్టీ సాగించిందని ఆయన చేసిన నిర్ణయం చాల ముఖ్యమైనది. భయంకరమైన నిర్బంధ విధానం దేశంలో తా[illegible]విస్తున్న దశలో, చావుబ్రతుకులను తేల్చే పోరాటంలో కాంగ్రెసు నిమగ్నమై వున్న పరిస్థితుల్లో, కాంగ్రెసుతో కలిసిఉన్న ఏసంస్థకూడా ఇలాంటి వ్యతిరేకచర్యలు చేయజాలదు. చేస్తే, క్రమశిక్షణ యొక్క సర్వసాధారణ సూత్రాలనే భంగపరచినదవుతుంది.

వెనుకటి విషయాలనే మేమెక్కువగా తరచి చూడవలసివచ్చింది. అయినప్పటికీ, 'పీపుల్సువార్'లోని రాతలనుబట్టి చూస్తే ఈనాడు కూడా భారత కమ్యూనిస్టుపార్టీ పాలసీ కాంగ్రెసు పాలసీకి చాల దూరంగా ఉందనీ, తరుచుగా దాన్ని వ్యతిరేకిస్తుందనీ చెప్పగలం.

కాబట్టి మా అభిప్రాయమేమిటంటే—కాంగ్రెసులో ఉన్న కమ్యూనిష్టులపై అభియోగం తేడానికి తగిన నిదర్శనాలు, రికార్డులు మా ఎదుట ఉన్నాయి. కాంగ్రెసులో తమపాత్ర, తామవలంబించిన పాలసీలను సమర్ధించుకోమనీ; తమపై తగినచర్య ఎందుకు తీసుకోకూడదో తెలియజేయవలసిందనీ వీరిని కోరాలి. మేము వ్యక్తులను గురించి పరిశీలన చేయలేము. కాని, తగినచర్య ఎందుకు తీసుకోకూడదో వ్యక్తులనే అడగగలం. ఎ. ఐ. సి, సి. లో సభ్యులుగా వున్న కమ్యూనిస్టులనే ఈవిధంగా అడగవలసిందని మా సూచన. ఎందువల్లనంటే వీరు తమ పార్టీలో ప్రముఖులై ఉంటారు. వీరుకాక తమపార్టీలో మరే ప్రముఖుడైనా వచ్చి తన సంజాయిషీలను, సమర్ధనలను చెప్పదలచుకుంటే ఆయనకట్టి అవకాశం కలిగించాలి. కాంగ్రెసులోని కమ్యూనిస్టు సభ్యులకు ఇలాంటి అవకాశాలు పూర్తిగా యివ్వాలనే కాంగ్రెసు అధ్యక్షుని, వర్కింగుకమిటీ, ఉద్దేశమని మాకు తెలిసింది. ఈ ఉద్దేశంతో మేము పూర్తిగా ఏకీభవిస్తున్నాం.

పైన మేము తెలియజేసినట్లు, ఇప్పటికప్పుడే చాలవరకు పరిశీలన, సంజాయిషీలు చెప్పడం జరిగింది. భారతకమ్యూనిష్టుపార్టీ కార్యదర్శి ఐన శ్రీ పి. సి. జోషీగారి సూచన ప్రకారం శ్రీ దేశాయ్‌గారు తన అభిప్రాయాలను తెలయజేయడంకూడా జరిగింది.

కాంగ్రెసులోని కమ్యూనిస్టు సభ్యులు ఇచ్చే సమాధానాలు సంతృప్తికరంగా లేకపోయినట్లయితే, ఆపైని ఏలాంటి చర్య తీసుకోవాలి అనే సమస్య వస్తుంది. దానిని గురించి ఇప్పుడు ఆలోచించడం తొందరపడడమవుతుంది. కాని ఒకవిషయం మేము స్పష్టం చేయాలనుకుంటున్నాం. కమ్యూనిస్టులకు కాంగ్రెసులో స్థానంలేకుండా తలుపు మూసేయడం కాదు ప్రస్తుత విషయం—ప్రస్తుత సమస్య ఏమిటంటే—కాంగ్రెసుయొక్క మూల సూత్రాలను కొనసాగించడం కాంగ్రెసు కార్యనిర్వాహక వర్గాల కర్తవ్యం. అలాంటప్పుడు ఆసూత్రాలను వ్యతిరేకించే వారిని కార్యనిర్వాహక వర్గాల్లో ఉండనివ్వడంగాని, వాటికి ఎన్నుకోవడంగాని ఎంతవరకు తగును అన్నదే ఇప్పటి సమస్య

జవహర్లాల్ నెహ్రూ
వల్లభాయ్ పటేల్
గోవింద వల్లభపంత్

బొంబాయి
21 సెప్టెంబరు 1945

ప్రజాశక్తి ప్రెస్, బెజవాడ. పర్మిట్ నెం. కె. 13/సి. — 10000—10–2–46

సవరణ

ఈ పుస్తకంలో పేజీ 240, 242, 243, 241. ల వరుసలు తప్పుగా పడ్డాయి. 240 పేజీ తరువాత 241, తర్వాత 242, 243 గా చదువుకోవాలి.

ప్రజాశక్తి కార్యాలయం, మొగల్‌రాజపురం, బెజవాడ.

END OF
TITLE